# లోకానికి నేనే వెలుగు

జూబిలీ 2025

నిరీక్షణ యాత్రికులు

## నిరీక్షణ యాత్రికులు

IUBILAEUM A. D. MMXXV
PERēGRINANTES
IN SPEM

సంపుటి : 47 ఏప్రిల్-జూన్ 2024 సంచిక : 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ
భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

### సంపాదక వర్గం :
ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా

### గురు విద్యార్థుల బృందం :
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్

## చందా వివరములు
సంవత్సరానికి మీ చందాను రూ॥ **100/-** యం.ఓ., డి.డి.ల ద్వారా **St. John's Regional Seminary Society, Hyderabad** పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 47 ఏప్రిల్ – జూన్ 2024 సంచిక : 2

## నిరీక్షణ యాత్రికులు

**ఫాదర్ కుర్మా తోమాస్**
సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు–500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక

సంపాదకీయం

*– రెవ. ఫాదర్ కుర్మా తోమాస్* .................................**06**

**1. నిరీక్షణ నిరాశను కలిగింపదు – అనువాదము** (*Spes non Confundit*)

*– రెవ. ఫాదర్ కుర్మా తోమాస్* ................................ **10**

**2. మాకు ప్రార్థించుట నేర్పుము – అనువాదము**

**ఉపోద్ఘాతము** – *బ్రదర్ అరికోట్ల భరత్* .............................. **40**

**1. ప్రార్థన గురించి ఫ్రాన్సిస్ పాపుగారి బోధనలు**

*– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్* .....................................**42**

**2. మాకు ప్రార్థించుట నేర్పుము (లూకా 11:1): ప్రార్థన అనే పాఠశాల దిశగా**

*– బ్రదర్ కాలెంతు సాగర్ బాబు* .............................. **46**

**3. విచారణ సంఘంలో ప్రార్థన**

*– బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్* ............................ **50**

**4. కుటుంబ ప్రార్థన**

*– బ్రదర్ బట్టు అజయ్ కుమార్* ............................... **58**

**5. యువతీ యువకుల ప్రార్థన**

*– బ్రదర్ బలసాని ప్రభుదాస్* .................................. **63**

**6. యేసు ఒక నిర్మానుష్య ప్రదేశానికి వెళ్ళి, అక్కడ ప్రార్థించాడు (మార్కు 1:35): ప్రార్థనపై జ్ఞానవడకాలు**

*– బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్* ..................................... **68**

**7. ప్రార్థన – సత్యోపదేశము**

*– బ్రదర్ కాసు అఖిల్* ............................................ **72**

**8. కతోలిక మఠవాస ఆశ్రమాలలో ప్రార్థన: వెలుగుచున్న ప్రార్థనా దీపము**

*– బ్రదర్ కొమ్మెర పవన్* ......................................... **74**

9. పవిత్ర స్థలములో ప్రార్థన
– *బ్రదర్ ఆరుగుల్ల రాజేంద్ర* .................................. 79
10. 2025 జూబిలీ సంవత్సర విశ్వాసుల ప్రార్థన
– *బ్రదర్ జుత్తుక వెళాంగని రాజ్* ............................ 82
3. క్రైస్తవ విశ్వాసానికి మూల స్తంభము సంఘ ప్రార్థన
– *బ్రదర్ అలజంగి దీపక్* ......................................... 85
4. హన్నా జీవితపు ప్రార్థనాశైలి
– *బ్రదర్ కండి రవీంద్ర కుమార్* ............................ 94
5. వినయశీలుని ప్రార్థన
– *బ్రదర్ కొట్టే సాగర్ రాజు* ................................... 100
6. మేలుకొని ప్రార్థింపుడు
– *బ్రదర్ బొమ్మ ఫ్రాన్సిస్* ......................................... 107
7. శోధనకు గురి కాకుండుటకై ప్రార్థన చేయుడు
– *బ్రదర్ బాసాని బాల ధీరజ్* ................................ 111
8. ప్రార్థన: పాప నివారణకు నిదర్శనం, స్వస్థతకు కారణం
– *బ్రదర్ పాగుర్ల భాను ప్రసాద్* ................................ 117
9. ప్రార్థనతో శోధనలను జయించుట
– *బ్రదర్ నందిగం మణిహార్* ..................................... 122
10. పశ్చాత్తాప ప్రార్థన
– *బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్* ......................... 128
11. సుంకరి – పరిసయ్యుని ప్రార్థన (లూకా 18:10–14)
– *బ్రదర్ ఆవుల కిషోర్* ........................................... 133
12. బైబులులో భక్తుల ప్రార్థనలు
– *బ్రదర్ కాకుమాను జాన్ రాజు*................................ 137
13. పార్థన – పరిచర్య
– *బ్రదర్ చింతాడ సుధీర్* ......................................... 142

# సంపాదకీయం



ప్రస్తుతము విశ్వవ్యాప్తముగా శ్రీసభ 2025 జూబిలీ సంవత్సరమునకు సన్నాహమౌతుంది. ఎందుకు 2025 వ సంవత్సరమును విశ్వవ్యాప్త శ్రీసభ జూబిలీ సంవత్సరముగా కొనియాడుతుంది? 2025వ సంవత్సరము నాటికి పరమ పవిత్ర త్రిత్వములో రెండవ వ్యక్తియైన సుతుడైన సర్వేశ్వరుడు మనలో ఒకనిగా (మానవునిగా) జన్మించి 2025 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్నాము. అనగా యేసు క్రీస్తు ఈ లోకములో జన్మించి 2025 సంవత్సరాలు పూర్తిచేసుకొను సందర్భముగా, పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 2025 వ సంవత్సరమును పవిత్ర జూబిలీ సంవత్సరముగా ప్రకటించారు. ఈ 2025 జూబిలీ సంవత్సరములో విశ్వాసులందరిని నిరీక్షణ కలిగి, విశ్వాములో ముందుకు సాగమని పిలుపునిస్తూ, విశ్వాసులందరిని "నిరీక్షణ యాత్రికులు"గా పిలుస్తున్నారు. ఈ సందర్భములో పునీత పౌలుగారి మాటలలో నిరీక్షణ మనకు నిరాశను కలిగించదు (రోమీయులు 5:5) అని మనందరికి గుర్తుచేస్తూ, విశ్వవ్యాప్తముగా ప్రజలందరిలో నిరీక్షణ బీజాలను నాటి ఆ నిరీక్షణలో అపారమైన దైవానుగ్రహలను పొందాలని ఆహ్వానిస్తున్నారు.

శ్రీసభలో ఇటువంటి అనుగ్రహాలను ఒసగు జూబిలీ సంవత్సరాలు క్రొత్తేమీ కాదు. 1300 సంవత్సములో 8వ బోనిఫాసు పాపుగారు "ఆంతికోరుమ్ ఆబెత్ ఫీదా రెలాత్సియో" అనే జూబిలీ ప్రారంభ పత్రము ద్వారా అప్పటి జూబిలీ సంవత్సరమును ప్రారంభించారు. అప్పటి నుండి ప్రతీ 100 సంవత్సరాలకు ఒకసారి ఈ జూబిలీని కొనియాడే విధముగా ఏర్పాటు చేశారు. కాని, 1342లో రోము నగర ప్రజల విన్నపము మేరకు 6వ క్లెమెంటు పాపుగారు, ఈ జూబిలీ సంవత్సరమును ప్రతీ 100 సంవత్సరాలకు బదులు ప్రతీ 50 సంవత్సరాలకు

ఒకసారి కొనియాడే విధముగా మార్చారు. 1389లో 6వ ఉర్బాను పాపుగారు క్రీస్తు ప్రభు ఈ లోకములో మనలో ఒకనిగా జీవించిన దానికి అనుగుణముగా ప్రతీ 33 సంవత్సరాలకు ఒకసారి కొనియాడే విధముగా మార్పు చేసి 1390వ సంవత్సరమలో జూబిలీకి పిలుపునిచ్చారు. ఈ జూబిలీ సంవత్సరము 6వ ఉర్బాను పాపుగారిచే నిర్ణయింపబడినా, ఆయన మరణానంతరము 1390లో 9వ బోనిఫాసు పాపుగారి చేత కొనియాడబడింది. 50 సంవత్సరాలకు ఒకసారియని ఇది వరకు నిర్ణయింపబడిన విధముగా 1400 సంవత్సరములో 9వ బోనిఫాసు పాపుగారు జూబిలీ పరిపూర్ణ పాపమన్నింపును (Indulgence) రోము నగరమును సందర్శించిన విశ్వాసులకు అందించారు. 1425లో 5వ మార్తీనుపాపుగారు మొట్ట మొదటిసారిగా లతెరానులోని పునీత యోహాను మహాదేవాలయ ద్వారములను తెరచి జూబిలీ సంవత్సరమును ప్రారంభించారు. ప్రతీ 50 సంవత్సరాలకు ఒకసారి జూబిలీ వేడుక అనే విధానములో 1450లో, జూబిలీని కొనియాడిన చివరి పాపుగారు 5వ నికోలాస్ పాపుగారు. 1475లో 2వ పౌలు పాపుగారు జూబిలీ వేడుక ప్రతీ 25 సంవత్సరాలకు కొనియాడే ఏర్పాటును చేశారు. ఆ విధముగా 4వ సిక్టుస్ పాపుగారు 1475లో జూబిలీని కొనియాడగా అప్పటి నుండి ప్రతీ 25 సంవత్సరాలకు ఒకసారి శ్రీసభ జూబిలీ సంవత్సరమును కొనియాడుచున్నది. కాని, నపోలెయోనిక్ యుద్ధాల కారణముగా 1800, 1850లో జూబిలీ సంవత్సరమును కొనియాడుట వీలుపడలేదు. 1875లో రోము నగరమును ఇటలీ రాజ్యములో కలుపుట వలన, శ్రీసభ సాంప్రదాయము మేరకు ఘనముగా వేడుక జరుపకపోయినా, జూబిలీ మహోత్సవమును కొనియాడగా, అప్పటి నుండి శ్రీసభలో నిరంతరాయముగా జూబిలీ సంవత్సరములు కొనియాడబడ్డాయి.

2022 ఫిబ్రవరి 11, ఫ్రాన్సిస్ పాపుగారు, నవీన సువార్తా ప్రచార విభాగ అధ్యక్షులైన మహా ఘన రీనో ఫిసికెల్లగారికి 2025 జూబిలీ వేడుకకు తగిన ఏర్పాట్లను చేయమని ఒక లేఖ ద్వారా తెలియజేశారు. ముందుగా రెండవ వాటికన్ మహాసభ ద్వారా విడుదలైన అధికారిక పత్రాలను మరింత శ్రద్ధతో అవలోకనము చేసుకొను నిమిత్తము 2023 సంవత్సరమును "మహాసభ సంవత్సరముగా" (Year of Council), 2024 సంవత్సరమును "ప్రార్థనా

సంవత్సరముగా” (Year of Prayer) ప్రకటించారు. 2025 మహా జూబిలీ ముఖ్య నినాదము విశ్వాసులు “నిరీక్షణ యాత్రికులు” (*Peregrinantes in Spem* - Pilgrims of Hope) అంటూ పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ప్రస్తుతము మనందరకు ఎంతో అవసరమగు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచములో చోటు చేసుకున్న వైపరీత్యాల మధ్య నిరీక్షణతో ముందుకు సాగడం ఎంతో అవసరమని, జీవితములో నిరాశతో నిండిన వారికి నిరీక్షణను కలిగించి దేవుడు మనలను నిరాశకు గురిచేయడను సందేశమును ప్రపంచ ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశముతో ఈ అంశమును పాపుగారు ఎన్నుకున్నారు. అదే విధముగా, పత్రీ జూబిలీ సంత్సరము శ్రీసభలో ఆనవాయితీగా పరిపూర్ణ పాప మన్నింపును (Plenary Indulgence) పాపుగారు ప్రకటిస్తారు. విశ్వాసులు ఆ పరిపూర్ణ పాప మన్నింపును పొందుటకు తగిన విధులను పరిపూర్తి చేసి జూబిలీ ద్వారమును ప్రవేశించుట ద్వారా పొందుకోవచ్చు. పత్ర్యేకముగా రాబోవు జూబిలీ సంవత్సరములో నిరీక్షణతో ఆ దేవుని అపారమైన కరుణను, ప్రేమను చవిచూచుటకు మనమంతా ప్రయత్నిద్దాం.

ప్రతీ జూబిలీ సందర్భముగా ఆ జూబిలీ అంశమును వ్యక్తీకరిస్తూ ఒక చిహ్నమును తయారుచేయుట శ్రీసభలో ఆనవాయితి. ఈ 2025 జూబిలీ సంవత్సరము కూడా ఆ జూబిలీ చిహ్నమును తయారు చేయుట జరిగింది. ఈ సంచికకు ముఖచిత్రముగా 2025 జూబిలీ చిహ్నమునే వినియోగించాము. ఈ జూబిలీ చిహ్నము ఒక నలుగురు వ్యక్తులు, ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన వారికి సూచనగా నాలుగు రంగులలో చిత్రీకరింపబడింది. వారు నలుగురు ఒకరిని ఒకరు ఆలింగనము చేసుకొనుట అందరిని ఐక్యపరచు సోదర భావమును, సామరస్యమును తెలియజేస్తుంది. ముందున్న వ్యక్తి సిలువను ఆలింగనము చేసుకున్నాడు. ఆ చిహ్నము, విశ్వాసమును మాత్రమే కాక నిరీక్షణను వ్యక్తీకరిస్తుంది. ఎందుకంటే మనందరకు నిరీక్షణ ఎంతో అవసరము. ఈ వ్యక్తుల క్రింది అలజడితోనున్న అలలు ఉన్నాయి. ఈ అలలు, జీవితము, ప్రయాణము ఎల్లపుడు సుగమముగా, సాఫీగా ఉండక అనేక ఒడిదుడుకులతో కూడినదని తెలియజేస్తుంది. అనుదిన జీవితపు, ప్రపంచ పరిస్థితులు నిరీక్షణకు పిలుపునివ్వాలి. అందుచేత సిలువ క్రింది భాగమును మనము గమనించాలి.

సిలువ క్రింద భాగము వంగి ఒక ఓడ లంగరును పోలి లోతైన జలాలాలో నాటబడి ఉన్నది. సాధారణముగా, ఓడ లంగరు నిరీక్షణకు చిహ్నాము. సముద్రయానములో నిరీక్షణ అను లంగరు, తుఫానులు చెలరేగి అత్యవసర పరిస్థితులలో ఓడను స్థిరముగా ఉంచుటకు ఉపయోగపడుతుంది. ఈ చిహ్నాము నిరీక్షణతో ప్రయాణించు విశ్వాసులను సూచిస్తుంది. అయితే ఇది వ్యక్తగతముగా నిర్వర్తించేది కాకుండా, ఒక సంఘముగా, అందరు సిలువ చెంతకు చేర్చబడుటను సూచిస్తుంది. ఈ చిహ్నాములో సిలువ నిశ్చలమైనదిగా కాకుండ చైతన్యముగా ముందుకు సాగునదిగా చూడవచ్చు. సిలువ మానవాళివైపు వంగి ఉన్నట్లు గమనించవచ్చు, మానవాళిని ఒంటరిగా వదలక, వారి వైపు వంగి, నిరీక్షణ అను భద్రతను, రక్షణను మనకు ప్రసాదిస్తుంది. ఈ జూబిలీ చిహ్నాము క్రింది పచ్చని రంగులో వ్రాయబడిన మాటలు, 2025 జూబిలీ సంవత్సర నినాదపు మాటలు, "నిరీక్షణ యాత్రికులు" (*Peregrinantes in Spem* - Pilgrims of Hope). కాబట్టి నిరీక్షణతో మనము విశ్వాస పయనములో ముందుకు సాగాలి, ఎందుకంటే నిరీక్షణ మనలను నిరాశకు గురిచేయదు.

రాబోవు 2025 మహా జూబిలీని పురస్కరించుకుని, ఫ్రాన్సిస్ పాపుగారు, జూబిలీ సంవత్సరమును ప్రారంభిచు నిమిత్తము పాపుగారు వ్రాసిన అధికారిక పత్రమును (Bull of Indiction), అదే విధముగా, 2024వ సంవత్సరమును "ప్రార్థన సంవత్సరముగా" ప్రకటించిన సందర్భముగా, "మాకు ప్రార్థించుట నేర్పుము" అను రోమను కూరియా విశ్వాసవ్యాప్తి విభాగము విడుదల చేసిన అధికారిక పత్రమును, అనువదించి, చివరిగా ప్రార్థన అను అంశముపై అనేక వ్యాసాలను ఈ సంచికలో ప్రత్యేకముగా మీకు అందించుచున్నాము. వీటిని శ్రద్ధగా పఠించుట వలన రాబోవు 2025 మహా జూబిలీకి తగు రీతిలో సిద్ధపడి, 2024వ సంవత్సరములో ప్రార్థన ఆవశ్యకతను తెలుసుకుని ప్రార్థనలో ఎదుగుటకు, స్థిరపడుటకు ప్రయత్నిద్దాం.

దైవాశీస్సులతో

**- ఫాదర్ కుర్మా తోమాస్**

సంచిక సంపాదకులు

# 1. నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు

(*Spes non Confundit*)

**అనువాదము: ఫాదర్ కుర్మా తోమాస్**



1. "నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు" (రోమీ 5:5). నిరీక్షణా భావముతో అపోస్తులుడైనపౌలు, రోము నగరములోని విశ్వాసులను ప్రోత్సహిస్తూ పై మాటలతో వారిని సంబోధించాడు. ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరించి ప్రతీ ఇరవైఐదు సంవత్సాలకు పరిశుద్ధ పాపుగారిచే ప్రకటించబడే విధముగా, రాబోవు జూబిలీ సంవత్సర ముఖ్య సందేశము కూడా నిరీక్షణే. నా (పాపుగారి) ఆలోచనలు ప్రత్యేకముగా పవిత్ర సంవత్సర సందర్భముగా నిరీక్షణ యాత్రికులుగా పిలువబడే విశ్వాసులవైపు, ముఖ్యముగా రోమునగరమునకు ప్రయాణించు విశ్వాసులు, అపోస్తులులైన పేతురు పౌలుల పట్టణమైన రోమునగరమును సందర్శించలేక వారి స్థానిక ఆలయాలలో జూబిలీని కొనియాడే విశ్వాసులపై సైతము కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రతీ ఒక్కరికి, ఈ జూబిలీ సంవత్సరములో "రక్షణ ద్వారమైన" (యోహాను 10:7, 9) ప్రభు యేసుతో యధార్థమైన వ్యక్తిగత అనుభూతిని పొందు అవకాశముగా ఉండునుగాక. ఆ రక్షణ ద్వారమైన ప్రభువును ప్రతి ఒక్కరికి ఎల్లపుడునుఎచ్చోటను "మన నిరీక్షణగా" ప్రకటించుటకు శ్రీసభ ఆజ్ఞాపింపబడినది (1 తిమో 1:1).

నిరీక్షణ కలిగి ఉండుట అంటే ఏమిటో ప్రతీ ఒక్కరికి తెలుసు. ప్రతీ వ్యక్తి అంతరాత్మలో, రాబోవు కాలములో మన స్థితి ఏవిధంగా ఉండబోతుందో తెలియకపోయినా, ఆ రాబోవు మంచిని ఉద్దేశించి, నిరీక్షణ అనే ఆశ నెలకొని ఉంటుంది. రాబోవు కాలమును ఉద్దేశించి అనిశ్చిత పరిస్థితులు కొంత వ్యతిరేక

భావాలకు తావిస్తుంది, నిశ్చితమైన నమ్మకము నుండి అనిశ్చితమైన భావాలకు, శాంతికరమైన భావాల నుండి ఆందోళనకు, దృఢ నమ్మకము నుండి అపనమ్మకము, సంశయము కలుగుతుంది. తరచు నిరాశాపరులైన వారిని మనము ఎదుర్కోవలసి వస్తుంది. చాలా సార్లు రాబోవు రోజులలో ఎటువంటి మంచిని ఎదుర్కోలేము అని భావించే నిరాశాపరులను, మొండి వారిని ఎదుర్కుంటాము. మనందరికి నిరీక్షణలో నూత్నీకరింపబడుటకు ఈ జూబిలీ తోడ్పడునుగాక. దైవవాక్కు ఆ నిరీక్షణను కనుగొనుటకు మార్గచూపరిగా ఉంటుంది. ఆ దైవ వాక్కును మన మార్గచూపరిగా చేకొని, అపోస్తలుడైన పౌలు రోమునగర విశ్వాసులకు తెలియపరచాలని ఉద్దేశించిన సందేశమును మరొకసారి గుర్తుచేసుకుందాం.

## నిరీక్షణ అను ఒక మాట

2. "విశ్వాసము వలన మనము ఇప్పుడు నీతిమంతులముగా చేయబడుటచే మన ప్రభువగు యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానపడితిమి. ఈనాడు మనకు నిలయమైయున్న ఈ దైవ అనుగ్రహమునకు ఆయనయే విశ్వాసము ద్వారా మనలను తీసికొనివచ్చెను. కనుక దేవుని మహిమలో పాలుపంచుకొను ఆశతో మనము అతిశయించుచున్నాము! ఈ నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు. ఏలయన, దేవుడు దానముగ మన కొసగిన పవిత్రాత్మ ద్వారా తన ప్రేమతో మన హృదయములను నింపెను" (రోమీ 5:2, 5). ఈ పరిశుద్ధ గ్రంథ భాగమును పునీత పౌలు మరింత ఎక్కువగా ధ్యానించ మనలను ఆహ్వానిస్తున్నారు. ఆయన, సువార్తా వ్యాప్తిలో రోమీయులకు వ్రాసిన లేఖ ఒక నిర్ణయాత్మకమైన మలుపు తీసుకున్నదని మనందరకు తెలుసు. అప్పటి వరకు ఆయన పనిని, రోమను సామ్రాజ్య తూర్పు ప్రాంతములో కొనసాగింపగా, ఇక నుండి రోమునగరముపై కేంద్రీ కృతమైనది, ముఖ్యముగా ప్రపంచము ఎరిగిన రోమునగరమును ఉద్దేశింపబడినది. ఆయనకు ఇది ఒక గొప్ప సవాలుగా నిలిచింది. కాబట్టి సువార్తా వ్యాప్తిని ఉద్దేశించి ఆ సవాలును ఎటువంటి అడ్డంకులు, అవధులు ఎదురైనా అంగీకరించాడు. రోమునగరములోని విశ్వాస సంఘమును పౌలు స్థాపించలేదు, అయినా సిలువ వేయబడి, మరణము నుండి

ఉత్థానుడైన యేసుక్రీస్తు సువార్తను, ప్రేమలో నిక్షిప్తమై, నిరాశను కలిగించని, మహిమను చేకూర్చు, పురాతనమైన వాగ్ధనాలు నెరవేరునను నిరీక్షణా సందేశమును, అందరికి అందించు నిమిత్తము ఆయన తక్షణమే అక్కడకు వెళ్ళుటకు నిర్భందింపబడ్డాడు.

3. ప్రేమచేత నిరీక్షణ ఉద్భవిస్తుంది, సిలువపై పొడవబడిన యేసుని తిరుహృదయము నుండి పెల్లుబికిన ప్రేమపై ఆధారపడి: "ఆ ఒక్క మానవుని అవిధేయత ఫలితముగ అనేకులు పాపాత్ములుగ చేయబడినట్లే, ఈ ఒక్క మానవుని విధేయత ఫలితముగ అనేకులు నీతిమంతులగుదురు" (రోమీ 5:19). మన విశ్వాస జీవనము ద్వారా ఆ జీవము ప్రదర్శితమవుతుంది. ఆ జీవము జ్ఞానస్నానము ద్వారా ప్రారంభమై, దేవుని కృపకు పాత్రులమై నిరీక్షణ ద్వారా పెంపొందింపబడి నిరంతరాయముగా నూత్నీకరింపబడి, పవిత్రాత్మ ద్వారా ధృవపరచబడుతుంది.

పవిత్రాత్మ సర్వేశ్వరుడు, యాత్రిక శ్రీసభలో తమ నిరంతరమైన సన్నిధి ద్వారా విశ్వాసులను నిరీక్షణ అను వెలుగులో ప్రజ్వలింపజేస్తారు. మన జీవితాలను వెలుగుమయం చేయుటకు నిత్యము వెలుగు జ్యోతి వలే దానిని కాపాడుతూ, వెలుగునట్లు చూస్తారు. దేవుని ప్రేమ నుండి మనలను ఎవరూ వేరు చేయలేరను నమ్మకముపై దృఢముగా నిలిచియుండుట వలన క్రైస్తవ నిరీక్షణ మనలను నిరాశకు గురిచేయదు: "క్రీస్తుయొక్క ప్రేమ నుండి మనలను ఎవరు వేరుచేయగలరు? బాధగాని, కష్టముగాని, హింసగాని, క్షామముగాని, వస్త్రహీనతగాని, ప్రమాదముగాని, యుద్ధముగాని, మరణముగాని అట్లు చేయగలదా? అయితే మనలను ప్రేమించిన ఆయన ద్వారా వీని అన్నిటిలో మనకు ఎక్కువ విజయము కలదు సుమా! ఏలయన, మన ప్రభువైన క్రీస్తు యేసుద్వారా మనకు లభించిన దేవునిప్రేమ నుండి మనలను మృత్యువుగాని, జీవముగాని, దేవదూతలుగాని, లేక ఇతర పాలకులుగాని, ఇక్కడ ఉన్నవిగాని రానున్నవిగాని, శక్తులుగాని, ఊర్ధ్వలోకముగాని, అధోలోకముగాని, సృష్టిలో మరి ఏదియు వేరుచేయజాలదునుట నాకు నిశ్చయమే" (రోమీయులు 8:35, 37-39). ఇక్కడ ఎన్ని అవరోధాలు ఎదురైనా నిశ్చలమైన ఈ నిరీక్షణ ఏ కారణముచేత నిలుస్తుందో చూడగలము: విశ్వాసములో స్థాపింపబడి, దైవ

ప్రేమచేత పోషింపబడి, జీవితములో మనము ముందుకు సాగుటకు తోడ్పడుతుంది. పునీత అగుస్తీనుగారు కనుగొనిన విధముగా: "మనము ఏ విధమైన జీవన విధానములో ఉన్నా సరే, ఆత్మకు సంబంధించిన మూడు అంశాలైన విశ్వసించుట, నమ్మకము కలిగియుండుట, ప్రేమ కలిగియుండుట అనునవి లేకుండా జీవించలేము" (Serm. 198 augm. 2).

4. పునీత పాలుగారు వాస్తవికతలో జీవించిన వారు. జీవితము సంతోష దఃఖాలమయమని ఆయనకు తెలుసు, సవాళ్ళ ద్వారా ప్రేమ పరీక్షింపబడుతుందని తెలుసు, దుఃఖ సమయాలలో నిరీక్షణ సన్నగిల్లుతుందని కూడా తెలుసు. అయినా ఈ విధముగా వ్రాయగలిగారు: "మన బాధలలో కూడ మనము అతిశయించుదము. ఏలయన, కష్టములు ఓర్పును, ఓర్పు సచ్ఛీలమును, సచ్ఛీలము నిరీక్షణను కలిగించును" (రోమీ 5:34). అపోస్తులుడైనపౌలునకు, సువార్తా పరిచర్యలో ఉన్నవారు ఎదుర్కోవలసినసవాళ్ళైన, అవగాహనాలోపము, మతహింసలతో మిళితమైన కష్టాలు, అవరోధాలు సర్వసాధారణము. (2 కొరింతీ 6:3–10). అయినా అటువంటి పరిస్థితిలో కూడా, చీకటి వెలుపల ఒక కాంతి కిరణమును చూడగలము: సువార్తా పరిచర్య క్రీస్తుని సిలువ, పునరత్థానము నుండి ఉద్భవించు శక్తి ద్వారా పోషింపబడుతున్నదని తెలుసుకోగలము. ఈ విధముగా, మనము నిరీక్షణకు దగ్గర సంబంధము కలిగిన ఓర్పు అను ఒక సుగుణమును పాటించుట నేర్చుకుంటాము. మన ఈ వేగవంతమైన ప్రపంచములో, తక్షణమే అన్ని జరిగిపోవాలి అనే అలవాటుకు లోనయ్యాము. ఇతరులతో గడుపుటకు మనకు సమయమేలేదు; కుటుంబాలు కూడా కలసి సంతోషముగా సమయము గడుపుట లోపించింది. ఓర్పుకు స్థానము లేక విపరీతమైన తొందరతో పరుగులు తీస్తున్నాము. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి, ఎందుకంటే ఇది అసహనానికి, ఆందోళనకు, హింసకు దారి తీస్తుంది, స్వలాభ ఆలోచనా ధోరణ, అసంతృప్తి మరింత ఎక్కువగా పెరుగుతాయి.

ఈ అంతర్జాల యుగములో ఓర్పునకు తావు లేదు, సమయము, స్థానము అనేవి "ఇప్పటికిప్పుడు" అను విధముగా తయారయ్యాయి. మనము ఇంకా

దైవ సృష్టిని ఒకింత అతిశయ దృష్టితో మననము చేయగలుగుచున్నామా? ఈ పరిస్థితిలో ఓర్పు యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరము. అప్పుడే పునీత ఫ్రాన్సిసు వారి వలే మారుతున్న ఋతువులను, పంటలను, జంతువుల జీవన విధానమును, అవి ఎదుగు కాలచక్రాల క్రమమును ప్రశంసిస్తూ ప్రస్ఫుటముగా చూడగలము. ఫ్రాన్సిసు వారు సరిగ్గా ఎనిమిది వందల సంవత్సరాల క్రితం రచించిన సృష్టి గీతములో, వారు సమస్త సృష్టిని ఒక గొప్ప కుటుంబముగా పరిగణించి, సూర్యుని "సోదరునిగా" చంద్రుని "సోదరిగా" సంబోధించారు. (Fonti Fracscane, No. 263, 6.10) నూత్నీకరింపబడిన ప్రశంసతో ఓర్పు యొక్క విలువను తెలుసుకున్నప్పుడే మనకు, ఇతరులకు ఉపయోగకరముగా ఉంటుంది. దేవుని వాగ్దానాలపై ప్రగాఢ నమ్మకము కలిగి ఉండాలి అను నేపథ్యములో పునీత పౌలుగారు తరచూ ఓర్పు గురించి ప్రస్తావించారు. అయినా, అన్నింటికన్నా ముందు దేవుని ఓర్పును గురించి సాక్ష్యమిస్తూ, "సహనమునకును, ప్రోత్సాహమునకునుకర్తయగు దేవుడు" (రోమీ 15:5) అని తెలిపారు. ఓర్పు అనేది పవిత్రాత్మ వరాలలో ఒకటి, అది మనలను నిరీక్షణలో పదిలపరచి, మనకు ఒక సుగుణముగా, జీవన విధానముగా బలపరుస్తుంది. నిరీక్షణ ఫలము, అదే సమయములో పునాదియైన ఓర్పు అను వరమును ప్రసాదించమని తరచూ ప్రార్థించుట అలవరచుకోవాలి.

## నిరీక్షణ యాత్ర

5. నిరీక్షణ, ఓర్పుల పరస్పర అనుసరణలో ఒక క్రైస్తవుని జీవితము మరింత అంకితభావముతో జీవించు క్షణాలని స్పష్టము చేస్తాయి. అవి మన గమ్యమైన యేసు ప్రభుని కనుగొనుటకు దోహదపడుతూ మన నిరీక్షణను పటిష్ట పరచే నిరంతర సహచరులుగా రూపొందుతాయి. 1300 సంవత్సరములో ప్రకటింపబడిన మొదటి జూబిలీ సంవత్సరమును నేను గుర్తు చేసుకోవాలని తలంచుచున్నాను. ఆ సంవత్సరము ప్రాచుర్యములోనున్న ఆధ్యాత్మికతచే ప్రేరేపించబడిన అనుగ్రహముతో కూడిన ప్రయాణమది. దేవుని కనికరము అను అనుగ్రహము పవిత్రులును, విశ్వాసపాత్రులైన దైవ ప్రజలపై అనేక విధాలుగా కురిపించబడిన

సంఘటనలను ఏలా మరచిపోగలము? మనకు ఎప్పుడూ గుర్తుకు వచ్చేవిధముగా, ఉదాహరణకు ఎనిమిదవ బోనిఫాసు పాపుగారు పవిత్ర సంవత్సరమును ప్రకటించుటకు ఆరు సంవత్సరములకు ముందుగా, 1294, ఆగష్టు 28, 29 తేదీలలో అక్విలాలోని కొల్లెమాజ్జో పరిశుద్ధ మరియమాత మహాదేవాలమును సందర్శించిన వారందరికి పునీత ఐదవ చెలెస్తీను పాపుగారి పాలనలో పొందిన "పాప మన్నింపు". అప్పటి నుండి శ్రీసభ జూబిలీ అనుగ్రహమును దారాళముగా ప్రవహించు దైవ కృపగా చవిచూస్తుంది. అంతకంటే ముందుగా 1216లో మూడవ ఒనోరియసు పాపుగారు, అసిస్సీలోని పోర్ట్సియుంకొల (Porziuncola)ను ఆగష్టు నెల మొదటి రెండు రోజులలో దర్శించే వారికి పునీత ఫ్రాన్సిసు వారి వేడుదల ద్వారా పాప మన్నింపును దయచేశారు. అదే విధముగా సాంతియాగో దె కాంపోస్తేలా పవిత్ర యాత్ర గురించి కూడా చెప్పవచ్చు, 1222లో రెండవ కలిస్తుసు పాపుగారు ఎప్పుడైతే అపోస్తులుడైన పునీత యాకోబు వారి పండుగ ఆదివారము నాడు వస్తుందో అప్పుడు జూబిలీ కొనియాడుటకు అనుమతించారు. ఆ విధముగా "వివిధ వ్యవధులలో" జూబిలీ కొనియాడుట ఎంతో మంచిది ఎందుకంటే విశ్వాసులకు సంఘపరంగా, వ్యక్తిగతముగా ఆ పవిత్రయాత్రలో దైవ కృప వారికి తోడ్పడుతూ, వారితో పయనిస్తుంటుంది.

ప్రతీ జూబిలీలో పవిత్ర యాత్ర అనేది ఒక ప్రధానమైన అంశము. ప్రయాణము అనేది సాంప్రదాయము ప్రకారము మానవుని జీవిత పరమార్ధమును తెలుసుకొనుటకు చేయు అన్వేషణగా భావించేవారు. కాలి నడకతో చేసే ప్రయాణము నిశ్శబ్దము, ప్రయాస, జీవిత సరళత్వము యొక్క విలువను, తిరిగి కనుగొనుటకు ఉపయోగపడు సాధనము. రాబోవు సంవత్సరములో నిరీక్షణ యాత్రికులు కచ్చితముగా ప్రాచీన, మరింత ఆధునిక రహదారులలో ప్రయాణిస్తూ జూబిలీ అనుగ్రహాలను ఉన్నత స్థాయిలో అనుభవించగలరని భావిస్తున్నాను. రోము నగరములోనే, ప్రాచీన క్రైస్తవ విశ్వాసుల సమాధుల సందర్శన, ఏడు దేవాలయాల సందర్శన, ఇతర విశ్వాస పవిత్ర యాత్రలు ప్రతిపాదించబడతాయి. దేశ సరిహద్దులు హద్దులే కాదన్నట్టు

ఒక దేశము నుండి ఇంకొక దేశమునకు, ఒక పట్టణము నుండి మరొక పట్టణమునకు ప్రయాణిస్తూ, విశిష్టతతో నిండిన దైవసృష్టిని మననము చేసుకుంటూ, వివిధ సంస్కృతుల, అనుభవాల గొప్పతనాన్ని ఆస్వాదిస్తూ, ఆ అనుభూతులన్నీ ప్రార్థనలో సమర్పిస్తూ, దేవుడు చేసిన అద్భుత కార్యాలకు కృతజ్ఞతలు చెల్లించుట నేర్చుకుంటాము. ఈ పవిత్ర యాత్ర ప్రణాళికలో, రోము నగరములో నిరీక్షణ అను నీటిబుగ్గ ద్వారా, అన్నింటికన్నా ముఖ్యముగా ప్రతీ హృదయ పరివర్తనకు తొలి అడుగు అయిన, పాపమన్నింపు అను దివ్య సంస్కారము పొందుటకు జూబిలీ దేవాలయాలు ఆధ్యాత్మిక ఎండమావులుగా, విశ్వాస యాత్రలో విశ్రాంతి నిలయాలుగా తోడ్పడతాయి. స్థానిక దేవాలయాలలో, పాపమన్నింపు దివ్యసంస్కారమును అందించుటకు, విశ్వాసులను తగిన విధముగా తయారుచేసి, గురువులను ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేసి, ఎప్పుడూ వారికి అందుబాటులో ఉండేలా చూడాలి.

ప్రత్యేకముగా, తూర్పు దైవార్చన క్రమములను అనుసరించు శ్రీసభలకు చెందిన విశ్వాసులను ఆహ్వానిస్తున్నాను, ప్రత్యేకముగా అపోస్తలుడైన పేతురు వారసునితో పూర్తి సహవాసము కలిగిన వారిని ఈ పవిత్రయాత్రలో పాలుపంచుకోమని ఆహ్వానిస్తున్నాను. వారు చాల బాధలను అనుభవించారు, క్రీస్తుకు, శ్రీసభకు విశ్వాసపాత్రముగా ఉండుటకు ప్రాణాలను సైతం త్యాగము చేసి, వారి ఉనికిని అనేక సందర్భాలలో కనబరచినవారు. ప్రత్యేకముగా వారికి మీ తల్లియునైన రోమునగరమునకు ప్రత్యేకముగా ఆహ్వానింపబడాలి. ప్రాచీన దైవార్చనను అనుసరించు వారిని, వారి దైవశాస్త్రము, వారి పితామహుల ఆధ్యాత్మిక జీవనశైలి, మునులు, దైవశాస్త్ర పండితులు, ప్రస్తుతము చోటుచేసుకొనే వైపరీత్యాల మధ్య ముఖ్యముగా వారి పరిస్థితి ఒక సిలువ మార్గమును పోలియున్నా, ప్రస్తుతము కొన్ని ప్రాంతాలలో జరుగు హింస కారణముగా వారి మాతృదేశాలను, వారి పవిత్ర స్థలాలను వదిలి సురక్షిత స్థలాలకు వెళ్ళ వలసిన పరిస్థితిలో ఉన్న క్రైస్తవ సనాతన ధర్మమును పాటించు సోదరీ సోదరులను అందరిని విశ్వ కథోలిక శ్రీసభ ఆలింగనము చేసుకోవాలని భావిస్తుంది. పైచెప్పబడిన వారికి, శ్రీసభ వారిని ప్రేమిస్తుంది అన్న తలంపు ద్వారా ఉద్భవించే నిరీక్షణ, వారిని విడనాడకుండా వారు ఎక్కడకు వెళ్ళినా

వారిని వెంబడిస్తుంది, ఈ విధముగా జూబిలీ సంవత్సరము మరింత ప్రభావితమైనదిగా ఉంటుంది.

6. 2025 పవిత సంత్సరము అంతకు ముందు నుండి కొనియాడబడిన అనుగ్రహము యొక్క కొనసాగింపు. గత సామాన్య జూబిలీ సందర్భముగా మనము యేసు క్రీస్తు జయంతి రెండు వేల సంవత్సరాలను పూర్తి చేసుకున్నాము. మళ్ళీ యేసు క్రీస్తు సువార్త యొక్క ముఖ్య సందేశమైన "కరుణామయుడైన దేవుని ముఖమును" (మిసెరికోర్దియె వుల్తుస్, 1–13) ప్రతీ తరానికి, దేశానికి చెందిన స్త్రీకి, పురుషునికి తెలియపరచుటకు, ఆ దేవుని కలుసుకొనుటకు, 2015 మార్చి 13న నేను ప్రత్యేక జూబిలీ సంవత్సరమును ప్రకటించాను. ఇప్పుడు మరియొక క్రొత్త జూబిలీకి సమయము ఆసన్నమైనది, మళ్ళీ జూబిలీ ద్వారము క్రీస్తు ద్వారా రక్షణ కలదను కచ్చితమైన నిరీక్షణను మేలుకొలిపే దైవ ప్రేమను మిక్కుటముగా అనుభవిచుటకు అందరిని ఆహ్వానించుటకు బాహాటముగా తెరువబడుచున్నది. ఈ పవిత్ర సంవత్సరము క్రైస్తవులమైన మనందరి అడుగులను మరియొక ముఖ్యమైన వేడుకవైపు మళ్లిస్తుంది: ప్రభువైన యేసు మరణ పునరుత్థానాల ద్వారా మనకు అందించిన రక్షణ 2033లో రెండు వేల సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఇటువంటి గొప్ప విశేషాలతో మనము ఈ ప్రయాణమును ప్రారంభించనున్నాము. వీటి ద్వారా దృఢ విశ్వాసముతో, మంచి పనులతో, గొప్ప సాంప్రదాయాలతో, జూబిలీ సంవత్సరము కచ్చితముగా విశ్వ శ్రీసభకు జీవముతో నిండిన నిరీక్షణను అనుగ్రహ అనుభవము కలుగుతుందని విశ్వసించి ముందుకు సాగుతున్న దైవ ప్రజలను దైవ కృప ముందుగా నడుస్తూ మనలను ముందుకు నడిపిస్తుంది. కాబట్టి నేను సామాన్య జూబిలీ ప్రారంభమునకు గుర్తుగా వాటికనులోని పునీత పేతురు మహాదేవాలయ పవిత్ర ద్వారము 2024 డిసెంబరు 24న తెరువబడాలని ప్రకటించుచున్నాను. తరువాత వచ్చే ఆదివారము అనగా 2024 డిసెంబరు 29, నా ఆసనమున్న, లతెరానులోని పునీత యోహాను మహాదేవాలయ ద్వారమును నేను తెరుస్తాను ఎందుకంటే ఆ దేవాలయము అంకితము చేయబడి, ఈ

సంవత్సరము నవంబరు 9న 1700 సంవత్సరాలను పూర్తి చేసుకొంటున్నది. 2025 జనవరి 1న మరియమాత దివ్య మాతృత్వ మహోత్సవము నాడు, మరియమాత మహా మహాదేవాలయ ద్వారములు తెరువబడతాయి. చివరిగా, 2025 జనవరి 5 ఆదివారము నాడు రోమునగర గోడల వెలుపల ఉన్న పునీత పౌలుగారి మహాదేవాలయ పవిత్ర ద్వారములు తెరువబడతాయి. పైన చెప్పబడిన చివరి మూడు దేవాలయాల పవిత్ర ద్వారములు 2025 డిసెంబరు 25 ఆదివారము మూయబడతాయి.

2024 డిసెంబరు 29న ప్రతీ మేత్రాసన మహాదేవాలయాలలో (Cathedral), అనుబంధ మహాదేవాలయాలలో (Co-Cathedral) మేత్రాసన పీఠాధిపతి ఆ వేడుక నిమిత్తము తయారు చేయబడిన క్రమమును అనుసరించి దివ్య బలిపూజను సమర్పించుట ద్వారా జూబిలీ సంవత్సరమును ప్రారంభించాలని ప్రకటించుచున్నాను. అనుబంధ మహాదేవాలయాలలో జరుగు వేడుకకు, మేత్రాసన పీఠాధిపతి స్థానములో ఆయన ఒక ప్రతినిధిని నియమించవలెను. ఈ పవిత్ర యాత్ర ముందుగా నిర్ణయింపబడిన దేవాలయము నుండి ప్రారంభమై మేత్రాసన మహాదేవాలయమునకు చేరుకొనుట విశ్వాసులందరిని ఐక్యపరచి దైవవాక్కుచే ప్రజ్వలింపజేయబడి, నిరీక్షణ యాత్రకు సంకేతముగా నిలుస్తుంది. ఈ పవిత్ర యాత్రలో భాగముగా ఈ ప్రస్తుత లేఖ నుండి కొన్ని భాగాలు చదివి వినిపించవచ్చు, ఈ జూబిలీ సంవత్సర సందర్భముగా ఒసగబడిన పాప మన్నింపు నియమాలను, సూచనలను ఏర్పాటు చేయబడిన సాంఘ్యాలను వివరించవచ్చు. స్థానిక శ్రీసభలలో ఈ పవిత్ర సంవత్సరము 2025 డిసెంబరు 28 ఆదివారమున ముగుస్తుంది. ఈ సంవత్సర వ్యవధిలో దైవ ప్రజలు దైవ కృపచేత ఈ నిరీక్షణ వ్యాప్తిలో పూర్తిగా పాల్గొనునట్లు, ఫలప్రదము అగునట్లు అన్ని ఏర్పాట్లు చేయాలి.

ఈ సాధారణ జూబిలీ 2025 జనవరి 6న క్రీస్తు సాక్షాత్కార మహోత్సవము నాడు వాటికనులోని పునీత పేతురు మహాదేవాలయ పవిత్ర ద్వారము మూయుట ద్వారా ముగుస్తుంది. ఈ పవిత్ర సంవత్సరములో, క్రైస్తవ నిరీక్షణ జ్యోతి అందరిని ప్రేరేపించే దైవ ప్రేమగా ప్రతి స్త్రీ, పురుషుని ప్రజ్వలింపజేయునుగాక!

విశ్వ శ్రీసభ ప్రపంచమంతట, ఈ గొప్ప సందేశమునకు ఫలప్రదమైన సాక్షిగా ఉండునుగాక!

## నిరీక్షణ చిహ్నాములు

7. దేవుని అనుగ్రహములో నిరీక్షణను కనుగొనుటతో పాటు, ఈ ప్రస్తుత కాల సంకేతములలో సైతము దేవుడు ప్రసాదించు నిరీక్షణను కనుగొనాలి. రెండవ వాటికను మహాసభ సూచించిన విధముగా: "ప్రతీ యుగములో చోటు చేసుకునే కాల పరిణామాలను పరిగణనలోనికి తీసుకొని వాటిని సువార్త వెలుగులో వివరించి అన్వయించడం శ్రీసభ బాధ్యత. ఈ విధముగా కాలక్రమేణ ప్రతీ తరము వారికి తగిన విధముగా వారికి అర్ధమగు రీతిలో ఈ ప్రస్తుత జీవిత పరమార్ధము, ఒకరికి ఒకరు ఏ విధముగా సత్సంబంధము కలిగి ఉన్నారు అను సంబంధిత ప్రశ్నలకు సమాధానమును కనుగొనునట్లు తోడ్పడాలి" (*గౌదియుం ఎత్ స్పెస్*, 4). మనము ఈ ప్రస్తుత ప్రపంచములో ఉన్న మంచిని కనుగొనాలి, లేకపోతే చోటుచేసుకునే చెడును, హింసను గాంచి దుఃఖములో మునిగే ప్రమాదము పొంచియున్నది. మానవ హృదయాలలో దాగి ఉన్న, రక్షణను ప్రసాదించే దైవ సన్నిధిని వెదుకు ఆరాటము కాల చిహ్నాలలో ఒకటి, ఇటువంటి కాల చిహ్నాలు నిరీక్షణ చిహ్నాలుగా మారాలి.

8. మొట్ట మొదటి నిరీక్షణ చిహ్నాము, ప్రపంచములో శాంతి నెలకొల్పాలన్న ఆశయము, ఎందుకంటే ప్రపంచము యుద్ధము అను ఘోర పరిస్థితిలో కూరుకు పోయింది. గతములో జరిగిన భయంకర సంఘటనల పట్ల అజాగ్రత్త వలన మానవులు చాలా మంది క్రూరత్వము, హింస అను మరొక భయంకరమైన పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికే ఎన్నో హింసలను అనుభవించిన వారికి భవిష్యత్తులో ఏమిజరుగనున్నదో తెలియని పరిస్థితిలో ఉన్నారు. వారి నిస్సహాయ ఆక్రందనలు, కొన్ని ప్రాంతాలలో జరుగు ప్రాంతీయ కలహాల వలన ప్రపంచ వ్యాప్తంగా కలిగే పరిణామాలను సరిదిద్దుటకు ప్రపంచ నాయకులు ఎందుకు ప్రేరణను పొందుటలేదు? మారణ ఆయుధాలు పట్టుతప్పి, నాశనమును,

మరణమును ఆపగలవని కలగనకూడదా? ఈ జూబిలీ ప్రపంచములో శాంతిని నెలకొల్పువారు "దేవుని బిడ్డలని" (మత్తయి 5:9) గుర్తు చేయునుగాక. ప్రపంచములో శాంతిని నెలకొల్పుట కొరకు తగిన చర్యలు తీసుకోమని, ప్రపంచ శాంతియే మనకు ఒక సవాలును విసురునుగాక. ప్రపంచ దేశాల రాయబారము అవిశ్రాంత నిబద్ధతతో, ధైర్యముతో, సృజనాత్మకతతో, ప్రతీ అవకాశమును ఉపయోగించుకుని శాశ్వతముగా ప్రపంచ శాంతిని నెలకొల్పుటకు పాటుబడునుగాక.

9. నిరీక్షణతో రాబోవు దినాలవైపు ఎదురుచూచుట జీవితము పట్ల ఆసక్తి, దానిని పంచుకొనుటను సూచిస్తుంది. విచారముగా, చాలా సందర్భాలలో ఇది లోపిస్తుంది. మొట్టమొదటి పర్యవసానము ఏమనగా, మానవ జీవితమును కొత్త జీవమునకు జన్మము ఇచ్చుట ద్వారా పెంపొందించాలి అను ఆశ లోపించడము. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, ఆచితూచి ముందుకు వెళ్ళుట, భవిష్యత్తును గురించి కలవరపాటు, ఉద్యోగ భరోసా లేకపోవుట, సాంఘిక పరమైన మంచి పథకాలు లేకపోవుట, సాంఘిక ప్రేరణకొదవై మంచి సంబంధాలతో కాక లాభము అనే ప్రామాణికతతో నియంత్రింపబడే పథకాల కారణముగా, చాలా దేశాలు ఆందోళన కలిగించు విధముగా జనన శాతము పడిపోవుటను అనుభవిస్తున్నాయి. కొన్ని ప్రదేశాలలో "కొంత మంది వనరుల వినియోగ విషయములో సమతుల్యత పాటించకుండా, జనాభా పెరుగుదలను విమర్శిస్తుంటారు, ఇది అసలైన సమస్యకు పరిష్కారము కనుగొనలేకపోవుటకు నిదర్శనము". (లౌదాతొ సి, 50)

నూతన జననాన్ని స్వాగతించుట అనేది ప్రతి పురుషుని, స్త్రీ హృదయములో, శరీరములో సృష్టికర్తచే నాటబడిన బాధ్యతాయుతమైన కార్యము, ఈ బాధ్యతను భార్యాభర్తలకు వారి ప్రేమబంధమునకు అప్పగించారు. ఈ దృష్ట్యా విశ్వాస సంఘాలను, సమస్త ప్రజలను ఆదుకొనే అన్ని అంశాలతో కూడిన తగు చట్టములను ప్రభుత్వము తయారుచేయుట అగత్యము. ఫలప్రదమునకు, ప్రేమకు గుర్తుగా నూతన పుత్రీ పుత్రులకు జన్మనివ్వాలన్న

యువత ఆశయము రాబోవు రోజులలో మానవ సమాజము కొనసాగుతుందని భరోసా ఇస్తుంది. ఇది నిరీక్షణతో ముడిపడిన అంశము: ఇది నిరీక్షణ ద్వారా జనిస్తుంది, నిరీక్షణ ద్వారా ఉత్పన్నమౌతుంది.

పర్యవసానముగా, ఒక సాంఘిక ఒడంబడిక అవసరత కొరకు నిరీక్షణలో ప్రోత్సహింపబడుటకు, అభివృద్ధి పరచుటకు క్రైస్తవ సంఘము దిక్సూచిగా ముందుండి నడిపించాలి, కేవలము ఒక సిద్ధాంతపరమైనదికాక అందరిని ఆకళింపుచేసుకుని ప్రపంచములోని కాళీగా ఉన్న ఉయ్యాలలను నింపే చిన్న పిల్లలు, పసి బిడ్డల చిరునవ్వులతో నిండిన భవిష్యత్తు కొరకు పాటుబడాలి. అందరు, ఏది ఏమైనా, స్త్రీ, పురుషులు దేవుని రూపములో సృజింపబడ్డారు కాబట్టి, సంతోషముగా జీవించుటను పునరుద్ధరించాలి (ఆది కా. 1:26), ఒక రోజుతో, ఇక్కడ ఇప్పుడు, కేవలము లోక వస్తువులతో సంతృప్తిచెందుట చాలదు. ఇది స్వలాభముతో కూడిన వ్యక్తిత్వానికి దారి తీస్తుంది, నిరీక్షణ లోపిస్తుంది; అది హృదయములో నిరాశను, అసహనమును ఫలింపజేసి దుఃఖాన్ని కలుగజేస్తుంది.

10. ఈ పవిత్ర సంవత్సరములో, ఏదో ఒక కష్టమును ఎదుర్కొంటున్న మన సహోదరీ, సహోదరులకు నిరీక్షణ యొక్క ప్రత్యక్ష సంకేతాలుగా ఉండుటకు పిలువబడ్డాము. ప్రత్యేకముగా స్వాతంత్ర్యమును కోల్పోయి, ప్రతి రోజు కారాగార నిర్భందన తీవ్రతను, విధించే అవరోధాలను ఎదుర్కొను వారిని, ఆప్యాయత కొరవడిన వారిని, చాలా సందర్భాలలో వారి గౌరవాన్ని కోల్పోతున్న కారాగార వాసులను నేను తలంచుకుంటున్నాను. ఈ జూబిలీ సంవత్సర సందర్భముగా, ప్రభుత్వాలు వారిలో నిరీక్షణ పురుద్ధరించే ప్రయత్నాలు చేయాలని నేను అభ్యర్థిస్తున్నాను. శిక్ష తగ్గించు విధానాలు లేదా సమాజము మీద, వారి మీద వారు నమ్మకమును తిరిగి పొందు ఉద్దేశముతో క్షమాభిక్షను ప్రసాదించుటకు ఆలోచన చేయాలి; చట్టాన్ని గౌరవించే అంకితభావముతో, వారిని మళ్ళీ సమాజములో కలుపుకొను విధానాలు ఏర్పాటు చేయాలని అర్థిస్తున్నాను.
   ఈ అభ్యర్థన చాలా పురాతనమైనది, పరిశుద్ధ గ్రంథము నుండి

గ్రహింపబడినది, ఆ ప్రాచీనమైన జ్ఞానము ఇప్పటికీ ఉపయోగపడుతుంది. నూతన ఆరంభమునకు నాంది పలికే క్షమాభిక్షను ప్రసాదించమని పిలుపునిస్తుంది: "ఏబదియవ యేటిని పవిత్రవత్సరముగా గణింపుడు ఆ యేడు మీ దేశమున వసించు జనులందరికి స్వేచ్ఛ లభించునని చాటింపుడు" (లేవీ 25:10). మోషే ధర్మశాస్త్రములోని ఈ నియమమును యేషయా ప్రవక్త సేకరించాడు: "ప్రభువైన యావే నన్ను అభిషేకించెను. ఆయన ఆత్మ నాపై ఉన్నది. పేదలకు శుభవార్తను ప్రకటించుటకును, హృదయ వేదననొందిన వారిని దృఢపరచుటకును, చెరలోనున్న వారికి విడుదలయు, బంధిపంబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును ఆయన నన్ను పంపెను. ప్రభువు అనుగ్రహవత్సరమును గూర్చియు, మన దేవుడు శిక్షించు దినమును గూర్చి ప్రకటించుటకును శోకించువారిని ఓదార్చుటకును ఆయన నన్ను పంపెను" (యెషయా 61:12). ఆయన పరిచర్య ప్రారంభించుటకు ముందు యేసు ఈ మాటలను తన మాటలుగా అన్వయించుకొని "ప్రభు హితవత్సరము" (లూకా 4:18,19) ఆయన ద్వారా పరిపూర్తి అవుతుందని ప్రకటించాడు. ప్రపంచ నలుమూలలో విశ్వాసులు ప్రత్యేకముగా, వారి ఆత్మల కాపరులైన విచారణ గురువులు కారాగార వాసులకు గౌరవప్రదమైన సదుపాయాలను, మానవ హక్కుల పరిరక్షణ, అన్నింటికన్నా ముఖ్యముగా క్షమాపణ లభిస్తుందను నిరీక్షణను, పరివర్తన కలుగుతుందను నమ్మకమును తొలగించు, క్రైస్తవ విశ్వాసమునకు వ్యతిరేకముగా ఉండు, మరణ శిక్షను నిర్మూలించుటకు పాటుబడాలి (కథోలిక సత్యోపదేశ సంక్షేమము, సంఖ్య 2267). కారాగార వాసులకు మరింత దగ్గరగా సమీపించుటకు, వారు నిరీక్షణతో భవిష్యత్తును చూచుటకు, నూత్నీకరింనబడిన ధైర్యమును పొందుటకు సూచనగా, నేనే స్వయాన కారాగారములో ఒక పవిత్ర ద్వారమును తెరవాలని భావిస్తున్నాను.

11. అనారోగ్యముతో బాధపడు వారికి, ఇంటివద్దనైనా లేదా ఆసుపత్రిలోనైనా, నిరీక్షణ కలిగి జీవించుటకు తోడ్పడాలి. వారు అనుభవించు బాధలు వారిని సందర్శించువారు చూపే ప్రేమ, సామీప్యత వలన ఉపశమనమును పొందాలి. ఇవి కారుణ్యముతో నిండిన కార్యాలు, నిరీక్షణతో నిండిన కార్యాలు కాబట్టి, అవి ఎంతో కృతజ్ఞతా భావాన్ని కలుగజేస్తాయి.

ప్రమాదకరమైన పరిస్థితులలో, వారి కర్తవ్యమును రోగులపట్ల, ప్రమాదకరమైన స్థితిలో ఉన్న వారిపట్ల అవిశ్రాంత శ్రద్ధతో సేవచేస్తున్న వైద్య సిబ్బంది పట్ల కృతజ్ఞతాభావము కలిగి ఉండాలి.

ప్రత్యేకముగా వారి వ్యక్తిగత బలహీనతల వలన, పరిమితులు వలన కష్ట పరిస్థితులలో ఉండి, ముఖ్యముగా ఎవరైతే జబ్బు లేదా అంగ వైకల్యము వలన, వారి వ్యక్తిగత స్వేచ్ఛను, స్వాతంత్ర్యమును కోల్పోయారో వారిపట్ల సమగ్రమైన శ్రద్ధ కలిగి ఉండాలి. వారికి సేవచేయుట మానవ గౌరవమును కాపాడినట్లు, ఇది ఒక గీతముగా భావించినట్లైతే, ఆ గీతమును నిరీక్షణకు పిలుపునిస్తూ, అందరు కలసి ఒక బృందముగా సమాజాన్నంతటిని కలుపుకుని ఆలపించాలి.

12. నిరీక్షణకు ప్రత్యక్ష రూపమైన యువతకు కూడా నిరీక్షణ కలుగజేయుట ఎంతో అవసరము. విచారముగా, అనేక సార్లు వారి కలలు, ఆశయాలు విచ్ఛిన్నమౌతున్నాయి. వారిని నిరాశకు గురికానీయకూడదు, ఎందుకంటే భవిష్యత్తు వారి ఉత్సాహముపైనే ఆధారపడి ఉంది. వారి శక్తి సామర్థ్యమును చూస్తుంటే ఎంతో సంతృప్తినిస్తుంది, ఉదాహరణకు ప్రజలు అవసరములో ఉన్నపుడు, ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకొన్నపుడు వారి భుజాలను సవరించుకొని సహాయం అందించుటకు ముందుకు వస్తారు. వారి పాఠశాల చదువులు పూర్తిచేసుకుని నిరీక్షణ కోల్పోయి, అనిశ్చయమైన, మంచిని చేకూర్చలేని భవిష్యత్తు, ఉద్యోగావకాశాలు, ఉద్యోగ భరోసా లేని యువతను చూడడం చాలా బాధాకరం. వారి కలలు నేరవేరుతాయని నిరీక్షణలేని యువత అధైర్యముతో కనుమరుగౌతారు. మాదకద్రవ్యాలను ఆశ్రయించి, క్షణికమైన ఆనందము కొరకు ప్రమాదకరమైన వాటిని ఆశ్రయిస్తుంటారు తద్వారా దారుణముగా అపాయానికి గురౌతుంటారు, ఎందుకంటే జీవితము అందించే ఆనందము, ఉన్నత విలువలు వారు చూడలేరు, పర్యవసానముగా ఒంటరితనము, నిరాశకు గురియై, వారిని అంతమొందించుకొనుటకు సైతం వెనుకాడరు. ఈ కారణముచేతనే, ఈ జూబిలీ సంవత్సర సందర్భముగా శ్రీసభ ఇలాంటి వారిని సమీపించుటకు మరింతగా కృషిచేయాలి. నూత్నీకరింపబడిన ఆశయాలతో, ఈ నవ యువతను,

విద్యార్థులను, వివాహ అంతస్థులో ఉన్న యువ జంటలను, ఉద్భవించే నవతరాన్ని పట్టించుకుందాం, ప్రోత్సహించుదాం. వారికి చేరువలో ఉందాం, ఎందుకంటే వారే శ్రీసభకు, ప్రపంచానికి సంతోషము, నిరీక్షణ!

13. వారికి వారి కుటుంబాలకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆశతో వారి స్వంత దేశాలను వదలి ప్రవాసులుగా ఉన్న వారికి కూడా నిరీక్షణ కలుగజేయాలి. పక్షపాతము వలనగాని, తృణీకరింపబడుట ద్వారా గాని వారి ఆశయాలకు భంగము కలిగించకూడదు. ప్రతీ ఒక్కరి గౌరవమును గుర్తించి, ప్రతి స్త్రీ, పురుషుని మనసార స్వాగతించుట ద్వారా, అందరిని గౌరవ భావముతో ఆలింగనము చేసుకొని, బాధ్యతాయుతమైన వారికి తోడ్పడాలి లేకపోతే వారు గౌరవప్రదమైన వారి స్థితిని కోల్పోతారు. అంతర్జాతీయ ఆందోళనల వలన చాలా మంది యుద్ధము, హింస, వివక్ష నుండి తమను తాము కాపాడుకొనుటకు వలస వచ్చిన పరదేశులకు, వారి స్వంత ప్రాంతములకు దూరమైనవారికి, శరణార్థులకు, భద్రత, ఉద్యోగము, విద్య, కొత్త ప్రాంతములో, సంస్కృతిలో వారు స్థిరపడుటకు కావలసిన వాటిని అందించాలి.

వారి బంగారు భవిష్యత్తు దొంగిలింపబడకుండుటకై క్రైస్తవ సంఘము, మరింత బలహీన స్థితిలో ఉన్నవారి హక్కులను పరిరక్షించుటకు, వారిని స్వాగతించుటకు వారి తలుపులను బాహాటముగా తెలరవాలి. తుది తీర్పు ఉపమానములో ప్రభుని మాటలు మన హృదయాలలో ప్రతిధ్వనించునుగాక: “పరదేశినైయున్నపుడు నన్ను ఆదరించితిరి” ఎందుకనగా “ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినపుడు అవి నాకు చేసితిరి” (మత్తయి 25:35,40).

14. వృద్ధాప్యములో ఉన్నవారు, తరచూ ఒంటరిగా, వదలివేయబడిన వారిగా బాధపడుతుంటారు, వారు కూడా నిరీక్షణ పొందుటకు అర్హులు. వారు ఒక ఆణిముత్యము వంటివారు వారు గౌరవార్హులు, వారిలోని జ్ఞాన సంపద, ఇంకా వారు సమాజానికి అందించగల సహకారము ద్వారా క్రైస్తవ సంఘము, పౌర సమాజము వివిధ తరాల మధ్య ఒడంబడికను ఏర్పాటుచేసి భలపరచాలి.

ఇక్కడ నేను యువ తరాలకు విశ్వాసము, జ్ఞానమును అందించు సాధనములుగా, మన పూర్వీకుల (తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు) గురించి చెప్పాలని భావిస్తున్నాను. ఈ మన పూర్వీకులు, వారి బిడ్డల కృతజ్ఞతా భావమును, వారి వారసుల (మనుమలు, మనుమరాండ్రు) ప్రేమను పొందుదురుగాక, మనము మన జీవితమును అర్థము చేసుకొనుటకు, ప్రోత్సాహమును కలిగి ఉండుటకు, మన పుట్టుపూర్వోత్తరాలను (మన పూర్వీకులను) మరచిపోకూడదు.

15. కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ఉన్న అసంఖ్యాకులైన పేదలకు కనీస అవసరాలను సమకూర్చాలని నా సంపూర్ణ హృదయముతో అర్థిస్తున్నాను. వివిధ కొత్త విధానాలైన పేదరికము ముంచుకొచ్చేలోపు, మనము మొద్దుబారి పోవు, నిష్క్రమించు ప్రమాదము పొంచి ఉన్నది. అయినా ఇటువంటి పరిస్థితులలో ప్రపంచములో ఏదో కొన్ని ప్రాంతాలలో మాత్రమే కాక మన చుట్టూ ఉన్న పరిస్థితులకు మనము మన కనులు మూసుకొనకూడదు. ప్రతి రోజూ మనము అనేక మంది పేదవారిని, దరిద్రులను కలుసుకుంటాము బహుశా వారు మన ప్రక్కవారే కావచ్చు. అనేకసార్లు వారికి తలదాచుకొనుటకు స్థలము ఉండదు లేదా ఆ రోజు తినుటకు సరిపడ తిండి ఉండదు. ఎవ్వరూ వారిని పట్టించుకోరు. అనేక వనరులున్న ఈ ప్రపంచములో అసంఖ్యాక ప్రజలలో ఎక్కువ శాతం మంది పేదలే, ఆ వనరులను మారణాయుధాల తయారీకి వినియోగించడం బాధాకరం. ఈ రోజులలో పేదవారి గురించి అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక చర్చలలో వచ్చినా అవి వరుసలో చివరి స్థానములో ఉంటాయి, ఇవి కేవలము బాధ్యత నిర్వహణలో తప్పనిసరి కాబట్టి వాటిని చర్చకు అనుమతిస్తుంటారు లేదా ప్రత్యక్షముగా కాకుండా పరోక్షముగా ఆ అంశాలను చర్చించడం జరుగుతుంది. చాలా సార్లు ఈ చర్చల ఫలితాలన్నీ అట్టడుగుననే మిగిలిపోతాయి (లౌదాతొ సి, 49). ఈ పరిణామాలకు పేదలను దోషులను చేయకూడదు, భిన్నముగా బాధలను అనుభవించేది వారని మనము గుర్తుచేసుకోవాలి.

## నిరీక్షణ కొరకు విజ్ఞాపన

16. తర తరాల నుండి పురాతనమైన సందేశమును ప్రవక్తలు ప్రతిధ్వనించిన విధముగా, ఈ భువిపైనున్న వనరులన్నీ అదృష్టవంతులైన కొందరికి కాకుండా అవి అందరవని ఈ జూబిలీ మనకు గుర్తుచేయాలి. ధనవంతులు లేనివారి పట్ల ఉదారముగా ఉండాలి, అవసరములోనున్న సహోదరీ, సహోదరుల నుండి వారి ముఖమును త్రిప్పకొనకూడదు. ఇక్కడ ప్రత్యేకముగా తిండి నీరు లేని వారిని గుర్తుచేసుకుంటున్నాను: తోటి సోదరీ సోదరులు ఆకలితో అలమటించుట మనకు అవమానము, అది మానవ దేహానికి ఒక గాయము వంటిది, మన మనస్సాక్షిని పరీక్షించుకోమని మనలను హెచ్చరిస్తుంది. నా విన్నపమును నేను మరొకసారి మీ ముందు ఉంచుచున్నాను, "మారణాయుధాలపై, సైనిక దళముపై పెట్టు సొమ్మును, కటిక పేదరికములో ఉన్న దేశాల ఉపయోగార్థము ప్రపంచ వ్యాప్తముగా ఆకలిని నిర్మూలించుటకు ఒక నిధిగా ఏర్పాటు చేద్దాం, తద్వారా ఆ దేశాల పౌరులు హింసాత్మకము లేదా ఊహాజనికమైన పరిస్థితులకు లోనుకాకుండా, లేదా గౌరవప్రదమైన జీవనము కొరకు వారి దేశాలను వదిలి వెళ్ళకుండా ఉంటారు". (లౌదాతొ సి, 262)

ఈ జూబిలీ సందర్భముగా సంపన్న దేశాలకు ఇంకొక హృదయపూర్వక విన్నపమును చేయదలచుకున్నాను. వారు పూర్వము చేసిన నిర్ణయాలను గుర్తుచేసుకోమని, మనవి చేస్తూ, ఏ దేశాలైతే వారి నుండి అప్పులు చేసి ఆ అప్పులను అసలు తీర్చలేని పరిస్థితిలో ఉన్నాయో వారి అప్పులను మన్నించమని మనవిచేయుచున్నాను. ఇది ఉదారత్వము కన్నా న్యాయమునకు సంబంధించిన విషయము. ఈ రోజులలో మరింత తీవ్రమైన అన్యాయము ఇంకొకటి మనమందరము గమనిస్తున్నాము, అది ఏమనగా, "భూగోళములో తూర్పు పడమరల మధ్య ఎక్కువగా ఉన్న 'పర్యావరణ సంబంధిత అప్పు', చాలా కాలముగా ప్రకృతి వనరులను కొన్ని దేశాలు సమతుల్యత పాటించకుండా వ్యాపార సంబంధిత ఉద్దేశముతో ఎక్కువ మోతాదులో వినియోగించుట వలన ఉత్పన్నమౌతుంది". (లౌదాతొ సి, 51) పరిశుద్ధ గ్రంథము తెలుపుచున్నట్లుగా,

భూమి ప్రభువుది, మనము కేవలము "వినియోగించు వారము, పరదేశులము" (లేవీయ 25:23). మనము నిజముముగా ప్రపంచ శాంతిని నెలకొల్పాలంటే రాబోవు రోజులలో అన్యాయమునకు తావిచ్చు కారణాలను నిర్మూలించుటకు పాటుబడాలి, అన్యాయపు, చెల్లించలేని అప్పులను తొలగించి, ఆకలితో అలమటించువారి ఆకలి తీర్చాలి.

17. రాబోవు జూబిలీ సంవత్సరము క్రైస్తవులందరికి ఒక ప్రత్యేకతను చేకూరుస్తుంది. అది శ్రీసభలో మొట్టమొదటి విశ్వాస మహాసభయైన నైసియా మహాసభ కొనియాడి 1700 సంవత్సరములు కావస్తుంది. దానిని గుర్తు చేసుకొనుట ఎంతో గొప్ప విషయము. అపోస్తలుల కాలములో పీఠాధిపతులు శ్రీసభకు సంబంధించిన విశ్వాసమునకు, క్రమశిక్షణకు సంబంధించిన విషయాలు వివిధ వ్యవధులలో చర్చించారు. క్రైస్తవత్వపు తొలి శతాబ్దాలలో, పీఠాధిపతుల సమాఖ్యలు తూర్పు, పడమరలలో దైవప్రజల ఐక్యత, క్రీస్తు సువార్తను విశ్వాసపాత్రముగా ప్రకటించుటకు తరచూ ఏర్పాటు చేయబడేవి. జూబిలీ సంవత్సరము కలిసి పయనించుట (సినడాలిటి) అను ప్రక్రియకు నిర్దిష్టమైన వ్యక్తీకరణను ఇచ్చుటకు ఒక ముఖ్యమైన అవకాశమువంటిది, ఎందుకంటే క్రైస్తవ సంఘము సువార్తా ప్రచారము తక్షణమే నెరవేర్చు అవసరముంది. జ్ఞానస్నానము పొందిన అందరు పొందిన పిలుపు, పరిచర్యను ఉద్దేశించి, ప్రపంచములోని ప్రజలందరకు, అసంఖ్యాకమైన నిరీక్షణ చిహ్నములను అందించుటకు సహబాధ్యులై ఉన్నారు.

యేసు క్రీస్తు పూర్తిగా దేవుడు కాదను వాదన ప్రకారము, ఆయన తండ్రితో సమానుడు కాదనిన క్లిష్టపరిస్థితులలో నైసియా మహాసభ, శ్రీసభ ఐక్యతను కాపాడుటకు పాటుబడింది. కాన్స్టాంటైన్ చక్రవర్తి ఉత్తరువుల ప్రకారము ప్రారంభమైన ఆ మహాసభలో దాదాపు 300 పీఠాధిపతులు పాల్గొన్నారు; 325 మే 20న వారి మొదటి సమావేశము చక్రవర్తి రాజభవనములో జరిగింది. వివిధ చర్చలు జరిగిన తరువాత పరిశుద్ధాత్మ అనుగ్రహము వలన మనము ఆదివారపు దివ్య బలిపూజలో ప్రకటించు విశ్వాస సంగ్రహమును ఏకగ్రీవముగా ఆమోదించారు. ఆ మహాసభలో పాల్గొనిన పితామహులు, అన్ని సంఘాలు,

క్రైస్తవులందరూ ఐక్యముతో ఒకే విశ్వాసమును, మొట్ట మొదటి సారిగా మేము "విశ్వసిస్తున్నాము" అను మాటలను ఉపయోగించారు (నైసియా విశ్వాస సంగ్రహము).

నైసియా మహాసభ క్రైస్తవ చరిత్రకు ఒక మైలురాయి. ఆ మహాసభ వార్షికోత్సవ వేడక పరమ పవిత్ర త్రిత్వైక సర్వేశ్వరునికి ప్రత్యేకముగా ఆ ప్రేమ పరమరహస్యమును మనకు ఎరుకపరచిన, దైవ కుమారుడును "పితతో ఏక స్వభావము కలవాడైన" (నైసియా విశ్వాస సంగ్రహము) యేసు క్రీస్తుకు స్తుతి గీతమును పాడుటకు క్రైస్తవులను ఆహ్వానిస్తున్నది. అదే సమయములో నైసియా క్రైస్తవ సంఘాలను, విశ్వాస సంఘాలను భాహ్యముగా గుర్తించగల ఐక్యత కలిగి ఉన్నారు అనడానికి ఒక గుర్తు. ఈ ప్రయత్నము "వారందరు ఒకరుగ ఐక్యమై ఉండునట్లు ప్రార్థించుచున్నాను. ఓ తండ్రీ! నేను నీయందును, నీవు నాయందును ఉండునట్లు వారిని మనయందు ఉండనిమ్ము. నీవు నన్ను పంపితివని లోకము విశ్వసించుటకు వారు ఒకరుగ ఐక్యమై ఉండనిమ్ము." (యోహాను 17:21) అని ప్రభు యేసు ప్రార్థించిన ప్రార్థనకు స్పందనగా నిలవాలి.

నైసియా మహాసభ ప్రభు ఉత్థాన మహోత్సవము గురించి చర్చించింది. ఈనాటి వరకు, ఈ ప్రశ్నకు వివిధ రకాల ఆలోచనా విధానాల వలన మన విశ్వాసమునకు మూలాధారమైన ఆ సంఘటనను (ప్రభు ఉత్థాన మహోత్సవమును) ఒకే రోజున కొనియాడుటకు ఒక ఆటంకముగా నిలిచాయి. దైవ ప్రసాదితముగా, 2025 లో అందరము కలసి వేడుక చేసుకొన బోవుచున్నాము. ఈ వేడుక, తూర్పు, పడమరకు చెందిన క్రైస్తవులందరి ఐక్యతకు, క్రీస్తు ఉత్థాన మహోత్సవమును ఒకే రోజు కొనియాడు విధముగా ఒక నిర్ణయమును తీసుకొనుట కొరకు ఒక విజ్ఞాపనగా ఉండనుగాక. చాల మంది ఆదిలో సంభవించిన విబేధాలకు కారణము తెలియకుండా ప్రస్తుతము చోటుచేసుకున్న విబేధాలకు కారణములపై కూడా వారికి అవగాహన లేదు. అందుచేత అటువంటి విబేధాలను ఏ విధముగా కొనసాగనివ్వగలము అను పరిస్థితి మనలను అభ్యర్థిస్తున్నది.

## నిరీక్షణలో నాటబడుట

18. క్రైస్తవ జీవన విధానమును వ్యక్తపరచే విశ్వాసము, దైవ ప్రేమతో పాటు నిరీక్షణ, త్రివిధములైన "వేదాంత సుగుణాలు" (Theological Virtues) అవుతాయి (1 కొరింతీ 13:13; 1 తిమోతి 1:3). విడదీయలేని వాటి బంధము, ముఖ్యముగా నిరీక్షణ విశ్వాసుల జీవిత సార్ధకతను తెలియజేస్తూ, అంతర్గత దిక్సూచిగా ఉంటుంది. ఈ కారణముచేత, అపోస్తలుడైన పౌలు ఈ విధముగా ప్రోత్సహిస్తున్నారు. "మీ నిరీక్షణలో ఆనందిపుడు. కష్టములో ఓర్పు వహింపుడు. సర్వదా ప్రార్థింపుడు" (రోమీ 12:12) మన హృదయాలలో ఉన్న విశ్వాసమునకు విశ్వసనీయమైన, ఆకర్షణీయమైన సాక్ష్యమునిచ్చుటకు మనము "నిరీక్షణతో నిండి ఉండాలి" (రోమీ 15:13). అప్పుడు మన విశ్వాసము సంతోషదాయకముగా, దైవ ప్రేమ ఉత్సహపూరితముగా ఉంటుంది. తద్వారా మనము అందరికి ఒక చిరునవ్వును, స్నేహపూరితమైన సంజ్ఞను, దయాపూరితమైన చూపును, వినుటకు సిద్ధముగా ఉన్న చెవులను, ఒక మంచి కార్యమును, యేసు క్రీస్తును పోలి జీవించినప్పుడు, పైన చెప్పబడిన వాటిని స్వీకరించు వారిలో విస్తారమైన నిరీక్షణ బీజాలు నాటబడతాయి. అయినా, మన నిరీక్షణకు ఆధారము ఏమిటి? దీనిని అర్థము చేసుకొనుటకు, "మన నిరీక్షణకు కారణాలను" (1 పేతురు 3:15) ఒక క్షణం ఆగి ఆలోచనచేద్దాం.

19. "నేను నిత్య జీవమును విశ్వసించుచున్నాను" (అపోస్తలుల విశ్వాస సంగ్రహము). కాబట్టి, మన విశ్వాసము ప్రకటింపబడే విశ్వాసము. క్రైస్తవ నిరీక్షణ ఈ మాటలలో అతిముఖ్యమైన మూలాధారమును కలిగి ఉంది. నిరీక్షణ "వేదాంత సుగుణము ద్వారా మనము ఆశించు విధముగా...నిత్య జీవము మనకు సంతోషము ఒసగుతుంది" (కథోలిక సత్యోపదేశ సంక్షేమము). నిరీక్షణను ఉద్దేశించి రెండవ వాటికను మహాసభ ఈ విధముగా తెలియజేస్తుంది, "మానవుడు దేవుని కృపావరాలకు దూరమైతే, మరణించాక లభించబోయే నిత్యజీవం మీద వారికి ఏ ఆశా లేకపోతే – అది మానవుణ్ణి గౌరవ హీనమైన స్థితికి నెట్టివేస్తుందే తప్ప అతడికి ఎలాంటి మేలూ జరుగదు; ఈనాడు మానవ జీవితం సంక్షోభానికి గురికావడానికి

అది కూడా ఒక కారణమే. ఎలాగంటే దేవుణ్ణి దైవోపదేశాలను నిర్లక్ష్యం చేస్తే – జననం మరణం పాపం పుణ్యం అపరాధ భావం జీవన దఃఖం వంటి నిగూఢ సత్యాల తాలూకు ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. అవి మానవుడి అంతరంగాన్ని నిరంతరమూ వేధిస్తూ చివరికి తీవ్రమైన నిరాశకు గురిచేస్తాయి" (*గౌదియం ఎత్ స్పెస్*, 21) ఏది ఏమైనా, మనము రక్షింపబడే నిరీక్షణ అను సుగుణము ద్వారా కాల ప్రవాహములో మానవ చరిత్ర, వ్యక్తిగత చరిత్ర ముందుకు సాగలేని అగమ్యగోచరముగా, చీకటి కూపముగా కాక మహిమాయుతుడైన ప్రభుని చేరుకొనుటకు తోడ్పడుతుంది. తద్వారా, ఆయన రాకకై ఆశతో ఎదురుచూస్తూ, ఆయన కొరకు నిరీక్షణతో నిత్యము జీవించగలము. ఈ విధముగా, తొలి క్రైస్తవుల ప్రార్ధనను మన ప్రార్ధనగా చేసుకొని, పరిశుద్ధ గ్రంథములో తెలియపరచిన విధముగా: "యేసు ప్రభూ! రమ్ము" (దర్శన 22:20) అని ప్రార్ధించుదాం.

20. యేసు ప్రభుని మరణము, పునరుత్థానము మన విశ్వాసమునకు ఆయువుపట్టు, నిరీక్షణకు ఆధారము. పునీత పౌలు నాలుగు క్రియావాచకముల ద్వారా క్లుప్తముగా తెలియజేస్తున్నారు: "నేను పొదింన దానిని మీకు మొదట అందించితిని. లేఖనమున వ్రాయబడినట్లు క్రీస్తు మన పాపముల కొర్తకై మరణించెను. లేఖనమున వ్రాయబడినట్లు ఆయన సమాధి చేయబడి, మూడవ దినమున సజీవుడుగ లేవనెత్తబడెను. ఆయన పేతురునకు తదుపరి పండ్రెండు మంది అపోస్తలులకును కనబడెను" (1 కొరింతీ 15:35). క్రీస్తు మరణించి, భూస్తాపనము గావింపబడి, (మృతులలో నుండి) లేపబడి, దర్శనమిచ్చెను. మనకొరకు ఆయన మరణమును అనుభవించెను. తండ్రి దేవుని ప్రేమ, పవిత్రాత్మ శక్తి ద్వారా ఆయన మానవ స్వభావమును మొట్ట మొదటి నిత్య జీవ ఫలముగా చేసెను. ఇదియే క్రైస్తవ నిరీక్షణ: అంతా ముగిసిపోయినదను ఛాయలు గల మరణమును క్రీస్తు మన కొరకు చవిచూచుట ద్వారా జ్ఞానస్నానములో మనము పొందు ఆయన అనుగ్రహమునకు కృతజ్ఞతలు, ఎందుకనగా "జీవితము మారుతున్నది అంతమగుటలేదు" (రోమను క్రమము, దివ్య బలిపూజ పుస్తకము, మృతుల కృతజ్ఞతా ప్రార్ధన ప్రారంభ పలుకులు, 1)

అని స్పష్టమగా తెలుకొనుచున్నాము. జ్ఞానస్నానములో క్రీస్తుతో భూస్థాపితము గావింపబడి, మరణపు గోడలను నాశనము చేసి, నిత్య జీవమునకు మార్గము తయారు చేసిన ఆయన పునరుత్థానములో నూతన జీవమును పొందుచున్నాము.

మరణము మనకు ప్రియమైన వారి నుండి వేరుపరచు బాధాకరమైన సంగటనయైనా, దానిని వ్యర్థ ఉపన్యాసముతో తక్కువ చేయకూడదు. ఏది ఏమైనా ఈ జూబిలీ సంవత్సరము, జ్ఞానస్నానము ద్వారా మరణమును రూపాంతరము చేయగల క్రొత్త జీవితమును వినూత్నముగా, అత్యంత కృతజ్ఞతా భావముతో ప్రశంసించుటకు ఒక గొప్ప అవకాశముగా భావించాలి. జూబిలీ సందర్భముగా ఆ పరమ రహస్యమును క్రైస్తవ విశ్వాస తొలి శతాబ్దాలలో క్రైస్తవ విశ్వాస సంఘాల జీవితాలలో ఏవిధంగా అవలోకనము చేసుకున్నాయో ధ్యానించుట ఎంతో సమంజసము. ఉదాహరణకు అనేక పురాతన దేవాలయాలలో గమనించిన విధముగా, ముఖ్యముగా రోము నగరములోని లతెరానో పునీత యోహాను మహాదేవాలయములోని జ్ఞానస్నానపు తొట్టిని పోలి ఎనిమిది కోణాల ఆకారంములో ఏర్పాటు చేయుట, మొదలగునవి. ఈ ఎనిమిది కోణాల ఆకారము అనే చిహ్నము, జ్ఞానస్నానము ద్వారా ప్రభు ఉత్థాన దినమును, సాధారణమైన వాటికి అతీతముగా ఉండు, వార దినముల కాల ప్రవాహమును, అనంతమైన దానికి ఆరంభమును, నిత్య జీవమునకు గుర్తుగా ఉన్న “ఎనిమిదవ రోజు” ఉద్భవమును సూచిస్తుంది: దాని కొరకే మన ఈ భూలోక యాత్రను కొనసాగిస్తున్నాము (రోమీ 6:22).

వేద సాక్షులు దీనికి నమ్మదగిన చక్కటి సాక్ష్యమును ఒసగుచున్నారు. ఉత్థానుడైన క్రీస్తులో అచంచలమైన విశ్వాసముతో, ప్రభుని మోసగించక ఈ భువిలోనే వారు వారి ప్రాణమును విడిచిపెట్టారు. వేద సాక్షులు, అంతము లేని నిత్య జీవితమును ప్రకటించుట ద్వారా అన్ని యుగాలలో విరివిగా ఉన్నారు, ప్రస్తుత కాలము ఇంకా ఎక్కవగా కూడా ఉండియుండవచ్చు. మనము నిరీక్షణలో బలపడి శ్రేష్టమైన ఫలాలను ఇచ్చుటకు, వారి సాక్షీభూతమైన జీవితము అనే సంపదను మనము కాపాడుకోవాలి.

వివిధ క్రైస్తవ సాంప్రదాయాల నుండి వచ్చు వేదసాక్షులు, ఐక్యతకు బీజాల

వంటి వారు, సమైక్యత అను రక్తమునకు చిహ్నము. ఈ వేద సాక్షుల విలువైన సాక్ష్యమును ప్రశంసిస్తూ, ఈ జూబిలీ సంవత్సరములో క్రైస్తవ సమైఖ్యతా వేడుకలు జరుపుకోగలమని ఎంతో గొప్ప నమ్మకము కలిగియున్నాను.

21. మనము మరణించిన తరువాత మనకు ఏమి జరుగనున్నది? యేసుతో నిత్య జీవపు అంచులను చూడగలము, దేవునితో పూర్తిగా సహవాసము కలవారమై ఆయన అనంతమైన ప్రేమలో నిత్యము అలరారుతాము. మనము నిరీక్షణలో ఎదురుచూచేవి ప్రత్యక్షముగా చూడగలము. పునీత అగుస్తీను గారి మాటలు మనకు గుర్తు చేయునట్లు: "నా ఉనికి నీలో ఒకనిగా ఉన్నపుడు, బాధగాని, శ్రమగాని ఉండదు. నా జీవితము నీతోనింపబడిన నిజమైన జీవితమౌతుంది." (పునీత అగుస్తీను గారి ఆధ్యాత్మిక భావాల వ్యక్తీకరణ, 10, 28 (Confessions of St. Augustine) పూర్తి సహవాసము యొక్క లక్షణాలు ఏమిటి? సంతోషముగా ఉండుట. అందరు ఆశించు విధముగా సంతోషముగా ఉండుట, కొరకు మానవులు పిలువబడ్డారు.

కాని, సంతోషము అనగానేమి? మనము ఆశించు, ఎదురు చూచు సంతోషము ఏమిటి? అది క్షణిక ఆనందము కాదు, తాత్కాలికమైన ఆనందము ఒకసారి అనుభవిస్తే దాని కోసము ఇంకా నిరాశతో ప్రాకులాడితే మన హృదయాలను అసంతృప్తితో, శూన్యముతో నింపుతుంది. దేనిలోనైతే శాశ్వతమైన ఆ ఆనందమును మనము కచ్చితముగా పొందుతామో, ఏదైతే మనకు సాఫల్యమును చేకూరుస్తుందో అదే ప్రేమ. ఈ విధముగా, మనము ఇప్పుడు కూడా చెప్పగలిగేది: నేను ప్రేమించబడ్డాను, కాబట్టి నేను జీవిస్తున్నాను. నేను ఎల్లపుడునిరాశపరచని ప్రేమలో జీవిస్తాను, నన్ను వేరుపరపలేని ప్రేమలో జీవిస్తాను. మరొకసారి, అపోస్తులుని మాటలను ఆలకిద్దాం: "మన ప్రభువైన క్రీస్తు యేసుద్వారా మనకు లభించిన దేవునిప్రేమ నుండి మనలను మృత్యువుగాని, జీవముగాని, దేవదూతలుగాని, లేక ఇతర పాలకులుగాని, ఇక్కడ ఉన్నవిగాని, రానున్నవిగాని, శక్తులుగాని, ఊర్ధ్వలోకముగాని, అథోలోకముగాని, సృష్టిలో మరి ఏదియు వేరుచేయజాలదనుట నాకు నిశ్చయమే" (రోమీ 8:38-39).

22. నిత్య జీవముతో ముడిపడి ఉన్న మరొక విషయము మన వ్యక్తిగత జీవితము ముగిసిన తరువాత, లోకాంత్యము తరువాత జరిగే దేవుని తుది తీర్పు. దీనిని చిత్రీకరించుటకు చాలా మంది చిత్రకారులు ప్రయత్నించారు - ఇక్కడ మిఖాయేలు ఆంజెలో సిస్తీను చిన్న దేవాలయములో చిత్రీకరించిన మాగ్నుమ్ ఓపుస్ చిత్రం - అప్పటి వేందాంత సిద్ధాంతాల ఆధారంగా చిత్రించిన చిత్ర పటం, చూచే వారిని మంత్ర ముగ్ధులను చేస్తుంది. మనము తీర్పుదిద్దబడు క్షణాల కొరకై మనము అవగాహనతో, మెలకువతో సిద్ధపడాలి, ఇదంతా మనలోని అనవసరమైన భయాన్ని తొలగించి మన జీవితాలను ముందుకు నడిపించే, సంరక్షించే నిరీక్షణను ఆధారముగా చేసుకొని సిద్ధపడాలి. ప్రేమామయుడైన దేవుని తీర్పు (1 యోహాను 4:8,16), కచ్చితముగా ప్రేమపై ఆధారపడి ఉంటుంది, ప్రత్యేకముగా అవసరములోనున్న వారి స్థానములో ఉన్న క్రీస్తుకు మనము చేసిన వాటిపై, చేయని వాటిపై ఆధారపడి ఉంటుంది. (మత్తయి 25:31-46). కనుక మనము స్పష్టముగా, ఈ లోక సంబంధమైన న్యాయస్థానాలు ఇచ్చే తీర్పు, మానవులచేత ఒసగబడిన తీర్పు గురించి కాక; ఆ తీర్పు, ప్రేమామయుడైన దేవునితో, మనతో ఏర్పాటు చేసుకునే సంబంధముతో, అనంతమైన పరమ రహస్యమైన దైవ కృపకు సంబంధించిన తీర్పు. పరిశుద్ధ గ్రంథము తెలుపుచున్నట్లుగా: "సజ్జనులు ఇతరులకు దయజూపవలెనని ఈ నీ చెయిదముల ద్వారానే నీ ప్రజలకు బోధింతువు. పాపము చేసినవారికి పశ్చాత్తాపపడుటకు అవకాశము నొసగెదవను నమ్మకముగూడ నీ ప్రజలకు కలిగింతువు, తద్వారా నీవు మమ్ము దండించునపుడు మేము నీ కరుణను నమ్మవలెను" (సలో.జ్ఞాన 12:19,22). 16వ బెనెదిక్తు పాపుగారి మాటలలో: "తీర్పు సమయములో ప్రపంచములో, మనలో ఉన్న చెడు అంతా, అతి శక్తివంతమైన ఆయన ప్రేమ చేత నింపబడుతుంది. ప్రేమతో నిండిన భారము మన రక్షణము, ఆనందము అవుతుంది" (స్పె సాల్వి, 47).

ఆ తీర్పు, మన రక్షణను ఉద్దేశించి నిరీక్షణలో ప్రభు యేసు మన కొరకు పొందిన మరణము, పునరుత్థానము వలన దానిని మనము గెలుచుకున్నాము.

ఇది మన ప్రభువును స్వయాన కలుసుకొనుటను సూచిస్తుంది. మనము చేసిన తప్పిదము దాచి ఉంచలేనిది; ఆ దైవ ప్రేమను కలుసుకొనుటకు శుద్ధీకరింపబడవలెను. ఇక్కడ ఈ భూలోక యాత్రను ముగించిన వారి కొరకు ప్రార్ధింపవలసిన ఆవశ్యకత ఉంది, పునీతుల సంబంధ ప్రయోజనముతో మన సహకారము, సృష్టి అంతటికి జ్యేష్ఠ పుత్రుడైన క్రీస్తులో మనందరము కలసి పంచుకునే బంధము ద్వారా మనము వేడుకోవాలి. ప్రార్ధనా ఫలితము ద్వారా జూబిలీ పాపమన్నింపు, మనకంటే ముందుగా ఈ లోకమును వీడిన వారిని ఉద్దేశింపబడి, వారు సంపూర్ణ దైవకృపకు పాత్రులు అగుదురుగాక.

23. నిజముగా, జూబిలీ పాప మన్నింపు దేవుని స్వభావమైన అనంతమైన దైవకృపను కనుగొను మార్గము. యాదృశ్చికము కాదు, ఆదిమ విశ్వాసులకు "దైవకృప", "పాపమన్నింపు" అనునవి ఒకదానికి బదులు ఒకటి సూచించేవిగా, అవధులు లేని దేవుని సంపూర్ణ క్షమాపణకు గుర్తుగా వాడేవారు.

పాప మన్నింపు దివ్య సంస్కారము ద్వారా దేవుడు మన పాపములను తుడిచి వేస్తాడను హామీ ఇస్తుంది. కీర్తనాకారుడు వ్యక్తపరచు విధముగా ఆ శక్తివంతమైన, ఊరటను కలిగించు మాటలు: "ఆయన నీ పాపములనెల్ల మన్నించును. నీ వ్యాధులనెల్ల కుదుర్చును. సమాధి నుండి నిన్ను కాపాడును. కరుణా కటాక్షము అనెడు కిరీటమును నీకు ఒసగును...ప్రభువు కరుణామయుడు, దయాపూరితుడు, దీర్ఘశాంతుడు, ప్రేమనిధి...మన పాపములకు తగినట్లుగా మనలను శిక్షింపడు మన దోషములకు తగినట్లుగా మనలను దండింపడు. భూమికి ఆకాశము ఎంత ఎత్తుగా ఉన్నదో ప్రభువు పట్ల భయభక్తులు చూపువారి యెడల ఆయన ప్రేమ అంత మిక్కుటముగా నుండును. పడమరకు తూర్పు ఎంతదూరమో అంత దూరముగా అతడు మన పాపములను పారద్రోలును" (కీర్తన 103:3-4,8,10,12). పాప సంకీర్తనము అను దివ్య సంస్కారము కేవలము ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుగ్రహము మాత్రమే కాక, మన విశ్వాస యాత్రలో నిర్ణయాత్మకమైన, ముఖ్యమైన మెట్టు. ఆ దివ్య సంస్కారము ద్వారా మన పాపములను తుడిచివేటకు, మన హృదయాలను స్వస్థ పరచుటకు, మనలను లేవనెత్తుటకు,

ఆలింగనము చేసుకొనుటకు, ఆయన సున్నితమైన దయగల ముఖమును చూపించ, ప్రభువును అనుమతిస్తున్నాము. దేవుని మనతో సఖ్యపడుటకు (2 కొరింతీ 5:20) అనుమతించుట కన్నా దేవుని తెలుసుకొనుటకు, ఆయన క్షమాపణను చవిచూచుటకు వేరొక మార్గము లేదు. పాప సంకీర్తనము అను దివ్య సంస్కారమును అనాదరము చేయవద్దు, కాని స్వస్థతను, సంతోషమును, దేవుడు మన పాపములకు మన్నింపును దయచేయు ఆ దివ్య సంస్కారము యొక్క ఔన్నత్యమును తిరిగి కనుగొందాము!

ఇంకా మన వ్యక్తిగత అనుభవము మేరకు, ప్రతీ పాపము ఒక "మచ్చను విడిచిపెడుతుంది". పాపము మనము చేసిన తప్పిదము వలన భాహ్యముగా మాత్రమే కాక, అంతర్గతముగా కూడా ప్రభావమును కలిగి ఉంటుంది, "ప్రతి పాపము, స్వల్ప పాపము సైతము, సృష్టి జీవులతో అనారోగ్యకరమైన బంధమును కలుగజేస్తుంది, ఈ భూలోకములో గాని, మరణము తరువాత గాని, ఉత్తరించు ఆత్మల స్థలములో గాని, ఆ పాపములు శుద్ధి చేయబడాలి" (కథోలిక సత్యోపదేశ సంక్షేమము, 1472). మన మానవత్వములో, బలహీనత వలన గాని, సైతాను ప్రలోభము వలన గాని, పాపపు ఛాయలు కొంత మిగిలి ఉంటాయి. క్రీస్తు అనుగ్రహము వలన ఇటువంటివి జూబిలీ సందర్భముగా ప్రసాదించు పాపమన్నింపు ద్వారా తొలగించబడతాయి, పునీత ఆరవ పౌలుపాపుగారు రచించిన విధముగా, "ఆయనే మన పాపములకు మన్నింపు" (అపోస్తొలోరుమ్ లీమిన, అపోస్తోలిక లేఖ, మే 23, 1974). జూబిలీ సందర్భముగా ఈ సంపూర్ణ పాపమన్నింపు ఆధ్యాత్మికముగా, ఫలప్రదముగా పొందుటకు అపోస్తోలిక పాపపరిహార సభ (Apostolic Penitentiary) కొన్ని నియమాలను తయారు చేస్తుంది.

ఈ సంపూర్ణ పాప మన్నింపు అనుభవమును పొందిన మనము తిరిగి ఇతరులను మన్నించుటకు మన హృదయాలను తెరవాలి. పాప మన్నింపు గతమును మార్చదు. గతములో జరిగిన సంఘటలను మార్చలేదు, అయినా రాబోవు కాలములో ఏ విధముగా జీవించదలచుకున్నామో మనము మార్చుకోవచ్చు, కోపము, శత్రుత్వము, కక్షసాధింపును పాపమన్నింపు ద్వారా పారద్రోలుట సాధ్యము. పాపమన్నింపు గతమును వేరుగా చూస్తూ, గత కన్నీటి

ఛాయలు ఇంకా ఉన్నా, మనసులో నెమ్మదిని కలుగజేస్తూ, ఒక బంగారు భవిష్యత్తును సుగమము చేస్తుంది.

గతమున కొనియాడిన జూబిలీ సంవత్సములో, దైవకృపను అందించు పరిచారకులను (Missionaries of Mercy) ఏర్పాటు చేశాను, వారు ఈ ముఖ్యమైన పరిచర్యను ఇంకా కొనసాగిస్తున్నారు. రాబోవు జూబిలీ సందర్భముగా, వారు ఈ పరిచర్యను నూత్నీకరింపబడిన నిరీక్షణతో ఎప్పుడైతే ఒక పాపి వారి చెంతకు తెరచిన హృదయముతో, పశ్చాత్తాపముతో, వస్తాడో వారికి పాప మన్నింపును ప్రసాదించాలి. తండ్రి దేవుని కృపచేత హృదయ పూర్వకముగా ప్రేరేపింపబడిన నిరీక్షణతో భవిష్యత్తును చూచుటకు, ఈ పరిచారకులు సఖ్యతకు, ప్రోత్సాహమునకు మూలముగా ఉందురుగాక. వారి ప్రశస్తమైన పరిచర్యను ఒక లాభదాయకముగా స్వీకరించి, కారాగారాలకు, ఆసుపత్రులకు, ఎక్కడైతే ప్రజల గౌరవము కించపరచబడుతుందో, ఎక్కడైతే పేదరికము ఎక్కవగా ప్రబలి ఉందో, సాంఘిక వినాశనము ఎక్కడ అధికముగా ఉందో, నిరీక్షణ పరీక్షింపబడుతున్నదో అక్కడకు వారిని పంపించాలని పీఠాధిపతులను నేను ప్రోత్సహిస్తున్నాను. ఈ జూబిలీ సంవత్సరములో, ఎవ్వరూ దేవుని క్షమాపణ, ఓదార్పు నిరాకరింపబడక ఉందురుగాక.

24. నిరీక్షణ అత్యుత్తమమైన సాక్ష్యమును దేవమాతయైన మరియమాతలో కనుగొంటుంది. పరిశుద్ధ కన్య మరియలో నిరీక్షణనుఒక సాధారణ ఆశాభావముగా కాకుండా నిజ జీవితములో ఒక అనుగ్రహ వరముగా చూడగలము. ప్రతీ తల్లివలే మరియ తన కుమారుని చూచినప్పుడు, ఆయన భవిష్యత్తును తలంచుకుంది. కచ్చితముగా యెరుషలేము దేవాలయములో వయసు మళ్ళిన సిమియోను మాటలను ఆమె మనసులో మననము చేసికొని ఉండవచ్చు: "ఇదిగో ఈ బాలుడు యిస్రాయేలీయులలో అనేకుల పతనమునకు, ఉద్ధరింపునకు కారకుడు అగును. ఇతడు వివాదాస్పదమైన గురుతుగా నియమింపబడియున్నాడు. అనేకుల మనోగత భావములను బయలుపరచును. ఒక ఖడ్గము నీ హృదయమును దూసికొనిపోనున్నది" (లూకా 2:34-35). సిలువ చెంత అమాయకుడైన తన కుమారుడైన యేసు శ్రమలను, మరణమును చూచింది. దుఃఖములో

మునిగి కూడా ఆమె "నీ మాట చొప్పున నాకు జరుగును గాక" అను మాటను దేవునిపై తన నమ్మకమును విడువక స్వీకరించింది. ఈ విధముగా మరియ మన కొరకు తన కుమారుని గురించి ప్రవచింపబడిన సంఘటనలన్నీ నెరవేరునట్లు తన సహకారాన్ని అందించింది. ఆయన "మనుష్య కుమారుడు అనేక శ్రమలను అనుభవించి, పెద్దలచే, ప్రధానార్చకులచే, ధర్మశాస్త్ర బోధకులచే నిరాకరింపబడి, చంపబడి, మూడవ దినమున ఉత్థానమగుట అగత్యము" (మార్కు 8:31). ఆ దుఃఖపూరితమైన బాధ్యతలో, ప్రేమతో అర్పింపబడి, మరియ మనకు తల్లియైనది, నిరీక్షణమాతగా నిలిచినది. ప్రాచీన భక్తిమార్గములో పరిశుద్ధ కన్య మరియను సాగరతారగా యాదృశ్చికముగా సంబోధించలేదు. అలా సంబోధించుట జీవితపు తుఫానులలో దృఢమైన విశ్వాసమును వ్యక్తపరుస్తుంది, దేవుని తల్లి మనకు సహాయము చేయుటకు వస్తుంది, నిరీక్షణలో, నమ్మకములో మనలను పదిలముగా కాపాడుటకు, ప్రోత్సహించుటకు వస్తుంది.

ఈ సందర్భముగా, 2031 లో మెక్సికో నగరములో గల గౌదలూపె మరియమాత పుణ్యక్షేత్రము ఐదు వందల సంవత్సరాల వార్షికోత్సవమును కొనియాడుటకు సిద్ధపడుతున్నదని గుర్తుచేయ తలంచుచున్నాను. యువాన్ దియేగో ద్వారా దేవుని తల్లి ఒక విప్లవాత్మకమైన నిరీక్షణ సందేశమును తీసుకొని వచ్చింది, ఆ నిరీక్షణ సందేశమునే పుణ్యక్షేత్రమును దర్శించు యాత్రికులకు, విశ్వాసులకు తీసుకొని వస్తుంది. "నేను నీ తల్లిని కానా?" (నికాన్ మోపోహువ నెం. 119). ఆ సందేశమే ప్రపంచ నలుమూలల ఉన్న మరియమాత పుణ్యక్షేత్రాలలో హృదయాలను తాకుతున్నది, అక్కడ లెక్కించలేని యాత్రికులు పరిశుద్ధ దేవమాతకు తమ బాధలను, దుఃఖాలను, వారి ఆశయాలను సమర్పించుకుంటారు. ఈ జూబిలీ సంవత్సరములో, ఈ పుణ్యక్షేత్రాలు పవిత్ర స్థలాలుగా నిరీక్షణకు, పునర్జన్మకు ప్రత్యేక తావుగా నిలచి స్వాగతించునుగాక. రోమునగరమునకు విచ్చేయు యాత్రికులందరిని మరియమాత పుణ్యక్షేత్రములలో ఆమెను గౌరవించుటకు, ఆ తల్లి సంరక్షణ వేడుకొంటూ

ప్రార్థనలో గడుపాలని ప్రోత్సహిస్తున్నాను. ప్రతీ ఒక్కరు ముఖ్యముగా బాధలలో ఉన్న వారు, అత్యంత అవసరతలో ఉన్న వారు, తల్లులందరి కంటే అమితమైన ఆప్యాయత కలిగిన, తన బిడ్డలను ఎన్నడూ విడనాడని, దేవుని పవిత్ర ప్రజలకు కచ్చితమైన నిరీక్షణా చిహ్నము, ఓదార్పుయైన మరియమాత చెంతకు విచ్చేస్తారని గట్టిగా నమ్ముచున్నాను. (లూమెన్ జెన్సియుం, 68)

25. జూబిలీ దిశగా మన ప్రయాణము సాగించి, పరిశుద్ధ గ్రంథమును ఆశ్రయించి, ఈ విధముగా మనతో మాట్లాడుతుందని తెలుసుకుందాం: “శరణాగతులమైన మనము, మన ముందుంచబడిన ఈ నిరీక్షణను దృఢముగ నిలిపి ఉంచుకొనుటకు మరింత ప్రోత్సహింపబడుచున్నాము. ఈ నిరీక్షణ మన హృదయములకు ఓడయొక్క లంగరు వంటిది. అది నిశ్చలమైనది, స్థిరమైనది. అది పరలోక దేవాలయపు తెరలో నుండి గర్భాలయములోనికి చొచ్చుకునిపోవును. మన కొరకై, మన కంటె ముందే యేసు అచట ప్రవేశించెను” (హెబ్రీ 6:18-20). ఆ మాటలు మనకు ఒక భలమైన ప్రోత్సాహమును కలిగిస్తాయి, మనకు ఇవ్వబడిన నిరీక్షణను ఎప్పటికి పోగొట్టుకోకూడదు, ఆ నిరీక్షణకు అంటిపెట్టుకుని దేవునిలో మన ఆశ్రయమును, మన బలమును కనుగొనాలి.

ఓడ లంగరు చిహ్నము చాల గొప్పది ప్రభు యేసుకు మనలను అప్పగించుకున్న యెడల జీవితపు కష్టాలు అను సాగరములో మనకు నిలకడ, రక్షణ కలిగి ఉండుటకు మనకు సహాయపడుతుంది. మనలను బాధపెట్టు తుఫాను జయించలేదు, ఎందుకనగా, క్రీస్తులో జీవించుటకు, పాపమును, భయమును, మరణమును జయించుటకు, మనము అనుగ్రహము ద్వారా జనించిన నిరీక్షణ అను ఓడ లంగరుతో పటిష్టము గావింపబడ్డాము. ఈ నిరీక్షణ, జీవితపు క్షణికమైన సంతోషాలను, తక్షణ ఫలితాలను స్వంతము చేసుకొను ధోరణిని, మనము అనుభవించుచున్న పరీక్షలను, కష్టాలను అధిగమింపజేస్తుంది, మనము పిలువబడిన విధముగా, పరలోకపు ధ్యేయము యొక్క గొప్పతనాన్ని కోల్పోకుండా, ముందుకు సాగుటకు ప్రోత్సహిస్తుంది.

రాబోవు జూబిలీ సంవత్సరము దేవునిలో మన నిరీక్షణ చెరగని నిరీక్షణగా గుర్తింపబడిన పవిత్ర సంవత్సరముగా ఉండునుగాక. ఈ జూబిలీ సంవత్సరము, శ్రీసభలో, సమాజములో మన వ్యక్తిగత సంబంధాలలో, అంతర్జాతీయ సంబంధాలలో, ప్రతీ వ్యక్తి యొక్క, దైవప్రసాదితమైన సృష్టి గౌరవమును పెంపొందిసస్తూ, మనకు కావలసిన ధైర్యవంతమైన నమ్మకమును పొందుదుముగాక. విశ్వాసుల సాక్ష్యము ప్రపంచములో నిరీక్షణ పెపొందుటకు, ప్రభు వాగ్ధానాలు నెరవేరునని సంతోషముతో ఎదురుచూస్తూ, ప్రతి స్త్రీ, పురుషుడు న్యాయములో, ఐఖ్యతలో జీవించునట్లు ఒక క్రొత్త దివి, ఒక క్రొత్త భువికి నాంది పలుకునుగాక (2 పేతురు 3:13).

ఇప్పుడు కూడా మనము ఈ నిరీక్షణ చెంతకు ఆకర్షింపబడుదుముగాక! మన సాక్ష్యము ద్వారా, నిరీక్షణ కొరకు ఆశగా ఎదురు చూస్తన్న వారిని చేరునుగాక. మనము జీవించు జీవనము ద్వారా వారికి ఈ మాటలలో చెప్పుదము: “నీవు ప్రభువు కొరకు వేచియుండుము ధైర్యము తెచ్చుకొనుము. గుండెదిటవు చేసికొనుము, నీవు ప్రభువు కొరకు నిరీక్షింపుము” (కీర్తన 27:14). స్తుతి మహిమ ఇప్పుడును ఎల్లపుడును కలుగు ప్రభు యేసు క్రీస్తు రోజు కొరకు దృఢముగా ఎదురు చూచు మన రోజులు నిరీక్షణా శక్తితో నింపబడునుగాక.

లతెరానులోని పునీత యోహాను మహాదేవాలయము, రోము నగరము, మే 9, 2024, ప్రభువైన యేసు క్రీస్తు మోక్షారోహణ మహోత్సవము, నా 12వ జగద్గురు పాలనా సంవత్సరము.

ఫ్రాన్సిస్

❋ ❋ ❋ ❋

# ౨. మాకు ప్రార్థించుట నేర్పుము
## (అనువాదము)

– బ్రదర్ అరికోట్ల భరత్

**ఉపోద్ఘాతము**



మనము 2025 జూబిలీ సంవత్సరానికి చేరువలో ఉన్నందున, పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 2024వ సంవత్సరాన్ని ప్రార్థనకు అంకితం చేయాలని నిశ్చయించారు. అందువలన ఆయన పవిత్ర ద్వారాన్ని తెరవడానికి సన్నాహకంగా ఎంతో అంకితభావముతో సమస్త శ్రీసభను ఆహ్వానిస్తున్నారు.

పవిత్ర సంవత్సర వేడుక యూదుల సాంప్రదాయమైన జూబిలీని (yobel) అనుసరించి కొనియాడబడుచున్నది. యూదుల సాంప్రదాయం ప్రకారము జూబిలీ క్షమాపణ, సఖ్యత పెంపొందించు సమయము. క్రీ.శ. 1300 నుండి మనలను ఆదుకునే దేవుని కరుణను ధ్యానిస్తూ, మన జీవితాలలో మార్పును చేకూర్చు సమయము. ఈ రెండు పవిత్ర సంసవత్సరములోయాత్రికులైన విశ్వాసులకు ఉదారముగా ఒసగబడు ఆధ్యాత్మిక అనుగ్రహాలతో జీవించుటకు, క్రీస్తు నందు జ్ఞానస్నానములో సహోదరీ, సహోదరులుగా ఐఖ్యపరచబడిన వారితో, సర్వమానవాళితో, దేవుని చేత ప్రేమింపబడు వారందరితో సత్సంబంధాలను నూత్నీకరించుటకు, ఎంతో అవసరము.

ఈ జూబిలీ కేవలము రోము నగరమును మాత్రమే కాక, అంతటకు విస్తరిస్తుంది, దేవుని కరుణ ప్రపంచమంతటికి ప్రకటింపబడినది, తద్వారా సువార్తా వ్యాప్తికి ఇది ఒక గొప్ప అవకాశము. క్రైస్తవులుగా, “నిరీక్షణ యాత్రికులుగా”, ఎవరైతే ఇంకా ఈ సువార్తను అందుకొనుటకు వేచియున్నారో ఆ మన సహోదరీ, సహోదరులు, కరుణ, దయాపూరితమైన హస్తాలను తెరచి

మనవైపు చాచు ప్రభువు చెంతకు నడుస్తూ, నిజమైన సాక్షులుగా ఉండుటకు ఆహ్వానింపబడ్డాము.

ఈ ఆధ్యాత్మిక సాహిత్యము ఫ్రాన్సిస్ పాపుగారి బోధన నుండి సేకరింపబడింది. జూబిలీ సంవత్సరములో పవిత్ర ద్వారమును తెరుచుటకు విశ్వాసులు తగురీతిగా సిద్ధపడుటకు ఉద్దేశింపబడినది. ప్రార్థనలో మరింత ఎక్కువగా లీనమై, ప్రార్థన అనేది దేవునితో వ్యక్తిగత సంభాషణ అని గుర్తించుటకు ఇవ్వబడిన ఒక ఆహ్వానము. ఆధునిక మానవుడు సువార్తా వ్యాప్తిలో, ప్రపంచములోని వేరు వేరు పరిస్థితులలో జీవించుటకు పిలువబడిన నేపథ్యములో ఎంతటి అంకితభావము, నూత్నీకరింపబడిన ఉత్సాహమును కలిగియున్నాడో ఆత్మపరిశీలన చేసుకొనుటకు పిలుపునిస్తుంది. ఫ్రాన్సిస్ పాపుగారు 2025 జూబిలీ సంవత్సరము ముందు సంవత్సరాన్ని ప్రార్థన సంవత్సరముగా ప్రకటించినప్పుడు, విశ్వాసులను ఈ విధముగా ప్రోత్సహించారు: "ఈ అనుగ్రహ సమయమును సంపూర్తిగా జీవించు ఉద్దేశముతో తయారగుటకు, దేవుని శక్తిని చవిచూచుటకుర...ధ వ్యక్తిగత జీవితములో, శ్రీసభ జీవనములో, ప్రపంచములో ప్రార్థన ప్రాముఖ్యతను కనుగొనడానికి,మీరు ప్రార్థనలో బలపడండి" (త్రికాల జపము, జనవరి 21, 2024).

పునీత అగుస్తీను గారు బోధించిన విధముగా చాలా సార్లు పాపుగారు, మన అంతరంగములో ఎక్కడైతే దేవుని వెలుగు ప్రకాశిస్తుందో ఆ ప్రశస్తమైన సత్యమును కనుగొనుటకు ప్రార్థన ఒక మార్గమువంటిది. ఫ్రాన్సిస్ పాపుగారు ఒక వ్యక్తిలో, సంఘములో అదేవిధముగా ఎక్కడైతే చెడు పైచేయి కలిగి ఉంటుందో అక్కడ ప్రార్థన ఏ విధముగా మార్పు తీసుకొని వస్తుందో వివరిస్తూ, విశ్వాసులను ప్రార్థనలో నిలకడగా ఉండమని ప్రోత్సహిస్తున్నారు.

అందుచేత, ప్రతీ క్రైస్తవునికి, ప్రార్థన వారి మార్గమును వెలుగుమయం చేయు వెలుగుగా నుండి పవిత్ర ద్వారములోనికి నడిపించు దిక్సూచిగా ఉండునుగాక. ప్రార్థన ద్వారా, దేవునితో మన సంబంధమును బలపరచుటకు జూబిలీ అందిచు అనుగ్రహము, క్షమాపణ అను వరములను మన హృదయాలలో ఆహ్వానించుటకు పవిత్ర ద్వారమును సమీపించుదుముగాక.

నిశ్శబ్దములో ఉన్న మాధుర్యమును, దేవుని చేతులలో మనలను సమర్పించుకున్నప్పుడు కలుగు శాంతిని, పునీతులతో సాంగత్యము ద్వారా చేయు విన్నపము యొక్క శక్తిని కనుగొనుటకు, ప్రార్థన ద్వారా సృష్టికర్తతో నిరంతర సంభాషణలో లీనమౌదాము.

ఈ ఆధ్యాత్మిక సాహిత్యము అనుదిన జీవితములో మనము ఎదుర్కొను అన్ని పరిస్థితులలో నూత్నీకరింపబడిన ప్రార్థనా భావమును కలిగి ఉండటకు ఉద్దేశింపబడింది. ప్రతి భాగము – వ్యక్తిగత ప్రార్థన ఆవశ్యకతతో ప్రారంభమై సంఘ ప్రార్థన ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ధ్యానాంశాలను, ప్రార్థన నడిపింపును, అదేవిధముగా మన అనుదిన జీవితములో ప్రతి క్షణం మనము ఇతరులతో కలసి జీవిస్తూ, దేవునితో సంభాషణలో పూర్తిగా మమేకము కావడానికి సలహాలను అందిస్తుంది. విచారణ సంఘాలలో, కుటుంబాలలో ప్రార్థన గురించి కొన్ని భాగాలు కేటాయించబడ్డాయి, ఇతర భాగాలు యువత, ధ్యాన మఠవాస సంస్థలకు, విశ్వాస వికాసమునకు, ఆధ్యాత్మిక వడకాలకు కేటాయించబడ్డాయి.

## 1. ప్రార్థన గురించి పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి బోధనలు

**– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్**

ప్రార్థన గురించి పరిశుద్ధ పాపుగారి బోధనను అనుసరించి, 2024 ప్రార్థన సంవత్సరంలో, 2025 జూబిలీ సంవత్సరానికి సిద్దపడటానికి మనము పిలువబడ్డాం. అనేక సందర్భాలలో పాపుగారు తమ బోధనల ద్వార, మే 6 2020 నుండి జూన్ 26 2021 మధ్య ఇచ్చిన "ప్రార్థన అనే సత్యోపదేశం" ద్వార ప్రార్థన అనేది సృష్టికర్తతో సన్నిహిత సంభాషణ అని, అది మానవ హృదయం నుండి ప్రారంభమై దేవుని కరుణగల హృదయాన్ని తాకుతూ, సాధారణమైన శైలిలో, శ్రీసభ బోధనతో అన్వయిస్తూ మన జీవితాలను మారుస్తుంది.

ఒక క్రైస్తవునికి, ప్రార్థన అనేది ఆధ్యాత్మిక జీవన శ్వాస (జనరల్ ఆడియన్స్, 9 జూన్, 2021), అది ఎప్పటికీ ఆగదు, పాపగారు చెప్పినట్లుగా మనం

నిదురిస్తున్నప్పుడు మాత్రమే కాదు, అది లేకుండా ముఖ్యమైన చర్య అయిన తండ్రితో మనల్ని ఉంచే సంబంధం లోపిస్తుంది. ఈ విధంగా జీవించినప్పుడు, ప్రార్ధనా జీవితం మనం పగటిపూట చేసే పనికి, కట్టుబాట్లకు ప్రత్యామ్నాయం కాదు, కానీ జీవితంలోని ప్రతి చర్యతో పాటుగా "అది స్పష్టంగా లేని క్షణాలలో కూడా" దేవుని సాన్నిధ్యం మనతో ఉంటుంది. దేవుని బిడ్డలు తన తండ్రితో, తన కుమారుడైన యేసుక్రీస్తుతో, దేవుని బిడ్డల జీవన సంబంధం ప్రార్ధన అని చెప్పినప్పుడు, మన సోదరులు, సోదరీమణులలో ఉన్న క్రీస్తు ముఖాన్ని ప్రకాశవంతం చేసే దీపానికి ఇది ఆజ్యం పోస్తుంది. (కతోలిక శ్రీసభ సత్యోపదేశము (CCC. 2565). ఈ సంభాషణలో, విశ్వాసి దేవునితో మాట్లాడటమే కాకుండా, ఆయన నిశ్శబ్ద సన్నిధి వెలుగులో సమాధానం, మార్గనిర్దేశం చేయడం ద్వారా ఆయన మాట ఆలకించటం కూడా నేర్చుకుంటాం. ప్రార్ధన ఆ విధంగా స్వర్గం, భూమికి మధ్య వారధిగా మారుతుంది, ఇది మానవ హృదయం, దేవుని హృదయం ప్రేమ యొక్క ఎడతెగని సంభాషణలో ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న ఒక సమావేశ స్థలం. ఫ్రాన్సిస్ పాపుగారు, జీవితంలోని సంతోషాలలో లేదా మనం ఎదుర్కోవాల్సిన సవాళ్లలో అన్ని పరిస్థితులలో ప్రార్ధన క్షణాలను కనుగొనమని ప్రోత్సహిస్తున్నారు. అలాగే ప్రార్థనలో, మనం దేవునిచే ఎంతగా ప్రేమించబడ్డామో తెలుసుకుంటాం, ఈ ఆవిష్కరణ మనం ప్రతిరోజూ జీవించాలనే ఆశ, ధైర్యాన్ని ఇస్తుంది. మనం ఎదుర్కొనే సమస్యలు మన ఆనందానికి అడ్డంకులు కావు, కానీ దేవుని నుండి ఆహ్వానాలు, ఆయనను కలుసుకునే సందర్భాలు (త్రికాల జపము, జనవరి 9, 2022).

ప్రార్థనలో దివ్య కారుణ్యం, లోతైన, వ్యక్తిగత మార్గంలో వ్యక్తమవుతుందని పరిశుద్ధ పాపుగారు పలుకుతువున్నారు, ఎందుకంటే దానిలో లోతుగా, ప్రతి మానవ అవసరం తండ్రి కారుణ్యం నిరంతర జ్ఞాపికని మనం కనుగొంటాము. నిజానికి, దయ వినయపూర్వకమైన ప్రార్థన ద్వారా మాత్రమే దానిని పొందవచ్చు. ప్రార్థన చాలా ముఖ్యమైనదిగా ఉండడానికి, దేవాలయంలో సుంకరి ప్రార్థించినట్లుగా మనకు ఏమి అవసరమో దేవునికి విన్నవించడానికి స్వచ్ఛమైన హృదయం అవసరం. "ప్రార్థన మంత్రదండం కాదు!", దృఢమైన సంకేతం కాదు, ఒక వ్యాపారంలో వలె, సరిగ్గా పునరావృతం చేసినప్పుడు, అభ్యర్థించిన

ఉత్పత్తిని ఇస్తుంది. "ప్రార్థనలో, దేవుడు మనలను మార్చాలి కాని దేవుణ్ణి మనం మార్చటం కాదు" (జనరల్ ఆడియెన్స్, 26 మే, 2021). ప్రార్థనలో అర్పించబడేది మన వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత దుస్థితి. ఈ విధంగా మాత్రమే మనం "దయగల ప్రేమతో నిండిన తండ్రిలా తన బిడ్డలను ఎదుర్కొనేందుకు వచ్చిన దేవుని కరుణను అనుభవించ గలుగుతాము". (జనరల్ ఆడియెన్స్ 25 మే, 2016).

పాపుగారు తన పాలన మొదటి నెల నుండి, క్రైస్తవులు తమను తాము "దేవునిలో ఒక కుటుంబం"గా (జనరల్ ఆడియెన్స్ 25 సెప్టెంబర్, 2013) దానిలో భాగంగా గుర్తించే ప్రదేశమైన ప్రార్థన ఎలా ఉంటుందో వివరించారు. ప్రార్థన మనలను ఒకే తండ్రితో ఏకం చేసి సహవాస బంధాలను బలపరుస్తుంది. శ్రీసభ తన ప్రభువును సంబోధిస్తూ (కథోలిక శ్రీసభ సత్యోపదేశము (CCC. 2641-2643) "ప్రార్థన ఉన్నచోట, సహవాసం ఉంటుంది. సహవాసం ఉన్నచోట ప్రార్థన ఉంటుంది". ప్రార్థనలో శ్రీసభ తనను తాను క్రీస్తు శరీరంగా గుర్తిస్తుందని బోధించే సత్యోపదేశం యొక్క మాటలను ప్రార్థన ప్రతిధ్వనిస్తుంది.

పునీత పియోపియెత్రల్చీనా మాటలకు అనుగుణంగా దేవుని హృదయాన్ని తెరవగల ఒక తాళం అనే ప్రార్థనను మన స్వంతం చేసుకోవాలని పాపుగారుమనలను కోరుతున్నారు, పాపుగారు చెప్తున్న విధంగా "నిష్టతో కాపలా లేని హృదయం" - "మీరు దానిని తెరవగలిగే సాధారణ తాళం, ప్రార్థన." ఎందుకంటే ఆయనది ప్రేమ హృదయం, ఒక తండ్రి హృదయం. ఇది శ్రీసభ యొక్క గొప్ప బలం. (పాద్రేపియో ప్రార్థన బృందములకు ఫ్రాన్సిస్ పాపుగారి సందేశము, ఫిబ్రవరి 6, 2016).

మన హృదయాలలో ఈ మాటలతో, దేవుని దయ, బలం, ప్రేమను కనుగొని, 2024 సంవత్సరాన్ని గొప్పగా మారుస్తూ, పాపుగారి ఆహ్వానానికి ఖచ్చితమైన వ్యక్తీకరణను అందించి, జూబిలీ ఒసగే అనుగ్రహాలవైపు నడవాలని విశ్వాసులందరినీ ప్రోత్సహిస్తునాయి. ప్రార్థన యొక్క "రాగం", దేవుని సన్నిధిలో ఉండాలనే మన కోరికను పునరుద్ధరించడానికి, ఆయనను ఆలకించి, ఆరాధించడానికి, ప్రార్థనను "పవిత్రతకు రాజ మార్గంగా మార్చి, ఇది మనము

ధ్యానం చేయడానికి కూడా వీలు కల్పిస్తుంది. (జూబిలీ 2025, ఫిబ్రవరి 11, 2022 సందర్భముగా H.E. Msgr రీనోఫిసికెల్లాకువ్రాసిన లేఖ).

మే 2020 జూన్ 2021 మధ్య ఫ్రాన్సిస్ పాపుగారు ఇచ్చిన 38వ "ప్రార్ధన అనే సత్యోపదేశం" నుండి కొన్ని బోధనల ద్వారా ఇప్పుడు మనం మార్గనిర్దేశం చేద్దాం:

ప్రార్థన అనేది నిరీక్షణకుగట్టి బలం. "మీరు ప్రార్థించినప్పుడు నిరీక్షణ పెరుగుతుంది, అది ముందుకు సాగుతుంది. ప్రార్థన నిరీక్షణకు తలుపులు తెరుస్తుందని నేను చెప్పగలను. నిరీక్షణ ఉంది కానీ ప్రార్థనతో నేను తలుపు తెరువగలుగుతాను" (జనరల్ ఆడియన్స్, 20 మే, 2020).

"క్రీస్తు ప్రభు పలుకుతున్నట్లు, "ప్రార్థన అనేది, ప్రతిదీ దేవుని నుండి వచ్చి అతని వద్దకు తిరిగి వెళ్ళుతుందని మనం గ్రహించే ప్రదేశం". కొన్నిసార్లు మానవులమైన మనం ప్రతీ దానికీ యజమానులమని నమ్ముతాము, లేదా దీనికి విరుద్ధంగా, మనం ఆత్మగౌరవాన్ని కోల్పోతాము, మనం ఒక వైపు నుండి మరొక వైపుకు వెళ్తాము. దేవుడైన మన తండ్రితో, సమస్త సృష్టితో మనకున్న సంబంధంలో సరైన కోణాన్ని కనుగొనడంలో ప్రార్థన మనకు సహాయపడుతుంది (జనరల్ ఆడియెన్స్, 4 నవంబర్, 2020).

ప్రార్థన ద్వారా దేవుని వాక్కు యొక్క కొత్త మనుష్య అవతారం జరుగుతుంది. దేవుని వాక్కును స్వాగతించి, పదిలపరచి ప్రపంచాన్ని ఎదుర్కోవడంలో దేవుని దివ్య మందసంగా తయారవుతాము. ప్రార్థన ద్వారా, దేవుని వాక్కు మనయందు, మనం దైవవాక్కులోవసిస్తాము. దైవ వాక్కు అనేది మంచి ఉద్దేశాలను ప్రేరేపిస్తు కార్యాచరణను కొనసాగిస్తుంది, అది మనకు బలాన్ని, ప్రశాంతతను ఇస్తుంది, మనం సవాళ్ళు ఎదుర్కున్నప్పుడు కూడా మనకు శాంతిని ఇస్తుంది. (జనరల్ ఆడియన్స్, 27 జనవరి, 2021).

శ్రీసభలోని ప్రతీది ప్రార్థనలో ఉద్భవించింది. ప్రార్థన వల్ల ప్రతీది అభివృద్ధి చెందుతుంది. శత్రువులు, సైతాను శక్తులు శ్రీసభతో పోరాడాలనుకున్నప్పుడు, మొదట శక్తిని హరించడానికి ప్రయత్నించి, ప్రార్థన చేయకుండా నిరోధించడం చేస్తాడు. పురోగతిని ప్రేరేపించే పవిత్రాత్మకు తలుపు తెరుస్తుంది ప్రార్థన. ప్రార్థన

లేకుండా శ్రీసభలో కలిగిన మార్పులు, మార్పులు కాదు. అవి కేవలం మానవ సమూహాలు చేసిన మార్పులు. (జనర ఆడియెన్స్, 14 ఏప్రిల్, 2021).

క్రీస్తు ప్రార్థిస్తున్నట్లుగా మనం ప్రార్థించాలని కోరుకోవడమే కాకుండా, ప్రార్థనలో మన ప్రయత్నాలు పూర్తిగా వ్యర్థమైనప్పటికీ, విఫలమైనప్పటికీ, మనం ఎల్లప్పుడూ అతని ప్రార్థనపై ఆధారపడగలమన్న హామీ క్రీస్తు ప్రభు మనకు ఒసగుతున్నాడు. క్రీస్తు మన కోసం ప్రార్థిస్తున్నాడు అన్న విషయం గురించి మనం తెలుసుకోవాలి. (జనరల్ ఆడియన్స్, 2 జూన్, 2021).

## 2. మాకు ప్రార్థించుట నేర్పుము (లూకా 11:1): ప్రార్థన అనే పాఠశాల దిశగా

**– బ్రదర్ కాలెంతు సాగర్ బాబు**

శిష్యులు యేసును ఒక ముఖ్యమైన, లోతైన అభ్యర్థనతో “మాకును ప్రార్థన చేయుట నేర్పుడు” (లూకా 11:1) అని ప్రభువు వద్దకు రావడం చూస్తున్నాం. ఈ మనవి నిజముగా ప్రార్థన ఎలా చేయాలి అనే విషయంలో ఉన్న లోటు, మార్గదర్శ ప్రయోగ అవసరాన్ని, శిష్యులు ఎరిగి ఉన్నారని ప్రతిబింబింపచేస్తూ, ప్రతి వ్యక్తిలో దాగి ఉన్న ఒక ముఖ్యమైన కోణం; ప్రార్థన నేర్పుటకు ఒక గురువు యొక్క అవసరత, జీవితంలో ముఖ్యమైన వాటి వైపు నడిపించడానికి ఒక మార్గచుపరి, అనే అంశాలు దాగి ఉన్నాయి. గురువు యొక్క శిక్షణలో, శిష్యుడు అనేటువంటి వాడు, అతని ముందు ఉన్న గురువు యొక్క అడుగుజాడలను అనుసరిస్తే తప్ప, వృద్ధి చెందదు; నిజానికి గురువు నడిచిన అడుగుజాడలలో నడవడం వలన ఏదో ఒకరోజు గురువు యొక్క నైపుణ్యాన్ని అవగతము చేసుకొని, నిదానంగా గురువువలె స్పష్టముగా అదే విజ్ఞానమును అర్జించగలుగుతాడు. “నేను ఆజ్ఞాపించిన వానిని పాటించినచో మీరు నా స్నేహితులై ఉందురు. (యోహాను 15:14) నన్ను విశ్వసించు వాడు నేను చేయు క్రియలను చేయును, అంతకంటే గొప్ప క్రియలను చేయను” (యోహాను 14:12).

ప్రార్థనకు సంబంధించినంత వరకు శిష్యులు ఈ మాటలను

అనుభవించారు. గురువు యొక్క సాన్నిధ్యములో ఉండడం వలన వారు ఆయన ప్రార్థన చేసే విధానము, ఎడారికి ఉపసంహరించుకునే విధానము, తండ్రితో సత్సంబంధం అనేది నిరంతర ప్రార్థన, ఆకర్షణ లోతైన జాగృతితో స్పష్టమవడం ద్వారా ఆకర్షితులయ్యారు. ఈపుత్రత్వ సంబంధమనే ఆకర్షణ వలన ఒక భాగం అపోస్తలులు కూడా దానిలో పొందాలనే తపన వారిలో కలిగింది. ఈ కోరిక వలన వారికి ప్రార్థన నేర్పించాలని గురువు నిర్ణయించి,తద్వారా నిజమైన ప్రార్థన శిక్షణకు ప్రాణం పోశాడు. అది శిష్యుల యొక్క కోరికను నిజమైన అనుభవంగా మార్చి దేవునితో వారి సంబంధాన్ని మలుచుకోవడమే కాక ఇతరులతో కూడా మలచబడుతుంది. పరిశుద్ధ పాపు గారు పదేపదే ప్రధానంగా చెప్పబడినవి ప్రతిధ్వనిస్తున్నాయి. అనగా ప్రార్థన అనేది ఒక భక్తివంతమైన సాధన మాత్రమే కాదు, కానీ అది ఆత్మ యొక్క ప్రాణవాయువు: ఇది ప్రతి వ్యక్తి యొక్క లోతైన, సాధారణ అవసరం. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి ప్రకారం "ప్రార్థన అనేది దేవునితో నిజమైన సంభాషణ, ఆయనతో ముఖాముఖి". (ఉదయకాల ధ్యానం, కాసా సాంత మార్త, మార్చి 15, 2018). భక్తుడు లేదా భక్తురాలు దైవ చిత్తానికి, మార్గదర్శకానికి వ్యక్తపరచుకొని, ఆలకించి, స్పందించే సమయమే ప్రార్థన. అందువలన ప్రార్థన అనేది స్వతహాగా వచ్చే సంభాషణ సూత్రం కాదని శిష్యుల విజ్ఞాపనలో చూపబడుతుంది. కానీ గురువు మాత్రమే చూపించేటువంటి బోధన, క్రమశిక్షణ అనే మార్గాలనే తప్పనిసరిగా అనుసరించాలి. శిష్యులు క్రీస్తు ప్రభువుని "మాకును ప్రార్థన నేర్పించండి", అని అడిగిన విధముగా దేవునితో ఎక్కువ సన్నిహిత, వ్యక్తిగత సంబంధములో ప్రవేశించడానికి మొదటిగా గురువు నుండి, తరువాత ఆధ్యాత్మిక మార్గ చూపరులు ఎవరైతే ఆయన అడుగుజాడలు, మార్గాన్ని గుర్తించడం నేర్చుకున్నారో అలాగే ఎప్పటి నుండో దేవుని సాన్నిధ్యంలో ప్రయాణిస్తున్న వారిని లేదా నడుస్తున్న వారిని సహాయం అడగడంలో భయపడకూడదు.

**ఆరాధన**

దేవుని గొప్పతనం ముందు ఆరాధన అనేది ఒక వినయం, గౌరవంతో కూడిన క్రియ. ఆరాధనలో మనము దేవుని యొక్క సార్వభౌమాధికారాన్ని, మన

పరిపూర్ణ ఆధారం ఆయన మీదనే అని ఒప్పుకొనుచున్నాము అని పాపుగారు పదేపదే తన ధ్యానంలో గుర్తు చేస్తున్నారు. మన విశ్వాసము, నమ్మికను బలపరుస్తూ ఆయన ముందు ఉంచడం ద్వారా ఇటువంటి ప్రార్థన విధానం దేవుని యొక్క సర్వశక్తి, మంచితనము ముందు లోతైన ఇంద్రియ వింత, ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంది. ఇది సృష్టికర్తగా మాత్రమే కాకుండా జీవ ఊట అయిన నిత్య ప్రేమ, కరుణగా ఆయన రాజ్యాధికారాన్ని గుర్తించే క్రియ. ఈ ఆరాధనలో ప్రతి క్రైస్తవుడు ఆ దైవసాన్నిధ్యములో తనకు తాను దేవునికి నిర్మలమైన, వినయ పూర్వక హృదయముతో సాక్షాత్కరించుకుంటూ తన చిన్నతనమును అంగీకరించుకోవాలి. ఇలాంటి ప్రార్థనకు విజ్ఞాపనలు లేదా విన్నపాలు అవసరం లేదు కానీ కృతజ్ఞత, గౌరవంతో ఆత్మ నిర్మలమైన భావముతో సృష్టింపబడని రహస్యమందు దేవుని వైపు మరలుతుంది.

## స్తుతి, కృతజ్ఞత

లెక్కించలేని ఆయన అనుగ్రహాలకు, ఆశీర్వాదాలకు సంతోషము, కృతజ్ఞతా భావంతో దేవునికి అర్పించేవే స్తుతి, కృతజ్ఞత ప్రార్థన. స్తుతి ప్రార్థనలో మనము దేవుని గొప్పతనము, అందము మంచి తనము ఆస్వాదిస్తాము అలాగే మన జీవితంలో, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఆయన జీవమును, జీవం ఇచ్చే సాన్నిధ్యమును అంగీకరిస్తున్నాం. కృతజ్ఞతా ప్రార్థనలో మనం పొందుకునే ప్రతి ఆశీర్వాదము ఆయన నిరంతర మంచితనము వలననేనని కృతజ్ఞతా భావమును వ్యక్తపరుస్తూ దేవుని చిన్న క్రియల నుండి పెద్ద క్రియల వరకు మనము స్పందిస్తూ ఉన్నాము. ఇటువంటి ప్రార్థన విధానము, కృతజ్ఞతా భావం అలవర్చుకోవడానికి ఏ ప్రేమతోనైతే దేవుడు మనలను ప్రేమించాడో అదే ప్రేమ సాక్ష్యం, గురుతుగా మన సోదరీ, సోదరుల వైపు చూసే విధానాన్ని మార్చుకోవడానికి సహాయపడుతుంది.

## విన్నపం

పునీతుల సత్సాంగత్యమును స్పష్టముగా వ్యక్తపరిచేదే విన్నప ప్రార్థన. సౌభ్రాతృత్వాన్ని, వివేకమును, దయను చూపిస్తూ అందులో మనము ఇతరుల అవసరాల కొరకు ప్రార్థిస్తాము. దీని ప్రాముఖ్యతను నొక్కి వక్కాణించుట

మంచిది, క్రైస్తవ ప్రేమ, సౌభ్రాతృత్వం అనే క్రియ, ఇది మనలను ఇతరులతో ఐక్యపరుస్తూ వారి బాధలలో, నిరీక్షణలో భాగము పొందేలా చేస్తుంది. విన్నప ప్రార్థన అనేది సహవాస జీవితానికి ఒక శక్తివంతమైన ప్రక్రియ దీని ద్వారా ప్రపంచ అవసరాలు, మన సోదరీ సోదరుల అవసరాలను దేవుని ముందుకు తీసుకుని రాగలుగుతాము.

ఈ విధంగా కాలము, సమయ పరిమితులను దాటుకుంటూ ఒకరి సంతోషాలను, బాధలను దేవునియందు భాగము పంచుకోవడానికి, విన్నప ప్రార్థన విశ్వాసులు, విన్నపాలను కలపడానికి ఒక వారధిలా తయారవుతుంది. ఒకరోజు మనం కూడా మరణించిన వారితో పరలోక సంపదలు అనుభవిస్తాము. కావున మరణించిన విశ్వాసికి పాపపరిహార కృపను అందించి వారితో ఐక్యపరిచే విధానమే ఈ విన్నప ప్రార్థన, ఈ జూబిలీ సందర్భంగా తెలుసుకోవాలి.

**విజ్ఞాపన**

మన మానవ బలహీనతను, సహాయ అవసరతను విజ్ఞాపన ప్రార్థన ప్రతిబింబింప చేస్తుంది. ఇలాంటి ప్రార్థనా విధానంతో మన సొంత అవసరాలు లోతైన ఆశలు, ఎక్కువ అవసరం ఉన్న విషయాలను దేవునికి సమర్పిస్తాము . మన హృదయాలను ఆయన ఎల్లప్పుడూ ఆలకిస్తాడు అని గుర్తుంచుకుంటూ నిశ్చయము, పట్టుదలతో మన మనవులను ఆయనకు సమర్పించుటకు ప్రోత్సహింపబడ్డాం; సిగ్గుపడకుండా స్థిరత్వం, నిశ్చయత కలిగి ఉండాలని ఆయన మన నుండి ఆశపడుతున్నాడు. ఎందుకు? కావున, నేను నా స్నేహితుని ద్వారమును తట్టుచున్నాను దేవుడు మిత్రుడు, మిత్రునితో నేను ఇది చేయగలను అదే స్థిరత్వము, గమనించదగిన ప్రార్థన. (ఉదయకాల ధ్యానం, కాసా సాంత మార్త, అక్టోబర్ 11,2018) విజ్ఞాపన అనేది ఎక్కడైతే మన బలహీనత ఆయన నిత్య కరుణ, ప్రేమలతో కలుస్తాయో అప్పుడే దేవునితో సన్నిహిత సహవాస సమయంగా మారుతుంది. దీని ద్వారా మన విషయాలు, కోరికలు, ఆశలు అలాగే జీవితంమొత్తాన్ని ఆయనకు అప్పగిస్తూ దేవుని మనం మరింత లోతుగా విశ్వసించడం నేర్చుకుంటాం.

# 3. విచారణ సంఘంలో ప్రార్థన

**- బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్**

## 3.1 దివ్య సత్ప్రసాదము

2025 సాధారణ జూబిలీ సిద్ధ పాటులో భాగంగా ఉన్న ప్రార్థన సంవత్సరం (2024) దివ్యసత్ప్రసాదం పట్ల అవగాహన పెంచుకొనుటకు, లోతుగా దివ్యసత్ప్రసాదము గురించి అనుభూతి చెందుటకు విలువైన అవకాశాన్ని అందిస్తుంది. దివ్య సత్ప్రసాదాన్ని లోతుగా అనుభూతి చెందాలంటే మనం ప్రతిసారి సత్ప్రసాదం ముందుకు వెళ్ళినప్పుడు మంచి నిశ్చల హృదయముతో నిర్మల స్థితిలో ఉండాలి. రోజు వారి జీవితములో తీసుకొనే చిన్నచిన్న నిర్ణయాలు, ప్రధానమైన నిర్ణయాలు దివ్యబలిలో జరిగే పరమ రహస్యాన్ని అనుభూతి పొందడానికి, ఇంకనూ విశ్వసనీయమైన, ప్రామాణికమైన సాక్షులుగా ఉ ండుటకు విశ్వాసులకు తోడ్పడతాయి .ఇలా దేవునికి ఇష్టమైన రీతిలో ప్రభావవంతంగా మారుతాయి (లోకానికి వెలుగు భూమికి ఉప్పు మత్తయి 5:13-16)

శ్రీసభ సభ్యులు ఆదివారం జరుపుకునే విశ్రాంత దినము (the Lord's day), దివ్యబలిపూజ, శ్రీసభ నడిపింపులో ప్రధానమైనవి. అలానే శ్రీసభలో భాగమైన విచారణకు ఆధ్యాత్మిక శక్తినిచ్చే దివ్య సత్ప్రసాదము కీలకమైనది. ఇది క్రైస్తవ జీవితానికి మూలం మరియు ప్రధానం. ఇది క్రీస్తు అర్పించిన బలి యొక్క స్మారక చిహ్నం, మానవాళి మోక్షానికి అతని త్యాగ పరిపూర్తి: శ్రీసభ సభ్యులందరిని ఒక దరికి చేర్చే క్రీస్తుని శరీర రక్తములు, అత్యున్నత స్థానంలో ప్రార్థింప విశ్వాసులకి ఇవ్వబడిన అవకాశం. ఈ కారణము చేతనే ఇంకనూ కథోలికులు దివ్య సత్ప్రసాదము గూర్చి మరింత ఎక్కువగా అవగాహన కలిగి ఉండుటకు, ఇంకనూ దానిని అనుభూతి చెంది పూర్తిగా నిమగ్నమై ఉండడానికి దోహదపడే ప్రార్థనా కార్యక్రమాన్ని ప్రతిపాదించడం జరిగింది.

### దివ్య పూజకు సరైన సిద్ధపాటు

మన దైనందిన జీవిత సాదకబాధకాల నుండి శాంతిని కోరినట్లయితే, దివ్య పూజలో పాల్గొనే ముందు ఆ పరమ రహస్యాన్ని కొనియాడ నిశబ్దం

వహించాలి. బలిపీఠాన్ని చేరి మందసంలో కొలువైన మందసనాధుని కనులారాగాంచి, కొన్ని క్షణాల్లో దివ్యబలిలో తనను తాను సాక్షాత్కార పరుచుకుంటాడన్న సత్యాన్ని విశ్వసించి మనల్ని మనం సంసిద్ధపరచుకోవాలి. ఆనాటి దివ్య పఠనాలను ముందుగా చదివి ధ్యానించినట్లయితే మనకు మరింత ఆ పరమ రహస్య అనుభూతిని అందిస్తుంది.

సిలువ గుర్తును భక్తి పూర్వకముగా ఆచరించుట, దివ్య బలిపూజ ప్రారంభంలో మనం చేసే సంజ్ఞలు మనలను పూర్ణ మనసుతో దివ్య బలిలో పాల్గొనేలా చేస్తాయి. వాస్తవానికి సిలువ గుర్తు, మన క్రైస్తవ విశ్వాస సంగ్రహము. సిలువ గుర్తును మనం మననం చేసుకునేటప్పుడు క్రీస్తునాధుని మనుష్యవతారము, మన రక్షణ, ఆయన పునరుత్థానము, తండ్రి కుమార పరిశుద్ధాత్మల నామములను ఉచ్చరించినపుడు పవిత్ర త్రిత్వము అనే గొప్ప పరమరహస్యాన్ని గుర్తు చేసుకుంటాము.

## దైవ వాక్కును జాగ్రత్తగా వినుట

సజీవమైన దేవుని వాక్కు ప్రతి విశ్వాసి హృదయాన్ని తాకి వారిని ప్రకాశవంతం చేయుటకు తమ తమ మనోభావాలను సరి చేసుకోవాలి. వినడం ద్వారా, విన్న దైవవాక్కును మనం మననం చేసుకోవడం ద్వారా,మన దైనందిన జీవితానికి అన్వయించుకొనుటకు సులభంగా ఉంటుంది. ప్రత్యేకించి సువార్తను ప్రకటించు సమయంలో లేచి నిలబడినప్పుడు సువార్త పరిచారకుని ద్వారా, ఆ ప్రభువు ఉనికిని మన జీవితానికి పాఠాలు నేర్పించేలాగున, మనం గుర్తించగలగాలి.

## పరలోక ప్రార్థనను భక్తితో ప్రార్థించుట

యేసు ప్రభువు మనకిచ్చిన పరలోక ప్రార్థనలో చెప్పబడిన పదాలను, వాటి అర్థాలను ప్రార్థనాపూర్వకంగా ధ్యానించుటకు ప్రయత్నించాలి. వ్యక్తిగత ప్రార్థనలో కూడా తొందరపడకూడదు. తొందరపడకుండా భక్తిశ్రద్ధలతో ఉపయోగించే ప్రతి మాటను, పూర్ణ మనస్సుతో తండ్రికి సమర్పించే ప్రయత్నం చేయాలి.

### సత్ర్పసాదనాథుని ఆహ్వానించుట

దివ్యబలిలో విరిచిన రొట్టె మన జీవితానికి బలమైన పోషణ, అతని సాన్నిధ్యం మనల్ని నడిపించే శక్తి. కావున ప్రతి విశ్వాసి జీవితంలో ఆ ప్రభువు ప్రవేశించడానికి సిద్ధంగా ఉంటాడని, భక్తి ప్రపత్తుల హృదయాలలోనికి ప్రవేశించ ఎన్నడూ వెనుకంజ వేయడనే నిశ్చయముతో సత్ర్పసాదనాథుని ఆహ్వానించాలి. ఆ దివ్యసత్ర్పసాదం స్వీకరించ ముందుకు వెళ్ళినప్పుడు కృతజ్ఞతా ప్రార్థనలతో మన మనసు నిండి ఉంటే ప్రభుని సాన్నిధ్యాన్ని మన హృదయం గొప్ప రీతిలో అనుభవిస్తుంది.

### పూజ సమాప్తమైనది సమాధానముతో వెళ్ళుము

క్రీస్తు ప్రభుని శరీర రక్తాలను స్వీకరించి, సార్థకమైన మనలను చివరి ఆశీర్వాదం తర్వాత పలికే ఈ వచనంతో క్రీస్తుకు విశ్వసనీయ సాక్షులుగా, శాంతి కొరకు పాటుపడే వారిగా, మనల్ని మనం మలచుకోవాలని, గురువు ద్వారా శ్రీసభ మనల్ని ఆహ్వానిస్తుంది.

### కృతజ్ఞతా భావం

దివ్యబలి అయిన తర్వాత మనం గుడి నుండి బయటకు వెళ్లే ముందు, కొన్ని నిమిషాల పాటు మనం స్వీకరించిన దివ్య శరీర రక్తాలకై, మనలో ప్రవేశించి మనలను పావన పరిచినందుకు కృతజ్ఞతతో మౌనంగా ప్రార్థించడం మంచిది. ఇలా ఇంకను దేవుని కృపలో ఎదగడానికి అనుభూతి చెందడానికి తద్వారా ప్రపంచ నరక శక్తులను జయింప బలం మనకు దొరుకుతుంది.

## 3.2 ప్రార్థనా ఘడియలు (The Liturgy of the Hours)

### 3.2.1 ఎడతెగక ప్రార్థించుడి (1 తెస్సలో 5:17) శ్రీసభ బహిరంగ ప్రార్థన

శ్రీసభ ప్రార్థన ఘడియలను ఆంగ్లంలో డివైన్ ఆఫీస్ అంటారు. దీనిని శతాబ్దాలుగా నిర్విరామంగా శ్రీసభ సభ్యులు జపిస్తున్నారు. ఇది ప్రేషిత కార్యంలో ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రార్థన ద్వారా దేవుని స్తుతిస్తూ మన దైనందిన జీవితాన్ని పవిత్రమొనర్చుటకు సాయం చేస్తుంది. జ్ఞానస్నానం ద్వారా క్రీస్తుని యాజకత్వంలో పాలుపంచుకుంటున్న ప్రతి విశ్వాసి తమ స్వరాన్ని క్రీస్తుతో

ఐక్యం చేస్తూ తండ్రిని స్తుతించే ప్రార్థన ఈ ప్రార్థన. కావున ఏ విశ్వాసి వ్యక్తిగత ప్రార్థన కాదు శ్రీసభ అంతటికి సంబంధించిన ప్రార్థన. ఈ ప్రార్థనలో పరిశుద్ధ గ్రంథం నుంచి స్వీకరింపబడిన కీర్తనలు, పఠనాలు మనల్ని పవిత్ర బాటలో నడిపించుటకు ప్రేరేపిస్తాయి.

## 3.2.2 విచారణలో శ్రీసభ ప్రార్థనా ఘడియలు

శ్రీసభ ప్రార్థన వాస్తవానికి ఒక వేడుక వంటిది. దీనిని శ్రీసభకు పట్టుకొమ్మలైన విచారణలలో విచారణ గురువుల ప్రోత్సాహముతో విచారణ ప్రజలందరితో కలిసి ప్రార్థిస్తే అది సంపూర్ణతను చేకూరుస్తుంది. విచారణలో శ్రీసభ ప్రార్థనా ఘడియలను ప్రోత్సహించడం మంచిది, ఉపయోగకరం కూడా. ఉదయకాల ప్రార్థన (Lauds), సాయంకాల ప్రార్థనలు (Vespers) రెండూ శ్రీసభ సాంప్రదాయం ప్రకారం రెండు మూల స్తంభాలు.

- ఈ శ్రీసభ ప్రార్థనా ఘడియలను జపించుటకు పనివేళల ఆధారంగా ఎంతమంది విచారణ ప్రజలకు వీలైతే అంతమందిని ప్రోత్సహించుట మంచిది. పనివేళలను బట్టి సమయాన్ని కేటాయిస్తే విశ్వాసులు అంతా తమ పనులను ముగించుకొని ప్రార్థనలో పాల్గొంటారు. యువతను కూడా ప్రోత్సహించుట మంచిది.
- ప్రతి విచారణలో స్వచ్ఛంద సేవకుల బృందం, ఈ ప్రార్థనను నడిపింప క్రమ పద్ధతిని తయారు చేసుకుని, అందులో ఉండే గీతాలను నేర్చుకొని, వివిధ పఠనాలను చదవమని వేరువేరు వ్యక్తులను ప్రోత్సహించాలి. వీటిని తమంతట తాము చేసుకొనుటకు విచారణ గురువు ముందుగా ఉపదేశమును అందించాలి.
- ఈ ప్రార్థనను జపించేటప్పుడు వాయిద్యాలతో గీతాలాపన చేస్తే విశ్వాసులంతా భక్తితో ప్రార్థించుటకు సహాయపడుతుంది. మధురమైన స్వరంతో కీర్తనలను పఠించుట సముచితము. ముఖ్యముగా జెకర్యా స్తుతి గీతము, మరియమాత స్తుతి గీతాన్ని చక్కగా ఆలపించేలాగున శ్రద్ధ వహించాలి. శనివారపు సాయంకాల ప్రార్థన 1, ఆదివారం సాయంకాలపు ప్రార్థన 2 ప్రత్యేక శ్రద్ధతో ప్రార్థించడం మంచిది.

## 3.3. ప్రభువు కొరకు 24 గంటలు

### 3.3.1 ఫ్రాన్సిస్ పాపుగారి ప్రతిపాదన

ఫ్రాన్సిస్ పాపుగారు చొరవ తీసుకొని “24 గంటలు ప్రభునితో” అను ప్రార్థనా కూటమిని ప్రతిపాదించారు. ఇది తపస్సు కాలంలో నాలుగవ ఆదివారం ముందు శుక్రవారం, శనివారం జరుపమని పాపుగారు కోరారు. దీని ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే విశ్వాసులంతా భక్తి ప్రభత్తులతో ప్రార్థన పూర్వకంగా ప్రభుని అనుభూతి చెంది, ఆయన యొద్దకు మరలటమే. శుక్రవారం సాయంత్రం శనివారం నాడు రోజంతా ఆలయాలను తెరిచి విశ్వాసులకు పాప సంకీర్తనలు ఏర్పాటు చేయాలి. ఆరాధనలు జరపాలి, తద్వారా దేవుని అనంతమైన కరుణ, కృపను విశ్వాసులు తెలుసుకునేలా పాప సంకీర్తన, ఆరాధన ద్వారా సాయం అందించాలి.

### 3.3.2. తపస్సుకాల ప్రార్థనలు, సఖ్యతా సంస్కారం (పాప సంకీర్తన)

పాపుగారు ప్రతిపాదించిన 24 గంటలు ప్రభునితో అను ప్రార్థనా కూటమి ఎవరైతే కథోలికులు శ్రీసభ నుంచి వెడలిపోయారో వారిని దగ్గర చేయడానికి ఒక అద్భుతమైన అవకాశం. దీని ద్వారా శ్రీసభకు పట్టుకొమ్మలైన విచారణలకు, సభ్యులకు ఒక ప్రత్యేక ఆహ్వానం ఇవ్వబడింది. అది తిరిగి మరలా ప్రభుని గొప్ప ప్రేమ, కరుణలను చవిచూడమని, మార్పు యొక్క ఫలాలు మనల్ని దేవునికి మరింత దగ్గర చేస్తాయని, ఈ అనుభూతి చెందడానికి తపస్సుకాలము సరియైనది. ఎందుకంటే ఈ కాలంలో ఎక్కువగా శ్రీసభ ప్రార్థనలు, ఉపవాసం, దానధర్మాలు, సఖ్యతా సంస్కారాల మీద శ్రద్ధ వహిస్తుంది. విచారణలో శుక్రవారం సాయంత్రం దివ్య పూజా బలితో లేదా దివ్యవాక్కుతో మొదలుపెట్టి, ఆరాధనలు సలిపి విచారణలో ఉండే వివిధ భక్త సంఘాలతో కలిసి పైచెప్పబడిన అనుభూతిని పొందవచ్చు.

- ❖ ఎవరైతే ఈ ప్రార్థన కూటమి ఏర్పాట్లకు బాధ్యత వహిస్తారో వారు దివ్య సత్ప్రసాద ఆరాధన, గీతాలాపన, జపమాల, ఇతర భక్తి కార్యాలకు సమయం కేటాయించవచ్చు. ఈ కార్యక్రమాలను భక్తివంతంగా జరుపుకుంటూ ప్రార్థన కూటమిని శనివారం సాయంత్రం దివ్యబలితో ముగించవచ్చు.

❖ ఇంకా చిన్న సంఘంలో రాత్రిపూట ఆరాధనను శుక్రవారం సాయంత్రం నిర్వహించి, చిన్న ప్రార్థనా వేడుకతో భర్తీ చేయవచ్చు. ఆ ప్రార్థనా వేడుకలో పాప సంకీర్తన, పాప పశ్చాత్తాప సంస్కారము,సత్రసాద ఆరాధన, నిశ్శబ్దంగా ఆరాధించుట వంటివి జరుపవచ్చు. మిషనరీస్ ఆఫ్ మెర్సీ ఉనికి ఇటువంటి ప్రార్థనా కూడికకు ఉపయోగపడుతుంది. వీరి ఉనికి పాపుగారు ప్రకటించిన కారుణ్య సంవత్సరము నుండి కొనసాగుతుంది.

## 3.4 దివ్య సత్రసాద ఆరాధన

### 3.4.1 ప్రభుని సన్నిధిలో ఉండుట:

దివ్యసత్రసాద క్రీస్తు సాన్నిధ్యం పట్ల విశ్వాసం బలపడుట వలన, రొట్టె రూపంలో ఉన్న దివ్య సత్రసాదంలో ప్రత్యక్షంగా ఉన్న ప్రభువును మౌనంగా ఆరాధించాలన్న భావన శ్రీసభలోఉద్భవించింది. (CCC. 1379) దివ్య పూజ జరపకపోయినా ఆరాధనలో ప్రభువును వ్యక్తిగతంగా అనుభూతిచెందే అవకాశం కలుగుతుంది. దివ్యబలి పూజలో శ్రీసభ "దీనిని నా జ్ఞాపకార్థం చేయుడి "అన్న ప్రభువాజ్ఞకు తన విశ్వసనీయతను ప్రదర్శిస్తే, దివ్య సత్రసాద ఆరాధనలో దానిని నిజం చేసినట్లు. దివ్య సత్రసాద నాధుని సాన్నిధ్యంలో మనం ఎవరిని స్వీకరిస్తామో, ఆయనతో ఉండడానికి, ఆయన సన్నిధిలో మెలగడానికి, మన జీవితాలను మార్చగల, మన జీవితాలకు అర్థాన్ని చూపే ఏకైక ప్రభువుని గూర్చి ఆలోచించాలి. నిజానికి దివ్య సత్రసాదం ఈ భూలోక మానవ జీవిత ప్రయాణంలో మన శరీరానికి బలమును, ఆధ్యాత్మిక అంతరంగానికి పవిత్రతను చేకూరుస్తుంది.

### 3.4.2 నిశ్శబ్దంతో కూడిన ధ్యానము: ప్రార్థన నమూనా

ఈ ప్రార్థన సంవత్సరంలో క్రీస్తునాధుని అనుభూతి చెందడానికి విశ్వాసులను దివ్య సత్రసాద ఆరాధనలో పాల్గొనమని శ్రీసభ ప్రోత్సహిస్తుంది. శ్రీసభను పవిత్రతలో నడిపింప దివ్య సత్రసాద ఆరాధన ద్వారా పొందే ఫలాల కోసం ఆరాధన లాంటి భక్తి కార్యాలను సంఘంలో అభివృద్ధి చేస్తూ ఉండాలి. ప్రార్థనలో విశ్వాసులు భక్తి పూర్వకంగా పాల్గొనుటకు, మనము సత్రసాదనాధుని వైపు ఆకర్షితులమగుటకు మన కోసం వేచి ఉన్న ఆ ప్రభు ఉనికిని గుర్తించడంలో

సహాయపడేలా సాంప్రదాయ ప్రతిపాదిక ఆరాధన క్రమాన్ని క్రింది భాగంలో ఇవ్వడం జరిగింది.

## దివ్య సత్ప్రసాద మందసము ద్వారా ప్రదర్శించుట

సత్ప్రసాదనాధుడు బలిపీఠంపై వేంచేయనున్న ఆ సమయంలో మనం ఆయన ముందు ఆయనను స్తుతింప, ఆరాధింప ఉన్నామని. ఆయన మన జీవితంలో ఉద్దేశించిన దానిని, చెప్పదలచిన దానిని ప్రార్థనలో వినడానికి సిద్ధంగా ఉన్నామని గ్రహించి, మౌనముగా మనలను మనం సిద్ధం చేసుకోవాలి. మన మనసులోని అభ్యర్థనలను ఆయన పాదాల వద్ద సమర్పించ సిద్ధపడాలి. ప్రార్థన అనుభూతిని పెంపొందించే పాటలు పాడడం, స్తుతించడం, ధూపం ఉపయోగించడం జరుగుతుంది. ఇవన్నీ ఆ పరిశుద్ధ ఘడియ క్షణం యొక్క ప్రత్యేకతను, పవిత్రమైన సత్ప్రసాదంలో ఉన్న ప్రభుని దైవత్వాన్ని గుర్తించడంలో సహాయపడతాయి.

## క్షమాపణకై అర్థించుట

పీఠంపై ప్రభుని స్థాపించిన తర్వాత హృదయాన్ని సిద్ధం చేసుకొనుటకు కొంచెం సమయం కేటాయించాలి. ఆ సమయం మన పాప క్షమాపణకై కేటాయించాలి. ప్రభువుకు మన పాపాలు, లోపాలు, గాయాలు అన్ని తెలుసు. ఆయన ముందు మనమేమీ దాచలేము. ప్రగల్భాలు పలకలేము. కానీ ఆయన మన నుండి కోరేది, మనలను మనం ఆయన దయకై వేచి ఉన్నవారిగా సంసిద్ధం చేసుకొనుట. అదే ఆయన మనలను హత్తుకునేలా చేస్తుంది.

## పరిశుద్ధాత్మను వేడుకొను ప్రార్థన

పునీత పౌలు గారి బోధనను అనుసరించి,దివ్యసత్ప్రసాదఆరాధనలో, దేవుడు మనకు ఏమి ఒసుగుచున్నాడో అని ఆత్మ దేవుని ప్రార్థించడం ద్వారా తెలుసుకోగలగాలి (1 కొరింతీ 2:12). ఆత్మ సహాయంతో మనం ప్రభుని నిజమైన ఉనికిని గుర్తించగలము. కావున విశ్వాసంతో మన మనసులను మరింత ప్రకాశవంతంగా చేయమని పరిశుద్ధాత్మను పాటల రూపంలో వేడుకొనుట మంచిది.

## మౌన ఆరాధన

దివ్య సత్ప్రసాద ఆరాధనలో మౌనంగా ఆ దివ్యసత్ప్రసాదనాధుని అనుభూతి చెందుటకు సమయం కేటాయించాలి. ఆ సమయంలో పునీత జాన్ హెన్రీ న్యూమాన్ చెప్పినట్లుగా "cor ad or loquitur" దేవుని హృది నుండి మానవ హృదికి సందేశాల వెల్లువ. దేవుని హృదయం మానవ హృదయంతో మాట్లాడుతుంది. ఇలాంటి సమయంలో ప్రత్యేక ప్రార్ధన అవసరతలను సత్ప్రసాదనాధుని ముందు ఉంచవచ్చు. ఉదాహరణకు, దైవ సేవకై యువత ప్రేరేపితులవ్వాలని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గూర్చి, కుటుంబాల కోసం ప్రార్థించవచ్చు. చిన్న చిన్న భజనలతో, దివ్య పఠనాలతో, పునీతుల బోధనలతో, జపమాలతో మౌనాన్ని భర్తీ చేయవచ్చు. ఈ భక్తి కృత్యాలు చేసేటప్పుడు ప్రధానంగా ధ్యానించాల్సిన విషయం ఏమిటంటే యేసుక్రీస్తు తలపెట్టిన రక్షణ కార్యము గూర్చి, తన తండ్రికి విధేయుడై మనుష్యావతారమెత్తిన ఘటన గురించి. ఇంకనూ ఆయన ఎల్లప్పుడూ మనతోనే ఉన్నాడన్న సత్యాన్ని గూర్చి ధ్యానించాలి.

## దివ్య సత్ప్రసాద ఆశీర్వాదం

దివ్య సత్ప్రసాద ఆరాధన దివ్య సత్ప్రసాద ఆశీర్వాదంతో ముగుస్తుంది. ఈ ఆశీర్వాదం మిగతా ఆశీర్వాదాలకు (ఉదా: పవిత్ర జలాల ఆశీర్వాదం, పునీతుల అవశేషాలతో ఆశీర్వదించుట, తల్లి మరియ మధ్యవర్తిత్వం ద్వారా మొదలగునవి) భిన్నమైనది. ఇది చాలా ప్రత్యేకమైనది ఎందుకనగా, ఈ సత్ప్రసాద ఆశీర్వాదంలో నిజమైన, గణనీయమైన రీతిలో ప్రభువే స్వయానా కొలువై ఉన్నారు. దివ్య సత్ప్రసాద ఆశీర్వాదముతో మనకు ఇంకనూ ప్రభువు దగ్గరవుతూ మనలను ఆలింగనం చేసుకుంటూ తన వద్దకు మనలను ఆకర్షిస్తారు. ఈ ఆశీర్వాదం, ఆరాధన, భక్తి, హృదయములో పరాకాష్ఠగా భావించవచ్చు. ఆరాధనలోను, ఆశీర్వాదములోనూ జరిగే దైవ, మానవ హృదయాల సంభాషణ ద్వారా సూర్యునిలా ప్రకాశించే ఆయన తేజస్సు మన ఆత్మలను ఆవరించి మనకు దివ్యానుభూతిని కలిగిస్తుంది.

## దివ్య సత్ప్రసాదమందసంలో పునఃస్థాపన

ఆశీర్వాదంలో పొందిన దైవ కృపావరాలతో సుసంపన్నం చేయబడిన మనము, తిరిగి మరల పవిత్రమైన మందసములో పునఃస్థాపన జరిగినప్పుడు, స్తుతి గీతములతో ప్రభువును కృతజ్ఞతా భావంతో స్తుతించాలి. ఇటువంటి భక్తికృత్యాలు ఎల్లప్పుడూ ఆ దివ్య సత్ప్రసాద నాథుడు మందసంలో మన కొరకైవేచి ఉన్నాడనే సత్యాన్ని గ్రహించాలి. ఆయన నిరంతరం మందసంలో, దేవాలయాలలో కొలువై ఉంటారు. ఆయనకు ఎవరూ ప్రార్థించనప్పటికీ కూడా ఆయన మన హృదయాలలో వేంచేయాలననే ఆశతో ఉంటాడు. మనకోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఈ సత్యాన్ని గ్రహించి ఎన్ని పనులు ఉన్నప్పటికీ దివ్య సత్ప్రసాదనాథుని దర్శించుట మానరాదు. కొద్దిపాటి సందర్శనలో మన స్తుతులు, కృతజ్ఞతలు, బాధలు, కష్టాలు, అవసరతలు ఆయనకు సమర్పించవచ్చు. మనం అడగకముందే మన అక్కరలు ఎరిగిన దేవుడు మన దేవుడు (మత్తయి 6:8) మనలను ఎన్నడూ విడువడు, ఎడబాయడు. మనం చెప్పేవన్నీ విని మనల్ని తన కృపలో నడిపిస్తాడు.

# 4. కుటుంబ ప్రార్థన

**– బ్రదర్ బట్టు అజయ్ కుమార్**

## 4.1 ప్రార్థన నేర్పించే పాఠశాల కుటుంబము

కుటుంబ ప్రార్థన ప్రాముఖ్యతను అనేక సార్లు శ్రీసభ బోధనలో పునఃధృవీకరించింది, అదేవిధముగా మనము పెరిగి పెద్దయైన తరువాత కూడా చిన్న పిల్లలుగా నేర్చుకున్న విషయాలే అనుదిన జీవితములో ప్రాధాన్యత కలిగి ఉంటాయని కూడా మనకు గుర్తుచేస్తాయి. కుటుంబములో ఒక చిన్న బిడ్డ తన మొదటి అడుగులు, “అమ్మ” లేదా “నాన్న”, “ధన్యవాదములు”, “దయచేసి” అనే మొదటి పలుకులవలే ప్రార్థన, దేవునకు “ధన్యవాదములు” అనేవి కూడా కుటుంబములో నేర్చుకొనుటకు వీలుపడుతుంది. ఒక చిన్న బిడ్డ పెరుగుతుండగా, తల్లిదండ్రులను అనుసరిస్తూ, కష్టసమయాలలో సైతం దేవునిపై ఆధారపడి, ఆయన సహాయముపై ఆధారపడుట నేర్చుకుంటుంది.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు అమోరిస్ లెతీత్సియా అను వారి అపోస్తోలిక ప్రబోధములో, ఈ విధముగా తెలియజేస్తున్నారు. "ఒక సత్యోపదేశ తరగతికన్నా లేదా ఒక ప్రసంగముకన్నా, కుటుంబ ప్రార్థనా సమయాలు, భక్తి కృత్యాలు సువార్తా ప్రచారమునకు శక్తివంతమైన మార్గాలు" (అమోరిస్ లెతీత్సియా, 19, 2016, సంఖ్య 288). పాపుగారు ముగిస్తూ ఈ విధముగా అన్నారు, "ఈ అనుభూతి వలననే శ్రీసభలో కుటుంబాల ఆధ్యాత్మిక నడిపింపు కొనసాగి, కుటుంబము ఒక చిన్న దేవాలయముగా, సమాజములో సువార్తా వ్యాప్తి కొరకు ఒక పులియ పరచు పధార్ధముగా ఉంటుంది" (అమోరిస్ లెతీత్సియా, సంఖ్య 290).

పునీత రెండవ జాన్ పౌలుపాపుగారు, వారి ఫమీలియారిస్ కొన్సోర్సియో అను అపోస్తోలిక ప్రబోధములో కుటుంబములో అందరు కలసి ప్రార్థించుట యొక్క ప్రాముఖ్యతను ప్రశంసించారు, ఎందుకంటే "కుటుంబములో మానవుడు ఉనికిలోనికి తీసుకొని రాబడుట మాత్రమే కాక క్రమేపి శిక్షణ ద్వారా మానవ సంఘములోనికి, కాని పునఃజన్మయైన జ్ఞానస్నానము ద్వారా విశ్వాస బోధన ద్వారా ఒక చిన్న బిడ్డ శ్రీసభ అను దేవుని కుటుంబము లోనికి సైతము ఆహ్వానింపబడుతున్నది" (ఫమీలియారిస్కొన్సోర్సియో, సంఖ్య 15).

## 4.2 కుటుంబ ప్రార్థన నమూనాలు

### 4.2.1 భోజనపు బల్ల చెంత, భోజనమునకు ముందు, తరువాత

కుటుంబాలు రోజులో కనీసము భోజనమునకు, ఒక్కసారియైనా కలుసుకొను స్థలము భోజన స్థలము. ఈ సమయము స్వల్పమైనదైనా అర్ధవంతముగా కలసి ప్రార్థించుటకు, దేవుడు మనకు ప్రసాదించిన వాటి కొరకు కృతజ్ఞతలు తెలిపి అదే విధముగా అవసరములలోనున్న వారి కొరకు ప్రార్థించుటకు ఒక గొప్ప అవకాశము. చిన్న పిల్లలు పరలోక ప్రార్థనలో మా అనుదిన ఆహారమును మాకు ప్రసాదించుము అని ప్రార్థించుట కేవలము ఒక ఊహాజనీనమైనది కాక, ప్రత్యక్షముగా మన పరలోక తండ్రిని మన అనుదిన ఆహారము కొరకు అర్థిస్తున్నామని నేర్చుకొనగలరు. మనము కలసి భుజించుట దేవుని నుండి పొందు అపారమైన అనుగ్రహముగా, జీవితాంతము మనలను

ముందుకు నడిపించు అనుగ్రహము. ఒక్కొక్క కుటుంబము వారికి తగిన విధముగా ప్రార్థించుటకు కొన్ని సలహాలు ఈ క్రింది విధముగా ఇవ్వబడ్డాయి.

### భోజనమునకు ముందు

"పరలోక తండ్రీ, ఈ ఆహారమును దయచేసినందుకు మీకు కృతజ్ఞతలు, మీ దివ్య చిత్తమును మా అనుదిన పోషణగా స్వీకరించుదుముగాక. అవసరములోనున్న పేదవారి కొరకు మేము ప్రార్థిస్తున్నాము: మీ దివ్య చిత్తములో వారు జీవించుటకు వారికి కావసిన వాటిని ప్రసాదించండి. ఆమెన్."

### భోజనము తరువాత

"ప్రభువా, మీరు ఒసగిన అనుగ్రహములకు మీకు కృతజ్ఞతలు: వాటిని మేము మంచిని చేకూర్చుటకు ఉపయోగింతుముగాక. క్రీస్తు ద్వారా ఈ మనవి చేయుచున్నాము. ఆమెన్."

## 4.2.2 రోజు ప్రారంభములో, ముగిసిన తరువాత చేయదగు ప్రార్థన

చిన్న పిల్లలు నిద్రకు ఉపక్రమించు సమయము కుటుంబ ప్రార్థన చేయుటకు ఇంకొక గొప్ప అవకాశము. రోజు గడచినందుకు దేవుని ప్రార్థించుట, అనారోగ్యముతో బాధపడు బంధువుల కొరకు, లేదా మధ్యాహ్న సమయములో తోటి స్నేహితులతో కలసి ఆడుకొను అవకాశమునకు దేవునకు కృతజ్ఞతలు చెల్లించుట, ఈ విధముగా వారు ఆ రోజు దేవుని నుండి పొందిన దీవెనలను గుర్తించుట నేర్చుకుంటారు. ఇటువంటి ప్రార్థన తోబుట్టువులుతో సామాధాన సంజ్ఞ పంచుకొనుట ద్వారా ముగిస్తే బాగుంటుంది తద్వారా ఆ రోజు చోటుచేసుకున్న విషయాల వలన వారు కోపముతో నిద్రకు ఉపక్రమించకుండా తోడ్పడుతుంది, ఈ విధముగా ఫ్రాన్సిస్ పాపుగారి సలహా మేరకు: సఖ్యత పడకుండా రోజు ముగియకూడదు.

సాధారణంగా, "క్రైస్తవ మౌళిక ప్రార్థనలు" గా పిలువబడే ప్రార్థనలకు చక్కటి ఉదాహరణలు ఇటువంటి ప్రార్థనలు: ఈ ప్రార్థనలు, ఇటీవల కొన్ని శతాబ్దాలుగా క్రైస్తవ ఆచారాలలో భాగమయ్యాయి. ఈ ప్రార్థనలను మనలో చాలా మంది మన తాతలు, అమ్మమ్మల నుండి లేదా బంధువుల నుండి నేర్చుకున్నాము.

• **ఉదయకాల ప్రార్థన**

"ఓ నా దేవా, మిమ్ము నేను ఆరాధిస్తున్నాను, నా పూర్ణ హృదయముతో మిమ్ము ప్రేమిస్తున్నాను. నన్ను సృజించి, ఒక క్రైస్తవునిగా, క్రైస్తవరాలుగా చేసినందుకు, రాత్రంతా నన్ను కాపాడినందులకు కృతజ్ఞతలు. ఈ రోజు నేను చేయబోవు పనులను మీకు సమర్పిస్తున్నాను, అవన్నీ మీ దివ్య చిత్తానుగుణముగా ఉండునట్లు, మీకు అత్యంత మహిమను చేకూర్చునట్లు ఉండునుగాక. నన్ను పాపము నుండి, దుష్టత్వము నుండి కాపాడండి. మీ కృప నాతోను, నేను ప్రేమించు నా కుటుంబ సభ్యులందరితోను ఎల్లపుడు ఉండునుగాక. ఆమెన్."

• **సాయంకాల ప్రార్థన**

"నా దేవా, మిమ్ము ఆరాధిస్తున్నాను, నా పూర్ణ హృదయముతో మిమ్ము ప్రేమిస్తున్నాను. నన్ను సృజించి, ఒక క్రైస్తవునిగా, క్రైస్తవురాలుగా చేసినందుకు, ఈ రోజంతా నన్ను కాపాడినందులకు కృతజ్ఞతలు. నేను ఈ రోజు చేసిన తప్పులను మన్నించండి, నేను చేసిన మంచిని స్వీకరింపుము. ఈ రాత్రంతా నన్ను సంరక్షించి, కీడు నుండి నన్ను విడుదల చేయుము. మీ కృప నాతోను, నేను ప్రేమించు నా కుటుంబ సభ్యులందరితోను ఎల్లపుడు ఉండునుగాక. ఆమెన్."

వీటితో పాటు ఇంకా ఇతర ప్రార్థనలతో పాటు పరలోక ప్రార్థన, మంగళవార్త జపము, త్రిత్వైక స్తోత్రము, కావలి దూతల ప్రార్థన, విశ్వాసుల ఆత్మలకు నిత్య విశ్రాంతి ప్రార్థన లేదా ఒకటి లేక రెండు గుర్తుల జపమాల లేదా దివ్య కారుణ్య జపమాల, అందరు కలసి లేదా చిన్నారులను హృదయము నుండి వెలువడు సొంత ప్రార్థన ద్వారా ప్రభువుతో మంచి సత్సంబంధాన్ని పెంపొందించుకొనునట్లు చేయవచ్చు. ఈ విధముగా యేసు నాథునితో చిన్నారులు సంభాషించుట నేర్చుకుంటారు, ప్రభువుకు నిజమైన స్నేహితులుగా తయారవుతారు, వారి అవసరాలను, కోరికలను, వారి ఆశయాలను ఆయనకు అప్పగిస్తారు.

### 4.2.3 ఆదివారపు ఉదయకాల ప్రార్థన ప్రార్థించుట

ఆదివారపు ఉదయకాల ప్రార్థనతో పాటు సువిశేష పఠనము తరువాత

తల్లిదండ్రుల వివరణ కేవలము ప్రార్థించుట మాత్రమే కాక దైవ వాక్కు వెలుగులో ఆ వారపు కార్యక్రమములను పంచుకునే అవకాశము కలుగుతుంది.

ఫమీలియారి స్కొన్సోర్షియో అను అపోస్తోలిక ప్రబోధము నందు, పునీత రెండ జాన్ పౌలుపాపుగారు, ఈ విధముగా తెలియజేస్తున్నారు, “దైవ వాక్కును స్వాగతించుట ద్వారా ప్రకటించుట ద్వారా క్రైస్తవ కుటుంబము వారి ప్రవక్త ధర్మాన్ని నిర్వర్తిస్తుంది: తద్వారా రోజు రోజుకు అది సువార్తను వ్యాపింపజేయు సంఘముగా తయారవుతుంది” (ఫమీలియారి స్కొన్సోర్షియో, సంఖ్య 51).

- ఉదయకాల ప్రార్థనలో ఎవరు ఏ పాత్రను పోషిస్తారో నిర్ణయిస్తే మంచిది, ఒకరు పల్లవులను చెబితే మరొకరు కీర్తనలను జపించవచ్చు, ఒకరు పరిశుద్ధ గ్రంథ పఠనము చేయవచ్చు, ఈ విధముగా ప్రతీ ఒక్కరిని భాగస్వాములను చేయవచ్చు, చిన్నారులకు సైతము అప్పజెప్పవచ్చు.
- తల్లిదండ్రులు, వినిన పఠనాలను కొంత సేపు వివరింపవచ్చు. ఈ విధముగా చేయునపుడు అనుదిన జీవిత అంశాలకు, కుటుంబమునకు, పాఠశాలకు, అన్వయిస్తూ, సువార్త, దైవవాక్కు ఏ విధముగా నిజ జీవితములో వెలుగును ప్రసరింపజేసి, మన అన్ని పనులలో ఏ విధముగా నడిపిస్తుందో తెలియజెప్పవచ్చు.
- కుటుంబ సభ్యులలో ఎవరైనా సంగీత వాయిద్యాలు వాయించగలిగితే, ఉదయకాల ప్రార్థన పాటల రూపములో లేదా సరియైన బాణితో నిర్వహించవచ్చు, కీర్తనలు, గీతములు, వందన సమర్పణలు సహజముగా అవి పాట రూపములో ఉండుట వలన ఆవిధముగా ఆలపించుట ద్వారా ఆ మధురమైన అనుభూతిని పొందగలము.
- చివరిగా, ఆ రోజు పునీతుని జీవిత గాథను చదువుట ద్వారా చిన్నారులకు ప్రేరణాత్మకమైన అనుభూతి కలుగుతుంది, వారు ఎందుకు పునీతులుగా గుర్తింపబడుచున్నారు అన్న విషయాలను తెలియజేసి, వారికి కేటాయింపబడిన రోజున వారి ప్రార్థనా సహాయమును, సంరక్షణను కోరవచ్చును అన్న విషయమును వారికి తెలియపరచవచ్చు.

# 5. యువతీ యువకుల ప్రార్థన

– బ్రదర్ బలసాని ప్రభుదాస్

## 5.1 ప్రభూ ఆనతిమ్ము నీ దాసుడు ఆలకించుచునేయున్నాడు (1 సమూ 3:9): దేవుని చిత్తాన్ని అర్థం చేసుకోవడం ఎలా?

యవ్వనం మానవుని జీవితంలో విప్లవాత్మకమైన పరివర్తన చెందే కాలం. ఈ యవ్వన ప్రయాణంలోనే విశ్వాసానికి దగ్గరై పలు విధములైన లోక కార్యకలాపాలతో పాటు ఆధ్యాత్మికపరమైన శోధన కూడా ఇక్కడే మొదలవుతుంది. దేవునితో వ్యక్తిగతంగా మరింత సన్నిహితంగా ఎలా ఉండాలని వెదుకుతూ దైవం పట్ల అభిలాష పెంచుకునేందుకు ఈ యవ్వనం ఒక ముఖ్య దశ. యుక్త వయసులో ఉన్న వారికి ప్రార్థించడం అనేది ఒక కష్టతరమైన పని అన్న సత్యాన్ని కూడా మనం గ్రహించాలి. కానీ వారికి ఒక ఆధ్యాత్మిక గురువుగా ఎవరైనా బాధ్యత తీసుకొని వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించగలిగితే ఎంతోమంది యువతీయువకులుప్రార్థనా జీవితం పట్ల ఉత్సాహవంతమైన ఆసక్తిని ప్రదర్శిస్తారు.

యువతీయువకులు ప్రార్థనా జీవితము పట్ల ఎన్నో అనుమానాలతో కూడిన ప్రశ్నలను భావాలను భయాలను వ్యక్తపరుస్తుంటారు. వారి ప్రార్థనలో తరచుగా వారి కోరికలు తీర్చే విధంగా జీవితములో ఉన్న భయాలను పోగొట్టమని ప్రార్థిస్తుంటారు. కానీ ఎప్పుడైతే వారు దేవుని చిత్తానుసారం జీవిస్తూ నిశ్శబ్ద ప్రార్థనలో గడుపుతారో అప్పుడే వారు దేవునికి తమ జీవితంలో జరుగుచున్న అలజడులను గూర్చి దేవునికి విన్నవించుకోగలరు దానికి ప్రతిస్పందనగా ఆ దేవుని నుండి ప్రోత్సాహకరమైన మేలులను, సంజ్ఞలను వారు చూడగలరు. "మీరు జీవవంతుడైన క్రీస్తుని సన్నిహితునిగా చేసుకుని ఆయనతో మీ అనుదిన జీవన విధానం గురించి సంభాషించడం మొదలుపెడితే ఒక క్రైస్తవ విశ్వాసిగా సమర్థవంతమైన క్రైస్తవ జీవితమును జీవితాంతము జీవించుటకు గల సామర్థ్యమును లోతైన ప్రార్థన అనుభవమును క్రీస్తు ప్రభువు ఒసగుతారు." (క్రీస్తుస్ వీవిత్ (Apostolic Exhortation Christus Vivit), మార్చి 25, 2019, సంఖ్య. 29).

యవ్వన కాలంలో వృత్తిపరమైన ప్రశ్నలు, జీవితంలో ఎలా స్థిరపడాలని ఆందోళనలు మనసులో కలగడం అనివార్యమే. యవ్వన కాలం ఒకరి భవిష్యత్తును ఏ విధంగా నిర్మించుకోవాలి అను ప్రణాళికలు వేసుకునేందుకు సరైన కాలం. అదేవిధంగా సమాజంలోని తన తోటి వారి గురించి ఆలోచిస్తూ, వారికి సేవ చేయాలనే తపన, ఆలోచన, ఆ వయస్సులోనే కలుగుతుంది. సరిగ్గా ఈ సమయంలోనే యువతీయువకులకు సరైన విధముగా ప్రార్థించడం నేర్పించగలిగితే, వారు క్రీస్తుని స్నేహితునిగా స్వీకరిస్తూ వారి భవిష్యత్తుపై కన్న కలలను సాకారం చేసుకునే విధంగా మనము వారికి సహాయపడగలము. యువతీయువకులు ప్రార్థనా జీవితమునకు అలవాటు పడినప్పుడు వారి ప్రార్థనలో అబ్రహాము వలె ఆకాశం వైపు చూస్తూ, దేవుడు వారిపై కుమ్మరించిన దీవెనలకు సూచికముగా ఆకాశంలోని నక్షత్రములను లెక్కించడం నేర్చుకుంటారు. మోషే వలే పొద మండుచున్నా కాలిపోని దృశ్యమును గాంచి ఆశ్చర్యచకితులగుదురు. నిశ్శబ్ద రాత్రిలో సమూవేలు వలే ప్రభుని స్వరమును వినగలుగుతారు. ద్వారము వెలుపల ఉండి తలుపు తట్టుచున్న యేసుప్రభుని తల్లి మరియ ఆహ్వానించిన విధముగా వీరు హృదయంలోనికి ప్రభువుని ఆహ్వానించగలరు. ఈ ప్రార్థనా వత్సరంలో ప్రతి ఒక్క క్రైస్తవ సంఘము కూడా ఇది ఒక బృహత్తర కార్యము గాను, బాధ్యతగాను తలంచి యువతీయువకులలో ప్రార్థనా జీవితం పట్ల అభిలాషను, కోరికను ప్రజ్వరిల్లునట్లు చేయాలి. ప్రభువే స్వయముగా ఈ కార్యమునకు, తోడ్పడుతూ మనలను ఆహ్వానిస్తున్నారన్న సంతోషంతో, ఈ కర్తవ్యమును ప్రతి క్రైస్తవ సంఘము కార్యరూపం దాల్చాలి.

## 5.2 యువతీయువకులతో ప్రార్థనా సమావేశాలు, కార్యక్రమాలు

యువతీయువకులకు నియమ బద్ధమైన సత్యోపదేశాన్ని బోధిస్తూ, సరైన రీతిలో ఎలా ప్రార్థించాలి, పవిత్ర గ్రంథంలో ఉన్న గొప్ప వ్యక్తుల జీవితమును ఆదర్శంగా తీసుకొని ప్రార్థనలో ఎలా బలపడాలి అని కతోలిక శ్రీసభ సత్యోపదేశం నాలుగవ భాగం బోధిస్తుంది. అదనంగా ఈ అంశాలను గూర్చి మరింతగా తెలుసుకోవడానికి ఫ్రాన్సిస్ జగద్గురువులు రాసిన "క్రీస్తుస్ వీవిత్ (Christus Vivit)" అనే అపోస్తోలిక ప్రబోధం కూడా చదవచ్చు. మరీ ముఖ్యంగా ఇందులోని 150, 157, 250, 252, 287, 290 పంక్తులలో యువతీయువకులు దేవునితో

ఏ విధమైన సన్నిహిత స్నేహ బంధాన్ని ఏర్పరుచుకోవాలి అను అంశాలను గూర్చి తదేకముగా, సులువుగా, సూటిగా వివరించడం జరిగింది. ఆ అంశాలను క్రింది విధముగా పాటించవచ్చు.

- యువతీయువకులంతా ప్రతిరోజు చేయబోయే పనులకు ముందుగా అందరూ కలిసికట్టుగా ఆ దినమును ప్రార్థనతో మొదలు పెట్టే విధంగా సమయాన్ని ఏర్పాటు చేయాలి. ఉదాహరణకు పాఠశాలకు వెళ్లే ముందు ఉదయకాల ప్రార్థనలను జపించడం, ఆ రోజు సువిశేష పఠనాన్ని చదివించడం వంటివి చేయాలి. వారాంత దినములలో దివ్యసత్ప్రసాద ఆరాధనలో పాల్గొనే విధంగా చేసి స్వయముగా వారే ఆరాధనను నడిపించేలా ప్రోత్సహించాలి. తద్వారా వారందరూ ఒకే చోట గుమికూడి ఏక మనస్సుతో దేవుని మనసారా స్తుతించగలుగుతారు. అదే విధంగా వారి జీవిత కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకొని ఒకరికొకరు ప్రార్థించుకుని గొప్ప సుగుణాన్ని వారు అలవరచుకోగలరు.
- యువతీయువకులు కేవలం వారి స్నేహితులను గూర్చి తెలుసుకోవడమే కాకుండా, కొత్తవారిని క్రీస్తు నాధుని గూర్చి ధ్యానించుటకు ఆహ్వానించి వారితో పరిచయాలు పెంచుకోగలగాలి. ఈ యొక్క సంవత్సరమంతా యువతీయువకులకు కేవలం దేవాలయములోనే కాకుండా ఇతర ప్రదేశాలలో అనగా యువతా కేంద్రంలో, ఆరాధన కేంద్రాలలో చిన్న ప్రార్థనా మంటపములలో మామూలు రీతిలో చిన్న బల్ల వంటిది ఏర్పాటు చేసి దేవుని చిత్రపటము లేదా బైబిలు గ్రంథమును మధ్య ఆకర్షణగా నిలిపి ప్రార్థించగలరు. ఉపయుక్తమైన ప్రార్థనా వాతావరణమును కలిగించుటకు దివ్యసత్ప్రసాద సన్నిధిని నెలకొల్పి ప్రార్థించగలరు. ఆ విధముగనే "ప్రార్థనా గుడారం" ను పాఠశాల యందు, ఇతర ఏ అనుకూలమైన స్థలంలోనైనా ప్రత్యేక పండుగ దినము లేదా వేసవి కాలపు విడిదిలలో ఏర్పాటు చేసి యువతీయువకులను ప్రార్థనా జీవితము వైపుమరలునట్లుగా మరింతగా వారిని ఆకర్షించవచ్చు. యుక్త వయసులో ఉన్నందున వీరికి శక్తివంతమైన ప్రార్థన అనుభవాన్ని పొందాలన్న ఆశను, మక్కువను చూపుతూ ఉంటారు. కాబట్టి సంవత్సరములో అప్పుడప్పుడు

సాయంకాలపు ఆరాధన లేదా ప్రభువుతో రాత్రంతా గడుపుటకు ప్రత్యేకమైన ఆరాధనను ఏర్పాటు చేసిన యెడల ప్రశాంతవంతంగా నిశ్శబ్దమైన దైవానుభూతిని వీరు పొందగలరు.

- చాలా విచారణలలో ఇప్పటికే "కమ్యూనిటీ వీక్" అనే పేరుతో యువతీయువకులను సమావేశపరచే ఆనవాయితీ విస్తృతంగా సాగుతుంది. వారి చదువులను పనులను చూసుకుంటూనే చిన్నపాటి సముదాయముతో గురువులు, కన్యస్త్రీలు, విచారణ పెద్దలతో కలసి విచారణ గురువు ఆధ్వర్యంలో లేదా మేత్రాసన కాపరుల అనుమతితో ప్రార్థనా సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటువంటి సమావేశాలు సోదర భావం సేవా భావాన్ని పెంపొందించడమే కాక యువతీయువకులను ప్రార్థనా జీవితం వైపు ముఖ్యముగా దైవార్చన ఘడియలను పాటించుటకు, ఆరాధనలో పాల్గొనుటకు, వ్యక్తిగత ప్రార్థన, వివిధ రకాల ప్రార్థనా రీతుల విలువను తెలుసుకునే గొప్ప సదావకాశాన్ని కల్పిస్తాయి.
- చాలా గురువిద్యాలయాలు లేదా దైవాంకిత మఠాలలో "ప్రార్థన ఆవశ్యకత"ను గూర్చి బోధించుటకు ఎల్లప్పుడూ తమ ద్వారములను తెరిచే ఉంటారు. సాధారణంగా బైబిల్ లోని ఒక ఆదర్శ వ్యక్తిని లేదా దైవ పిలుపు సంఘటనలను యువతీయువకుల జీవితానికి సరిపడే విధంగా అన్వయిస్తూ ప్రార్థనా కార్యక్రమాలు సాగించడం అనేది ఒక నిరంతర ప్రక్రియ.
- యువతీయువకులు పుణ్యక్షేత్రాలను కాలినడకతో నడుచుటకు పర్వతాలను అధిరోహించుటకు, ఇతర ప్రకృతి అందాలను చూచుటకు ఎక్కువగా ఇష్టపడతారు ఇలా ప్రకృతిని చూస్తూ అందరితో కలిసి పవిత్రయాత్రలకు వెళ్లడం వలన దేవుడు సృష్టించిన సృష్టిని చూసి ఆశ్చర్యపడుటకు స్తుతించుటకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుటకు అవకాశం ఉంటుంది. ఇటువంటి సందర్భాలు యువతీ యువకులకు పూర్ణ హృదయంతో ఎలా ప్రార్థించాలని నేర్పించుటకు అనుకూలంగా ఉంటుంది. ఇలా కాలి బాటన నడిచేటప్పుడు పవిత్రయాత్రకు సంబంధించిన కీర్తనలను పాటలను

పాడుకుంటూ ఉల్లాసంగా గడపవచ్చు.

- విచారణ యందలి యువతీ యువకులను విచారణలో జరపబడుతున్న అనేక కార్యక్రమాలను వారే ముందుండి నడిపించే విధముగా ప్రోత్సహించాలి. రోజువారీ ఉదయకాల ప్రార్ధన, జపమాల మాత్రమే కాకుండా, నెల మొదటి శుక్రవారం ప్రార్థనలు, స్లీవ మార్గము వంటి ప్రార్థనా కార్యక్రమాలను వీరి చేతనే సృజనాత్మకంగా చేసే విధంగా వారికి అవకాశాలు ఒసగాలి.
- మొబైల్ ఫోను అనేది యువతీయువకుల జీవితంలో ఒక తప్పనిసరి మాధ్యమంగా మారింది. ఆధునిక సాంకేతిక యుగంలో ఉన్న మనకు, అంతర్జాలం నుండి పలు విధములైన ప్రార్థన 'ఆప్'లు, ఆడియోలను దిగుమతి (డౌన్లోడ్) చేసుకుని ప్రార్థించుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆనాటి సువార్తా పఠనములు వాటి వ్యాఖ్యానములను ఫోన్లోనే చదువుకొనవచ్చును. కాబట్టి వారు ప్రయాణించేటప్పుడు, స్కూళ్ళకు వెళ్ళినప్పుడు పని చేసుకునేటప్పుడు, మొబైల్ ఫోను ద్వారా ప్రార్థన చేసుకోవచ్చు. ఈ విధంగా దేవునికి సంబంధించిన ప్రార్థనా 'ఆప్'లను వాడటం వాటి నుండి వచ్చిన జ్ఞానంతో పాటు వారి ఆలోచనలను జోడిస్తూ చిన్న ప్రార్థనలు కానీ ధ్యానాంశములను కానీ ఇతరులతో పంచుకోవడం కూడా ఒకలాంటి ప్రార్థనా విధానం. మరీ ముఖ్యముగా పలు రకాల కారణాలవల్ల విచారణకు దూరముగా ఉంటూ దేవాలయానికి వెళ్లలేక, ఇతర ఏ ప్రార్థనా కార్యక్రమాలకు హాజరుకాలేని వారు ఈ విధముగా దేవునితో ప్రార్థనా జీవితంలో గడపగలరు.

## 6. యేసు ఒక నిర్మానుష్య ప్రదేశానికి వెళ్ళి, అక్కడ ప్రార్థించాడు (మార్కు 1:35) : ప్రార్థనపై జ్ఞానవడకాలు

**– బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్**

యేసు ఒక నిర్మానుష్య ప్రదేశానికి వెళ్ళి, అక్కడ ప్రార్థించాడు (మార్కు 1:35). సువార్తికుడు క్రీస్తు ప్రార్థనా జీవితమును మనకు విశదీకరిస్తూ అందు

క్రైస్తవ ప్రార్థనా జీవితానికి ముఖ్యమైన రెండు కోణాలను క్రీస్తు జీవితము ద్వారా మనకు అందిస్తున్నాడు. అవి ఏమనగా, రోజువారీ దినచర్య నుండి తనను తాను నిష్క్రమించుకొని తండ్రియైన దేవునితో వ్యక్తిగత సంభాషణను కోరుకోవడం అవసరం. నిశ్శబ్దహృదయం కలిగి దేవుని స్వరాన్ని, ఆయన చిత్తాన్ని ఆలకించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. ఈ దృక్కోణంలో, ప్రార్థనా సంవత్సర సందర్భంలో, ఈ ఆధ్యాత్మిక వడకం మన ఆధ్యాత్మిక పరివర్తనకు, పరమ పవిత్రుడైన తండ్రి దేవుని ద్వారా ఆహ్వానింపబడిన మనం హృదయపరివర్తన చెంది జీవించుటకి ఈ ఆద్యాత్మిక వడకం మనకు ఒక బంగారు అవకాశాన్ని అందిస్తుంది.

## 6.1 "నా నామమున ఇద్దరు లేదా ముగ్గురు గుమిగూడిన చోట నేను ఉంటాను" (మత్తయి 18:20): ఆధ్యాత్మిక వడకము యొక్క అంతరార్థము

క్రైస్తవులు ప్రార్థనలో కలిసినప్పుడు, తాను (యేసు) వారిమధ్య ఒక ప్రత్యేకమైన రీతిలో ఉంటానని మనకు బోధించారు. ఈ విషయంలో, అనగా, ఆధ్యాత్మిక వడకంలో పాల్గొనడం అనేది మనం మన సాధారణ జీవితం ద్వారా, అందు  మనం జరిపే ప్రార్థనల ద్వారా ప్రభువు ఉనికిని మరింత పూర్తిగా అనుభవించడానికి ఒక గొప్ప అవకాశం. ఆధ్యాత్మిక వడకం అనేదివాస్తవీక పరిస్థితుల నుండి తప్పించుకోవడం కాదు, కానీ ప్రార్థన యొక్క నిశ్శబ్దం ద్వారా వాస్తవీకతలో పూర్తిగా మునిగిపోవడం. ప్రామాణికమైన ఆధ్యాత్మిక వడకం యొక్క ఫలితం సాధారణ దినచర్యల నుండి రోజులతరబడి విరామం కోసం ఆరాటపడటం కాదు, కానీ ప్రభువు సన్నిధి ద్వారా దైనందిన జీవితాన్ని మార్చే ఒక కొత్త వెలుగుగా గుర్తించాలి. తరచూ మన దృష్టిమరల్చి, మన విశ్వాస జీవితం నుండి దూరం చేసే ఈ ప్రపంచంలో, ప్రార్థనావడకం అనేది ఎడారిలోని ఏర్పడిన జలాశయం వంటిది. మన నగరాలలో, వివిధ రకాల ఆరోపణలు, ఆక్రందనల వలన ప్రజలు జీవితం మీద ఆశను కోల్పోయి జీవిస్తున్న ఈ తరుణంలో, కేవలం ప్రభువు మాత్రమే మనకు ఆనందాన్ని ఇవ్వగలడని ఈ ఆధ్యాత్మిక వడకం మన హృదయాలను దేవునిపై కేంద్రీకరింపజేస్తుంది.

ఈ విధంగా ప్రార్థనా సంవత్సరం, సామాన్య విశ్వాసులు, దేవుని సేవ

కొరకై ప్రత్యేకించబడిన అభిషిక్త ప్రజలు, సంవత్సర కాలంలో కొన్ని రోజులు దేవుని సన్నిధిలో గడిపి దేవునియందు వారి భక్తి పునరుద్ధరించుటకు ఆధ్యాత్మిక జీవితంలో ఎదుగుటకు ఈ ప్రార్థనా సంవత్సరం ప్రతీ ఒక్కరికి ఒక బంగారు అవకాశము కలిపిస్తుంది. ఈ ఆధ్యాత్మిక వడకం చేయుటకు ఒక అనుకూలమైన స్థలం ఎంపిక చాలా ముఖ్యమైనది. ఉదా: మఠాశ్రమాలు, మఠాలయాలు, పుణ్యక్షేత్ర స్థలాలు, ఈ ధ్యానం చేయుటకు అనుకూలమైనవి, ఎందుకంటె ఇక్కడ వారు ప్రార్థనకు, ఆధ్యాత్మికతకు అంకితమైన సమయాలు క్రమం తప్పకుండా ఉంటాయి. అవి మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు దోహదపడతాయి.

- ఈ ఆధ్యాత్మిక వడకాలను నిర్వహించడంలో విచారణలు సహృదయ భావంతో ముందుకు రావాలి. కొన్నిసార్లు ఇది కష్టంగా ఉన్నప్పటికీ, నెలలో ఒకరోజు లేదా రోజులో ఒక పూట ఈ ఆధ్యాత్మిక వడకాలను నిర్వహించడానికి ప్రయత్నం చేయాలి. అందరూ పాల్గొనే విధంగా అనుకూలమైన సమయాన్ని కేటాయించాలి. ముఖ్యముగా, శనివారం మధ్యాహ్నం లేదా ఆదివారం, తద్వారా కుటుంబ పోషణ నిమిత్తం రోజువారి పనిచేసే వారు కూడా ఇందులో స్వేచ్ఛగా పాల్గొనవచ్చు.
- సంవత్సరం పొడవున మన సాధారణ జీవితములందు క్రీస్తు నేర్పించిన ప్రార్థనను (యేసు ప్రార్థన) ధ్యానించడం ద్వారా ఆధ్యాత్మిక ధ్యానాంశ జీవితంను జీవించిన వారము అవుతాము. దీనిని "హృదయ ప్రార్థన" అని కూడా పిలుస్తారు. గురువులకు ఇది చాలా ప్రియమైనది. నిరంతరం ఈ ప్రార్థనను ధ్యానించడం ద్వారా, మన అనుదిన దిన చర్యలో దేవుని ఉనికిని గుర్తు చేస్తుంది. అంతేగాక, ఎల్లప్పుడూ మనతో ఉన్న దేవుని మనం స్తుతిస్తూనే ఉంటాం. ఈ ప్రార్థనను మనం కారులో లేదా ప్రభుత్వ రవాణాల ద్వారా చేయు ప్రయాణములో కూడా ధ్యానించగలం, మన జీవితాలలో ఎదురయ్యే వివిధ వ్యక్తుల విన్నపముల కొరకు కూడా ప్రార్థించే ఒక గొప్ప ప్రార్థన ప్రభు ప్రార్థన.
- వీలైతే, వారంలో, బహుశా పని నుండి ఇంటికి వెళ్ళేటప్పుడు లేదా భోజన విరామ సమయంలో, పవిత్రమైన దివ్య మందసంను దర్శించి

ప్రార్థించుటకు కొంత సమయాన్ని కేటాయించడానికి ప్రయత్నించండి. విశ్వాసుల సమాధుల స్థలమును క్రమం తప్పకుండా సందర్శించడం, మరణించిన వారికోసం ప్రార్థించడం లాంటి కొన్ని పద్ధతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- సంవత్సరంలోని కొన్ని సమయాల్లో, ప్రత్యేక ప్రార్థనల ద్వారా పునీతులు, మనందరి తల్లియైన పరిశుద్ధ మరియమ్మతో మన సంబంధాన్ని పెంపొందించడానికి, బలోపేతం చేయడానికి శ్రీసభ మనలను ప్రేమతో ఆహ్వానిస్తుంది. ఉదాహరణకు, మే, అక్టోబర్ నెలల్లో, ఇప్పటికే చాలా ప్రాంతాలలో ఉన్న ఆచారం ప్రకారం, దేవాలయ పరిసరాలలో లేదా విశ్వాసుల గృహాలలో (భవనాలలో) జపమాల జపించడము మంచిది.
- దైవపిలుపుకు స్పందించు విషయములలో ప్రార్థన చాలా ప్రముఖమైనది. ఎందుకంటే ఈ ప్రార్థనలోనే మనం ప్రభువును కలుసుకొని, ఆయన చిత్తాన్ని తెలుసుకోగలం. ఈ నిశ్శబ్ద ప్రార్థనలో, మన జీవితాల్లో క్రీస్తు తన వెలుగును ప్రకాశింపజేయమని ప్రేమగా వేడుకోవాలి.

## 6.2 ప్రభువు ప్రార్థన: అన్ని ప్రార్థనలకు మూలం

"ప్రభు ప్రార్థన"లో క్రీస్తు ప్రభు తన అపోస్తలులకు, వారి నుండి సకల విశ్వాసులకు ఒక ప్రార్థనా విధానాన్ని చక్కగా వివరించారు. అంతేగాక, ప్రభు ప్రార్థనను అన్నీ ప్రార్థనలకు మూలం అని కూడా చెప్పవచ్చు. క్రీస్తు నేర్పించిన ఈ ప్రార్థనయే మన విశ్వాసానికి మూలం.

ప్రభు ప్రార్థన అనేది మానవ అనుభవం యొక్క సార్వజనీనతను, దైవీక రహస్యాన్ని స్వీకరించే ప్రార్థన. ఇది ఒక పిల్లవాడు తన తండ్రిని (నాన్నా) సంబోధించే నిరాడంబరతను, నిగూఢమైన, దైవీకమైన దేవుని ఉనికితో మనల్ని ఏకం చేయగలదు. కథోలిక శ్రీసభ సత్యోపదేశం, తెర్తూలియను బోధనను పునఃశ్చరిస్తూ, ప్రభు ప్రార్థన "మొత్తం సువార్త సంశ్లేషణ" (కతోలిక శ్రీసభ సత్యోపదేశము, 2761-2776) అని విపులంగా చెప్పవచ్చు. దేవుని పవిత్రత, ఆయన రాజ్యం, మన దైనందిన జీవితాలు, పరస్పర క్షమాగుణం, చెడుకు వ్యతిరేకంగా మన పోరాటం వంటి మన జీవితంలోని ప్రతికోణాన్ని స్పృశించే

ప్రార్థన ఇది. “మన తండ్రి” అని చెప్పడం ద్వారా మనం దేవుని హృదయానికి, మన విశ్వాస హృదయానికి దగ్గరవుతాం. పరిశుద్ధపాపు గారు వ్యాఖ్యానిస్తూ, ఈ ప్రార్థన కేవలం మాటలు, అవసరాల సంబంధం కాదని, పరలోక తండ్రితో సాన్నిహిత్యానికి ఒక మార్గమని వివరించారు. ఈ ప్రార్థన నిరాడంబరతతో, ప్రేమతో దేవుని “తండ్రి” అని పిలుచుకుంటూ, నమ్మకంతో సంబోధించడం నేర్పిస్తుంది. (ప్రజలనుద్దేశించి పాపుగారు ప్రతీ బుధవార ఉపదేశము (General Audience), ఫిబ్రవరి 27, 2019): యేసు మనకు ఏది అవసరమో దానినే బోధించాడు. ప్రార్థనలో అనేకమైన వ్యర్థ పదాలు ఉపయోగించుట కంటే క్రీస్తు నేర్పించిన ప్రార్థన పూర్ణ హృదితో ధ్యానించుట మేలు అని పరిశుద్ధ పాపుగారు తెలియజేశారు. అంతేగాక, మనం తండ్రితో నిరాడంబర హృదయంతో మాట్లాడగలమని ఆయన ముందుగానే మనకు చూపించారు, ఎందుకంటే “మనం ఆయనను అడగడానికి ముందే మనకు ఏమి అవసరమో ఆయనకు తెలుసు” (మత్తయి 6:8).

- సాంప్రదాయకంగా, ప్రభు ప్రార్థన ఏడు భాగాలతో రూపొందించబడింది. దీనిని “ఏడు విన్నపముల ప్రార్థన” అని కూడా పిలుస్తారు. ఈ ప్రార్థనను మనము కతోలిక సత్యోపదేశము సం. 2803-2854 నందు కనుగొనవచ్చు. ప్రతి విశ్వాసి పరలోక తండ్రితో ఉండవలసిన సంబంధం గురించి క్రైస్తవ విశ్వాసానికి ఉన్న సంబంధాన్ని ఇది క్లుప్తం చేస్తుంది. ఈ ఏడు విన్నపములను నెలవారీ ఆధ్యాత్మిక ప్రార్థనా సదస్సుకు ధ్యానాంశంగా ఉపయోగించవచ్చు. అంతేగాక క్రీస్తు బోధించిన ఈ ప్రార్థన అన్నీ ప్రార్థనలకి మూలం కావున, ఒక్కొక విన్నపమునకు ఒక్కొక ఆధ్యాత్మిక సదస్సును అంకితం చేసి ధ్యానిస్తూ జూబిలీ ప్రార్థనా సంవత్సర దిశగా విశ్వాసపు అడుగులు వేయవచ్చును.

## 7. ప్రార్థన - సత్యోపదేశము

**- బ్రదర్ కాసు అఖిల్**

సత్యోపదేశము సువార్తా వ్యాప్తిలో ఒక ప్రత్యేకతను కలిగి, విశ్వాసములో అభివృద్ధిని పరిపక్వతను పెంపొందింపజేస్తుంది. (cf. Directory for Catechesis

[DfC, no. 56) "సత్యోపదేశము ప్రార్థన చేయుటకు, ప్రార్థనలో శిక్షణ ఒసగుటకు, క్రైస్తవ అనుభవమునకు ధ్యానపూర్వక అంశమును అభివృద్ధిచేయుటకు బాధ్యత కలిగి ఉంది" (DfC, no. 86).

## 7.1. "మోషే చేతులను పైకెత్తినంతసేపు" (నిర్గమ 17:11): కాపరి ప్రబోధనా ప్రార్థన

క్రైస్తవ సంఘములో ప్రతీ విశ్వాసి తన జీవిత విధానమును బట్టి సత్యోపదేశ పరిచర్య చేయుటకు బాధ్యతను కలిగియున్నప్పటికీ (cf. DfC, no. 111),"సువార్తా వ్యాప్తిలో పీఠాధిపతి ప్రప్రథముడు దానిని వారి మాటల ద్వారా వారి సాక్షీభూత జీవన విధానము ద్వారా సువార్త వ్యాప్తి చేయు బాధ్యత కలవారు" (అపోస్తోలిక ప్రబోధము, పాస్తోరెస్ గ్రేజిస్, అక్టోబరు 16, 2003, సం. 26 cf. DfC, no. 114), పీఠాధిపతులు మేత్రాసనములో సత్యోపదేశమునకు బాధ్యత వహించువారిగా, వారు బోధించుటతోపాటు సత్యోపదేశమును ప్రోత్సహించి, విశ్వాసులకు అవసరమగు రీతిలో వివిధ పద్ధతులలో సత్యోపదేశమును అందిస్తూ వారి బాధ్యతను నిర్వర్తించాలి (cf. DfC, no. 114).

ఈ విధముగా, పీఠాధిపతులకు మేత్రాసన సంఘాలను ప్రోత్సహించుటకు ప్రార్థనా సంవత్సరము ఒక గొప్ప అవకాశము, ప్రప్రథమముగా వారికి అప్పగింపబడిన విశ్వాసుల కొరకు ప్రార్థించుట ద్వారా, ఎందుకనగా, మోషే వలే వారు కూడా ప్రజల కొరకు ప్రభుని విన్నవించుటకు పిలువబడ్డారు. రెండవదిగా, వివిధ అంశాల ఆధారముగా ప్రార్థనా విలువను బోధించుటకు పిలుపు నిచ్చుట ద్వారా శ్రీసభలోని అతి గొప్పదైన ఆచారము కొనసాగుతుంది. చివరిగా, వారి మేత్రాసనాలలో తగు రీతిగా ఈ సత్యోపదేశమును చేయుటకు ఏర్పాట్లను చేయాలి.

గురువులు, డీకనులు, దైవాంకితులైన స్త్రీ, పురుషులు, సామాన్య విశ్వాసులు (పురుషులు), స్త్రీ ఉపదేశులు, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, (cf. DfC, nos.115-129), అందరూ వారి పరిమితి మేరకు పీఠాధిపతితో కలసి సృజనత్మకముగా, ఉత్సాహముగా విశ్వశ్రీసభలో ఈ ప్రత్యేక బాధ్యతకు సహకరించాలి.

## 7.2 ప్రార్థనపై సత్యోపదేశము కొరకు కొన్ని సూచనలు

ప్రార్థన గురించి సత్యోపదేశమును చేయుటకు ఈ క్రింద సూచనలు ఉపయుక్తముగా ఉంటాయి.

- దైవార్చన సంవత్సర ముఖ్యమైన కాలాలలో (ఆగమన కాలము, క్రీస్తు జయంతి కాలము, తపస్సు కాలము, క్రీస్తు పునరుత్థాన కాలము), పీఠాధిపతులు విశ్వాసులనుమేత్రాసన ప్రధాన దేవాలయమునకు ఆహ్వానించి ప్రార్థన గురించి సత్యోపదేశము చేయాలి (ధవ. ధవడ, యే. 114).
- ప్రార్థన ప్రాముఖ్యతను వివరించుటతోపాటు ప్రార్థనా జీవన విధానములో జీవించుటకు ప్రోత్సహించాలి, సంఘముతో కలసి కొన్ని ప్రార్థనా విధానాల సాధనతో వారికి తెలియపరచుట సముచితము. ఈ ప్రార్థనా విధానాలు చిన్నారులకు లేదా యవ్వనస్థులకు నిర్వహించునపుడు దైవాంకితులు లేదా సామాన్య విశ్వాసిచే నడిపింపచేస్తే మంచిది. తద్వారా ప్రార్థనా జీవితమును కార్యసిద్ధి చేయుటకు ఉపయోగపడుతుంది.
- సత్యోపదేశ సమయములో ప్రార్థనకు కేటాయించుట మేలు: దివ్య సత్ప్రసాద ఆరాధన వేళలో తండ్రి దేవునితో యేసునాధునికి ఉన్న ఆ ప్రేమ బంధమును అనుభవింప ఆహ్వానింపవచ్చు: ఆరాధన, స్తుతి, కృతజ్ఞత చెల్లించుట, తండ్రి దేవుని కుమారునిగా పెంచుకున్న నమ్మకము, విన్నపము, ఆయన మహిను ప్రశంసించుట దివ్య వాక్కు ఆధారముగా చిన్న చిన్న సాధనా కృత్యాలు ఉదాహరణకు పరిశుద్ధాత్మ ప్రేరణతో నిండిన పరిశుద్ధ గ్రంథ పఠనము (Lectio Divina) లేదా జపమాలను జపించుట, విశ్వాస సత్యాల గురించి కొన్ని ధ్యానాంశాలను ఇచ్చుట, లేదా ధ్యానమును పెంపొందించుటకు ఉపయుక్తమగు చిన్నాలను వినియోగించుట, శ్రీసభ ప్రార్థనను జపించుట.
- తల్లిదండ్రులు వారి అనుదిన కుటుంబ జీవితములో ప్రార్థనను ప్రోత్సహించుట, ఉదాహరణకు ప్రభువొసగిన ఆహారమునకు కృతజ్ఞతలు తెలియజేసి, ఆహారమును ఆశీర్వదించుట, ఉదయాన్నే ప్రార్థించుట,

నిద్రకు ఉపక్రమించు వేళలో ప్రార్థించుట, సాయంకాలము చిన్న చిన్న ప్రార్థన ద్వారా తల్లిదండ్రులు బిడ్డలను దీవించుట లేదా గృహమును నుండి బయటకు పని నిమిత్తమై వెళ్ళు సమయములో దీవించుట, ఒక ప్రయాణము చేయు ముందు దీవించుట, ఒక దేవాలయమును దాటి వెళ్ళునపుడు దేవుని దీవెనలకు కృతజ్ఞతగా సిలువ గుర్తును వేసుకొనుట, మొదలగునవి.

- సంఘముగా సమావేశమగు సమయాలలో, ప్రారంభ, ముగింపు ప్రార్థనథను కడుజాగ్రత్తతో తయారు చేయుట.
- పాపుగారి తరపున సేవలందించు సువార్తా వ్యాప్తి విభాగము "ప్రార్థనా నియమాలు" ఆధారముగా చేసుకొని, గొప్పవైన వివిధ క్రైస్తవ ఆచారముల ఆధారముగా లోతైన అధ్యయనము చేయుట, అదే విధముగా సత్యోపదేశానికి తగు రీతిగా ప్రసంగమును తయారగుటకు ఉపయోగపడుతుంది.

## 8. కతోలిక మఠవాస ఆశ్రమాలలో ప్రార్థన: వెలుగుచున్న ప్రార్థనా దీపము

**– బ్రదర్ కొమ్మెర పవన్**

2025 జూబిలీ సంవత్సరపు సిద్ధపాటులో ఈ (2024) సంవత్సరమును ప్రార్థనకు అంకితం చేయబడినది. కావున మఠవాస ఆశ్రమములో తమ జీవితాలను అంకితం చేసుకున్న గురువులు మఠకన్యలు ప్రార్థనలో అంకితమై ఈ సంవత్సరం అంతా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారని దానిలో ఎటువంటి సందేహం లేదు. వాస్తవానికి మఠవాస ఆశ్రమములోని సన్యాసులు,మఠకన్యలు తమను సంపూర్ణంగా దైవాంకితులను చేసుకుని ప్రభువుకు సమర్పించుకుంటారు. ఒక ప్రత్యేకమైన భక్తి ప్రార్థన ద్వారా తమ జీవితాల్లో దేవుని దర్శించుకుంటారు. శ్రీసభలోని మఠవాస ఆశ్రమాలు పరలోక కృపవరాలకు ఆధారాలు. శ్రీసభకు మఠవాస ఆశ్రమ జీవితం ఒక గర్వకారణం. వారి జీవితం ద్వారా వారు చేయుచున్న ప్రేయషిత కార్యము ద్వారా మఠవాస

ఆశ్రమములోని సభ్యులు అంతా క్రీస్తు ప్రభువు ఆనాడు కొండమీద, ప్రార్థనను దేవాది దేవునికి సాక్షిగా జీవిస్తూ ప్రపంచ చరిత్రలో ప్రభుపరలోక మహిమను ముందే ఈ భూమిపై తీసుకువచ్చేలా జీవిస్తారు. వారు సంఘంగా శ్రీసభలో ఒకే విధమైన దైవప్రేమకు సాక్షిగా ఉంటూ, అంకిత భావంతో మెలుగుతారు, విశ్వాసులు ప్రభులో ఎదగాలని వారు అపోస్తలుల ఫలప్రదమును సహకరిస్తారు, దాని కోసమే ప్రార్థన చేస్తూ ఉంటారు. (Apostolic exhortation, Vita Consecreta), 24, మార్చి, 1996, సంఖ్య 8). దైవ పిలుపు, శ్రీసభ ప్రేషిత కార్యము అనే వెలుగులో మఠవాసులు సర్వోన్నతమైన దేవునితో ఉండుటకుసర్వదా సిద్దపడి స్పందించాలి. (వీతా కాన్సెక్రాత, సంఖ్య 59) ఈ దీపపు ప్రార్థన ఎంతోమంది మఠగురువులు, మఠకన్యలు వారి యొక్క ఆశ్రమాలలో ప్రారంభిస్తూ ఈ మఠవాసాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింప చేయగలిగారు. ఇది ఎంతో సుందరమైనది, భరోసానిచ్చేది. ప్రత్యేక విధంగా మనము ఈ మఠఆశ్రమాలను వచ్చే జూబిలీ 2025 విన్నపాలను మదిలో ఉంచుకొని ప్రార్థించాలని తద్వారా మనందరం ఆ ప్రభులో మరింత గొప్పగా ప్రార్థన జీవితం ద్వారా ఎదగాలని మన ప్రార్థన జీవితం పెంపొందుతుందని నమ్మికతో బలపడతామని విశ్వాసంతో ఆనందంగా జీవించగలమని ఆశిద్దాం.

## 8.1 దృఢమైన ప్రార్థనను కొనసాగిద్దాం (కొలసీ 4:2)

### శ్రీసభ ధ్యాన పూర్వకమైన పిలుపు

అపోస్తలుడైన పునీత పౌలు గారు మనలను దేవునితో స్థిరమైన సంబంధం కలిగి ఉండమని ఆహ్వానిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు కలిగినను ఎన్ని బాధలు ఎదురు వచ్చినను ప్రభువైపు చూపులు స్థిరంగా ఉంచమని బోధిస్తున్నారు . ఈ భావంలో శ్రీసభలోని సభ్యులందరు మఠవాస ఆశ్రమవాసులను పోలి ధ్యాన పూర్వకమైన జీవితమును జీవించుటకు పిలువబడ్డారు. జ్ఞానస్నానం పొందిన ప్రతి ఒక్క విశ్వాసి తప్పనిసరిగా క్రీస్తును ధ్యానించాలి, వారు మాట్లాడే మాటలు, చేసే పనులు క్రీస్తుకు ఒక నిర్దిష్ట రూపముగా నిలవాలి. ఈ విధముగా, ప్రతీవిశ్వాసి అనగా క్రైస్తవునికి ప్రభుని కార్యములను ధ్యానించుటకు పిలువబడ్డారు. ఒక వ్యక్తి ఎల్లప్పుడూ అంతర్గతంలోనికి స్వతంత్రంగా తన

ఆరోగ్య పరిస్థితి పని లేదా భావోద్వేగాలు బట్టి ప్రార్థన ప్రారంభించవచ్చు. ఇది దేవుని కుమారుని ప్రార్థన, క్షమింపబడినపాపి తాను ప్రేమించబడిన ప్రేమను స్వీకరించడానికి తనకు తాను ముందుకు వచ్చి మరింత ప్రేమించడం ద్వారా దానికి ప్రతిస్పందించే ప్రార్థన. ధ్యాన పూర్వకమైన ప్రార్ధన అనేది దేవునితో సహవాసం చేయడం. ఇది విశ్వాసముతో యేసుపై స్థిరముగా నిలిపిన చూపు. దైవ మందసం ముందు కూర్చున్న Curé of Ars (ఆర్స్ గ్రామ వైద్యుడుగా పిలువబడే పునీత జాన్ మరియవియాన్నీ) గారు అంటున్నట్లుగా,"నేను ఆయనవైపు చూస్తాను ఆయన నావైపు చూస్తారు", ఒక పనివాడు దివ్య మందసము ముందు ప్రార్థించుట. ధ్యాన పూర్వకమైన ప్రార్థన దైవ వాక్కును వినుట, విశ్వాసముతో విధేయత చూపుట. ధ్యానపూర్వక ప్రార్థన నిశ్శబ్దము, క్రీస్తు ప్రార్ధనతో ఐక్యమై పాస్కా పరమ రహస్యములో పాలుపంచుకొనుట వంటిది (కతోలిక శ్రీసభ సత్యోపదేశము, సంఖ్య 2710–2724).

## 8.2 మఠవాస ఆశ్రమాలను సందర్శించుట

పవిత్రయాత్ర ఒకరి జీవితములో మారుమనస్సు అనుభవమును కలుగజేస్తుంది, జీవితాన్ని దేవుని పవిత్రత వైపు మరలిస్తుంది. మనము 2025 జూబిలీకి పవిత్ర యాత్రకు సిద్ధమవుతుండగా, మేత్రాసనాలలోని కథోలిక మఠవాస ఆశ్రమాలను సందర్శించుటకు 2024లో ప్రార్థనా సంవత్సర సందర్భముగా ప్రత్యేకముగా ఏర్పాటు చేయవచ్చు:

- యువతీయవకులతో కలసి పవిత్ర యాత్రలు నిర్వహించుట ద్వారా వారు ప్రత్యేకముగా శ్రీసభలో దైవ పిలుపు అనుభవమును పొందు అవకాశము కలుగుతుంది, దీనిలో భాగముగా దివ్య సత్ప్రసాద ఆరాధన, దివ్య గ్రంథ పఠనములపై ధ్యానాంశము, ధ్యానము, శ్రీసభ ప్రార్థనా ఘడియలు, అనుదిన జీవితములో పవిత్రత దిశగా క్రైస్తవ సుగుణాలతో కూడిన అనుభవముపై వాటి ప్రభావము.
- వివిధ కాల వ్యవధిలో ప్రార్థనలో గడుపుటకు మఠవాస ఆశ్రమాలను సందర్శించుట.
- మఠవాస ఆశ్రమములో నివసిస్తున్న స్త్రీ, పురుష మఠవాసులను సందర్శించుట ద్వారా వారి జీవితాన్ని సంపూర్తిగా, ఉదారముగా దేవునికి

అంకిత మొనర్చుకొన్నందుకు వారికి కృతజ్ఞత తెలుపుటకు, రాబోవు 2025 జూబిలీ ఆధ్యాత్మిక ఫలాలను ఉద్దేశించి వారి ప్రార్థనా సహాయమును కొరుటకు, తద్వారా కొన్ని వస్తువులను కానుకగా వారికి అవసరమగు వాటిని వారితో పంచుకొనుటకు ఈ సందర్శన ఉపయొగపడుతుంది.

- పుణ్య జీవితమును జీవించిన మఠవాసుల రచనల నుండి స్వీకరింపబడినవి:

| | |
|---|---|
| Nada teturbe, nada teespante; | ఏ విషయము నిన్ను కలవర పాటుకు గురి కానీయకుండును గాక, |
| todo se pasa, Dios no se muda; | ఏ విషయము నిన్ను భయానికి గురి చేయకుండును గాక, |
| la pacienciatodo lo alcanza. | ఎవరైతే దేవుని కలిగియున్నారో |
| Quien a Dios tiene nada le falta. | ఏ కొదవయు ఉండదు: |
| SóloDios basta. | దేవుడు మాత్రము చాలు. |

(పునీత అవిలాపురి తెరేసమ్మ)

మన పవిత్రతకు పరిపూర్ణతకు మూలకర్త దేవుడే, ప్రార్థన మన ఆత్మను ఎల్లప్పుడు దేవునికి చేరువలో ఉండునట్లు చేస్తుంది. అది నిప్పులా మండించి, వెలిగించిన తరువాత, ఒక అగ్నిగుండమువలే మన ఆత్మలో మండుతుంది, దానిలో ప్రేమ అనే అగ్ని నిరంతరం రగులుతుంటుంది, నిక్షిప్తముగా సైతము రగులుతుంది. మన ఆత్మ దైవముతో ప్రత్యక్ష సంబంధములో ఉన్నపుడు, ఉదాహరణకు దివ్య సంస్కారాలలో, ఒక శక్తివంతమైన శ్వాస రగుల్కొన్న విధముగా, పైకెత్తబడి, ఊహించలేని ఉదారతతో ధైవానుగ్రహముతో నింపబడుతుంది. మన ఆత్మ దివ్యలోక జీవనము విశ్వాసము, ప్రేమచేత యేసుక్రీస్తు ద్వారా తండ్రితో ఐక్యమయ్యే పరిమాణముతో కొలువబడుతుంది. ఈ ప్రేమ తగిన మంచి కార్యాలను ఫలసాయముగావించాలి, ఎక్కువగా, విరివిగా ఫలించుటకు, ప్రార్థనా జీవితము అవసరము. సాధారణముగా, మన దైవ ప్రేమలో ఉన్నతి అనేది మన ప్రార్థనా జీవితముపై ఆధారపడి ఉన్నదని

తెలుసుకోవాలి. (ధన్య కొలుంబ మార్మియోన్)

నా దేవా, పవిత్ర త్రిత్వమా, నీ పవిత్ర శ్రీసభ మహిమార్థము, ఈ భువిపై ఆత్మల రక్షణకై, శ్రమలలో ఉన్న ఉత్తరించు ఆత్మల విముక్తికై, నేను నిన్ను ప్రేమింప, నిన్ను ప్రేమింపచేయ ఆశగొనియున్నాను. నాకు నీ రాజ్యములో నీవు ఏర్పాటు చేసిన మహిమను పొందుటకునీ చిత్తమును నిష్టతో నెరవేర్చ ఆశగొనియున్నాను. ఒక్క మాటలో, నేను ఒక పునీతురాలిగా (పునీతునిగా) ఉండదలచుచున్నాను, కాని నేను నా శక్తిహీనతను ఎరుగుదును, నేను నిన్ను వేడుకొనుచున్నాను, నా దేవా, నీవే నా పవిత్రతగా ఉండుము.

నిండు ప్రేమతో జీవింప ఆజ్ఞాపింపబడుటకు, నన్ను నేను ఒక బలిగా నీ కరుణాపూరిత ప్రేమకు సమర్పించుకొనుచున్నాను, తక్షణమే నన్ను దహించమని వేడుకొనుచున్నాను, అనంతమైన మృదుత్వము అనే అలల ద్వారా నీలోదాచబడి నా ఆత్మలో ప్రవహించుట ద్వారా, నేను నీ ప్రేమకు హతసాక్షిగా తయారగునట్లు, నా దేవా! ఈ నా ప్రాణ నైవేద్యము, నీ ముందు నిలుచుటకు తయారు గావింపబడినపుడు, అంత్యమును నేను మరణించుటకు ఆనతిమ్ము, నా ఆత్మ తక్షణమే ఎగసి జాప్యము లేక నీ నిత్య కారుణ్య ప్రేమ వక్షస్థలమునకు చేరునుగాక.

నా ప్రియుడా, నా గుండె ప్రతీ చప్పుడు నా ఈ అర్పణను అనేక మార్లు, చీకటి ఛాయలు తొలగునంత వరకు, అనిత్యములో నీకు ముఖాముఖిగా నా ప్రేమను నీకు తెలియజేయు వరకు నూత్నీకరింప చేయుమని వేడుకొనుచున్నాను. (పునీత చిన్న తెరేసమ్మ)

## 9. పవిత్ర స్థలములో ప్రార్థన

**– బ్రదర్ ఆరుగుల్ల రాజేంద్ర**

2018లో జరిగినటువంటి "అంతర్జాతీయ పుణ్యక్షేత్ర అధికారుల, దైవపరిచర్య సహాయకుల సమావేశంలో పరిశుద్ధ ఫ్రాన్సిస్పాపుగారు మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలలో దినదినాభివృద్ధి చెందుతున్న భక్తుల సందర్శనం, వారు ఆశించు ఆశీర్వాదముల గురించి ప్రస్తావించారు. పాపుగారు మాట్లాడుతూ "ప్రార్థన పుణ్యక్షేత్రాలను ఫలభరితమగు స్థలములుగా మార్చును, ఎందుకన ఈ

పుణ్యక్షేత్రాలయందే యాత్రికులు, విశ్వాసుల భక్తి దేవుని ప్రేమయందు వారికిగల జ్ఞానం ద్వారా పెంపొందుతుంది" (అంతర్జాతీయ పుణ్యక్షేత్రాల అధికారుల దైవ పరిచర్య సహాయకుల సమావేశములో పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి సందేశము, నవంబర్ 29,2018).

పరిశుద్ధ స్థలములలో ప్రార్ధన, మానవునికి ఆవలిగా అగాధ లోతులను దాటి ప్రతిధ్వనిస్తుంది. ఇదే విషయాన్ని పరిశుద్ధ పాపుగారు మే 20, 2020లో బుధవారం ప్రజలకు నిర్వహించే సమావేశంలో మాట్లాడుతూ, "నిరీక్షణకు ప్రార్ధన పునాది వంటిది నిరీక్షణకు ఫలము ప్రార్ధన కావున నిరీక్షణ ఎదుగులాగున ప్రార్ధించండి. ఆ నిరీక్షణే మిమ్ములను ముందుకు నడిపిస్తుంది. ప్రార్ధన నిరీక్షణ ద్వారములను తెరుస్తుంది. నాకు నిరీక్షణకలదు ఆ నిరీక్షణ ద్వారములను నేను ప్రార్ధనతో తెరుస్తాను. ఎందుకనగా ప్రార్ధనా పరులగు విశ్వాసులు తమ జీవితములకు ఆధారభూతమైన, ప్రధానమైన సత్యములను నిరంతరం కాపాడుకుంటూ ఇతరులకు తెలియజేస్తూ, అసత్యాలు, అనగా జీవితం అనేక కష్టసుఖాల కలయిక అని, మనం అనుభవిస్తున్న అనేక కష్టదుఃఖాలు, గెలుపు ఓటములు, కష్టదినములు సమ్మేళనం అయినను జీవితం దేవుని వరప్రసాదములతో నిండిన జీవితం అని ప్రేరేపిస్తుంది. (బుధవారం ప్రజలతో సమావేశము, మే 20, 2020)

## 9.1 సఖ్యత, నిరీక్షణస్థలములు

నిరీక్షణ, పుణ్యక్షేత్రములకు కొత్తది కాదు. మనకు ప్రభువునందు ఉండు ఈ విశ్వాసము నిరీక్షణయగు ఉత్తరీయముతో చుట్టబడి ఉన్నది. శాంతి సమాధానములుయందు, ఓదార్పునందు మనకుగల నిరీక్షణ అసాధారణమగు జీవమును ఇచ్చు విశ్వాసపు విలువను మనము అర్ధం చేసుకొన సహాయం చేస్తుంది. పుణ్యక్షేత్రములు ప్రత్యేక స్థలములుగా ఉండవలెను. ఎందుకన పరలోక ప్రార్ధనలో విశ్వాసులు ప్రార్ధించు రెండవ రాకడ పరమ రహస్యములను వారు అర్ధం చేసుకోగలరు. పుణ్యక్షేత్రాలలో మనచూపు, పూర్తిధ్యాస మొత్తం చరిత్రలో నిలిచి ఉన్న ఆ దేవుని అగోచరమగు సాన్నిధ్యమునందు, మన వ్యక్తిగత జీవితంలో కేంద్రీకరించి ఉంచుతాము. పుణ్యక్షేత్రమునకు వచ్చు యాత్రికుడు తాను ప్రార్ధన

యందు అడిగిన దానియందు నిరీక్షణ కలిగి ఉండాలి. ఈ కారణము వలన ఆధ్యాత్మిక పరిచర్యలో చేయు ప్రయత్నంలో కలిగించు సదుపాయములు యాత్రికుడు తన ప్రస్తుత సమయములో ప్రార్థించిన విన్నపము నిరీక్షణ ద్వారా తప్పక నెరవేరునను దృష్టి విశ్వాసము కలిగి ఉండాలి. ప్రతి క్రైస్తవుడు "నిరీక్షణ యాత్రికుడు" ఈ యాత్రికుడు ధ్యేయము, గురి లేనటువంటి దేశదిమ్మరికాక, ధ్యేయము కలిగి తాను ఎచటికి పోవుచున్నది తెలిసిన వ్యక్తి అయి ఉండవలయును. ప్రతి యాత్రికుడు తన సరిహద్దులను దాటి నిరీక్షణ ద్వారా తన హృదయవాంఛలను, ఆశలను తీర్చు పవిత్ర స్థలము చేరవలయును. నిరీక్షణ అద్దము ద్వారా చూచినప్పుడు మాత్రమే దైవసంఘ సేవపరిచర్య ఎంత అవసరమో విధితమగును. నిరీక్షణ ద్వారా మాత్రమే దేవుడు ఒసగు శాంతి సమాధాన సఖ్యతను మనము పూర్తిగా విపులంగా అర్థం చేసుకోగలం. అంధకార ఘడియలలో జీవితం విచ్ఛిన్నమైనను, కలవరపడినను, నిరీక్షణయందే మన జీవితాలు పూర్తిగా వెలుగొందుచున్నవి.

- పుణ్యక్షేత్రములు నిరీక్షణ స్థలములు. ఎందుకన, అవిశ్వాసులను తమ యొద్దకు ఆహ్వానిస్తూ ఆ పుణ్యక్షేత్ర పునీతుని మధ్యస్థ ప్రార్థన ద్వారా వారికి కృతజ్ఞతలు అర్పిస్తూ వారి ప్రార్థనా సహాయం ద్వారా విశ్వాసం, కోరికలు, విన్నపములు తప్పక ఆలకింపబడి ఫలభరితం చెందుతాయన్న నమ్మకాన్ని కలిగిస్తాయి. నిజమునకు మన పుణ్యక్షేత్రాలు "ప్రార్థనా నిధులు" ఇది, ప్రత్యేక ప్రార్థన విన్నపములతోనూ కొవ్వొత్తులతోనూ భక్తికార్యములను చిహ్నంతో నిండియుండి ఏ విధముగా పూర్వకాలమందు, ప్రస్తుత కాలంలో మన ప్రార్థనలు తండ్రి చిత్తప్రకారము తన బిడ్డల వేడుకోలును విన్నపములను వినుటకు ఎప్పటికీ త్రోసిపుచ్చని ఆ దేవునియందు ఏ విధముగా నెరవేరును తెలుసుకొనగలము. కావున మనకు కావలసినవి మన దేవుని అడుగుటకు భయపడవద్దు.
- పవిత్రస్థలములు ముఖ్యముగా "మేత్రాసన పాపక్షమాపణ స్థలములు" ఇందు అభిషిక్తులైన గురువులు ఎల్లప్పుడూ అచటప్రజల పాపక్షమాపణ సంస్కారములను దయచేయుటకు సిద్ధంగా ఉంటారు. తప్పిపోయిన

కుమారుని ఉపమానంలో ఏ విధంగా ఆ దయగల తండ్రి తన కుమారుని రాక కోసం తన రెండు చేతులుచాచి ఎదురు చూస్తుంటాడో, అదే విధంగా ఆ పరమ తండ్రి ఈ పాపసం కీర్తన సాంగ్యము ద్వారా తన బిడ్డలను ఎల్లప్పుడూ తన రెండు చేతులు చాచి ఆహ్వానిస్తుంటాడు. ఈ జూబిలీ సంవత్సరమునకు తయారవుతున్న మనమందరం ఆ దేవదేవుని అనంతమైన వరములు ఈ పవిత్రస్థలముల నుండి మనలో ప్రవహించులాగున, పాపసం కీర్తన ద్వారా ప్రపంచమునకు ఆ దివ్యకారుణ్య ద్వారములు తెరవబడులాగున ఆశిద్దాం, నిరీక్షణ కలిగియుందాం. ఏ విధముగా అయితే తండ్రి లేక గృహము లేక ఈ లోకాశలవలలో చిక్కుకున్న ఆ కుమారుని పోలిన మనమందరం ఆ ప్రేమకలిగిన ఆ ప్రభుని హస్తములలో ఆయన కౌగిలిలో ఒదిగి పోదాం.

- ఈ జూబిలీ సందర్భంగా ఈ ప్రార్థనా సంవత్సరమందు ప్రత్యేకమైన ఉద్దేశములతో, ముఖ్యంగా ఈ సంవత్సరం దేవునితో సఖ్యత కలిగించు సంవత్సరముగా అన్ని పరిస్థితులలో ఆ ప్రభువు నుండి పొంగి ప్రవహించు ఆధ్యాత్మిక వరములు పొందులాగున, ముఖ్యముగా మన ప్రాంతీయ, ప్రపంచ పరిస్థితులలోఎక్కడ, ఎక్కువచెడు, ఘోరమైన బాధల వలనని రీక్షణను నశించిందో వారి కొరకు ప్రార్థించ ఆహ్వానిస్తుంది.

# 10. 2025 జూబిలీ సంవత్సర విశ్వాసుల ప్రార్థన

**– బ్రదర్ జుత్తుక వెళాంగని రాజ్**

## 10.1 పవిత్ర సంవత్సరానికి దేవుని ప్రజల ప్రార్థన ప్రాముఖ్యత

ఈ ప్రార్థనా సంవత్సరంలో, దేవుని ప్రజలు, ప్రతీ విశ్వాసి ప్రార్థన చాలా ముఖ్యమైనది. ప్రార్థన కేవలం వ్యక్తిగతముగా, దేవుని మధ్య మాత్రమే కాకుండా, దేవాలయ సభ్యులందరి మధ్య, పరలోకానికి చేర్చే ఒకే స్వరంలా వారిని ఏకం చేస్తూ, మరింత ప్రామాణికమైన చర్యగా మారుతుంది. కథోలిక సాంప్రదాయం ఎల్లప్పుడూ మతపరమైన ప్రార్థన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, దీనిలో విశ్వాస భాగస్వామ్యం వ్యక్తీకరించబడుతుంది. పునీతుల సాంగత్యంలోను,

మతపరమైన మధ్యవర్తిత్వంలోనూ ప్రార్థన అనునది శ్రీసభ ఐక్యత శక్తివంతమైనదని తెలుపుచున్నది. ఈ ఐక్యత పవిత్ర సంవత్సరంలో ఒక నిర్దిష్ట మార్గంలో వ్యక్తమవుతుంది. ప్రపంచనలుమూలల నుండి విశ్వాసులు ప్రార్థనతో, ఆధ్యాత్మిక మార్పు, పరివర్తన కొరకు వారి ఉద్దేశ్యములను తోటి సహోదరులతో, విశ్వాసులతో పంచుకుంటారు. ఇది జూబిలీ సంవత్సరం ద్వారా ప్రకటించబడిన క్షమాపణను, మన్నింపును అనుభవించడానికి వీలు కల్పిస్తుంది.

ఈ పవిత్ర జూబిలీ 2025 సంవత్సర సిద్ధపాటుకు విశ్వాసుల ప్రార్థనల నమూనాలు మన ప్రార్థనలలో ప్రతి ఒక్కటి మతపరమైన సంబంధం గురించి తెలియజేస్తుంది. ఇది ఒక గొప్ప వస్త్రంలో అల్లిన బంగారు దారం (పట్టు దారం) అని, విశ్వాసంతో నిండిన హృదయాలకు ఆధ్యాత్మిక ఉదాహరణ తెలుపుతుంది.

మొదటిది ఫ్రాన్సిస్ పాపు గారు రచించిన “జూబిలీ ప్రార్థన”. ఇది మన సంఘములో, ముఖ్యంగా ఆదివారం పూజా సమయంలో, జూబిలీ కోసం ఎదురుచూస్తూచేసే అర్థవంతమైన ప్రార్థన. ప్రభువు మనకు ఇవ్వాలనుకుంటున్న అసాధారణమైన కృపలను స్వాగతించడానికి, విశ్వాసుల హృదయాలను సిద్ధం చేయడంలో ఇది సహాయపడుతుంది.

## మధ్యవర్తిత్వ (విజ్ఞాపన) ప్రార్థన

“ఓ తండ్రీ, నీ దయతో, నీ బిడ్డల విన్నపాలను ఆలకించండి. మేము 2025 జూబిలీకి సిద్ధపడుచుండగా, మా విశ్వాసాన్ని పునరుద్ధరించండి, మాలో నిరీక్షణ, ప్రేమ, దాతృత్వం అనే సుగుణాలను పెంపొందించండి, మీ ప్రేమకు ఈ ప్రపంచములో మేము సాక్షులుగా ఉండటానికి మాకు సహాయం చేయండి.”

## స్తుతి ప్రార్థన

“ప్రభూ, నీ అనంతమైన మంచితనానికి మేము నిన్ను స్తుతిస్తున్నాము. రాబోయే జూబిలీ సంవత్సరములో మేము, మీ చేతితో చేసిన ఈ సృష్టి అందాలను చూడడానికి మా కన్నులను తెరవండి, తద్వారా మీరు చేసిన ఈ

సృష్టి అద్భుతమైన గొప్పతనాన్ని చూసి మా హృదయాలు సంతోషించును.”

## కృతజ్ఞతా ప్రార్థన

“ఓ దేవా, మీరు ఒసగిన ప్రతి ఆశీర్వాదము, దయచేసిన అన్ని కృపావరములకు గాను మేము మీకు కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము. మేము జూబిలీ మహోత్సవమునకు సిద్ధపడుచుండగా, మా జీవితములలో ప్రతి క్షణములోనూ, అణువులోనూ మీ దివ్యహస్తమును గుర్తించ మాకు నేర్పండి. ఆదే విధముగా ప్రతీ నూతన దినమును మీ దయ, ప్రేమ పూరిత బహుమతిగా స్వీకరించే కృపను మాకు ప్రసాదించండి.”

## విన్నప ప్రార్థన

“సమస్త జ్ఞానానికి మూలాధారమైన ప్రభూ, రాబోయే జూబిలీ మహాసంవత్సర వేడుకలు జరుపుకోవడానికి సిద్ధపడుచున్న మమ్ములను ఈ ప్రస్తుత ప్రార్థనా సంవత్సరంలో మీ మార్గనిర్దేశములో నడిపించుము. మీ దయ, కనికరములు, మన్నింపు అనే పరలోక వరములను తెలుసుకొని, పరిపూర్తిగా అర్థం చేసుకొనే విధముగా మా హృదయాలను తెరచి, మా మనస్సులను ప్రకాశవంతం చేయండి.”

❋ ❋ ❋ ❋

## జూబిలీ సంవత్సర ప్రత్యేక ప్రార్థన

ఓ మా పరలోక తండ్రీ! / మీ కుమారుడును
మా సోదరుడైన యేసు క్రీస్తులో / మీరు మాకు ఒసగిన
విశ్వాసము,/ పవిత్రాత్మ చేత మాలో క్రుమ్మరింపబడిన
దాతృత్వ జ్వాల ద్వారా, / రానున్న మీ రాజ్యమునకై /
దివ్యమైన నిరీక్షణను / మాలో మేల్కొలుపండి.
మీ కృపతో మమ్ములను, / ప్రభు వాక్కు విత్తనములు వెదజల్లే /
చురుకైన వ్యవసాయదారులుగా / రూపొందించండి.
నరశక్తులు నశించి, / మానవత్వం వికసించి /
సకల విశ్వము హెచ్చింపబడి / ధృడ సంకల్పంతో / క్రొత్త దివి,
క్రొత్త భువికై నిరీక్షించుటకు / మీ మహిమ, వైభవము /
నిరంతరం మాలో నింపండి.
జూబిలీ మహోత్సవ కృపావరములు, / పరలోకపు
యాత్రికులందరిలో దృడ పరచి, / పరలోక సంపద పట్ల
నిరీక్షణను, / ఆశను ఉత్తేజపరచండి.
రక్షకుని ఆనందము, / శాంతి, / ప్రపంచమంతటిపై
క్రుమ్మరించబడును గాక! మా స్తుతులు ఘనత / శతాబ్ధములుగా
అందుకొను దేవా!
నిరంతరము మహిమ కీర్తి మీకే కలుగును గాక!
ఆమెన్!

# 3. క్రైస్తవ విశ్వాసానికి మూల స్తంభము సంఘ ప్రార్థన

బ్రదర్ అలజంగి దీపక్

## ఉపోద్ఘాతం



దేవునిచే సృజింపబడిన ఈ సృష్టిలోని సకల జీవరాసులలో ఒక ఉన్నతమైన, విలక్షణమైన, విచక్షణాత్మకమైన, అద్భుత మేధాశక్తిని కలిగిన వ్యక్తిగా మనం మానవుని అభివర్ణించవచ్చు. మానవ జీవితం అనేది ఒక గడియ నుండి మరొక గడియకు, ఒక రోజు నుండి మరొక రోజుకు, ఇలా మరణ సమయం వరకు కొనసాగుతుంది. మానవ జీవన చక్రంలో ప్రతిక్షణము అమూల్యమైనదే, ఎందుకనగా, ఈ భూలోక జీవితానికి ముగింపు ఉండుట వలన మానవుడు గడిపే క్షణాలలో విలువైనదిగా, ఉపయోగకరమైనదిగా, విశిష్టమైనదిగా, వెలకట్టలేనిదిగా మనం దేవునితో సంభాషించే సమయం అని చెప్పవచ్చు. దానినే మనం ప్రార్థన సమయం అని చెప్పవచ్చు. ప్రార్థన గురించి పునీత జాన్ దమషీన్ గారు తెలియజేస్తూ, “మన మనస్సును, మేధస్సును సకల స్థితిలయ కారకుడైన ఆ దేవుని వైపు మళ్లించటమే ప్రార్థన” (కతోలిక సత్యోపదేశం. 2559) అని అన్నారు. ప్రార్థన మనలను దేవునితో ఐక్యపరుస్తుంది. ప్రార్థనలో మనలను మనం వినమ్రులను చేసుకుంటూ, దేవుడే సర్వాధికారి అని గుర్తిస్తూ, ఆయన మీద పరిపూర్ణంగా ఆధారపడుతూ, ఆయనతో మన బంధాన్ని దృఢపరుచుకుంటాం. మనం ప్రార్థనకు హాజరైన వ్యక్తులను ఆధారంగా లేదా స్థూలంగా తీసుకుంటే, రెండు రకాల ప్రార్థనలు మనకు తారసపడతాయి. అందులో మొదటిది వ్యక్తిగత ప్రార్థన, రెండవది సంఘ ప్రార్థన. ఒక వ్యక్తి ఏకాంతముగా చేసే ప్రార్థనను వ్యక్తిగత ప్రార్థనగ, ఇద్దరూ లేదా ఇంకొంత

మంది వ్యక్తులు ఒకే చోట సమావేశమై చేసే ప్రార్థనను సంఘ ప్రార్థనగా అభివర్ణించవచ్చు.

ఈ నవీన, వైజ్ఞానిక యుగంలో మానవునిలో రకరకాల ఆలోచన దృక్పథాలను చూస్తున్నాము. అందులోని ఒక ఆలోచన ధోరణి, సంఘ ప్రార్థన అవసరమా? వ్యక్తిగత ప్రార్థన సరిపోదా? అనే అంశాలు సమాజంలో చక్కర్లు కొడుతున్నాయి. మరీ ముఖ్యంగా కరోనా వ్యాధి ప్రబలిన రోజుల నుండి ఇటువంటి ఆలోచనల్లోనే ఉండి, ఇంకా సంఘ ప్రార్థనల్లో పాల్గొనక కాలాన్ని వృధా చేస్తున్న వారు అనేకమంది ఉన్నారు. కాబట్టి మనం సంఘ ప్రార్థన ఔన్నత్యాన్ని, లోతైన అర్థాన్ని, క్రీస్తు మాటల్లో సంఘ ప్రార్థన లాభాలను, అపోస్తలుల జీవితంలో సంఘ ప్రార్థన స్థానాన్ని, శ్రీసభ బోధనల సారాంశాలను పరిశీలిద్దాం.

## 2. సంఘ ప్రార్థన చారిత్రక, పవిత్ర గ్రంథ నేపథ్యం

క్రైస్తవ విశ్వాసంలో, దేవునితో మానవుడు సాగించే లోతైన, పవిత్రమైన సంభాషణయైన ప్రార్థన, ఒక ప్రముఖమైన స్థానాన్ని కలిగియున్నది. ప్రార్థన మూలాలు చరిత్రలో విరివిగా వ్యాపించి, విశ్వాసుల ఆధ్యాత్మిక జీవితాన్ని దిశానిర్దేశం చేసిన విషయం పవిత్ర గ్రంథంలో మనం చూడవచ్చు.

### 2.1 సంఘ ప్రార్థన ప్రారంభ మూలం

పాత నిబంధనలో మనకు వివిధ రకాల ప్రార్థనలైన, స్తుతి ప్రార్థనలు, విన్నప ప్రార్థనలు, పశ్చాత్తాప ప్రార్థనలు తారసపడతాయి. అందులో "షేతు కుమారుడైన ఎనోషు నాటి నుండే జనులు యావే నామమున దేవుని ఆరాధింప మొదలుపెట్టిరి" (ఆది.కా. 4:26). ఈ ప్రారంభ ప్రార్థన, సమూహ ప్రార్థనకు లేదా సంఘ ప్రార్థనకు మూలముగా మనము పరిగణింపవచ్చు.

### 2.2 పరలోక ప్రార్థన: సంఘ ప్రార్థనకు ఒక దైవీక నమూనా

క్రొత్త నిబంధనలో యేసు చేత ప్రస్తావించబడిన ఒక కీలకమైన ప్రార్థన, పరలోక ప్రార్థన. ఇది యేసు ప్రభు స్వయంగా మనకిచ్చిన దైవీక నమూనా (మత్తయి 6:9-13). ఇందులోని ప్రతీ పదము మానవ హృదయాన్ని కదిలిస్తూ, ఆలోచింపజేస్తూ, మానవ బాధ్యతను గుర్తుచేస్తుంది. దీనిలోని ప్రతీ పదము దేవునితో, మానవునితో మనకు ఉండాల్సిన బంధాన్ని తెలియజేస్తుంది. దేవునితో

క్రైస్తవుల సంభాషణ సారాంశాన్ని వ్యక్తపరుస్తుంది.

## 2.3 మధ్యవర్తిత్వ ప్రార్థన శక్తి

మధ్యవర్తిత్వ ప్రార్థనను మనం పవిత్ర గ్రంథమతటా చూడవచ్చు. ఆదికాండము 18వ అధ్యాయంలో అబ్రహాము సొదొమ,గొమొర్రా ప్రజల కోసం మధ్యవర్తిత్వ ప్రార్థన చేశాడు. ఇతరుల తరుపున ఎడతెగత ప్రార్థించుట వలన విశ్వాసులు పొందగల పరివర్తనకు, మేలులకు ఉదాహరణగా అబ్రహాము నిలిచాడు.

## 2.4 ఆదిమ క్రైస్తవ సంఘంలో ప్రార్థన

ఆదిమ క్రైస్తవ సంఘంలో క్రైస్తవ విశ్వాసులందరూ ఒకే చోట సమావేశమై ప్రార్థన చేయడాన్ని మనం గమనించవచ్చు. "వారు అపోస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టెను విరచుటయందును మరియు ప్రార్థించుట యందును ఎడతెగక ఉండిరి" (అపో.కా. 2:42). ఈ ఉదాహరణ నేటి క్రైస్తవ సంఘ ఆరాధనకు మూల స్తంభంగా ఉంది అని చెప్పవచ్చు.

## 2.5 నిరంతర దైవ సహవాసం

తెస్సలోనీయులకు పునీత పౌలు గారు 1 తెస్సలోనిక 5:7లో "సదా ప్రార్థింపుడు" అని ఉత్తర్వులు జారీ చేయడానికి గమనించవచ్చు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసిన విషము ఏమనగా, మనం నిరంతరం దైవసాన్నిధ్యంలో ఉండాలి.

# 3. క్రీస్తు బోధనలలో,అపోస్తలుల జీవితాలలో సంఘ ప్రార్థన విశిష్టత

క్రీస్తుని ప్రబోధాలలో మనం సంఘ ప్రార్థన ప్రస్తావనను చూడవచ్చు. మత్తయి సువార్తలో ఏసుప్రభు ఇలా చెబుతున్నారు: "ఎక్కడ ఇద్దరు లేక ముగ్గురు నా పేరిట కూడుదురో అక్కడ నేను వారి మధ్య ఉంటాను" (మత్తయి18:20). యేసు మనులను ఏకాంత విశ్వాసానికే కాక, ఇతరులతో కలిసి జీవించే విశ్వాసానికి కూడా ఈ వచనాల ద్వారా ఆహ్వానం పలికారు. మరొకమారు ఆయన శిష్యులు, ఆయనను ఎలా ప్రార్థించాలో అడిగినప్పుడు, ఆయన ఈ రీతిగా సమాధానం ఇచ్చారు: "పరలోకమందున్న మా తండ్రి" (మత్తయి6:9)

అని చెప్పారు. ఏసుప్రభు ఇందులో 'మా తండ్రి'అని అన్నారు కానీ, 'నా తండ్రి' అని అనలేదు. దీనిని బట్టి ఆయన మన తండ్రి. ఆయనకు మనము పిల్లలము, క్రీస్తులో మనం సహోదరులము. అందువలన, మనం ప్రార్థనలో దేవుని వద్దకు వచ్చినప్పుడు మన తోటి విశ్వాసులతో ఉండటం సహజం.

ఏసుప్రభు బోధనలను స్వీకరించిన అపోస్తలులు, ఆయన బోధనలకు అనుగుణంగా, ఆయన పునరుత్థానము అనంతరం జీవించడం మొదలు పెట్టారు. ఈ సహవాస ప్రార్థన అనేది ఆదిమ క్రైస్తవ సంఘము నుండి గమనించవచ్చు. అపోస్తలుల కార్యములు 2:42లో అపోస్తలుల బోధన, సహవాసం, రొట్టె విరవడం, సంఘ ప్రార్ధన అనే అంశాలను చూడవచ్చు. అటు తరువాత, పేతురు, యోహానులు కారాగారము నుండి విడుదలైనప్పుడు, ఆనాటి విశ్వాసులందరూ దేవుని స్తుతిస్తూ, ప్రార్థిస్తూ తమ స్వరములను కలిపిరి (అపో.కా. 4:24) అని పరిశుద్ధ గ్రంథములో తెలియజేయబడింది. ఈ బోధనలు, ఆచరణములే తరువాత కాలంలో సంఘ ప్రార్థనకు బీజములు, పునాదులు వేశాయి. మూల స్తంభాలుగా నిలిచాయి.

## 4. సంఘ ప్రార్థన ఆవశ్యకత

### 4.1 మన ఆధ్యాత్మిక బలం క్షీణిస్తున్న సమయంలో ఇతరుల ప్రార్థనలు మనలను నిలబెడతాయి

లూకా 5:18-26లో పక్షవాత రోగి స్వస్థతకు, తన పొరుగు వారు తోడ్పడ్డారు. పక్షవాతానికి గురైన వ్యక్తి, యేసు వద్దకు రావటానికి తన స్వశక్తి అనుకూలించకపోయినా, తన స్నేహితులు అతని స్వస్థతను కలిగించే శక్తి ఏసుకు ఉందని గ్రహించి, విశ్వసించి యేసు వద్దకు చేర్చారు. స్వస్థతకు కారణమయ్యారు. మరో ఉదాహరణ నిర్గమ 17:11-12లో ఇశ్రాయేలీయులు అమాలేకీయులపై యుద్ధానికి వెళ్ళినప్పుడు చేతులను పైకెత్తినంత వరకు ఇశ్రాయేలీయులు గెలుస్తూనే ఉన్నారు. అతని చేతులు క్రిందకు దించినప్పుడల్లా అమాలేకీయులు ఆధిక్యంలోకి వస్తున్నారని గ్రహించి అహరోను, హూరు, మోషే చేతులను స్థిరంగా ఎత్తి పట్టుకున్నారు. మోషే శక్తి క్షీణించినప్పుడు, తన సహోదరుడు, స్నేహితుని భౌతిక తోడ్పాటుతో విజయాన్ని చూడగలిగాడు.

ఇందువలననే మనం ఆధ్యాత్మికంగా క్షీణించిపోతున్న సమయంలో, ఇతరుల ప్రార్థన మనలను నిలబెడుతుంది, బలపరస్తుంది. మనం బాధలను, కష్టాలను, సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పుడు వారి ప్రార్థన ఎంతగానో సహాయపడుతుంది.

## 4.2 మీ విశ్వాసం కుంచించుకు పోతున్నప్పుడు, ఇతరుల విశ్వాసం మీలోని ఆధ్యాత్మిక అంతరాన్ని పూరిస్తుంది

యేసుపైన పక్షవాత రోగి స్నేహితుల విశ్వాసం, నమ్మకము పక్షవాతానికి గురైన స్నేహితుని కోలుకునేలా చేసింది (లూకా 5:18-26). వారి విశ్వాసాన్ని మెచ్చిన యేసు, పక్షవాత రోగితో, "మిత్రమా, నీ పాపాలు పరిహరించబడ్డాయి" అని అన్నారు (లూకా 5:20). ఈ అద్భుతంలో ఆ వ్యాధి పీడితుని స్నేహితులు, ఆ వ్యాధిగ్రస్తునిలో కొరతగా ఉన్న ఆరోగ్యమనే ఖాళీని యేసు అనే వైద్యుని వద్దకు చేర్చి పూరించారు. యాకోబు 5:16లో "పరస్పరము మీ పాపములు ఒప్పుకొనుడు. ఒకరి కొరకు ఒకరు ప్రార్థించుకొనుడు." ఈ సందేశమును అనుసరించి, మనం ఒకరి కొరకు ఒకరు మేలికరమైన జీవితానికై ప్రార్థించాలి. మన శక్తి సన్నగిల్లుచున్న సమయంలో, బాధలు, కష్టాలు అనే సుడిగుండాలు మన జీవితంలో చెలరేగుతున్న సమయంలో, మన స్నేహితుల ప్రార్థన మనకు ఎంతగానో ఉపకరిస్తుంది, శక్తినిస్తుంది, ధైర్యాన్నిస్తుంది, దేవుని అనుగ్రహాలు పొందడానికి తోడ్పడుతుంది.

## 4.3 సంఘ ప్రార్థన మనకు అధిక శారీరిక, ఆధ్యాత్మిక శక్తిని అందిస్తుంది

మన వ్యక్తిగత ప్రార్థనలోనే కాదు, సంఘ ప్రార్థన ద్వారా కూడా అధిక శక్తిని పొందగలమని గ్రహించాలి. యేసు మాటల్లో, "భూలోకమున మీలో ఇద్దరు ఏక మనస్కులై ఏమి ప్రార్థించినను పరలోకమందుండు నా తండ్రి వారికి అది అనుగ్రహించును" మత్తయి18:19లో తెలియజేయడాన్ని మనం చూస్తున్నాం. మనం ఇతరులతో ప్రార్థన చేయునప్పుడు, మన ప్రార్థనలు స్వార్థపూరితంగా ఉండే అవకాశం తక్కువ, దేవుని హృదయానికి అంగీకారముగా ఉండే అవకాశం ఎక్కువ.

## 5. సంఘ ప్రార్థనకు ప్రతీక దివ్యబలి పూజ

దివ్య బలిపూజ కతోలిక సాంప్రదాయంలో సంఘ ప్రార్థనకు ఒక గొప్ప ఉదాహరణ. ఇక్కడ విశ్వాసులు ఏక మనసుతో దైవ నామస్మరణ చేయడానికి, పవిత్రమైన క్రీస్తు శరీర రక్తములు స్వీకరించడానికి, గురువు బోధనల ద్వారా పవిత్ర గ్రంథపు లోతైన భావాలను తెలుసుకోవడానికి సమావేశమవుతాము. ఇందువలననే, దివ్య బలిపూజ క్రీస్తు శరీరంలో సభ్యులుగా ఉన్న విశ్వాసుల ఐక్యతను సూచిస్తుంది.రెండవ వాటికన్ మహాసభ ద్వారా విడుదలైన పవిత్ర దైవార్చన నియమములు (*Sacrosanctum Concilium*) అనే పత్రము, దివ్య బలి పూజలో విశ్వాసుల సమూహ స్వభావాన్ని, విశ్వాసుల చురుకైన భాగస్వామ్యాన్ని వ్యక్తపరుస్తుంది. పవిత్ర దైవార్చన నియమములు (*Sacrosanctum Concilium*) లో తెలియజేయబడిన కొన్ని అంశాలు:

### 5.1. క్రియాశీలకమైన, చైతన్యవంతమైన విశ్వాసుల భాగస్వామ్యం

దివ్యబలి పూజ కేవలం యాజకులు చేసే బాహ్య ఆచారము కాదు కానీ, విశ్వాసులందరూ కలసి పరస్పర భాగస్వామ్యంతో దేవునికి ఆరాధన చేసే దైవార్చన. అందువలననే "మన తల్లి శ్రీసభ క్రైస్తవ దైవార్చనలలో విశ్వాసులందరూ భాగస్వాములు కావాలని, దేవుని పట్ల ఆరాధన భావంతో ఇష్ట పూర్తిగా, చైతన్యవంతంగా దైవార్చనలలో పాల్గొనాలని "పవిత్ర దైవార్చన చట్టం" లోని సంఖ్య 14 (*Sacrosanctum Concilium* 14) తెలియజేస్తుంది.

### 5.2 సంఘ ఆరాధన

ఈ విశ్వలేఖ, శ్రీసభ ముఖ్యమైన లక్ష్యాన్ని ఈ విధంగా తెలియజేస్తుంది: క్రైస్తవ విశ్వాసులందరూ ఒకచోట భాగస్వామ్యులై దేవుని స్తుతించాలి, ఆరాధించాలి, ప్రభుని రక్షణ బలిని సమర్పిస్తూ, ఆయన ప్రసాదించిన దివ్యహారాన్ని భుజించాలి. ఈ విధంగా, మనం క్రైస్తవ జీవితానికి మూలం, ఆధ్యాత్మిక శిఖరం  దివ్యబలి పూజ అనిపేర్కొనవచ్చు, అని పవిత్ర దైవార్చన నియమములోని సంఖ్య 10 (*Sacrosanctum Concilium* 10) లో తెలియచేయబడింది.

### 5.3 దివ్యబలి పూజ ఐక్యతకు మూలము

ఈ విశ్వలేఖలో దివ్యబలి పూజ విశ్వాసుల మధ్య ఐక్యతను పెంపొందిస్తుంది అని పవిత్ర దైవార్చననియమములలోని సంఖ్య 14 (*Sacrosanctum Concilium* 14) తెలియజేస్తుంది. దివ్యబలిపూజ విభిన్న నేపథ్యాలు, సంస్కృతుల ప్రజలను ఒకచోట చేర్చి, దైవారాధనలో వారిని ఏకం చేస్తుంది. దివ్యబలిపూజలో విశ్వాసులు క్రీస్తుతో, క్రైస్తవ సహోదరులతో ఐక్యమై ఉండటాన్ని సుస్పష్టంగా గమనించవచ్చు.

## 6. సంఘ ప్రార్థనలో ఇమిడియున్న వేదాంత సత్యాలు

క్రైస్తవ సంఘ ప్రార్థన అనేది క్రైస్తవ విశ్వాస ప్రాముఖ్యతను, ఆచరణను రూపొందించే లోతైన వేదాంత సూత్రాలతో నిండియున్నది. సంఘ ప్రార్థనలో ఉన్న కొన్ని వేదాంతపరమైన అంశాలు:

### 6.1 ఐక్యత

క్రైస్తవ సమూహం ఒక చోట ప్రార్థనకు సమావేశమైనప్పుడు, వారు క్రీస్తు శరీరానికి సూచికగా ఉంటున్నారని పవిత్ర గ్రంథంలో చూస్తున్నాం. క్రైస్తవులు ఒకే ఆధ్యాత్మిక కుటుంబంలో పరస్పర అనుసంధానించబడిన సభ్యులు (1 కొరింతీ 12:12-27). సంఘ ప్రార్థన విశ్వాసులను ఏకతాటిపై తీసుకురావడం ద్వారా ఐక్యతను పెంపొందిస్తుంది, క్రీస్తు ద్వారా దేవుని ప్రేమ, దయ కరుణలపై నమ్మకాన్ని బలోపేతం చేస్తుంది.

### 6.2 మధ్యవర్తిత్వం, విన్నపం

క్రైస్తవ సంఘ ప్రార్థనకు కేంద్ర బిందువు మధ్యవర్తిత్వం. ఇక్కడ విశ్వాసులు ఒకరి జీవితంలో ఎదురయ్యే అవసరాలు, ఆందోళనలు, వారి జీవిత సవాళ్లను ఎదుర్కోవడానికి కావలసిన శక్తిని దయచేయమని ప్రార్థిస్తారు (యాకోబు 5:16). క్రీస్తు మనలను ప్రేమించినట్లే ఒకరినొకరు ప్రేమించుకోవాలి అనే వేద సత్యాన్ని సంఘ ప్రార్థన వెల్లడి చేస్తుంది.

### 6.3 ఆధ్యాత్మికతలో మార్పులు

సంఘ ప్రార్థన క్రైస్తవ సంఘంలో ఒక వ్యక్తి ఆధ్యాత్మిక మార్పులకు,

ఎదుగుదలకు కీలక పాత్ర పోషిస్తుంది. ఇది విశ్వాసంలో ఎదగడానికి, దేవునితో సంబంధం పెంచుకోడానికి ఎంతగానో దోహదపడుతోంది. ఇటువంటి సంఘ ప్రార్థన అనుభవాల ద్వారా, క్రైస్తవులు దైవ చిత్తానికి అనుగుణంగా నడుచుకోవాలని ప్రోత్సహిస్తుంది. (రోమీ 12:12).

### 6.4 బాప్తిస్మ బాధ్యత,క్రైస్తవ్యానికి సాక్ష్యం

సంఘ ప్రార్థన బహిరంగంగా క్రైస్తవ నమ్మకాలను, విలువలను ధ్రువీకరిస్తుంది. కలసి ప్రార్థించడం ద్వారా, సువార్తను ప్రకటించడంలో, క్రీస్తు సువార్తను ఇతరులతో పంచుకోవడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తారు (మత్తయి 28:19-20).

### 6.5 క్రీస్తు రెండవ రాకడ కొరకు నిరీక్షణ

సంఘ ప్రార్థన అనేది ఈ భూలోక జీవితం తరువాత పరలోక జీవితం ఉ ందనే ఆశను సజీవంగా ఉంచుతుంది. క్రీస్తు మరలా వైభవ సమేతంగా విచ్చేస్తారని, ఆయన శాశ్వతమైన పాలనకై ఎదురుచూస్తూ ప్రార్థిస్తారు (దర్శన 21:15). దైవ చిత్తమే అంతిమంగా నెరవేరుతుందని, దేవునిపై నమ్మకముంచడానికి ఈ నిరీక్షణ సహాయపడుతుంది.

## 7. ఈ నవయుగంలో (సమకాలీన కాలంలో) సంఘ ప్రార్థన

ఈ వైజ్ఞానిక యుగంలో డిజిటల్ మీడియా, ప్రపంచీకరణ, ఇంటర్నెట్ సేవలు, ఆన్ లైన్‌లో ప్రార్థనా సమూహాలు, ప్రత్యక్ష ప్రసారాలు, ప్రార్థనలను సులభతరం చేసింది. మనుష్యుల భౌతిక స్థానంతో సంబంధం లేకుండా ప్రార్థనలో పాల్గొనడానికి నూతన అధ్యాయానికి నాంధి పలికింది. కతోలిక సంఘంలో కొన్ని సంఘ ప్రార్థనలకు ఉదాహరణలు: కుటుంబ ప్రార్థన, మరియదళము, విన్సెంట్ దెపౌల్ బృందము, దివ్యకారుణ్య బృందము.

### ముగింపు

సంఘ ప్రార్థన విశిష్టతను తెలుసుకోవడం ప్రస్తుత క్రైస్తవ సమాజానికి ఎంతో అవసరము. సమాజంలో 'నేను', 'నాది', 'నేను బాగుంటే చాలు' అనే భావన అధికముగా వ్యాప్తి చెందుతున్న, ఈ నవీన యుగంలో, సంఘ ప్రార్థన

ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, దానిలో ఉన్న లోతైన పరమార్థాన్ని ఇతరులతో పంచుకోడానికి ప్రయత్నిద్దాం. సంఘ ప్రార్థనతో పాటు వ్యక్తిగత ప్రార్థనను కూడా నిర్లక్ష్యం చేయరాదు అని పవిత్ర దైవార్చన నియమముల సంఖ్య 12 (*Sacrosanctum Concilium* 12) తెలియజేస్తుంది. సంఘ ప్రార్థన, వ్యక్తిగత ప్రార్థన ఒకే దేహానికి రెండు కన్నుల వంటివి. ఇందులో ఏది సరిగా పని చేయకపోయినా ఆధ్యాత్మిక కొరత అనేది ఏర్పడుతుంది. కావున, వ్యక్తిగత ప్రార్థనే కాదు, సంఘ ప్రార్థన కూడా అవసరమే అనే పరమార్థాన్ని ఇతరులతో పంచుకోడానికి ప్రయత్నిద్దాం. యేసు అనే ద్రాక్షావల్లికి, రెమ్మలుగా ఉన్న మనము (యోహాను 15:5) అందరమూ ఐక్యముగా జీవించటానికి ప్రయత్నించుదాం. ఐక్యమత్యమే మహా బలము. క్రైస్తవ విశ్వాసుల ఐక్యమత్య స్థాపనయే నా ఊపిరి. శ్రీసభలో ఉన్న విశ్వాసుల ఐక్యతను గౌరవిద్దాం. అందరం కలిసి పరలోక రాజ్య స్థాపనకై బాటలు వేద్దాం.

❋ ❋ ❋ ❋

# 4. హన్నా జీవితపు ప్రార్థనాశైలి

బ్రదర్ కండి రవీంద్ర కుమార్



*హన్న... ప్రార్థించింది.... ప్రార్థిస్తూనే జీవించిది...*

*ప్రార్థన - విశ్వాసానికి సూచిక అవుతుంది*

*ప్రార్థన - వినయముతో జీవించేలా చేస్తుంది*

*ప్రార్థన - ప్రేమను నలుగురికీ పంచుతుంది*

*ప్రార్థన - మంచి మనిషిగా మలుస్తుంది*

*ప్రార్థన - పవిత్రులుగా చేసి దేవునిలో నడిపిస్తుంది*

**హన్నా జీవితం**

దేవునిపై అచంచలమైన భక్తి విశ్వాసాలకు ఆమె ఓ ప్రతీక, ప్రేమాను రాగాలకు అతీతంగా దేవునికి ఇచ్చిన మాటకు తన కన్న బిడ్డను దేవునికి సమర్పించిన త్యాగము ఆమెది. ప్రార్థనా జీవితంలో గెలుపొందాలి అనుకునే వారికి ఆమె ఒక మార్గదర్శి. ఇంతకీ ఆమె ఎవరో మీకు అర్థం అయ్యిందా? ఆమె మరేవరో కాదు, హన్నా. హన్నా ప్రాచీన ఇశ్రాయేలు ప్రజలలో ఒక మహిళ. ఆమె భర్త పేరు ఎల్కానా. హన్నా గర్భం దాల్చలేని స్థితిలో ఉన్న సమయంలో దేవునికి ప్రార్థించింది. ఆమె దేవునికి చేసిన ప్రతిజ్ఞ ప్రకారం, ఒక పుత్ర సంతానం పొందితే, ఆ బిడ్డను దేవుని సేవకు అంకితం చేస్తానని ప్రతిజ్ఞ చేసింది.

**దుఃఖపూరితపు ప్రార్థన**

ఎల్కానా ఎఫ్రాయిాము తెగకు చెందినవాడు. ఆయనకు హన్నా, పెన్నిన్నా అను ఇద్దరు భార్యలు ఉన్నారు. పెన్నెన్నాకు బిడ్డలు కలరు కానీ హన్నాకు

సంతానం కలుగలేదు. వారు ప్రతి యేటాషిలో నగరమునకు వెళ్లి సైన్యములకు అధిపతియైన యెహోవాను ఆరాధించి బలులు సమర్పించెడివారు. ఆ సమయంలో హన్నా హృదయ వేదనతో కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, ఈ విధంగా ప్రభువును ప్రార్థించింది. సైన్యములకు అధిపతియైనయావే ప్రభువా! ఈ దాసురాలి బాధను పరికింపుము, ఈ దాసురాలిని జ్ఞప్తియందు ఉంచుకొనుము. నాకు ఒక మగ బిడ్డను అనుగ్రహింపుము, ఆ బిడ్డను నీకే సమర్పించు కొందును అంటూ తన రొమ్మును బాదుకుంటూ, దుఃఖముతో నిండిన హృదయంతో, కన్నీటీతోఆమె బాధను దేవుడు వినేలా ప్రార్థించింది. కన్నీటితో ప్రార్థన చేస్తే దేవుడు ఆలకించి ఆ బాధను తీసివేస్తాడు. ఎందుకంటే ప్రభువు మనం బాధపడటం, కన్నీరు పెట్టడం ఆయన తట్టుకోలేడు, ఆయన హృదయం తరుక్కుపోతుంది. కన్నీటి ప్రార్థన విలువ అటువంటిది. ఆయన దగ్గరకు కన్నీరు, మున్నీరుతో వచ్చిన వారందరి కన్నీళ్ళనుతుడిచి వారి కళ్ళలో సంతోషాన్ని నింపేదేవుడు మన దేవుడు. హన్నా కన్నీటి ప్రార్థన ప్రభువును ఎంతగానో కదిలించింది.

## ప్రభువు ఆమె ప్రార్థనను ఆలకించెను

హన్నా దేవాలయంలో ఎంతో విషాదంతో, కన్నీళ్లతో దేవుని ముందు మోకాళ్ళపై ప్రార్థన చేసింది. హన్నా తన ప్రార్థన ఈ విధంగా చేసింది: ఓ మా ప్రభువా, నీ దాసి కష్టాలను గమనించు, నన్ను మరచిపోవద్దు. నాకు ఒక కుమారుని ఇస్తే, ఆ బాలుని జీవితాంతం నీ సేవకే అంకితం చేస్తానుఅని వాగ్దానం చేసింది. ఏలి, హన్నా గమనించి, మొదట్లో ఆమె మద్యం తాగి ఉన్నదని అనుకున్నాడు. కానీ హన్నా తన బాధను వివరించగానే, ఏలి ఆమెకు ఆశీర్వాదం ఇచ్చి, ఆమె కోరినదంతా నెరవేరాలని ప్రార్థించాడు. హన్నా ఇంటికి తిరిగి వెళ్లి, కొంత కాలం తరువాత గర్భవతి అయింది. ఆమె ఒక కుమారునికి జన్మనిచ్చింది. ఆ బిడ్డకు సమూవేలు అని పేరు పెట్టింది. హన్నా తన వాగ్దానాన్ని నిలబెట్టుకుని, సమూయేలును దేవునికి అంకితం చేసి, దేవాలయానికి తీసుకెళ్ళి సమర్పించింది. ఈ విధంగా హన్నా ప్రార్థనకు దేవుడు స్పందించి, ఆమెకు కుమారుని ఇచ్చాడు. దీని ద్వారా మనం తెలుసుకోవాల్సిన విషయం దేవుడు

మన ప్రార్థనలను ఆలకించి రవేర్చేవాడని, మనం నిజమైన విశ్వాసంతో ప్రార్థిస్తే, దేవుడు మన కోరికలను నెరవేరుస్తాడని తెలుస్తుంది.

## హన్నా ఓ మహానుభావురాలు

హన్నా ప్రతిరోజు వేకువనే నిద్రలేచి ప్రభువును సేవించేది. ప్రతిరోజు దీపారాధన చేస్తూ ఉండేది. ఈ విధంగా ప్రార్థనా జీవితాన్ని జీవిస్తూ ఉండేది అందుకనే దేవుడు ఆమె కోరికనునెరవేర్చి, కుటుంబాన్ని దీవెనలతో నింపాడు. మన కుటుంబంలో దేవుని శాంతి సమాధానములు ఈ హన్నా మాదిరిగా వేకువనే లేచి ప్రభువుకు ముందు దీపం వెలిగించి, ప్రార్థించాలి. ఇలా ప్రార్ధన చేస్తున్న వారుకిదేవుడు దీవెనలు కుమ్మరిస్తూనే ఉంటాడు. ఒకప్పుడు గొడ్రాలు, గొడ్రాలు అని పిలవబడిన ఈ హన్నా తన కుమారుడు జన్మించిన తర్వాత ఆమెను రాజులను అభిషేకించిన సమూవేలు ప్రవక్తకు తల్లిగా పిలువబడింది, దేవుని దృష్టిలో ఉన్నత స్థానాన్ని సంపాదించుకుంది. ఉన్నత స్థాయి రావడానికి కారణం, ఉదయంలేచి ప్రభువునకు ప్రార్థిస్తూ, ప్రార్థన ద్వారా రోజును ప్రారంభించడం.

## హన్నా ప్రార్థన, ముఖ్యమైన లక్షణాలు

### 1. విశ్వాస ప్రార్థన

హన్నా ఎప్పుడూ దేవునికి విశ్వాసపాత్రంగా ఉండేది. ఏనాడు దేవుని సందేహించలేదు. తన జీవితంలో అధైర్యపడలేదు, చింతించలేదు. దేవుడు తనకు మేలు చేస్తాడని పూర్తిగా విశ్వసించింది. నమ్మిన వారిని విడనాడే దేవుడు కాదని ఆమె నమ్మకం. అందుకే పూర్ణం మనసుతో పూర్ణ విశ్వాసముతో ప్రభుని విశ్వసించింది. దేవుని పై ఉన్న లోతైన నమ్మకం ఆమె లోతైన విశ్వాసాన్ని ప్రతి ఫలింపజేసింది.

### 2. నిరంతరప్రార్థన

హన్నా నిరంతరం ప్రార్థిస్తూ దేవుని శరణు పొందాలని కోరుకుంది ఆమె తన ప్రార్థన ఎప్పుడూ ఆపకుండా ఆయనను స్తుతిస్తూ ప్రార్థిస్తూ, ఆమె జీవించినంత కాలము ప్రార్థనా జీవితాన్ని జీవించింది. నిరంతర ప్రార్థన మనకు దేవునిలో జీవించాలని నిరీక్షణతో బ్రతకాలని తెలియజేస్తుంది.

### 3. కృతజ్ఞతాప్రార్థన

హన్నా తన కుమారుడైన సమూయేలు జన్మించిన తర్వాత ఆమె దేవునికి కృతజ్ఞతలు చెప్పింది ఆ ప్రార్థనలు "నా హృదయము ప్రభువు నందు ఆనందించుచున్నది అంటూ ప్రార్థిస్తూ దేవుడు చేసిన మేలులకు ఉప్పొంగిన హృదయముతో దేవుని మహిమను, ఆయన కృపను ప్రార్థనలో ప్రశంసించింది".

### 4. బాధాపూరితమైన ప్రార్థన

హన్నా తన బాధను,ఆంతరంగిక వేదనలను కష్టాలను దేవునికి చెప్పడానికి వెనుకంజ వేయకుండా సమస్తమును ఆయనకు విన్నవించింది. ఆమె తన బాధలను నెరవేర్చిన దేవుని సహాయం కోరుతూ ఆయనను ఆశ్రయించింది. తన మనసులో ఉన్న భావాలను దేవునికి తెలియజేసింది. ఈ ప్రార్థన మనకు కూడా ప్రేరణగా నిలుస్తుంది. మన బాధలను, కష్టాలను ప్రభువునకు విన్నవించి ఆయనను ఆశ్రయిస్తే సమస్తము తొలగిపోతుందని హన్నా మనకు తెలియజేస్తుంది.

### 5. ప్రార్థనలో నిశ్చలత

హన్నా ప్రార్థనలో తన హృదయాన్ని పూర్తిగా దేవునికి సమర్పించింది. ఆమె హృదయములో ప్రార్థిస్తూ ఆమె పెదవులు కదులుచుండినను నోటి నుండి మాట మాత్రము వెలువడుటలేదు. ఆమె ప్రార్థనలో ఎంతగానో నిమగ్నమై పోయింది, ఆమె ప్రార్థనలో ఉన్న నిశ్చలతను మనం గమనించవచ్చు. ప్రార్థన అంటే దేవునిలో లీనమైపోవడం.

### 6. వాగ్దాన ప్రార్థన

హన్నా దేవునికి వాగ్దానం చేసింది నాకు మగ పిల్లవాడిని దయ చేస్తే ఆ పిల్లవాడిని తిరిగి ఆయనకు సమర్పిస్తానని ప్రతిజ్ఞ చేసింది బాలునికి జన్మనిచ్చిన తరువాత తీసుకుని వెళ్ళి దేవాలయంలో దేవునికి సమర్పించింది. ఆ విధంగా తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంది.

### 7. తగ్గింపు ప్రార్థన

ఏలి తనను అపార్థం చేసుకుని తప్పుగా మాట్లాడినా, ఆయనకు ఎదురు

చెప్పక తనను తాను తగ్గించుకొని ఈ దాసురాలి కొరకు ప్రార్థించు అని వినయముతో విధేయతతో ఆయనను అడిగింది తన భర్తకు తన తోటి వారికి ఎల్లప్పుడూ సహాయపడుతూ వారి పట్ల వినయంతో మెలిగేది. ఆయన దీనులను లేవనెత్తును అన్నమాట హన్నా జీవితంలో ఆమెను ఎంతగానో అణిగిమనిగి, ఒదిగి ఉండేలా చేశాయి, తద్వారా ఆమెను దేవుడు ఉన్నత స్థితికిలేవనెత్తాడు.

## 8. నమ్మకముతో కూడిన ప్రార్థన

ఆమె ప్రార్థనలు ప్రతిఫలం చూడడానికి చాలా కాలం పట్టినా, ఆమె నమ్మకాన్ని కోల్పోలేదు. దేవుడు తన ప్రార్థనలను వింటాడు అనే నమ్మకంతో ఆమె నిరంతరం ప్రార్థన చేస్తూనే ఉంది.

## 9. త్యాగపూరిత ప్రార్థన

హన్నా తన ఆశలను, కష్టాలను దేవుని ముందు ఉంచింది. ఆమె బిడ్డ కోసం వేడుకుంది, కానీ తన స్వంత కోరికలను కంటే, దేవుని యోచనకు, దేవుని విధానాలకు విలువనిచ్చింది.

## 10. ధైర్యం కూడిన ప్రార్థన

హన్నా తన సామాజిక పరిస్థితులను, అవమానాలను పట్టించుకోకుండా ధైర్యంగా ప్రార్థించింది. తన ప్రార్థనలు దేవుని వరకు చేరుతాయని ఆమె ధైర్యముతో నమ్మింది.

## హన్నా ప్రార్థనా జీవితం నుండి నేర్చుకోవలసిన పాఠాలు

1. హన్నా ప్రార్థనా జీవితం మనకు అనేక పాఠాలను నేర్పిస్తుంది. ఆమె విశ్వాసం, పట్టుదల, దేవునిపై నమ్మకం మనందరికీ ఒక స్ఫూర్తినిస్తుంది. హన్నా జీవితంలో ఎదుర్కొన్న ప్రతీ సవాలును, ఆమె ప్రార్థన ద్వారా అధిగమించింది.

2. హన్నా చూపిన ప్రార్థనా విధానం, ఆమె చూపిన వినమ్రత, ఆమె చూపిన కృతజ్ఞత మనకు గొప్ప పాఠాలను అందిస్తాయి. సమూవేలు ఒక గొప్ప ప్రవక్తగా, నాయకుడిగా ఎదిగాడు, ఇది హన్నా చేసిన ప్రార్థనలకు, ప్రతిజ్ఞకు ప్రతిఫలం.

3. హన్నా జీవితమంతా, ఆమె ప్రార్థనా జీవితం దేవునిపై విశ్వాసం, ఆయన కృపకు ఒక అద్భుత దృశ్యం. హన్నా జీవితాన్ని పరిశీలించడం ద్వారా, మనం కూడా మన ప్రార్థనలను విశ్వాసంతో, పట్టుదలతో చేయుట నేర్చుకోవచ్చు.
4. హన్నా దేవుని ఎదుట ఎడతెగత, మనస్ఫూర్తిగా ప్రార్థించింది. ఆమె ప్రార్థనలు ఉదయం సాయంత్రం దేవునికి సమర్పించేది. మనం కూడా హన్నావలే ఉదయము సాయంత్రముమన ప్రార్థనను దేవునికి అర్పించాలి.
5. హన్నా మొదట ఒక సంతాన లేమితో బాధపడినా, ఆమె తల్లియైన తరువాత శాంతియుత జీవితం గడిపింది. ఆ చిన్న సంతోషాలను పెద్ద విజయాలుగా అంగీకరించింది. మనం కూడా హన్నావలే ఎన్నోసార్లు బాధపడవచ్చు దుఃఖించవచ్చు కానీ మన సమయం వచ్చినప్పుడు దేవుడు మనకు హన్నావలే ప్రశాంతమైన జీవితాన్ని సంతోషాన్ని దయచేస్తాడు.
6. తన సమస్యకు పరిష్కారం ఎక్కడ దొరుకుతుందో గ్రహించి అక్కడకు చేరింది, దేవుని ప్రార్థించింది. తాను ఉన్న స్థితిని మార్చగలిగేవాడు, దేవుడు ఒక్కడేనని పరిపూర్తిగా విశ్వసించింది. దేవుడు తన యెడల చేసిన కార్యాన్ని హన్నా బహుగా కీర్తించింది.
7. హన్నా తన కుమారుడు సమూవేలును దేవుని సేవకు సమర్పించి, ఆయన ద్వారా సమాజానికి సేవచేసింది. మనం కూడా మన బిడ్డలను దేవుని సేవకు అంకితం చేస్తూ ఎల్లప్పుడూ దేవునికి తోటివారికి సహాయపడేలా వారిని మనం తీర్చిదిద్దాలి. దీనిని మనం అందరం బాధ్యతగా స్వీకరించి, అమలులో పెట్టాలి.

❋ ❋ ❋ ❋

# 5. వినయశీలుని ప్రార్థన

బ్రదర్ కొట్టే సాగర్ రాజు



యాకోబు, దేవునితో ఎందుకు కుస్తీ పడ్డాడు? "నన్ను దీవించుదాక నిన్ను వెళ్ళనీయను" (ఆ. కాం. 32:26) అని యాకోబు దూతతో పలికాడు. అనగా, నేను అడిగేది, నాకు ఒసగేవరకు నేను నిన్ను పోనివ్వను అని యాకోబు ఉద్దేశ్యం. దేవుడు తన చిత్తానికి తలొగ్గాలని యాకోబు దేవునితో కుస్తీ పడ్డాడు. కాని, యేసు తన మానవ స్వభావీయ చిత్తాన్ని దేవునికి తలొగ్గటానికి పోరాటం (ప్రార్థన) చేసారు. "ఆత్మ ఆసక్తి కలిగి యున్నను, దేహము దుర్భలముగా ఉన్నది" (మార్కు 14:38) అని యేసు శిష్యులతో అన్నారు.

ప్రార్థన దేవునితో 'కుస్తీ', 'పోరాటం' అయితే, మన శ్రమలలో మనం ఎవరివలె ప్రార్థన చేయుచున్నాము? యాకోబువలెనా లేక యేసువలెనా? మనం అనేకసార్లు యాకోబువలె ప్రార్థన చేస్తాం: దేవుని చిత్తము నెరవేరాలని కాకుండ, మన చిత్తమే నెరవేరాలని కోరుతాం, మన చిత్తాన్ని మార్చుకొని, దేవుని చిత్తం నెరవేరాలని కోరుటకు బదులుగా, దేవుడే తన మనసును, చిత్తాన్ని మార్చుకోవాలని ఆశిస్తాం. యేసుతో కలిసి సిలువను మోయు శక్తిని ఇవ్వమని కోరుటకు బదులుగా, సిలువనే తీసివేయమని కోరుతూ ఉంటాము. మనలను మనం సంపూర్ణముగా దేవుని చిత్తానికి సమర్పించుకున్న యెడల, మనం యేసువలే ప్రార్థిస్తాం. ఇరువురి ప్రార్థన ఫలితాలు వేరువేరుగా ఉన్నాయి. పేరును అడిగిన యాకోబుకు, దేవుడు తన పేరు చెప్పలేదు. కాని యేసు విషయములో, "దేవుడు ఆయనను అత్యున్నత స్థానమునకు లేవనెత్తి అన్ని నామముల కంటె

ఘనమగు నామమును ఆయనకు ప్రసాదించెను. పరలోక, భూలోక పాతాళ లోకముల యందలి సమస్త జీవులును క్రీస్తు నామమునకు మోకాలు వంచి వినతులు కావలెను. పితయగు దేవుని మహిమార్థమై, యేసు క్రీస్తు ప్రభువు అని ప్రతి నాలుక ప్రకటింపవలెను" (ఫిలిప్పీ 2:9-11).

దేవుని ఏదైనా అడగటానికి ప్రార్థనలు చేస్తాం. ప్రార్థనలో మన చేతులను దేవుని వైపు చాపుతాం. అయితే, మనం ప్రార్థన చేయు కొలది, నెమ్మదిగా, దేవుడే తన చేతులను మన వైపుకు చాపుతారు. ఎందుకన, తన చిత్తమును చేయమని మనలను కోరుతూ ఉంటారు. మన ప్రార్థనలో సిలువను, పరిస్థితిని, స్థానాన్ని, వ్యక్తిని తీసివేయమని కోరతాం. కాని, దేవుడు ఆ సిలువను, పరిస్థితిని, స్థానాన్ని, వ్యక్తిని అంగీకరించమని కోరుతారు.

ఠాగూరు చెప్పిన ఈ చిన్న కథ, పై భావాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది: ఒక భిక్షగాడు గడప గడపకు వెళ్లి భిక్షం ఆడుకుంటున్నాడు. అలా వెళుతూ ఉండగా, బంగారు రథముపై రాజకుమారుడు రావడం చూస్తాడు. 'అబ్బ! ఈ రోజు నా పంట పండింది, అడగకుండానే, రాజకుమారుడు నా జోలె నిండా కాసులు కురిపిస్తాడు' అని భావించి, వెళ్లి రాజకుమారుని ముందు, తన జోలెను చాపాడు. ఆపుడు, రాజకుమారుడు, 'నాకు ఇవ్వడానికి నీ దగ్గర ఏమున్నది?' అని భిక్షగాడిని అడగటం జరిగింది. అయోమయములో పడిపోయిన భిక్షగాడు, తన జోలె నుంచి ఒక చిన్న మొక్కజొన్న గింజను ఇస్తాడు. చాలా విచారముగా ఇంటికి వెళ్లి, ఆ రాత్రి, తన జోలెను ఖాళీ చేయుచుండగా, ఒక చిన్న బంగారు గింజను చూస్తాడు. అప్పుడు వాస్తవాన్ని గ్రహించి, ధైర్యము చేసి జోలెలో నున్న గింజలన్నింటిని ఇస్తే బాగుండేది అని ఆ భిక్షగాడు వాపోయాడు.

యేసు "తండ్రీ! నీ చిత్తమైనచో ఈ పాత్రను నా నుండి తొలగింపుము" అని ప్రార్థించారు. కాని తండ్రి, లోక రక్షణార్థమై, ఆ పాత్రను పానము చేయమని తిరిగి యేసును కోరారు. అప్పుడు యేసు, "తండ్రీ! నా ఇష్టము కాదు. నీ చిత్తమే నెరవేరును గాక!" అని ప్రార్థించారు. అపుడు స్వర్గము నుండి దూత ప్రత్యక్షమై ఆయనను బలపరచెను. ఆయన బాధతో ఇంకను దీక్షగా ప్రార్థన

చేయసాగెను. ఆయన చెమట రక్తబిందువుల వలె భూమిమీద పడుచుండెను (లూకా 22:42-44). తన రక్తాన్నంతటిని సిలువపై చిందించడానికి యేసు సిద్ధపడ్డారు.

## ఆయన బాధతో ఇంకను దీక్షగా ప్రార్ధన చేయసాగెను

ఈ వచనాలను లూకా సువార్తీకుడు వ్రాసాడు 22:44. ఈ వచనాలు, మన ప్రార్థనా జీవితం ఎలా ఉండాలో నేర్పుతున్నాయి. మనకు ఆదర్శముగా ఉంటున్నాయి. లూకా తన సువార్తను వ్రాసే నాటికి, క్రైస్తవ సంఘం ఎన్నో వేదహింసలను పొందుతుంది. శ్రీసభ శ్రమలలో, హింసలలో, యేసు ప్రార్ధన ఆదర్శం! ప్రతీ విశ్వాసి, తన జీవితములో గెత్సెమని అనుభవాలను చిన్న మొత్తములో కలిగే ఉంటారు. అనారోగ్యం, ఇతరులు మనలను సరిగా అర్థం చేసికోక పోవడం, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, దైవభీతి లేకపోవడం, పాపభీతి లేకపోవడం, విశ్వాసలేమి ఒక్క మాటలో చెప్పాలంటే హృదయాంధకారం. ఇలాంటి పరిస్థితులలో, మనం మొట్టమొదటిగా చేయవలసినది, ప్రార్థనలో దేవుని వైపునకు మరలటం అని యేసు నేర్పిస్తున్నారు. కనుక, మనలను మనం మోసం చేసికోకూడదు. దేవునిపై ఆధారపడి జీవించుదాం.

“అబ్బా! తండ్రీ! నీకు అసాధ్యమైనది ఏదియు లేదు” (మార్కు 14:36). దేవునకు సమస్తము సాధ్యమే! మానవుడు, ఇక చేయడానికి ఏ అవకాశం లేనప్పుడు, నిరాశ, నిస్పృహలో నున్నప్పుడు, ఇలాగే ప్రార్థిస్తాడు. కష్టాలను తొలగించమని ప్రార్థిస్తాడు. కాని, యేసువలే, “తండ్రీ! నా ఇష్టము కాదు. నీ చిత్తమే నెరవేరనిమ్ము” అని ప్రార్థించగలగాలి.

ఒక విశ్వాసికి ఎల్లవేళలా సాధ్యమైనది ప్రార్థన చేయడం. ప్రార్థనలో అడిగినది నెరవేరక పోతే మనం ఏమి చేయాలి? మళ్ళీ ప్రార్ధన చేయాలి! యేసు ప్రార్థనను దేవుడు ఆలకించలేదని, మనకు సువార్తను చదివినప్పుడు అనిపిస్తుండవచ్చు, అయితే, హెబ్రీ 5:7లో “యేసు భక్తి, విధేయతలు కలవాడగుట చేతనే దేవుడు ఆయన ప్రార్థనను ఆలకించెను” అని చదువుచున్నాము. ఈ విషయములో, యేసు తండ్రి నుండి సహాయాన్ని

పొందినట్లుగా, లూకా సువార్తికుడు వివరించాడు: “అపుడు స్వర్గము నుండి ఒక దూత ప్రత్యక్షమై ఆయనను బలపరచెను” (22:43). అయితే, ఈ సహాయం నిరీక్షణ మాత్రమే యేసు ప్రార్థనకు తండ్రి దేవుని అసలైన సమాధానం యేసు క్రీస్తు ఉత్థానం.

ప్రార్థనలో వేడుకున్నది వెంటనే జరుగకపోతే, దేవుడు మన ప్రార్థనలను ఆలకించడం లేదని భావిస్తూ ఉంటాము. ప్రతీ ప్రార్థనను దేవుడు తప్పక ఆలకిస్తారు. దేవుడు ఇంకా ఎక్కువగా మనకొసగాలని, ఆలస్యం చేస్తూ ఉంటారు. మనం క్రమం తప్పకుండా ప్రార్థన చేయడమే, దేవుని ఆశీర్వాదాలు పొందటం! గెత్సెమని తోటలోని సంఘటన చివరిలో యేసు తన శిష్యులతో, “లెండు, పోదాము రండు” (మత్తయి 26:46) అని చెప్పారు. యేసు పేతురుతో, “నేను నా తండ్రిని ప్రార్థింపలేనను కొంటివా? ప్రార్థించిన ఈ క్షణమున ఆయన పండ్రెండు దళముల కంటె ఎక్కువమంది దూతలను పంపడా? ఇట్లు కాదేని, ఈ విధముగా జరుగవలెనను లేఖనములు ఎట్లు పరిపూర్ణమగును?” అని అన్నట్లుగా, యేసు మనకోసం మరణించడానికే సిద్ధపడ్డాడని, దేవుని చిత్తమే, తన చిత్తముగా భావించారని స్పష్టమగుచున్నది.

యేసు తన శిష్యులకు నేర్పిన ‘పరలోక ప్రార్థన’కు, గెత్సెమని తోటలో యేసు చేసిన ప్రార్థనకు స్పష్టమైన సారూప్యత ఉన్నది. “పరలోక ప్రార్థన” వలె, గెత్సెమని తోటలో ప్రార్థనను యేసు కూడా, “అబ్బా! తండ్రీ!” (మార్కు 14:36) అని లేదా “ఓ నా తండ్రీ!” (మత్తయి 26:39) అని ప్రారంభించారు. “నీ చిత్తమే నెరవేరనిమ్ము” అని యేసు ప్రార్థించారు. “కీడులలో నుండి మమ్ము రక్షింపుము” అని ప్రార్థించునట్లుగా, యేసు “ఈ పాత్రము నానుండి తొలగి పోనిమ్ము” అని ప్రార్థించారు. శోధనలకు గురికాకుందునట్లు ప్రార్థించమని యేసు తన శిష్యులను కోరారు.

మన ప్రార్థనలో, బలహీనులమైన మనకు ఆత్మ కూడ సాయపడును. మాటలకు సాధ్యపడని నిట్టూర్పుల ద్వారా మన కొరకై ఆత్మయే దేవుని ప్రార్థించును (రోమీ 8:26). దేవుని ఆత్మ యేసుకు కూడ సాయపడినది: “యేసు ఏడ్పులతో, కన్నీటితో పెద్దగా ఎలుగెత్తి ప్రార్థించెను” (హెబ్రీ 5:7).

## యేసు శ్రమలు, లోకాంతము వరకు కొనసాగును

యేసు ప్రభువుతో మనం గెత్సెమని తోటను వీడే ముందు, మరొక విషయాన్ని మనం నేర్చుకోవాలి. యేసు శ్రమలు, లోకాంతము వరకు కొనసాగును. "దేవుని గొర్రెపిల్ల అయిన క్రీస్తు మరణించి, సజీవుడాయెను. ఆయన సదా జీవించి ఉండును" (దర్శన 1:18). "సింహాసనము మధ్య గొఱ్ఱెపిల్ల నిలిచి యుండెను. అది వధింప బడినట్లు ఉండెను" (దర్శన 5:6). వధింప బడుచున్న గొఱ్ఱెపిల్లను మనం దివ్య పూజాబలిలో కలుసుకుంటున్నాము. గెత్సెమని తోటకు వెళ్ళుటకు ముందుగానే, యేసు దివ్యసత్ప్రసాదమును స్థాపించారు, తద్వారా, ఆయన శిష్యులు, యుగయుగముల వరకు, ఆయన శ్రమలను స్మరింతురుగాక! తపఃకాలములో, యేసుతో గంటపాటు గెత్సెమని తోటలో ఉండటం అనగా, పవిత్ర గురువారం రోజున ఒక గంటపాటు దివ్యసత్ప్రసాద సన్నిధిలో ఉండటం! అలాగే, ఈ లోకములో తన శరీరములో భాగస్థులైన వారి శ్రమలలో, యేసు శ్రమలు కొనసాగుతూనే ఉన్నాయి. నాడు ఆయన శరీరము బాధలకు గురియైనట్లు, నేడు యేసు తిరు హృదయం వేదనలను అనుభవించు చున్నది. గుప్తమైన గెత్సెమని తోటలు మన చుట్టూ ఎన్నో ఉన్నాయి! అలాంటి వారిని చేరుకుంటే, యేసు ప్రభువును చేరుకున్నట్లే!

"నేను సానుభూతిని ఆశించితిని. కాని అది లభ్యము కాదయ్యెను. ఓదార్పును అభిలషించితిని కాని అది లభింపదయ్యెను" (కీర్తన 69:20) అని ప్రభువు మనతో చెప్పకుండును గాక! దానికి బదులుగా, ఈ నా సోదరులలో అత్యల్పుడైన వారికి నీవు ఇవి చేసియున్నావు కనుక, "అవి నాకు చేసితివి" (మత్తయి 25:40) అని చెప్పాలి.

వ్యాపార ప్రపంచంలో పోటీతత్వం ఉంటుంది. దీనిని మనం టీవిలో చూస్తున్నాము, రేడియోలో వింటున్నాము, పేపర్లలో చదువుతున్నాము. ఆకట్టుకునే ప్రకటనతో వినియోగ దారులను ఆకర్షించుటకు ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇతర కంపెనీ వస్తువులతో పోల్చుతూ ఎవరికివారు, వారి ఉత్పత్తియే ఉత్తమమైనదని ప్రచారం చేస్తూ ఉంటారు. పోటీతత్వం మంచేదే కాని, అది ఇతరులను నాశనం చేస్తుందని గుర్తించాలి.

ఆధ్యాత్మిక జీవితంలో పోటీతత్వానికి, ఇతరులతో పోల్చడం లాంటి వాటికి తావు లేదు. ఒక వ్యక్తి ఇతరులతో పోల్చుకున్నపుడు, ఆ వ్యక్తి ఉత్తమం కాలేడు. తననుతాను ఇతరులతో పోల్చుకుంటూ, 'నాకు శత్రువులు ఎవరు లేరు, నేను ఎవరిని నాశనం చేయడం లేదు, చాలా వినయంతో ఉన్నాను, ఎలాంటి తప్పు చేయడం లేదు' అని చెప్పుకునేవాడు అహంకారి, గర్విష్టి అని చెప్పవచ్చు. ఎప్పుడు విమర్శించేవాడు సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని ఆలోచించలేడు. ఎప్పుడు తానే ఒప్పు అని ఇతరులకు చూపించుకొంటుంటాడు. కనుక ఆధ్యాత్మిక జీవితంలో లేదా దేవుని విశ్వసించేవారు పోటీ, పోల్చుట అను పదాలకు తావు ఇవ్వకూడదు. ఆధ్యాత్మిక జీవితంలో అవసరమైనది: "నేను ఘోరపాపిని" అంటూ వినయం కలిగి జీవించాలి.

ఇదే విషయాన్ని మనం సువార్తలో చూస్తున్నాము. పరిసయ్యుడు తననుతాను పొగడుకొను చున్నాడు. అందరిలోకెల్ల, తానే నీతిమంతుడని, మంచివాడని భావించాడు. 'వారానికి రెండుసార్లు ఉపవాస ముందునని, నా ఆదాయం అంతటిలో పదియవ వంతు చెల్లించు చున్నాను' అని తననుతాను ప్రచారం చేసుకున్నాడు. 'ఇతరులవలే లోభిని, అన్యాయము చేయువాడను, వ్యభిచారిని కాను. ఈ సుంకరి వంటి వాడను కాను' అని సుంకరితో (ఇతరులతో) తననుతాను పోల్చుకున్నాడు. కాని, సుంకరి దూరంగా నిలువబడి కన్నులన్కైనను పైకెత్తుటకు సాహసింపక, రొమ్ము బాదుకొనుచు, 'ఓ దేవా! ఈ పాపాత్ముని కనికరింపుము' అని ప్రార్థించాడు. ఇద్దరిలో దేవుని ఎదుట నీతిమంతునిగ పరిగణింపబడి, ఇంటికి వెళ్ళినది సుంకరియే!

పరిసయ్యుడు ధర్మశాస్త్రమును తు.చ. తప్పక పాటించాడు. కాకపోతే, గర్విష్టి, అహంభావి, స్వార్ధపరుడు. అతనిలో వినయము అసలు లేదు. సుంకరి పాపాత్ముడే, దుష్టకార్యాలు చేసేవాడే, కాని, వినయంతో, దేవుని ఎదుట తన పాపాన్ని ఒప్పుకున్నాడు. మార్పు చెందుటకు సిద్ధపడ్డాడు. "దేవుడు అహంకారులను ఎదిరించి, వినయశీలురులను కటాక్షించును" (1 పేతురు 5:5).

మనం కూడా దేవునితో సఖ్యపడి, క్షమించబడిన వారిగా తిరిగి ఇంటికి వెళ్ళాలంటే, మనలోనున్న స్వార్థాన్ని, అహాన్ని, గర్వాన్ని తీసేద్దాం. మన పాపాలను ఒప్పుకొని, దేవుని దయ కొరకు చూద్దాం. ఇతరులను నిందించక, వారికి మన వంతు సహాయం అందిద్దాం. ప్రార్థించునప్పుడు, సుంకరివలె వినయంతో ప్రార్థించాలి. దేవుని ఎదుట మనం భిక్షగాళ్ళం అని పునీత ఆగుస్తీనువారు అన్నారు. మన ప్రార్థన హృదయాంతరాళము నుండి రావాలి. ఆత్మయే ఎటుల ప్రార్థించాలో మనకు నేర్పును (రోమీ 8:26). మన ప్రార్థన మన దేవునికి అర్పించే గొప్ప అర్పణ. వినయంతో చేసే మన ప్రార్థన దేవునికి మహిమను, వైభవమును చేకూర్చాలి.

# 6. మేలుకొని ప్రార్థింపుడు

- బ్రదర్ బొమ్ము ఫ్రాన్సిస్



"మీరు శోధనలకు గురి కాకుండా మేలుకొని ప్రార్థింపుడు, ఆత్మ సిద్ధమైనను దేహము దుర్బలముగా ఉన్నది అనెను." మత్తయి 26 :41

**మెలకువగా ఉండి ప్రార్థించుడి**

శత్రు సమూహముచే ఇళ్ళు ముట్టడించబడి, విరుగగొట్టి మీ కుటుంబం మీదకు వచ్చుదురని నీకు ముందుగా తెలిసినప్పుడు ఇంక నీవు తలుపు దగ్గరే ఉండి చూస్తూ ఉంటావా? లేదా ముందుగానే మేల్కొని ప్రమాదము పట్ల జాగ్రత్త వహిస్తావా? కుటుంబ యజమాని తన ప్రాణము మీదకు వచ్చిన లేక కోల్పోయిన తన కుటుంబమును రక్షించుకోవడానికి సాహసం చేస్తాడు. అదే విధముగా మన ఆధ్యాత్మిక జీవితం ప్రభువుకి దగ్గరగా ఉండాలి అంటే మనమందరము అనుక్షణం మేల్కొని, లక్ష్యం ఉంచి జాగ్రత్త గలవారై, చురుకుగా ఉండి, శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయాలి. ప్రభువు పాపుల చేతికి అప్పగింపబడిన గడియ, శ్రమలు అనుభవించవలసిన సమయము వచ్చినదని తండ్రి చిత్తాన్ని ముందే ఎరిగి మేల్కొని తన ఆవేదనను తండ్రితో సంభాషించుచున్నాడు. అలాగే మన వ్యక్తిగత జీవితంలో ఈ లోక వస్తువులు, సంపదలు, పలుకుబడి మీద ఆధారపడి ప్రభువు ఆజ్ఞలకు లోబడకుండా జీవిస్తూ ఉంటాము. అలాకాకుండా పైవచనములో ఏసుప్రభువు చెప్పినట్లుగా మీరు మేల్కొని లక్ష్యంతో జాగ్రత్త కలిగి సాతాను క్రియలు మనందరినీ చేరకుండా ఉండడానికి చురుకుగా, మెలకువగా ఉండి ప్రార్థించాలి. మనము విశ్వాసులుగా మనకు వచ్చే శోధనలకు

ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, సజీవులై మెలకువగా ఉండాలి. ప్రార్థన ఆయుధాలను ధరించి శత్రువుని (సైతానును) అవసరమైతే ఎదిరించడానికి సిద్ధంగా ఉండాలి.

**పోరాడువానిగా ఉండుము**

పునీత పౌలు తన చివరి దశ అనగా మరణ సమయములో "నేను మంచి పోరాటం పోరాడితిని నా పరుగును ముగించితిని నా విశ్వాసమును నిలుపుకొంటిని" (2 తిమోతి 4:7). విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడము (1 తిమోతి 6:12). పౌరుషము అనగా పోరాడు వానిగా ఉండటం. ఆ విధముగా నీవు నేను కూడా విశ్వాస సంబంధమైన పోరాటమునకు మన అనుదిన జీవితంలో సిద్ధముగా వుండాలి. ఉన్నత విషయములపై మన మనసు, హృదయము నిలుపుకోవాలి మన విశ్వాస సంబంధమైన పోరాటంలో ఒక భాగము ఏమనగా సాదారణ పరిస్థితుల లోనూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ శత్రు క్రియలను, పన్నాగములను గుర్తించుట. ఉదాహరణగా, ప్రభువు యోబు పరీక్షకు, శోదనకు గురైనప్పుడు ఇది ప్రభువు చిత్తం అని గుర్తించి తన క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రభువును విడనాడలేదు, నిందించలేదు కానీ ప్రభువు నామమును స్తుతించ గలిగాడు. "దేవుడు మనకు శుభములు దయచేసినప్పుడు స్వీకరించితిమి కీడులను పంపినప్పుడు మాత్రము స్వీకరింపవలదా?" (యోబు 2:10).

**ఆధ్యాత్మిక జీవితానికి అడ్డుగోడలు**

"ఏలయన, అసూయ స్వార్ధపరత్వములు ఎచటనుండునో అచట అలజడియు సర్వ విధములగు నీచ కార్యములును ఉండును." (యాకోబు 3:16). సాతానుడి పన్నాగములు ఏ విధముగా ఉంటాయంటే అవి మనం ఊహించని విధంగా ఉంటాయి. ఎక్కడైతే అసూయ, స్వార్థము, అహము, తిరుగుబాటు ఉండునో అక్కడ గందరగోళము అన్ని రకముల నీచకార్యములు జరుగుతాయి. మన జీవితంలో ఎప్పుడైనా గందరగోళస్థితి వచ్చినప్పుడు దానిని వెంటనే తొలగించాలి. వాటిని తొలగించాలి అంటే జీవితంలో భయం ఉండాలి. భయం అంటే, మానవ భయం, ఇతరుల భయం కాదు కానీ,

దైవభయం. దైవభయం అనగా దేవుని యందు భయభక్తులు కలిగి ఉండటం. దానిని మనం అలవర్చుకోవాలి అప్పుడు సాతాను అడ్డులు, పన్నాగాలు మనకు బయలు పడతాయి. "ప్రభువు నుండి వచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది అంతేకాక అది శాంతి ప్రదమైనది, మృదువైనది, స్నేహపూర్వకమైనది, అది కనికరముతో నిండియుండి సత్కార్యా ప్రధమగును. పక్షపాతమునకు, వంచనకును దూరమైనది." (యాకోబు 3:17)

నీ ఆత్మ భారముగా ఉండుటగాని ఎప్పుడైనా బాధింపబడునట్టుగాని లేక అసాధారణంగా ఉండుట నీవు భావించినప్పుడు మెలకువగా ఉండి "సదా ప్రార్థించాలి" (1 తెస్సలో 5:7). అయితే విశ్వాసికి సాధారణమైనది ఏమిటి ? ఆ ప్రశ్నకు సమాధానము ఇచ్చుటకు ముందు ఏది అసాధారణమైనది కాదో దానిని చూద్దాం. చింతించుట సాదారణము కాదు. వివాదములు ద్వారా బాధింపబడుట సాధారణము కాదు. మన దగ్గర సమాధానము లేని వాటికి ప్రణాళిక వేయుట సాధారణము కాదు. మనలను గూర్చి ఎవరేమనుకుంటారో అని ఆలోచనలు కలిగి అనర్థముగా జీవించుట సాధారణము కాదు. కృంగిపోవుట, మనము మంచి వారము కాదు అని ఆలోచించుట, మనము పతనమైతిమి అని భావించుట సాధారణము కాదు. ఈ విధమైన ఆలోచనలు మనమీదకు వచ్చినప్పుడు అవి సాతాను అబద్ధములని గుర్తించగలగాలి. అటువంటి సూచనలు వచ్చినప్పుడు సాతాను క్రియలని గమనించాలి. సాధారణ స్థితిలో ఉండుటకు ప్రభువైన ఏసుక్రీస్తు నామములో, ఆయన సన్నిధానములో ఉండడం అవసరము.

## అప్రమత్తంగా ఉండు వానికి ప్రభు సహాయము

"మేము వితండవాదములను, దైవజ్ఞానమునకు అడ్డు నిలుచు ప్రతి ఆటంకమును త్రోసివేయుదుము. ఆలోచనలను బంధించి క్రీస్తునకు విధేయులుగ చేయుదుము." (2 కొరింతీ 10:5) సాతాను మీద ప్రభువు మనకు జయము కలగచేయును అయితే మనము ఆయనకు మొరపెట్టి, మన సమస్యలోనికి రమ్మని ఆహ్వానించినప్పుడే ఆయన మనకు జయము కలుగజేయును. " వినుము! నేను ద్వారము వద్ద నిలిచి తలుపు తట్టుచున్నాను. ఎవరైనను నా స్వరమును విని తలుపు తెరచిన లోనికి వత్తును. వానితో భుజింతును. అతడును నాతో

భుజించును" (దర్శన 3:20).

మన పరిస్థితి మారాలి అని ఒకచోట కూర్చుని అనుకున్నట్లయితే, ఏవిధమైన మార్పు జరగదు. అయితే మనము కృషి చెయ్యగలగాలి. మెతకతనము, సోమరితనము, ఈ పరిస్థితులన్నిటి నుండి ప్రభువు మనకు సహాయము చేయుటకు సమర్థుడై నిత్యము మనతో ఉన్నాడు. కానీ ఈ పరిస్థితులన్నీ కూడా మనలను చుట్టుకొని మనకు నిరుత్సాహాన్ని, కృంగిపోవటం, నిస్పృహ లోనికి నెట్టుతాయి. కానీ వీటికి వ్యతిరేకముగా మనము కూడా కొంత పాత్ర పోషించవలెను. ఆ గందరగోళ ఆలోచనలను, ఆటంకాలను బంధించి, క్రీస్తుకు విధేయులుగా జీవించాలి. మనము అనుదిన జీవితంలో దైవ వాక్కు అనుసారము జీవించుటకు, పిలువబడుతిమి. ఆ విధముగా ఉండుటకు మనము ఆత్మీయంగా అన్ని విషయాలలో జాగ్రత్తగా ఉండవలెను.

# 7. శోధనకు గురి కాకుండుటకై ప్రార్థన చేయుడు

**- బ్రదర్ బాసాని బాల ధీరజ్**



మానవుడు సంఘజీవి, స్వేచ్ఛా జీవి అనుక్షణం ఆనందాన్ని పొందాలని కాంక్షిస్తూ ఉంటాడు. సాధారణంగా మానవుడు తన స్వల్ప సంతోషానికి, లోకానికి ఆకర్షితుడై, శారీరక వ్యామోహలకు బానిసై, తాత్కాలిక ఆనందాన్ని పొందాలని ఆశిస్తుంటాడు . కానీ, అదే మానవుడు సత్యం తెలుసుకొని శారీరక వ్యామోహలకు, లోక వ్యసనాలకు విరోధిగా జీవించి శాశ్వత ఆనందాన్ని ఆశించినట్లయితే దైవం అనుగ్రహించే సంపూర్ణమైన ఆనందాన్ని పొందినవాడిగా మారుతాడు. లోక పరమైన ఆనందాన్ని పొందాలని ఆశించే వారు దైవ ఆశీస్సులు లేక అనుక్షణం ఆంతరంగికంగా శోధనలకు గురవుతుంటారు. ప్రార్ధన సహాయంతో లోక ఆశలను తిరస్కరించిన వారు శోధనలనుజయంచిన వారిగా మారుతారు. పౌలు గారు స్వల్ప వ్యవధిలో ఈ సత్యాన్ని గ్రహించి ఈ లోకాన్ని చెత్తగా పరిగణిస్తున్నాను అని హిత బోధ చేసి శోధనలను ప్రార్ధన సహాయంతో జయించ సాగాడు. పరిశుద్ధ గ్రంథంలో శారీరక సంభంధమైన వ్యసనాలకు బానిసై శోధనలను మదిలో ఆహ్వానించినవారు ఎందరో ఉన్నారు. అదే పరిశుద్ధ గ్రంథంలో లోక వ్యామోహలను ప్రార్ధన సహాయంతో విస్మరించిన వారు ఎందరో మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు. శారీరక వ్యామోహంలో పరమానందాన్ని వెదకిన సంసోనూ, ధనాకాంక్షతో తన గురువునే సంహారించడానికి వెనుకంజ వేయని యూదా ఇస్కారియోతు, లోక ఆశలలో నిమగ్నులై తమ జీవితాలను అర్ధరహితంగా ముగించారు. మరోప్రక్క లోక వ్యసనాలు తాత్కాలికం అని విశ్వశించి, ప్రార్ధన ద్వారా, సాక్షాత్తు క్రీస్తు ప్రభువే

సైతానుచే శోధింపభడి, తరిమికొట్టాడు. ఇలా ప్రార్ధన ద్వారా శోధనలకు గురికాక అనునిత్యం దైవం మీద విశ్వాసంతో మన జీవితాలను అర్థవంతంగా జీవించవచ్చు. సాధారణముగా ప్రతి మానవుడు శోధనకు గురికావడనికి ప్రధాన కారణాలు తాను విశ్వసించే అర్థరహితమైన బోధనలే. అందులో ప్రధానంగా మానవతావాదం (humanism), సాంకేతిక పరిజ్ఞానం (science), శారీరక వ్యామోహం (Epicureanism) మొదలైన నమ్మకాల వల్ల శోధనలకు గరవుతూ దైవ అనుగ్రహానికి దూరమవుతున్నాడు.

## 1. మానవతావాదం

దైవం మీద ఆధారపడకుండా మానవుడు తాను సృష్టి అంతటిలో అధికారం కలవాడనని విశ్వసించే వాడు. దైవ అనుగ్రహన్ని, దైవ భీతిని, విశ్వాసం పూర్తిగా సన్నగిల్లడంతో తమ జీవన పయనంలో అనేక సందర్భాలలో, సమస్యలలో తనకు తన తోటి సహోదరుడే ఆప్తుడని అజ్ఞానతో ఉంటారు. యోహాను14:6 నేనే సత్యమును, జీవమును, మార్గమును నా ద్వారా తప్ప ఎవరు తండ్రి యొద్దకు రాలేరు, అన్న సత్యాన్ని గ్రహించిన మానవుడు దైవ సృష్టిలో భాగం అని తెలుసుకున్న వాడే శోధనలను జయించినవాడు అవుతాడు. కీర్తన 118:8 నరుని నమ్ముటకంటే ప్రభువుని ఆశ్రయించుట మేలు.

మానవునిపై ఆధారపడకుండా అనునిత్యం దైవ ప్రేమకై అభిలషిస్తే యోబు వలే మనం నిత్యం జీవితంలో ఎదురుకొనే ఎటువంటి సమస్యనైనా, శోధనైనా ఎదుర్కొని జయించగలము. కావున కంటికి కనిపించే మానవుడి కంటే అనుక్షణం మన పరివర్తనకై ఎదురుచూస్తున్న దేవుని మీద ఆధారపడటం యుక్తం అని గ్రహించిన నాడు ఎటువంటి శోధననైనా జాయించిన వారము అవుతాం. తల్లి మరియ తన జీవిత కాలమంతా దేవుని మీద విశ్వాసం ఉంచి జీవించినది. ఏనాడూ కూడా సందేహించలేదు, సంకోచించలేదు. మానవతావాదులు దేవుని మీద ఆధారపడకుండా, దైవ సన్నిధిని తిరస్కరిస్తూ మానవుడే సృష్టి అంతటిలో అధికారం కలవాడు అని వాదిస్తుంటారు. పరిశుద్ధ గ్రంథంలో ఎంతో మంది రాజులు తమకు తాము దేవుళ్ళుగా ప్రకటించుకున్నారు. కానీ, చివరకు గర్వంతో జీవించేవారు నిజమైన దేవుని

ముందు పటాపంచలయ్యారు. సత్యాన్ని తెలుసుకొని, మానవుడు కేవలం సృష్టిలో ఒక భాగం అని గ్రహించి దేవునిపై ఆధారపడి జీవిస్తే శోధనలను జయించిన వారిగా మారుతాం.

## 2. శారీరక వ్యామోహం

మానవుడు తన అనుదిన జీవితంలో శారీరక వ్యామోహాలకు (బానిసగా శోధనలకు) గురౌతూ ఉంటాడు. మత్తయి 5:28 కామేచ్ఛతో పరాయి స్త్రీని చూచువాడు ఆ క్షణమునే తన హృదయంలో ఆమెతో వ్యభిచరించియున్నాడు అని తెలియజేస్తుంది. (ఈ లోక వ్యమోహాలలో అతి ప్రమాదమైనది. శాంతికి దూరముచేసి అనుక్షణం శోధన అనే ఊభిలో బందిస్తుంటుంది.) దావీదు మహారాజు శారీరక వ్యామోహంతో పాపం కట్టుకున్నాడు. అదే యాకోబు కుమారుడైన యోసేపు దైవ విశ్వాసంతో శరీరక శోధనను ప్రార్ధన ద్వారా జయించి దేవునికి ప్రీతికరంగా మారాడు. మనం తరచు శారీరక ఆనందాలకై తహతహలాడుతాం. శారీరక కార్యములు స్పష్టమే అవి జారత్వము, అపవిత్రత, కాముకత్వము (గలతీ 5:19). కావున పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తునట్లుగా శోధనలను జయించాలంటే క్రీస్తు ప్రభువువలే తండ్రిపై విశ్వాసం ఉంచి దైవ అనుగ్రహన్ని పొందాలి. సృష్టిలో ప్రతి మానవుడు శారీరక ఆనందానికై ఆశపడుతుంటాడు ఊగిసలాడు తుంటాడు మితిమీరిన శోధనలకు ఆకర్షితులై దైవ సన్నిధిని మరచి జీవిస్తూవుంటాం, అటువంటి సందర్భాలలో మనశ్శాంతి కోల్పోయి తరుచూ శోధనాలను మన జీవితంలోనికి ఆహ్వానిస్తు వాటితో సహజీవనం చేస్తుంటాం. ఇటువంటి దారి తెలియని సందర్భాలలో దైవ సన్నిధి ఆశ్రయంగా నిలిచి, మార్గచూపరిగా నిలుస్తుంది. అనుక్షణం ప్రార్ధన ద్వారా శారీరక వ్యామోహాలకు బానిసలం కాకుండా ఉండుటకై సదా ప్రార్థింపుడు అన్న పౌలు గారి మాటలను మన జీవితాలలో పాటిస్తూ ప్రార్ధనా శక్తితో వాటితో పోరాడుతూ విశ్వాస వీరులుగా మారడానికి ప్రయత్నిదాం.

## 3. సాంకేతిక పరిజ్ఞానం

మానవుడు సృష్టి కర్తకు బదులు సృష్టింపబడిన వస్తువులను పూజించి సేవించిరి (రోమీ 1:25). తాను, తనను సృష్టించిన దేవుని మరచి నేటి ఆధునిక

యుగంలో మనందరం సాంకేతిక పరిజ్ఞానానికి ఆకర్షితులై అనుక్షణం అందులో పరమానందాన్ని వెతుకుతూ, మనల్ని సృష్టించిన దేవుని మరిచిపోతూ, ప్రార్థనా జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తూ, మనం ఎదుర్కొనే రోజు వారి సమస్యలను చేదించలేక, నిజమైన ఆత్మసంతృప్తి దేవునిలో అధికంగా లభిస్తుందని తెలియక ఈ లోక సాంకేతిక పరిజ్ఞాన ఊబిలో చిక్కుకొని, ఊపిరి ఆడక అంధకారంలో నివసిస్తుంటాం. ప్రార్థనలో వుండే ప్రతి భక్తుడు ఎటువంటి శోధనలకు గురికాక దేవునిపై ఆధారపడి జీవిస్తే సత్యాన్ని అభ్యసించినవారముఅవుతాం.

శోధనలను మనం ప్రార్థన ద్వారా దేవుని ప్రేమను చూసి, దైవ ప్రేమను ప్రార్థన ద్వార విని, చివరిగా ప్రార్థన ద్వారా దైవ ప్రేమను స్పర్శించి మనం శోధనలను జయించవచ్చు. ఈనాటి కాలంలో ప్రతి విశ్వాసి దేవుని మరచి కృత్రిమ మేథస్సుతో సహజీవనం చేస్తున్నాడు. తనని సృష్టించిన దేవుని మరచి అనుక్షణం సులభమైన రీతిలో జీవనం సాగిస్తున్నాడు. కృతిమమేథస్సుద్వారా మానవుడు నీతి నియమాలను కూడా మరిచి సాంకేతిక పరిజ్ఞాన పరికరాలను ఆరాధిస్తూ వాటిని నిత్యావసర వస్తువులుగా మార్చుకుని, సత్యాన్ని తెలుసుకోలేక సాంకేతిక పరిజ్ఞానానికి బానిసగా మారి, ప్రార్థనా జీవితాన్ని మరిచి, అనుక్షణం శోధనలకు గురవుతూ తన జీవితంలో నిజమైన శాశ్వత ఆనందాన్ని కోల్పోతున్నాడు. ప్రార్థన ద్వారా నిజమైన ప్రేమను మన జీవితాలలో అనుసరిస్తే ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానానకి ఆకర్షితులం కాక శోధనలను జయించిన వారము అవుతాం.

కావున ప్రతి మానవుడు ఇలాంటి వ్యామోహాలలో చిక్కుకొని అనుక్షణం వ్యధకు గురవుతుంటాడు. తాను శోధింపబడి శ్రమ పొందెను కనుక శోధింపబడు వారికి సహాయం చేయగలవాడై ఉండెను (హెబ్రీ 2:18). సాక్షాత్తు క్రీస్తు ప్రభువే సాతాను ద్వారా అన్ని విధాలుగా శోధింపబడ్డాడు. ఎడారిలో ఉపవాస ప్రార్థన ద్వారా శోధనను జయించాడు. ప్రార్థనలో క్రీస్తు ప్రభువుకు మానవాళి మీద వున్న ప్రేమను ప్రార్థనలో విని, చూసి, స్పర్శించినట్లయితే మన అనుదిన జీవితాలలోని శోధనలను జయించవచ్చు. ఆ ప్రభువు ప్రేమను మనం స్పర్శించక అనుదినం స్వల్ప, క్షణిక ఆనందాలకై తహతహలాడుతుంటాం. కావున ప్రార్థన ద్వారా దేవునిలో ఏకమై శోధనలను జయించవచ్చు.

## 4. ప్రార్థనలో దైవ ప్రేమను వినుట

దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఏకైక కుమారున్ని ఈ లోకానికి ప్రసాదించెను (యోహాను 3:16). తల్లి మరియ దైవ ప్రేమను తన ప్రార్థనలో విని, సందేహించక దూత పలికిన మాటలను విశ్వసించి ఈ లోక పరమైన శోధనలను జయించింది. లోకానికి తల్లిగా అవతరించింది. యోసేపు దూత ద్వారా దైవ ప్రేమను విని తల్లి మరియకు అండగా ఉండి శారీరక శోధనాలను జయించాడు. కావున మన అనుదిన ప్రార్థన ద్వారా దేవుడు మానవాళి రక్షణకై చేసిన త్యాగాన్ని నెమరువేసుకుంటూ, ప్రతి రోజు ప్రార్థనలో దేవుని స్వరాన్ని ఆలకిస్తూ మన జీవితాలలొ అయన చేస్తున్న గొప్ప కార్యాలను ప్రార్థన ద్వారా గుర్తుచేసుకుంటూ, ప్రతి రోజు అయన స్వరాన్ని ప్రార్థన ద్వారా వింటూ మోషేవలే దేవుని స్వరాన్ని ప్రార్థనలో వింటూ అయన సన్నిధికి చేరువలో ఉంటూ ఎటువంటి శోధననైనా,సమూవేలు వలే ప్రార్థనలో దేవుని స్వరాన్ని అలకిస్తూ జీవిత కాలమంతా దేవునికి విధేయులుగా జీవించినవారము అవుతాం.

## 5. ప్రార్థనలో దైవ ప్రేమను చూచుట

ప్రతి రోజు ప్రార్ధన ద్వారా దేవునిలో ఏకమైతే ఆయన ప్రేమను కనులరా చుసినవారిమవుతాం శారీరక వ్యామోహాలకు దూరంగా ఉంటాం. మగ్దలా మరియ దైవ ప్రేమను తన కనులరా చూసి పాప జీవుతానికి స్వస్తి పలికింది. సుంకరియగు మత్తయి కనులరా ప్రభువు ప్రేమను చూసి నూతన జీవితానికై పరుగులు తీసాడు. తల్లి మరియ ప్రతి రోజు తన జీవిత కాలమంతా దైవ ప్రేమను కనులరా కాక్షించి ఎటువలటి శోధననైనా జయించ గలిగింది ఇలా ప్రతీ ఒక్కరం ప్రార్ధన ద్వారా దైవ ప్రేమను చూసి పాప జీవితానికి స్వస్తి పలకాలి.

## 6. ప్రార్థనలో దైవ ప్రేమను స్పృశించుట

చివరిగా ప్రార్ధన ద్వారా కేవలం దైవ ప్రేమను చూడటం, వినటం మాత్రమే కాకుండా దైవ ప్రేమను స్పృశించినట్లయితే శోధనలను తరిమిన వారమవుతాం. రక్తస్రావంతో భాధపదుతున్న స్త్రీ ప్రభువు అంగీ అంచును స్పృశించి స్వస్థత పొందింది ఆనంద జీవితానికి ఆహ్వానం పలికింది. తోమా ప్రభువును స్పృశించి

వేలుతో తాకినఆయన అనంత ప్రేమను స్పృశించి లోక పరమైన వ్యామోహాలకు స్వస్తి పలికి భారతదేశ అపోస్తులుడిగా అవతరించాడు. ఇలా ప్రార్థన ద్వారా ప్రతి రోజు దేవుని ప్రేమను విని, చూసి, స్పృశించినట్లయితే శోధనలను జయించవచ్చని తెలుసుకుందాం.

లోకపరమైన వ్యామోహలకు తహతహలాడకుండా మీరు ప్రతి రోజు ప్రార్థనలో ఉండుడు అని పలికిన పౌలు మాటలను మదిలో నిలుపుకుంటూ ప్రభువు ప్రేమను స్పృశించి ఆనందమైన జీవితానికి నాంధిపలుకుదాం. ప్రతీ రోజు మన జీవితాలలో ఈ ఆధునిక యుగంలో ఎన్నో విరుద్ధమైనా భోధనలకు అక్షర్షితులమై సత్యాన్ని తెలుసుకోలేక ప్రార్థన జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తుంటాం. మానవతావాదం, సాంకేతిక పరిజ్ఞానం, శారీరక వ్యామోహాలు వంటి ఆధునిక వ్యసనాలతో ఆధ్యాత్మిక యుద్ధం చేస్తూ ప్రార్థనా జీవితానికి తలుపులు తెరుస్తూ ఎటువంటి శోధననైనా జయించడానికి ప్రయత్నం చేద్దాం. ప్రతీ రోజు ప్రార్థనలో దైవ ప్రేమ గురించి వింటూ, చూస్తూ, స్పృశిస్తూ మన అనుదిన జీవితాలలో ఎదుర్కొంటున్న శోధనలను జయిస్తూ విశ్వాస వీరులుగా మారడానికి ప్రయత్నం చేద్దాం.

# 8. ప్రార్థన: పాప నివారణకు నిదర్శనం స్వస్థతకు కారణం

– బ్రదర్ పాగుర్లభాను ప్రసాద్

## ఉపోద్ఘాతం



మానవ దైనందిన జీవితంలో ప్రార్థనకు చాలా ప్రాముఖ్యత ఉంది. దేవుడంటే ఎవరో తెలిసిన ప్రతీ వ్యక్తి ప్రార్థన చేస్తాడు, ముఖ్యంగా మన క్రైస్తవత్వంలో ప్రార్థన కోసం రాత్రంతా కేటాయించే వారు ఉన్నారు మతాలు వేరైనా ప్రాంతాలు వేరైనా దేవుళ్ళు వేరైనా గానీ మనిషి తన మతంలో ముఖ్యంగా పాటించేది ప్రార్థన. భక్తులు తమ ఇష్ట దైవాలను ప్రార్థించే స్థలాలు ఏవి అనగా? క్రైస్తవులకు ప్రార్థనాలయాలు, హైందవులకు దేవస్థానాలు, ముస్లింలకు మసీదులు, ఇక బుద్ధులు, జైనులు వారి వారి మతా శ్రమాలలో ప్రార్థనలు చేస్తూ ఉంటారు. అసలు మనిషి ప్రార్థనకు ఎందుకు అంత ప్రాముఖ్యత ఇస్తాడు? దానికి రెండు కారణాలు ఉంటాయి. 1. తనకు ఉన్న బాధలను కష్టాలను ప్రార్థన చేయడం ద్వారా దేవుడు తొలగిస్తాడని, 2. తన ఇష్ట దైవాన్ని ప్రార్థించడం ద్వారా తనలోని విశ్వాసాన్ని కనపరుస్తూ దేవునితో మాట్లాడే ప్రయత్నం చేయడం.

ఈ రెండింటిలో మొదటి నియమాన్ని ఎక్కువగా పాటిస్తూ ఉంటాం. అదే, మనకు అవసరమైనది దేవుని దగ్గర నుండి పొందాలంటే ప్రార్థన చేస్తాం. ప్రార్థన ద్వారా మనం ఏదైనా సాధించగలమని మనం గట్టిగా నమ్ముతాం.కారణం యేసుప్రభు ప్రార్థన చేయమని ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు (లూకా18:1). “మనం చేసే మంచి తిరిగి మళ్లీ మన వద్దకు వస్తుందేమో తెలియదు కానీ మనం చేసే ప్రార్థనకు మాత్రం కచ్చితంగా ఫలితం లభిస్తుంది” అయితే ప్రార్థన ద్వారా దైవ శక్తిని పొందుకుంటాము. ప్రార్థన ద్వారా మనలో దాగి ఉన్న చెడు ప్రభావాన్ని

కూడా తొలగించగలం. యేసు ప్రభు 40 రోజులు ప్రార్థనలతో గడిపి దైవ శక్తిని పొందుకున్నాడు సైతాను వెడలగొట్టారు (మత్తయి 4:10). అలాగే ప్రార్థనతో మనం కట్టుకున్న పాపాలు సహితం పోగొట్టుకోగలము. "కుమారా! ధైర్యము వహింపుము నీ పాపములు క్షమింపబడినవి"అని పలికెను (మార్కు 2:5). క్రీస్తు ప్రభువు పాపాన్ని ద్వేషించారు పాపిని ప్రేమించారు సాక్షాత్తు దైవ కుమారుడు క్రీస్తే ప్రార్థించారు. ఐదు వేల మందికి ఆహారం పంచేటప్పుడు ఆకాశం వైపు కనులెత్తి ఆశీర్వదించి పంచారు (మత్తయి 14:19). "యేసు వారితో శోధనలకుగురికాకుండుటకు ప్రార్థన చేయుడి" (లూకా 22:40) అదే విధంగా ప్రార్థన ద్వారా విశ్వాసులు అనేక విధాలుగా మేలులు అనుగ్రహాలు పొందినట్లు మనం చూస్తాం.

## 1. విశ్వాసపు ప్రార్థన ఎంతో గొప్పది

రగిలే అగ్నికి వాయువు తోడైతే ఇంకా అధికంగా మండుతుంది. అలాగే భక్తుడు చేసే ప్రార్థనకు విశ్వాసం తోడైతే ప్రార్థనకు బలం తోడవుతుంది.పవిత్ర గ్రంథం ప్రకారం చూస్తే దేవునికి విశ్వాసపు ప్రార్థన అంటే బహుప్రీతి (మత్తయి 14:31) "వెంటనే ప్రభువు చేయి చాచి పట్టుకొని అల్ప విశ్వాసి! నీవేల సందేహించితివి? అని పేతురుతో అనెను. అదే విధంగా క్రీస్తు ప్రభువు తన దైనందిన జీవితంలో విశ్వాసానికి ఎంతో ప్రాముఖ్యతను నాలుగు సువార్తా గ్రంథాలలో మనం గమనిస్తే యేసుప్రభు ఏదైనా అద్భుతాన్ని చేసే ముందు ఆ వ్యక్తిలోని విశ్వాసాన్ని గమనించారు. ఈ విధంగా పునీత పౌలు గారి మాటలను కూడా జ్ఞాపకం చేసుకోవచ్చు. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమీ 10:17) మనం చేసే ప్రతి ప్రార్థన కూడా విశ్వాసంతో నిండి ఉండాలి అని మన ప్రార్థన విశ్వాసముతో కలిగి ఉంటే దేవునికి ఇష్టమయ్యే బిడ్డలుగా జీవించగలం (హెబ్రీ 11:6) అని పౌలు గారు తెలియజేస్తున్నారు. విశ్వాసం లేని ఏ వ్యక్తి అయినా ప్రాణం లేని శవం వంటి వాడు (యాకోబు 2:26).

మన దైనందిక జీవితంలో మన సమస్యలు బాధలు, కష్టాలు, అనారోగ్య సమస్యలు తొలగిపోవాలంటే విశ్వాసముతో కూడిన ప్రార్థన చేయడం చాలా

అవసరం."తన తండ్రి చిత్తం తన జీవితంలో నెరవేరాలని విశ్వాసం ఉంచి ప్రార్థన చేశారు ప్రభువుకు శారీరకంగా మరణ భయం ఉన్న ప్పటికీ తన తండ్రి చిత్తమే నెరవేరాలన్న తపన మాత్రం చాలా ఉంది" (మార్కు 14:36). అలాగే మనం చూస్తూ ఉంటాం విశ్వాసంతో ప్రార్థించిన వారందరికీ శారీరిక స్వస్థతలు చేయబడ్డాయి "ఆయన నామమందలి విశ్వాసము మూలమున ఆయన నామమే మీరు చూచి ఎరిగియున్న వీని నిబలపరిచినది ఆయన వలన కలిగిన విశ్వాసమే మీ అందరి ఎదుట వీనికి ఈ పూర్ణ స్వస్థత కలుగజేసెను" (అపో. కా. 3:16). "అట్లే నీ చూపును పొందుము నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచినది" (లూక 18:42). "అల్ప విశ్వాసినీవేల సందేహించితివి" (మత్తయి 14:31). ఈ విధంగా పవిత్ర గ్రంథం విశ్వాసం గూర్చి విశ్వాసంతో కూడిన ప్రార్థన గూర్చి అనేక విధాలుగా మనకు బోధిస్తుంది.

## 2. ప్రార్థన: పాపమును మన్నించును

మనిషికి ఆత్మ శోధన అనేది ఉంటుంది. అది మనిషి తప్పు చేసినప్పుడల్లా లేక పాపం చేసినప్పుడల్లా నీవు చేసేది తప్పు అని నిందిస్తుంటుంది. అందుకే మనిషిలో తప్పు చేసినపుడు తెలియని తడబాటు, కంగారు తాను చేసే పని మర్చిపోయేంత విసుగు వస్తుంటాయి. కొందరు తప్పును తప్పిపుచ్చుకోవాలను కుంటారు, మరికొందరు చేసిన తప్పును ఏ విధంగా ఒప్పుకోవాలని ఆలోచిస్తుంటారు. అందుకు ప్రార్థన ఒక విషయ సూచికగా మనకు కనిపిస్తుంది. అసలు ప్రార్థనతో మనం దేవుని వరాలు అడుగుతాం అలాంటిది మన పాపాలు ఎలా మన్నించబడతాయా? అనే ఆలోచన మనలో కలుగుతుంది. ప్రార్థన వలన మనకు ఉపశమనం కలుగుతుందనేది ఎంత నిజమో అదే ప్రార్థన వలన పాపాలు ప్రాయశ్చిత్తం చేయబడతాయి అనేది కూడా అంతే నిజం. పేతురు ఆయన యొద్దకు వచ్చి "ప్రభువా నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన ఎడల నేను ఎన్ని మార్లు క్షమించాలి ఏడు పర్యాయములా? అని అడిగెను" (మత్తయి 18:21). "దేవునియెదుట మన పాపములను ఒప్పుకొనినచో, ఆయన మన పాపములను క్షమించి, మన అవినీతినుండి మనలను శుద్ధిచేసి, నీతిని చేకూర్చును" (యోహాను 1:9). సుంకరి ఇట్లు

ప్రార్థించెను, ఓ దేవా ఈ పాపాత్ముని కనికరింపుము” (లూకా18:13) అని ప్రార్థించెను. “ప్రభు నీ స్థిరమైన ప్రేమతో నన్ను కరుణింపుము నీ అనంత కరుణతో నా పాపములు కడిగివేయుము” (కీర్తన 51:1) అని దావీదు రాజు తాను కట్టుకున్న పాపముల కొరకు పశ్చాతాప పడుతున్నాడు. ఈ విధంగా ప్రార్థనతో పాపాలు సహితం పరిహరించబడుతున్నాయని తెలుస్తుంది.

## 3. ప్రార్థన: స్వస్థతకు నిదర్శనం

ఈ భూమి మీద మనిషి కళ్ళు మూసుకొని నమ్మేదిముగ్గురిని 1. దేవుడు 2. వైద్యుడు 3. వాహనదారుడు. విశ్వసించి అర్థిస్తే లేదా ప్రార్థిస్తే వంద శాతం దేవుడు ఇస్తాడు. పవిత్ర గ్రంథంలో చూస్తే కుష్ఠ రోగికి స్వస్థత మత్తయి గ్రుడ్డివారికి స్వస్థత (మత్తయి 8:3), పిశాచ గ్రస్తునికి స్వస్థత (మార్కు 9:14), లాజరు పునర్జీవము (యోహాను 11:1) ఇలా మనకు చాలాచోట్ల ప్రభువు స్వస్థపరచినట్లు కనిపిస్తుంది. వైద్యుని విషయంలో ఇంతవరకే మనం రోగం నయం అవుతుందని చెప్పగలం. వైద్యులు కూడా వంద శాతం రోగులను కాపాడగలమా అని నమ్మకం ఇవ్వలేరు. అటు ఇటుగా మాట్లాడుతారు. ఇక చివరిగా వాహనదారుడు కూడా మనిషి జీవితంపై నమ్మకాన్ని కనబరచలేరు. వారి అజాగ్రత్త వలన నష్టపోయిన వారు కొన్ని లక్షలలో ఉంటారు. అయితే వైద్యుడు, వాహనదారుడు, ఈ ఇద్దరు చేయలేనటువంటిది దేవుడు చేయగలడు. కారణం దేవుడు సర్వాంతర్యామి, సర్వం ఆయనకు మోకాళ్లు వంచి వినతులు కావాలి అనిపౌలు గారు ప్రకటిస్తారు. అంటే ప్రభువు మాత్రమే స్వస్థ పరచగలరు. అందుకు మనకు ప్రార్ధన చాలా అవసరం. ప్రార్థనకు అసాధ్యమైనది ఏమున్నది? సమస్తము సాధ్యమే. అందుకే ప్రభువు ప్రార్థించమని చెప్పారు. ప్రార్థనలో ఏది అడిగినను అది ఒసగబడును అని ప్రభువు చెప్పారు. ప్రభువు పరలోక ప్రార్థన నేర్పించడం చూస్తాం (లూకా11:1) సాక్షాత్తు దైవ కుమారుడు క్రీస్తు ప్రార్థన చేశారు శోధన సమయంలో దైవకార్యాన్ని నెరవేర్చడానికి ఆత్మ ధైర్యం కోసం ప్రభువు ప్రార్థించారు అంటే ప్రార్థనకు అంత ప్రాముఖ్యత ఉంది. అందుకే మదర్ తెరిసా గారు ఈ విధంగా అన్నారు “ప్రార్థన అడగడం కాదు ప్రార్థన అంటే దేవుని చేతిలో ఉంచుకోవడం ఆయన స్వరాన్ని మనం హృదయాలలో లోతుగా వినడం”.

## ముగింపు

ప్రార్థన ఒక శక్తివంతమైన ఆయుధం. ముఖ్యంగా క్రీస్తుని అనుసరించే మనకు పునీతుల జీవితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే వారు ప్రార్థన గొప్పతనాన్ని తెలుసుకొని పాటించారు. ఈరోజు దేవుని పేరిట అనేక అనుగ్రహాలు స్వస్థతలు చేస్తున్నారు. కారణం, ప్రార్థన ద్వారా వారు పొందిన పవిత్ర జీవితం. ప్రార్థనలో గడపడం సాక్షాత్తూ దేవునితో సంభాషించడం వంటిది. దేవునితో గడపాలంటే దేవునిలో ఉండాలంటే ప్రార్థన చేయాలి. అది విశ్వాసంతో ప్రార్థించాలి. ఆవగింజంత విశ్వాసం ఉంటే సముద్రాన్ని కూడా కదిలించవచ్చని ప్రభువు చెప్పారు.కాబట్టి ప్రార్థిద్దాం ప్రభువు మేలులు పొందుకుందాం.

# 9. ప్రార్ధనతో శోధనలను జయించుట

- బ్రదర్ నందిగం మణిహార్



దేవునితో మనసు విప్పి మాట్లాడుకోవడం సంభాషించడం, మానవునికి దేవునితో సఖ్య పరుస్తుంది. ప్రార్థన బలహీనతలలో మన బ్రతుకులను బలపరుస్తుంది. చచ్చుబడిపోయినవానికి ప్రార్థన జీవం ఇస్తుంది. ప్రార్థనా జీవితం ద్వారా దేవుని రక్షణ భాగ్యం పొందవచ్చు, ఆయన ద్వారా వచ్చే ఉపయోగాలను విలువలను తెలుసుకోగలిగితే ప్రార్థనలో ఉన్న శక్తిని మనం పొందుకోవచ్చు. ప్రార్థించడం ద్వారా మనం దేవుని మహిమ పరచుట, మన జీవితంలో వచ్చే సమస్యలను చడానికి అధిరోహించడానికి ఉపయోగపడుతుంది. మనం ప్రార్థన చేయడం ద్వారా దేవుని చిత్తాన్ని తెలుసుకోగలుగుతాం. కీర్తనాకారుడు ఈ విధముగా తెలియజేస్తున్నాడు “దినమునకు 7 సార్లు నేను నీకు వందనములు అర్పింతును” (కీర్తన 119:164).

పవిత్ర గ్రంథంలో అనేకమంది అనేక అవసరాల కొరకు ప్రార్థించారు. దావీదు మహారాజు వేకువ జాముననే ప్రార్థించేవాడు. దేవుడు తనకు చేసిన మేలులకు దావీదు మహారాజు కృతజ్ఞతలు అర్పించేవాడు, హన్నా బిడ్డ కొరకు ప్రార్థన చేసి కుమారుని పొందింది. యోబు కష్టాలలో బాధలలో కృంగిపోకుండా దేవునియందు విశ్వాసముంచి ప్రార్థించి బాధల నుండి విముక్తి పొందాడు. ఒక సామెతలో చెప్పిన విధంగా, “దీపం వెలగాలంటే నూనె పోయాలి”. క్రైస్తవ జీవితం సాఫీగా సాగాలి అంటే ప్రార్థనా శక్తి కావాలి. మన ఇరుకు ఇబ్బందులలో, నష్టాలలో వ్యాధి బాధలలో కాకుండా అనునిత్యం దేవునికి ప్రార్థన చేయాలి,

సువార్త పఠనములలో యేసుప్రభు కూడా అనేకమార్లు ప్రార్థన చేశారు. గెత్సెమనే తోటలో బాధలో ఉన్నప్పుడు తండ్రి దేవుని ప్రార్థించారు, అనేక అద్భుతాలు చేసేముందు తండ్రికి ప్రార్థించి తన చిత్తాన్ని తెలుసుకున్నారు. పునీత అగుస్తీనుగారు "మనిషి శరీరానికి ఆహారం ఎంత అవసరమో, మానవ హృదయానికి ప్రార్థన అంతే అవసరము" అని తెలియజేస్తున్నారు. ప్రార్థన లేని వ్యక్తి జీవం లేని ఆత్మతో సమానం, ఆరోగ్యంగా బతకడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఆత్మ జీవించడానికి ప్రార్థన కూడా అంతే అవసరం అని మదర్ తెరిసా గారు చెబుతున్నారు.

## శోధన అనగానేమి?

శోధన అంటే ఏమిటి, అసలు మనకు శోధన ఎందుకు వస్తుంది. శోధన వల్ల మనకు వచ్చే లాభం ఏమిటి, నష్టమేమిటి అని ఒకసారి ఆలోచిస్తే. శోధన అనగాదైవకార్యాన్ని నెరవేర్చకుండా సాతాను కలిగించే ఆటంకాలను, పన్నాగాలను శోధన అంటారు. కొన్నిసార్లు మనం పరిశుద్ధ గ్రంథ చదవాలి అనుకుంటాం కానీ ఏదో ఆలోచనలో ఏదో పని గుర్తు వచ్చి చదవకుండా వెళ్ళిపోతాం. కొన్నిసార్లు ప్రార్థన చేయాలనుకుంటాం అప్పుడే ఏదో గుర్తు వచ్చి చేయకుండా వెళ్ళిపోతాం. కొన్నిసార్లు దేవాలయానికి వెళ్లేటప్పుడు బంధువులు వచ్చారని లేక వాహనం సమస్య వచ్చిందని దేవుని చెంతకు వెళ్లకుండా సాతాను మనలను శోధించి దైవ కార్యాన్ని నెరవేర్చకుండా ఆపుతుంది. మానవ జీవితంలో మనం అనేకసార్లు, అనేక సందర్భాలలో రకరకాల బలహీనతలకు లోనౌతాము, కోరికలకు, వ్యామోహాలకు, శరీరక సుఖం, చెడు అలవాట్లకు ప్రాకులాడుతుంటాం. కొన్నిసార్లు సాతాను మనలను వయసుకు సంబంధించిన శోధనలతో శోధిస్తుంది, శోధనలు మనలను దేవుని రక్షణను పొందుకోకుండా దేవుని ప్రేమకు దూరంగా చెడు మార్గాలలో మనలను నడిపిస్తూ మనసుకు శాంతి లేకుండా చేస్తుంటాయి.

పవిత్ర గ్రంథంలో అనేకమంది ప్రవక్తలు రాజులు శోధింపబడ్డారు. మన ఆది తల్లిదండ్రులు సర్ప రూపంలో వచ్చిన సాతానుచే శోధింపబడి తినవద్దన్న పండు తిని శోధింపబడ్డారు. దావీదు మహారాజు తన సైనికుల్లో ఒకరైన

ఉరియా భార్య బెత్షెబ శరీర సౌందర్యం చూసి శోధింపబడ్డాడు. యేసుప్రభు కూడా యోహానుచే బాప్తిస్మము పొందిన తర్వాత ఎడారిలో ప్రార్థించుచుండగా సైతాను ద్వారా శోధింపబడ్డారు. అందుకే పునీత అగుస్తీనుగారు ఈ విధముగా చెబుతున్నారు మానవులైన మనము అనునిత్యం శోధనలు ఎదుర్కుంటాము. వాటిని జయించకుండా దైవ రాజ్యానికి దైవ కిరీటాన్ని పొందలేము అని అన్నారు. కొన్నిసార్లు దేవుడు మన విశ్వాసాన్ని శోధనల ద్వారా పరీక్షించి మలినమైన మనలను పవిత్రులుగా మలచి వారసులను చేస్తారు. అందుకొరకు గెత్సెమను తోటలో శోధనకు గురి కాకుండా ప్రార్థన చేయమని ప్రభువు ఆనతిచ్చారు.

## సైతాను మనలను మూడు విధాలుగా శోధిస్తుంది

1. శారీరక ఆశలపరంగా శోధింపబడుట, 2. లోకాశలపరంగా శోధింపబడుట, 3. హృదయాశల పరంగా శోధింపబడుట

## 1. శారీరకంగా శోధింపబడడం

మానవ శరీరం ఎప్పుడు సుఖాన్ని కోరుకుంటుంది, తొందరగా శోధనలో పడుతుంది. సైతాను మన శరీరం ఉపయోగించి మనలను శోధిస్తుంది. మానవులమైన మనం మంచి ఆహారము కొరకు, అందమైన జీవితం కొరకు, విలాసవంతమైన సౌకర్యాల కొరకు తహతహలాడుతాము. సైతాను కూడా వాటినే ఉపయోగించి మనలను శోధిస్తుంది. పవిత్ర గ్రంథంలో మనం గమనించినట్లయితే దావీదు మహారాజు బెత్షెబ సౌందర్యాన్ని చూసి శోధింపబడి ఆమెతో పాపం చేశాడు.సంసోను,డెలీలా అందానికి, సౌందర్యానికి దాసోహమై ఆమెను ప్రేమించి ప్రేమ వ్యామోహంలో పడి తాగి మత్తులో శోధింపబడి దేవుని బలాన్ని,కనుదృష్టిని కోల్పోయి చివరికి దేవుని చిత్తాన్ని కూడా నెవేర్చలేకపోయాడు.ఏసావు పొలం పనులు చేసి అలసిపోయి ఇంటికి వచ్చినప్పుడు యాకోబు చేసిన ఆహారం కోసం తన జేష్ట అధికారాన్ని కోల్పోయాడు (ఆది.కా. 25:34). ఉపవాస ప్రార్థనలో నిమగ్నమై 40 దినములు గడిపిన ఏసుప్రభువును సైతాను రాళ్లను రొట్టెలుగా మార్చి తినమని శోధించింది (మత్తయి 4:3). ఈ విధంగా అనేకమార్లు శరీరాన్ని తృప్తి పరచడానికి మనం చేయు పనులను ద్వారా సైతానుచే శోధింపబడి, అదిపన్నిన పన్నాగాలలో

చిక్కుకొని పోతాము. "ఏలయన శరీరముకోరునది, ఆత్మ కోరుదానికి విరుద్ధముగా ఉండును. రెండింటికినిబద్ధవైరము (గలతీ 5:17). కాబట్టి శరీరానుసారం జీవించకుండా సైతాను కలిగించే శోధనలకు లొంగిపోకుండా క్రీస్తు వలె ప్రార్థనా బలంతో వాటన్నిటినిజయించాలి.

## 2. లోకాశలపరంగా శోధింపబడటం

లోకం చూడడానికి ఎంత అందంగా ఉంటుందో అదే విధంగా మనలను శోధనలో పడవేయడం కూడా అంత సులువుగానే పడవేస్తుంది. మానవుడు తన జీవితంలో విలువైన ఐశ్వర్యాలు సంపదలు, ఎత్తైన భవనాలు, కార్లు, వస్తువులు, బంగారం ఎన్నెన్నో కావాలని ఆశిస్తాడు. సైతాను కూడా మనిషి ఆ కోరికలతో శోధించి దేవునికి దూరం చేస్తుంది. తన దుష్ట వాంఛలచే ఆకర్షింపబడి చిక్కుబడినప్పుడు సైతాను మానవుడిని శోధించును (యాకోబు 1:14). యేసుప్రభు తన శిష్యులతో కడరాత్రి విందును ఆరగించు సమయములో, యేసును అప్పగించాలి అని సీమోను కుమారుడగు యుదా ఇస్కారియొత్తు భావించాడు. అదే విధంగా ప్రధానార్చకులతో చేతులు కలిపి 30 వెండి నాణాలకు ప్రభువును అప్పగించాడు. ఎడారిలో ప్రార్థనలో నిమగ్నమైన యేసుప్రభువును సైతాను ఎత్తైన పర్వత శిఖరమున ఉంచి రాజ్యములన్నిటిని, వాటి వైభవమును చూపి ప్రభువును శోధించింది కానీ ప్రార్థనా శక్తిగల ప్రభువు సైతాను శోధనలకు లొంగకుండా సైతానును తన నుండి దూరంగా తరిమి వేశారు.

## 3. హృదయాశల పరంగా శోధింపబడుట

మానవుడు ఆరాధించేది దైవమును మాత్రమే. అలాంటి ఆరాధన చేయాలి అంటే పవిత్రమైన హృదయం కావాలి. కానీ పన్నాగాలు పన్నే సైతాను మానవ హృదయాన్ని కూడా శోధిస్తుంది. నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయము తోనుతోను పూర్ణ మనసుతోను ప్రేమింపవలెను (మార్కు 12:33). ప్రభువును ప్రేమించే హృదయము ఇటువంటి శోధనలకు గురికాకూడదు. సైతానుచే హృదయము దైవ ఆరాధన చెయ్యలేదు, దేవునికి దూరం అవుతుంది. కొన్నిసార్లు మానవ హృదయం కోపం, ద్వేషంతో నిండిపోతుంది. అటువంటి హృదయాలు

ప్రభువును ఆరాధించలేవు చివరికి చెడు మార్గంలో నడిచి సైతానికి స్నేహితులై ప్రభువు రాజ్యానికి పరలోక రాజ్యానికి దూరమవుతాయి. సైతానుకు అర్పించిన హృదయం శోధనలకు గురి అవుతుందే తప్ప ప్రభువును ప్రేమించలేదు. హృదయము అన్నింటికంటే మోసకరమైనది (ఇర్మియా 17:9). అందుకే ప్రభువు అంటున్నారు, భారముచే అలసిసొలసిన సమస్త జనులారా నా యొద్దకు రలడు, మీకు విశ్రాంతి నొసగెదను. బాధలతో, శోధనలతో మనం ప్రభు చెంతకు చేరి ప్రార్థించినచో మన శోధనలు తొలగించి మనకు పరలోక రాజ్యాన్ని ప్రాప్తింప చేస్తారు.

## శోధనలను జయించాలి అంటే

మన జీవితంలో వచ్చే శోధనలను మనం జయించగలమా, సైతాను క్రియలను ఎదుర్కోగలమా, సైతాను పన్నాగాలను తిప్పి కొట్టగలమా? మనలను మనము ప్రశ్నించుకుంటే? నిజమే సైతాను క్రియలను మనం ఎదుర్కోగలము, సైతాను పన్నాగాలను తిప్పి కొట్టవచ్చు, ఎలా? ప్రభువు తన శిష్యులతో పలికిన మాట శోధనకు గురి కాకుండటకై ప్రార్థన చేయుడు (లూకా 22:46). అవును ప్రార్థనా శక్తితో సైతాను క్రియలను, తాను పన్నే పన్నాగాలను మనం అధిగమించవచ్చు. అనేక మంది పవిత్ర గ్రంథంలో ప్రభువు యెడల విశ్వాసముంచి ప్రార్థించి అనేక శోధనల నుండి విముక్తులైనారు. సైతాను శోధనలలో సమస్తము కోల్పోయి, భార్యచే వెలివేయబడి, బంధుమిత్రులతో చీదరింపబడిన యోబు దేవుని ప్రార్థించగా తిరిగి తన సమస్తమును, ఆరోగ్యమును సంపదలను రెండింతలు పొందుకున్నాడు. కామపువాంఛతో ఇద్దరు న్యాయమూర్తులు సుసన్నా మీద వ్యభిచారపు నిందను మోపి చంపడానికి తీసుకువెళ్ళుచున్నప్పుడు, దేవుని మీద నమ్మకం కలిగిన సుసన్నా ఆకాశము వైపు చూచి ప్రార్థించగా దానియేలు అను యువకుని ప్రభువు ప్రేరేపించి మాట్లాడించి సుసన్నాను రక్షించాడు. ప్రభువును నమ్మి ఆయన ముందుకు వస్తే శోధనల నుండి బయటపడు మార్గం చూపిస్తాడు (1 కొరింతీ 10:13).

క్రైస్తవులమైన మనం నిరుత్సాహం, నిస్పృహ, వేదనలు, కష్టాలు, వ్యాధులు, అవమానాలు లాంటి శోధనలలో పడిపోతాము. మెలుకువతో జాగరుకులై

ఉండుడు. శత్రువగు సైతాను గర్జించు సింహం వలె తిరుగుచు ఎవరినేనిక బళింప చూచుచున్నాడు (1 పేతురు 5:8). మెలుకువతో ఉండి ప్రార్థనతో దాని క్రియలను దాని శోధనలను తిప్పి కొట్టవచ్చు. దేవుని వాక్యము ఎప్పుడైతే మన హృదయం నిండా ఉంటుందో సైతాను శోధనలకు వ్యామోహాలకు చోటు ఉండదు. అందుకే మన హృదయము దేవుని వాక్కుతో నింపుకుందాం. శోధన జయించడానికి మానవుడు పవిత్రంగా జీవించాలి. నీవు యవ్వన వ్యామోహాలను వదిలి పవిత్ర హృదయంతో ప్రభువు యొక్క సహాయము కోరెడు వారితో పాటు నీతి,విశ్వాసము ప్రేమ శాంతి అనువాటికై శ్రమింపుము (2 తిమోతి 2:22). దేవుని ప్రార్థనలో పవిత్ర జీవితమును గడుపుచూ, జీవించినట్లయితే సైతాను మనలను ఏమి చేయలేదు. దేవునకు విధేయులు కండు సైతానును వ్యతిరేకింపుడు అప్పుడు సైతాను మిమ్ము విడిచి పారిపోవను (యాకోబు 4:7). దేవునికి విధేయులమై జీవించినప్పుడు ఆయనతో ఉనప్పుడు, ప్రభువునకు శోధనలలో ప్రార్థన చేసినప్పుడు అయనపై ఆధారపడి జీవించినప్పుడు, దేవుడు ఎప్పుడు చేయి విడువడు. ప్రభువు మనతో ఉన్నప్పుడు అన్నింటిని జయించగలం, శోధనలకు గురికాము. కాబట్టి ప్రతి క్రైస్తవుడుశోధనలు వచ్చినప్పుడు కృంగిపోకుండా, నిరాశ పడకుండా, వేదనలతో సమస్యలతో సతమతం కాకుండా ప్రార్థన అనే ఆయుధమును చేపట్టి సాతానును జయించవచ్చు. దేవుని బిడ్డగా, దేవుని మహిమ పరుస్తూ, ఆనందిస్తూ దేవునితో కలిసి జీవించవచ్చు. మనం ప్రభువు చెప్పిన విధముగా శోధనలయందు ప్రభుని ప్రార్థిస్తూ, ప్రభుని ఆజ్ఞలను పాటిస్తూ జీవించుదాం.

❀ ❀ ❀ ❀

# 10. ప్రశ్చాత్తాప ప్రార్థన

– బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్

## పాపాలను ఒప్పుకొనుట (మార్కు 1:4)



తొలి మానవుడైన ఆదాము మొదలుకొని ప్రతి మానవుడు పాపం చేస్తూనే ఉంటాడు. కాని పరిశుద్ధ గ్రంథములో స్త్రీ, పురుషులు బలహీనతవలన పాపం చేసినా, పశ్చాత్తాపపడి, ప్రభువుతో సమాధాన పడ్డారు. మనము కూడా అటువంటి పశ్చాత్తాప్తులను అనుసరిస్తూ ఉండాలి. స్వీయ పాపాల కోసం పశ్చాత్తాపపడాలి.

స్నాపకయోహాను క్రీస్తురాకకు మార్గము సిద్ధము చేశాడు. అతడు క్రీస్తుకొరకు ప్రజలను సిద్ధంచేశాడు. ఇలా సిద్ధంచేయు ప్రక్రియలో బప్తిస్మము (తపోస్నానము) గూడ ఒకటి. ఇది నూత్నవేదపు జ్ఞానస్నానం కాదు. పూర్వవేదపు ప్రజల్లో అమల్లోవున్న ఓ రకపు శుద్ధీకరణ కర్మ. యోహాను బోధ విన్నవాళ్ళు పశ్చాత్తాపం చెంది, తమ పాపాలను ఒప్పుకొని, బప్తిస్మము పొందుకున్నారు. పాపపు మానవులమైన మనం కూడా మన పాపాలకు పశ్చాత్తాపపడాలి. దేవుని యెదుట మన తప్పిదాలను ఒప్పుకోవాలి.

## పరలోకానికి విరోధంగా పాపం చేసాను (లూకా 15:21)

తప్పిపోయిన కుమారుడు, దుడుకు చిన్నవాని కథ మనకు తెలుసు. అతడు తండ్రి ఆస్తిని దూరదేశాల్లో దుర్వినియోగంచేసాడు. దుష్టజీవితం జీవించాడు. కాని కరవుకాలంలో కనువిప్పు, తన పాడు పనులకు పశ్చాత్తాపపడి మళ్ళీ తండ్రియింటికి తిరిగి వచ్చాడు. తండ్రిని కలిసికోగానే అతడు "నీకూ పరలోకానికి విరోధంగా పాపం చేసాను" అన్నాడు. ఆ చిన్నవాడు తండ్రి ప్రేమను నిరాకరించాడు కనుక తండ్రికి వ్యతిరేకంగా పాపం చేసాడు. కాని

మనం చేసే పాపాలు తోటిప్రజలకు మాత్రమే కాదు, దేవునికి గూడ విరోధంగా వుంటాయి. (ఈ సందర్భములో పరలోకం అంటే దేవుడు) కాబట్టి నరునికి విరోధంగా పోవడంకాదు, మరి దేవునికి విరోధంగా పోవడం, పాపంలోని ప్రధానాంశం. ఇలాంటి పాపకార్యాలు చేసే మనం కూడ పశ్చాత్తాప పడుతుండాలి. హృదయశుద్ధికి వేరొక మార్గం లేదు.

## ప్రభువు పశ్చాత్తాప ప్రియుడు (నిర్గమ 34:7)

పాపం వల్ల కోపాన్ని, పశ్చాత్తాపం వల్ల శాంతిని ప్రదర్శించేవాడు యావే ప్రభువు. నూత్నవేదంలోని ప్రభువు కూడా పశ్చాత్తాప ప్రియుడు. జక్కయ పేదల నోళ్ళుగొట్టి బ్రతికేపాపి. అయినా అతడు పశ్చాత్తాప పడగానే ప్రభువు "నేడు ఈ ఇంటికి రక్షణ లభించింది" అన్నాడు (లూకా 19:9). ఓ పాపాత్మురాలు తన దుష్టజీవితాన్ని తలంచుకొని చిత్తశుద్ధితో పరితాపపడింది. తన కన్నీటితో ప్రభుపాదాలు కడిగి శుద్ధిచేసింది. ప్రభువు వెంటనే ఆమెను కరుణించి "ఈమె అధికంగా ప్రేమించింది కనుక ఈమె ఘోర పాపాలుగూడా క్షమించబడ్డాయి" అన్నాడు (లూకా 8:47). మరో సందర్భంలో వ్యభిచారిణి కాపాడాడు. "ఇక వెళ్ళి పాపం చేయకుండా బ్రతుకు" అని మందలించాడు (యోహాను 8:11). పశ్చాత్తాప హృదయంపట్ల ప్రభువు చూపే కారుణ్యం ఇలాంటిది. ఇలాంటి సన్నివేవాలు పరిశుద్ధ గ్రంథములో చాలా ఉన్నాయి. భక్తుడు ఇలాంటి సన్నివేశాలను మననం చేసికొని హృదయ పరివర్తన కలిగి జీవించుటకు ప్రయత్నించాలి.

## ఎవరైనా పాపం లేదనుకుంటే (1 యోహాను 2:1)

మనం పాపం చేయగూడదు. కాని బలహీనతవల్ల పాపంలో పడిపోయినట్లైతే, పశ్చాత్తాపపడి ప్రభువు ఎదుట మన పాపాన్ని ఒప్పుకోవాలి. అతడు తండ్రియెదుట మన తరపున మనవి చేసేవాడు. మన పాపాలకుసర్వలోక పాపాలకు శాంతి కరుడు ఆ ప్రభువే. అనగా అతని సిలువ మరణం మన పాపాలను శుద్ధిచేస్తుంది. కనుక ఆ ప్రభువు మన దోషాలను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనకు విముక్తి కలిగిస్తాడు. ఇక, మనం పాపం లేని వాళ్ళం అనుకొంటే హతమైపోతాం. మనలను మనమే మోసపుచ్చుకుంటాం. అబద్ధమాడుతాం. నరుల పాపాల కోసం చనిపోయానని చెప్పే క్రీస్తుని గూడ అబద్ధీకునిజేస్తాం. అంచేత పరిశుద్ధ గ్రంథం, క్రైస్తవుడు నిత్యం పశ్చాత్తాప

మార్గాన పాయనిస్తుండాలని తెలియజేస్తుంది. (1 యోహాను 1:82:2).

## నిరపరాధుని రక్తం అప్పగించాను (మత్తయి 27:4)

యూదా ఇస్కారి యోతు ఘోర పాపం చేశాడు. నేను నిరపరాధి రక్తాన్ని అప్పగించి పాపం చేసానని ఒప్పుకున్నాడు. అయినప్పటికీ అతనికి పరిహారం లభించలేదు. ఎందుకంటే అతని హృదయంలో పశ్చాత్తాపం లేదు. పైగా నిరుత్సాహంతో నిండిపోయింది. కనుకనే అతడు ఊరి వెలుపలకు వెళ్ళి ఉరివేసుకున్నాడు. కావున పశ్చాత్తాప పడకుండా పాపమును ఒప్పుకొనుట వలన ప్రయోజనం లేదు. పేతురు గారు కూడా పాపం చేశాడు కానీ పశ్చాత్తాప పడి తన పాపాన్ని ఒప్పుకున్నాడు, వెలుపలకు వెళ్ళి బోరున యేడ్చాడు. నిరాశ చెందకుండ ప్రభువునందు నమ్మిక వుంచాడు. ప్రభువు అతని పాపాన్ని క్షమించాడు. కనుక పాపం చేసినపుడు, నిరాశ పడడం కాదు, ఎవరో నిర్బంధించగా పాపాన్ని ఒప్పుకోవడం కాదు కానీ పశ్చాత్తాప పూరితమైన హృదయంతో ప్రభువు ఎదుట ఆ పాపాన్ని నివేదించుకోవాలి. అప్పుడు క్షమాపణ లభిస్తుంది.

## కేవలం నీకే విరోధంగా (కీర్తన 51:4)

పశ్చాత్తాప ప్రార్థనలోని ముఖ్యాశం పశ్చాత్తాపమే. ఎంతగా పశ్చాత్తాప పడతామో అంతగా పాపపరిహారం పొందుతాం. మనం చేసే ప్రతి పాపమూ దేవునికి ప్రతికూలంగా పోతుంది. పాపంలోని సారముదుష్టత్వము, దేవునికి వ్యతిరేకంగా పోవడమనే అంశంలోనే యిమిడివుంది. అందుకే కీర్తనాకారుడు స్వీయ పాపాన్ని స్మరించుకొని “నీకే, కేవలం నీకే విరోధంగా పాపం చేశాను ప్రభూ” అన్నాడు. ఈ సత్యాన్ని మనం బాగా అర్థం చేసుకోవాలి . కొంతమంది మంచి నీళ్ళు త్రాగినంత సులభంగా చీటికి మాటికీ పాపం చేస్తుంటారు. పాపం దేవునికి విరోధంగా పోతుందని అర్థం చేసికున్నవాళ్ళు ఇంత చులకనగా పాపకార్యాలకు ఒడిగట్టరు.

## రెక్కలు విరిగిన పక్షి

ఈ పశ్చాత్తాపం గూడ ప్రభువు అనుగ్రహించే వరం. మనంతట మనం పాపం చేయగలమే గాని పశ్చాత్తాపడలేం. పాపం జేసినపుడు రెక్కలు విరిగిన పక్షిలాగా, ఊబిలో దిగబడిన జంతువులాగా, సాలీడు గూటిలో చిక్కుపడిన

పురుగులా నిస్సహాయ స్థితిలో వుండిపోతాం. ప్రభువు కరుణిస్తేగాని ఈ పాపావస్థను దాటి మరలా బయట పడలేం. అందుకే "ప్రభూ నీవు మా మనసు మార్చుము. అప్పుడు మేమ మనసు మార్చుకుంటాం" అంటాడు యిర్మియా ప్రవక్త (యిర్మియా 31:18). "ప్రభూ, నాలోని రాతి హృదయాన్ని తీసివేసి దానిస్థానమున విధేయాత్మకమైన నిర్మల హృదయాన్ని నెలకొల్పు" అంటాడు (యెహెజ్కేలు 11:19). "ప్రభూ! నన్ను బలంగా ఆకర్షించు అప్పుడు నేను నీ వైపు అకర్షించబడతాను" అంటుంది పరమ గీతంలోని ప్రియురాలు (పరమ గీతము 1:4). పాపియైన నరుడు రేయింబవళ్ళు మననం జేసికోవలసిన మహా వాక్యాలివి!

## నాలుగు వంతులు నష్టపరిహారం (లూకా 19:8)

పశ్చాత్తాపపడిన తరువాత మన పాపాలను ప్రభువు ఎదుట ఒప్పుకోవాలి. ఒప్పుకొని పాపపు ప్రవర్తనం మార్చుకుంటానని ప్రమాణం చేయాలి. జక్కయ్య పేదల నోళ్ళుకొట్టి ధనం కూడబెట్టాడు. కాని పరివర్తనం చెందాక తన జీవితం మార్చుకుంటానని ప్రమాణం చేశాడు. తన ఆస్తిలో సగభాగం పేదలకిస్తానన్నాడు. నోళ్ళుగొట్టి అన్యాయంగా లాగుకున్న డబ్బునకు నాలుగంతలుగా నష్టపరిహారం చేయడం, ఇవన్నీగూడ అతని చిత్తశుద్ధిని యదార్థమైన పరివర్తనను తెలియ జేస్తాయి. అతడు మళ్ళీ పాపపు త్రోవ త్రొక్కనని ప్రమాణ పూర్వకంగా హామీ ఇచ్చాడు. మన పశ్చాత్తాపానికి కూడా ఇలాంటి గట్టి మాటపట్టు తప్పక అవసరము.

## ఓ షరతు

మన పాపాలకు పరిహారం పొందాలి అంటే ఓ షరతును పాటించాలి. ప్రభువు మనలను క్షమించాలని ఎలా కోరుకుంటున్నామో అలాగే మనము ఇరుగుపొరుగు వారిని క్షమిస్తుండాలి. "మీరు పొరుగువారి అపరాధాలను క్షమించకపోతే మీ తండ్రి కూడా మీ అపరాధాలను క్షమించడు"అని ప్రభువు రూఢిగా చెప్పారు (మత్తయి 6:15). పైగా క్షమాపణం పొంది కూడ తాను క్షమించలేని సేవకుని కథ మనకు తెలుసు. "నేను నిన్ను కరుణించిన రీతినే నీవునునీతోడి దాసుని కరుణించవలదా?" అని యజమానుడు ఆ సేవకుని గద్దించాడు (మత్తయి 18:33). కనుక మనకు ఎవరిమీద దీర్ఘకోపం, దీర్ఘకాలపు పగ పనికిరాదు. దేవుడు క్షమాపరుడు. ఆయనను కొలిచే క్రైస్తవ ప్రజలు కూడ

సులభంగా క్షమించడం నేర్చుకోవాలి.

**పాపులలో నేను ప్రథముడను (తిమోతి 1:15)**

పునీత పౌలు గారు తొలుత క్రైస్తవులను హింసించాడు. అలా హింసించడం ద్వారా క్రీస్తునకే ద్రోహం చేశాడు. కాని ప్రభువు మాత్రం క్షమించి నమ్మకమైనవాడని తలంచి తన పరిచర్యకు వినియోగించుకున్నాడు. తరువాత పునీత పౌలుగారు క్రీస్తుకోసం ఎంతో కృషి చేశాడు. ఎన్నోవేల మైళ్ళు ప్రయాణం చేసి ఎన్నో క్రైస్తవ సంఘాలను నెలకొల్పాడు. ఎంతో మందికి క్రీస్తును బోధించాడు. ఎన్నో లేఖలు వ్రాసి క్రీస్తును గూర్చినవేద సత్యాలెన్నో ప్రతిపాదించాడు. అయినా ఈ పౌలు జీవితాంతం వరకూ తాను పాపినని చెప్పుకున్నాడు. జీవితాంతం వరకూ హృదయంలో పశ్చాత్తాపాన్ని నెలకొల్పుకున్నాడు. చివరి రోజుల్లో తిమోతికి వ్రాసిన మొదటి లేఖలో, పాపుల్లో నేను ప్రథముడను అని చెప్పుకున్నాడు. పౌలులాంటి వానిని క్షమిస్తే ఇక ప్రభువు మమ్ము మాత్రం క్షమించడాఅని పాపులు ధైర్యము తెచ్చుకోవడం కోసం, ఇక రాబోయే వాళ్ళకు తనను ఓ ఉదాహరణగా తీసుకునేలా, ప్రభువు తన్ను క్షమించాడని వ్రాసికున్నాడు (1 తిమోతి 1:13-17). ఇలా మహా భక్తులు వారి పాపమును ఒప్పుకున్నారు. జీవితాంతమూ తమ పాపాల కోసం పశ్చాత్తాపపడ్డారు. ఇక అత్యల్పులమూ, నిజముగా పాపులమైన మనం, రోజూ స్వీయ పాపాల కోసం పశ్చాత్తాప పడవలసిన అవసరము తప్పక ఉన్నది.

**మీకు శాంతికలుగునుగాక! (యోహాను 20:21)**

ఉత్థాన క్రీస్తు ప్రభువు, శిష్యులకు దర్శన మిచ్చినప్పుడు మీకు శాంతి కలుగునుగాక అని సంబోధించారు. క్రీస్తు సిలువ మరణం వల్ల మనకు పాపపరిహారం లభించింది. కనుక ఉత్థాన క్రీస్తునరులందరకు శాంతి, సమాధానాన్ని అందిస్తారు. మనం పాపాలకు పశ్చాత్తాపపడినపుడు ఉత్థాన క్రీస్తు శాంతి, సమాధానాన్ని పొందుతాం. అందుకే పశ్చాత్తాపపడు హృదయం ఎంత భారంగా వుంటుందో క్షమాపణ పొందిన హృదయం అంత తేలికగా ఉంటుంది. హృదయంలో శాంతి, సమాధానం మనకు అనుభవ పూర్వకంగా తెలిసిన సత్యమే. కనుక పాపాలను తలంచుకొని నిత్యం పశ్చాత్తాపపడదాం. పశ్చాత్తాప ఫలితమైన హృదయ శాంతిని అనుభవిద్దాం. క్రీస్తు సమాధానాన్ని చవిచూద్దాం.

# 11. సుంకరి - పరిసయ్యుని ప్రార్థన

## (లూకా 18:10-14)

- బ్రదర్ ఆవుల కిషోర్



ప్రార్థన అంటే దేవునితో సంభాషించడం. దేవుని సమక్షంలో ఉండి ఆయనతో ముచ్చటించడం. మనకు జరిగిన మేలులకు ఆయన్ని స్తుతించుటం మన సమస్యలను ఆయనకు విన్నవించటం. పరిపూర్ణ విశ్వాసంతో ప్రార్థించే వారు తప్పనిసరిగా ఆయన దీవెనలను పొందుతారు. మనం విశ్వాసంతో ప్రార్థిస్తే దేవుని సహాయము మనకు లభిస్తుంది. ప్రార్థన లేని జీవితం నూనెలేని దీపంతో సమానం కాబట్టి ప్రార్థన అనేది పవిత్రమైన దైవశక్తిని పొందుకోవడానికి, దేవుని దీవెనలు పొందుకోవడానికి ఉపయోగపడే ఆయుధం. మనం ఎల్లవేళలా ప్రార్థించాలి, ప్రార్థనలో అర్థించాలి, మన మాటలలో చేతలలో ఆలోచనలలో చేసే ప్రతి పని ఒక ప్రార్థన అనే భావాన్ని కలిగి మన జీవితాన్ని నడుపుకోగలిగిన నాడు దేవునికి అతి ప్రియమైన ప్రార్థన సమర్పణమవుతుంది.

**కుటుంబ ప్రార్థన**

కుటుంబంలోని సభ్యులందరూ కలసి ఏక మనసుతో శాంతి సమాధానంతో ఐక్యంగా ప్రార్థించడం. ఏ కుటుంబంలోనైతే ప్రతి దినం ప్రార్థన ఉంటుందో ఆ కుటుంబం దేవునికి ప్రీతి పాత్రమవుతుంది. అటువంటి కుటుంబంలో సభ్యులందరూ ఒకరి యెడల ఒకరు ప్రేమాభిమానాలను పెంచుకొని సహజీవనం సాగిస్తారు. కుటుంబ ప్రార్థన లేని కుటుంబాలు గొడవలతో, అపార్థాలతో, అశాంతి నిలయాలుగా ఉంటాయి. భార్య కొడుకులతో కోడలు నోవా వెలుపలకు వచ్చి దేవునికి పూజ పీఠము నిర్మించెను అందుకే దీవెన

పొందాడు (ఆది.కా. 8:18). "నేను నా కుటుంబము యావేను మాత్రమే ఆరాధింతుము" (యెహోషువ 24:15).

## సంఘ ప్రార్థన

సంఘంలోని వ్యక్తులందరినీ ఐక్యపరచి ఒకరితో ఒకరు ప్రేమ సమాధానాలతో నెలకొల్పుతుంది. సంఘంలోని సభ్యులందరూ ఒకే కుటుంబంగా కలిసిమెలిసి దేవునితో ముందుకు సాగడానికి ఈ ప్రార్థన సహకరిస్తుంది సమాజంలో ప్రేమానురాగాలతో సాగిపోగలరు. "సోదరులు ఎల్లరూకూడి ఐక్యముతో జీవించుట చాలా మంచిది. చాలా రమ్యమైనది" (కీర్తన 133:1).

"తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" (లూకా 18:14), "ప్రభువు గర్వాత్ముని అణచివేసి దీనాత్మునికి తన వరాన్ని ఇస్తాడు" (యాకోబు 4:6). దేవుని ఎదుట దీనత్వము కలిగి వినయ పూర్వితమైన పశ్చాతాప పూరిత ప్రార్థనతో ప్రార్థిస్తే ప్రభువు నిన్ను క్షమించి ఇంకనూ సమృద్ధిగా దీవించును. దావీదు మహారాజు అంతటివాడే ప్రభువు ఎదుట పశ్చాతాపబడి ప్రార్థించి పాప ప్రాయశ్చిత్తం పొందాడు. అందుకే ప్రభువు తనను అధికంగా దీవించాడు.

పరిసయ్యుడు సుంకరి యొక్క ఉపమానము మనము చాలాసార్లు వినియుంటాం. ఎప్పుడు విన్నా ఏదో ఒక కొత్త విషయాన్ని ఈ ఉపమానం మనకు నేర్పిస్తూనే ఉంటుంది ఈ ఉపమాన భావాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. ఈ ఉపమానంలో ఇద్దరు వ్యక్తులు ప్రార్థించడానికి దేవాలయమునకు వెళ్ళారు. పరిసయ్యుడు తిన్నగా పీఠం దగ్గరకు వెళ్లి దేవుని ముందు నిలుచుని గర్వముతో ఇతరుల వలె తాను లేనందుకు కృతజ్ఞతలు చెప్పాడు. అయితే సుంకరి దేవాలయ ద్వారము వద్ద నిలుచుని, లోనికి ప్రవేశించే అర్హత తనకు లేదన్న ఉద్దేశంతో తన పాపము ఒప్పుకుంటూ దేవుని దయాభిక్ష కొరకు బ్రతిమాలాడు. తన పాపపు జీవితానికి సిగ్గుపడి పరలోకం వైపు కన్నులెత్తి చూడటానికి కూడా సాహసించలేదు.

## 1. స్వయం ధర్మం – వినయం

పరిసయ్యునిలో స్వయం ధర్మాన్ని చూస్తూ ఉన్నాం. తానే గొప్ప, తాను

ఎదుటివారి కంటే గొప్పవాడు, ఎదుటివారి కంటే ఉన్నతమైనటువంటి వాడు, ఎదుటివారి కంటే ప్రార్ధనాపరుడు అని హెచ్చించుకుంటూ ఉన్నాడు. సుంకరి వినయంతో తన గుండెలు బాదుకుంటూ దేవా నేను పాపిని అని ఒప్పుకుంటూ ఉన్నాడు. ఈ విధంగా ప్రభువు ఎదుట వినయంతో ప్రార్ధన చేయాలి. అప్పుడే దేవుడు మన మనవిని ఆలకిస్తాడు అని సుంకరి మనకు తెలియజేస్తున్నాడు.

## 2. లౌకికవాదం – అనుగ్రహం

పరిసయ్యుడు దేవుని ప్రార్థిస్తున్నప్పుడు నేను వారానికి రెండు సార్లు ఉపవాసం ఉంటాను, నా ఆదాయం అంతటిలో పదవ వంతు చెల్లిస్తూ ఉంటాను అని వింటున్నాం. పరిసయ్యుడు దేవునితో నేను నీకు ఇది ఇచ్చాను నీవు ఏమి ఇస్తావు అని ఒప్పందాలు మాట్లాడుతున్నాడు. సుంకరి మాత్రం కన్నులనైనను పైకెత్తుటకు సాహసింపక, నేను పాపాత్ముడను నన్ను కరుణింపుము అని ప్రార్థిస్తున్నాడు ఆయన అనుగ్రహం కొరకు ఎదురు చూస్తున్నాడు. పరిసయ్యుడు మూడుసార్లు ఉపవాసం, పదోవంతు చెల్లిస్తున్నాను అని దేవునితో బేరాలు చేస్తున్నాడు. కానీ సుంకరి మాత్రం దేవుని అనుగ్రహం కోసం ప్రార్థిస్తున్నాడు. మనందరికీ అదే నేర్పిస్తున్నాడు.

## 3. పాపము – పశ్చాతాపము

సుంకరి తాను చేసిన పాపములను స్మరించుకుంటూ రొమ్ములు బాదుకుంటూ ఏడుస్తూ పశ్చాతాపం కోసం ప్రార్థిస్తుంటే పరిసయ్యుడు మాత్రం పాపాన్ని ఒప్పుకోక అహంకారం వల్ల మరింత పాపాన్ని కట్టుకుంటున్నాడు. సుంకరి మన పశ్చాతాపము దేవునికి మానలను దగ్గర చేస్తుందని, దేవుని ఆశీర్వాదాలు అందిస్తుందని తెలియజేస్తున్నాడు.

ఈ సుంకరి, పరిసయ్యుని ప్రార్థన ద్వారా మనం మన జీవితాలకు అన్వయించుకోవలసినది, మనం నేర్చుకోవలసినది, దేవుని ఎదుట తగ్గింపు తనముతో జీవించుట. పాపము చేసిన వ్యక్తి తన తప్పును తెలుసుకొని ఎప్పుడైతే తనను తాను తగ్గించుకుని పాప మన్నింపు కొరకు ప్రార్థిస్తాడో అప్పుడే దేవుని దీవెనలకు అర్హుడు అవుతాడు అని తేటతెల్లమవుతుంది. పాపము చేయడము మానవునికి స్వభావపూర్వకముగా సహజము. పశ్చాత్తాపపడిన వారి పాపాలను

మన్నించడం దేవుని సహజ స్వభావము. ఆ మన్నింపు మనకు కావాలి అంటే ఆ దేవుని దరి మనం చేరాలి మన పాపాలను మనం ఒప్పుకోవాలి. నీ జీవితంలో రక్షణ రావాలి, పశ్చాతాపము కావాలి, దేవుని దీవెనలు పొందుకోవాలి అంటే చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాలి. దేవుని దరి చేరాలి. సుంకరిలా జీవించేటువంటి జీవితాన్ని అలవరచుకొని దేవుని దరిచేరేటువంటి భాగ్యాన్ని మనకు దయచేయమని దేవుని ప్రార్థిద్దాం.

❋ ❋ ❋ ❋

# 12. బైబులులో భక్తుల ప్రార్థనలు

- బ్రదర్ కాకుమాను జాన్ రాజు

**1. అబ్రాహాము మనవి (ఆది.కా. 18:27-33)**



అబ్రహాము సొదొమ, గొమొర్రా పట్టణాల కొరకు దేవునికి మనవిచేశాడు. ఆ నగరాల్లో 50 మంది భక్తిపరులుంటే వారిని కాపాడమని అడిగాడు.

ఆ సంఖ్యను 45, 40, 30, 20, 10 దాకా తగ్గిస్తూ వచ్చాడు. చివరకు ఆ నగరాల్లో పదిమంది భక్తిమంతులు కూడ లేరు. కనుక దేవుడు ఆ పురాలను నాశనం చేయవలసి వచ్చింది. జనులు మంచివారైనా చెడ్డవారైనా, వారికొరకు ప్రార్థించ వలసిన బాధ్యత మనకు ఉన్నది. మన విజ్ఞాపన వలన ఎందరికో మేలు కలుగుతుంది.

**2. మోషే విజ్ఞాపన (నిర్గమ 32:30-32)**

యిస్రాయేలు ప్రజలు ఈజిప్టు నుండి బయలుదేరి రాగానే సీనాయి దగ్గర బంగారు దూడను కొల్చి యావేకు కోపం రప్పించారు. ఆయన వారిని నాశనంచేసి మోషేనుండి క్రొత్త ప్రజను పుట్టించాలనుకొన్నాడు. కాని మోషే అందుకు అంగీకరించలేదు. అతనికి ఆ ప్రజలంటే ప్రీతి. కనుక అతడు నీవు ఈ ప్రజల పాపాన్ని మన్నించనైనా మన్నించు, లేదా నీ జీవగ్రంథం నుండి నాపేరు కొట్టివేయి అని మనవిచేశాడు. యూదులు, దేవుడు తన భక్తుల పేర్లను ఓ గ్రంథంలో వ్రాసివుంచుకొంటాడనీ, వారిని తప్పక రక్షిస్తాడనీ నమ్మారు. ఇక్కడ మోషే చిత్తశుద్ధి మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అతడు తన ప్రజలు నాశనమైతే తన పేరునుగూడ జీవ గ్రంథంనుండి తుడిచివేయాలని

కోరుకొన్నాడు. తాను జాతిపిత కావడం, తన సంతానం కనాను దేశాన్ని ఆక్రమించుకోవడం ముఖ్యం కాదు. యావే ఎన్నుకొన్న ప్రజలు బ్రతికి ఉండడం ముఖ్యం. స్వార్థం లేనివాళ్లే గొప్ప ప్రార్థన చేయగలరు.

### 3. నన్ను చంపివేయి (సంఖ్యా 11:10-15)

యిస్రాయేలు ప్రజలకు ఏడారిలో మాంసం తినాలనే కోరిక పుట్టింది. వాళ్ళు మోషేమీద నిష్ఠూరాలు పలికారు. అతనికి వారిమీద జాలి కలిగింది. అతడు ప్రభూ! నేను ఈ ప్రజల బాధను చూడలేను. నేను వీరిని ఓ తల్లిలా కనలేదు. ఓ దాదిలా ఎత్తుకొని తిప్పలేదు. నీవే వీరికి దాదివి. ఇప్పుడు వీరికి మాంసాన్ని దయచేయవేని నన్ను చంపివేయి. అప్పుడు నేను వీరి బాధను కన్నులార చూడను అని ప్రార్థన చేశాడు. మహాభక్తులు ప్రజల కొరకు ఎంతటి త్యాగాన్ని చేయటానికైనా సిద్ధంగా వుంటారు.

### 4. పశ్చాత్తాపము, వినయము (కీర్తన 51:16-17)

యెరూషలేము దేవాలయంలో ప్రజలు జంతు బలులు అర్పిస్తున్నారు. కాని జంతు బలుల వలన దేవుడు ప్రీతిజెందదు. నిజమైన బలిపశువు భక్తుడే. కనుక దాసుడు తన హృదయాన్నే దేవునికి అర్పించుకోవాలి. కీర్తనాకారుడు పశ్చాత్తాపము, వినయముగల హృదయాన్ని దేవునికి అర్పించుకొంటున్నాడు. పశ్చాత్తాపము ఎందుకంటే, మనం పాపులం కనుక. దేవుడు మన పాపాలను క్షమించేవాడు కనుక. వినయము ఎందుకంటే, దేవుడు సృష్టికర్త కనుక. భక్తుడు వినయంతో పశ్చాత్తాపంతో దేవుని సమీపించాలి.

### 5. ప్రభుని కరుణ (కీర్తన 103:11-14)

103వ కీర్తన దేవుని కరుణను వర్ణిస్తుంది. భూమికి ఆకాశం అనంతమైన ఎత్తు. దేవునిపట్ల భయభక్తులు చూపే వారియెడల అతని ప్రేమ అంత ఎత్తుగా వుంటుంది. పడమరకు తూర్పు అనంతమైన దూరం. దేవుడు మన పాపాలను అంతదూరంగా విసరి పారవేస్తాడు. తల్లితండ్రులు తమ కుమారుల మీద జాలి చూపినట్లే దేవుడు నరులమీద నెనరు జూపుతాడు. ఎందుకు? మనం ఆదాము కోవకు చెందిన వాళ్ళం. "ఆద్మా" అంటే మట్టి. మనం మట్టి నుండి పుట్టినవాళ్ళం. దుర్భల ప్రాణులం. దేవదూతలం కాదు. కనుక ప్రభువు మనలను

కరుణతో చూస్తాడు. దేవుని కారుణ్యాన్ని అనుభవానికి తెచ్చుకొని అతనిపట్ల నమ్మకాన్ని పెంపొందించు కోవడానికి ఈ అంశాలు బాగా ఉపయోగపడతాయి.

## 6. విజ్ఞులకు గాక పసిబిడ్డలకు (మత్తయి 11:25-27)

ప్రభువు పరలోక రహస్యాలను గర్వితులైన పరిసయ్యులకూ, యూదుల మత పెద్దలకు తెలియజేయలేదు. పసిబిడ్డలకు తెలియజేసాడు. ఈ "పసిబిడ్డలు" దీనులు. క్రీస్తు శిష్యులంతా ఈ వర్గం వాళ్ళే. దైవశ్రుతి వీరికి తెలిసినట్లుగా యూదుల మత నాయకులకు తెలియదు. తండ్రి తన్ను గూర్చిన సమస్త జ్ఞానాన్ని కుమారునికి అప్పగించాడు. కనుక మనకు తండ్రిని తెలియజేసేవాడు క్రీస్తే. వాళ్ళిద్దరికి పరస్పర జ్ఞానం, ప్రేమ ఉంటాయి. నేడు మనం క్రీస్తుద్వారా తండ్రిని, తండ్రి ద్వారా క్రీస్తును తెలుసుకొంటాం. కాని వినయము సరళభావము కలవారే దేవుని తెలుసుకోగలరు.

## 7. నేను నీ కొరకు ప్రార్థించాను (లూకా 22:31-32)

ధాన్యాన్ని జల్లెడలో పోసి అటూఇటూ ఊపుతారు. అప్పుడు మట్టి పెళ్ళలనూ రాళ్ళనూ వేరు చేయవచ్చు. పిశాచం శిష్యులను గోదుమలవలే జల్లెడ పట్టగోరింది అంటే బలంగా శోధించగోరింది, శోధించిందికూడ, కనుక శిష్యులు క్రీస్తుపట్ల విశ్వాసాన్ని కోల్పోయి ఆయనను విడచి పారిపోయారు. కాని ప్రభువు పేతురు కొరకు ప్రార్థించాడు. క్రీస్తుని నిరాకరించిన పేతురు ఆ ప్రార్థన బలం వలన ప్రభుని విశ్వసించాడు. పడిపోయి మళ్ళీ లేచాడు. అనగా క్రీస్తునుండి పారిపోయిన శిష్యులను మళ్ళీ క్రీస్తు దగ్గరికి చేర్చాడు. ఈవిధంగా క్రీస్తు ప్రార్థన శిష్యులందరికీ మేలు చేసింది. నేడు ఉత్థాన క్రీస్తు మన కొరకు గూడ ప్రార్థన చేస్తుంటారు (హెబ్రీ 7:25). కనుకనే మనం ఎన్ని శోధనలనైనా, అపాయాలనైనా తప్పించుకోగలము. మనకు దైవానుగ్రహం మీద నమ్మకముండాలి.

## 8. ఈ పాత్రను తొలగించు (మార్కు 14:36)

క్రీస్తు గెత్సెమని ప్రార్థన ఎందరికో ప్రేరణగా నిలిచింది. ఈ ప్రార్థనలో "పాత్ర" అంటే సిలువ మరణమే. ఆ సమయములో ముందు క్రీస్తు సిలువ మరణాన్ని తొలగించమని తండ్రిని వేడుకొన్నాడు. చనిపోవడానికి ఏ ప్రాణి ఒప్పుకోదు. ప్రభు ఎల్లవేళల తండ్రి చిత్తానికి బద్ధుడు. కనుక తండ్రి కోరినట్లే మరణానికి సంసిద్ధుడయ్యాడు. తండ్రి, కుమారుడు అడిగినా సిలువ మరణాన్ని

తొలగించలేదు. దానిని భరించే శక్తిని మాత్రం ప్రసాదించాడు. నేడు మనం దేవుని చిత్తాన్ని అంగీకరించక, మన చిత్త ప్రకారం పనులు జరగాలని కోరుకొంటాం. కాని ఇది పద్ధతి కాదు. బైబులు భక్తులు నిరంతరమూ దేవునికి విధేయించారు. మనం కూడ అటువంటి విధేయతను అలవరచుకోవాలి. దేవుని చిత్తప్రకారం జీవించినపుడు గొప్ప మనశ్శాంతి కలుగుతుంది.

## 9. దేవా! ఈ పాపిని కనికరించు (లూకా 18:13)

పరిసయ్యుడు, సుంకరి ఇద్దరు దేవాలయానికి ప్రార్థనకు వెళ్ళారు. పరిసయ్యుడు గర్వితుడు. అతడు దేవుని ముందు తన్నుతాను పొగడుకున్నాడు. పొగరుతో నేనీ సుంకరిలాగ దుర్మార్గుణ్ణికాదు అని చెప్పుకొన్నాడు. కాని సుంకరి గుడిలోని పీఠంవైపు, దైవసాన్నిధ్యంవైపు కన్నులెత్తి చూడటానికి కూడ సాహసింపలేదు. తన వినయాన్ని ప్రదర్శిస్తూ రొమ్ము బాదుకున్నాడు. తాను నిక్కంగా పాపినని నమ్మాడు. కనుక దేవా! ఈ పాపిని కనికరించు అని వేడుకొన్నాడు. వినయంతో, పశ్చాత్తాపంతో కూడిన అతని వేడుదలను దేవుడు ఆలించాడు. పరిసయ్యుని పాపాలను మన్నించని దేవుడు సుంకరి పాపాలను మన్నించాడు. మన ప్రార్థనలో వినయం, చిత్తశుద్ధి వుండాలి.

## 10. పరలోకంలోని మీ తండ్రి (మత్తయి 7:9-11)

ప్రార్థనలో దేవుని తండ్రిగాను మనలను బిడ్డలుగాను భావించుకోవాలి. తల్లితండ్రులు తమ బిడ్డలు ఆకలితో రొట్టె, చేప మొదలైన ఆహార వస్తువులు అడిగినపుడు వాటినే యిస్తారు కాని కీడుచేసే రాయి, పాము మొదలైన వస్తువులను ఇవ్వరు. ఇక దేవుడు ఈలోక తండ్రుల్లాగ చెడ్డవాడుకాడు. స్వార్థపరుడుకాడు. అతడెప్పుడూ మనకు మేలుచేసే వస్తువులే యిస్తాడు. ఆ తండ్రిని మనం నమ్మాలి. ప్రార్థనలో మనకూ దేవునికీ, తండ్రీబిడ్డల సంబంధం ఉంటుంది. ఈ సంబంధం మనకు నమ్మకం పుట్టించాలి.

## 11. ఇద్దరు ముగ్గురు నా పేరిట (మత్తయి 18:19-20)

ఇక్కడ ఇద్దరు ముగురు అనగా సమూహము. వ్యక్తి ప్రార్థన కంటే సంఘ ప్రార్థన బలమైనది. దేవుడు యిస్రాయేలును ఒక సంఘముగా ఎన్నుకొన్నాడు. అలాగే క్రైస్తవులమైన మనలను కూడ ఒక సంఘముగా ఎన్నుకొన్నాడు. మనం

ఆయనను ఒక సంఘముగా ఆరాధిస్తాం. కనుక, సాధ్యమైనపుడెల్లా సంఘముగా ప్రార్ధన చేయాలి. వ్యక్తిగత ప్రార్ధన మంచిదే కాని పదిమంది కూడి చేసిన ప్రార్ధన బలంగా వుంటుంది. ఉత్థాన క్రీస్తు పేరిట మనం భక్తసమాజాలుగా రూపొందాలి. ఈ సమాజాలను ఉత్తేజ పరచేది క్రీస్తే.

## 12. కోతగాండ్రను పంపమని తండ్రికి మనవి (మత్తయి 9:37-39)

రైతు పంటను సేకరించినట్లుగా దేవుడు ప్రజలను దైవరాజ్యంలోనికి సేకరిస్తాడు. పంట యజమానుడు తండ్రి. పంటను కోసే కోతగాడు క్రీస్తు. కనుకనే, ఆయన స్థానములో పనిచేయుటకు శిష్యులను ఎన్నుకొన్నాడు. ఇప్పుడు కూడ అనేక మంది పనివారు కావాలి. యువతీయువకులు పిలుపును అందుకోవాలి. వీళ్లే పనివాళ్లు లేక కోతగాండ్రు. ఎక్కువ మంది కోతగాండ్రను పంపి, ఎక్కువ పంటను సేకరించమని మనం తండ్రిని వేడుకోవాలి. అనగా ఎక్కువ మంది దైవ పిలుపును స్వీకరించాలని మనం ప్రార్ధన చేయాలి. మన ప్రార్ధన వలన కొందరు యువతీయువకులు పిలుపును అందుకొంటే మన జీవితం ధన్యమౌతుంది.

❋ ❋ ❋ ❋

# 13. ప్రార్థన - పరిచర్య

బ్రదర్ చింతాడ సుధీర్



ఈ గందరగోళ, అవిశ్రాంత జీవితంలో, నిరంతరము ప్రశాంతత కొరకు ఏకాంతముగా ప్రార్థించడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటాము. మనము దేవుని సాన్నిధ్యంలో ఒంటరిగా వుండే నిశ్శబ్ద ప్రదేశం కొరకు వెదుకుతుంటాం. జీవిత పరమార్థాన్ని గుర్తించడానికి ప్రార్థన మనకు సహాయం చేస్తుంది. ప్రార్థన, మనము దైవానుభూతిని అనుభవించటానికి సహాయపడుతుంది.

ప్రార్థన గురించి సామాన్య అవగాహన ఏమనగా, దైవ స్వరూపితో సంబంధ ఏర్పాటు అని చెప్పవచ్చు, క్రైస్తవ సాంప్రదాయం ప్రార్థనను గూర్చి చెబుతూ "మన హృదయాలను మనస్సులను ప్రభువైపునకు మళ్లించడమే ప్రార్థన" అని ప్రార్థన విశిష్టత గురించి రోమను, పశ్చిమ దేవాలయ పితామహులు వ్యాఖ్యానించారు. "దేవునితో సంభాషించడమే ప్రార్థన" అని గ్రేగోరి ఆఫ్ నిస్సా అన్నారు. "ప్రార్థన మనలను దేవునితో సహచరునివలె ఐక్యపరుస్తుంది" అని జాన్ క్రిసోస్తము అన్నారు. "ప్రార్థన అనగా ప్రేమించటం" అని పునీత అవిలాపురి తెరేసమ్మగారు తెలియజేయుచుండగా, "సమస్తమునకు మూలము ప్రార్థన" అని మ్యాక్స్ మిలియన్ కోల్బే గారు తెలియపరుస్తున్నారు. అందువల్ల ప్రార్థన అనేది మన జీవితాలలో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

### ప్రార్థన అనగా...

పసిబిడ్డ తల్లి పాలకోసం వెదుకుతూ తల్లితో తన బంధాన్ని

పెంచుకొనునట్లు, దేవునితో మానవుడు మనసుతో పెంచుకొనే బంధమే "ప్రార్థన" ప్రార్థన అనగా "దేవునితో మనసువిప్పి మాట్లాడుకోవడం/సంభాషించడం", మానవునిలో ఉన్న హృదయం ఆధ్యాత్మికంగా ఊపిరి పోసుకోవటమే "ప్రార్థన". ప్రార్థన ద్వారా బలహీనతతో బ్రద్దలైన బ్రతుకు బలపడుతుంది. వాడిపోయిన జీవిత ఆశలు, ఆశయాలు మరలా చిగురిస్తాయి. చచ్చుబడిపోయిన శరీరంలోని నరాలన్నీ జీవంతో పుంజుకుంటాయి. శాపాలు సంతోషంగాను, వేదనలు దీవెనలుగాను మారిపోతాయి. కీర్తన 103:3, ప్రార్థన ద్వారా దేవుడు "నీ పాపములెల్ల మన్నించును, నీ వ్యాధులనెల్ల కుదుర్చును".

## ప్రార్థన విశేషమేమనగా

ముంగిస పామును చంపిన తర్వాత వెంటనే వెళ్ళి ఒక ఆకును తింటుంది. పాము ద్వారా వచ్చిన విషము శరీరానికి సోకకుండా, విరుగుడుగా ఆ ఆకును తింటుంది. అదే విధంగా, సాతాను ద్వారా పాపమనే విషము మనకు సోకకుండా ఉండాలంటే ప్రతిరోజు మనం "ప్రార్థన" అనే ఆకును ఔషదంగా (మందుగా) తినాలి. దైవ మానవ సంబంధము పట్ల ఉన్న పరమరహస్యాన్ని విశ్వాసులు నమ్మి, దాన్ని వేడుకగా జరుపుకొంటూ, జీవించే సత్య దేవుని పట్ల జీవం ఉట్టిపడే విధంగా వ్యక్తి గత సంబంధం నిలుపుకొని, దాని నుంచే జీవించటం అవసరం. ఈ సంబంధమే ప్రార్థన.

## ప్రార్థన – దేవుని కానుక

"మనస్సును, మేధస్సును దేవుని వైపు మళ్ళించడమే ప్రార్థన లేదా మంచి వస్తువుల కోసం దేవుని బ్రతిమాలుకోవడమే ప్రార్థన." "కాని మనం ప్రార్థించునపుడు గర్వంతో తొణికిసలాడే హృదయ శిఖరంపై నుంచి మాట్లాడుతున్నామా? లేదా పరితపించే వినమ్ర హృదయ "అంతరంగం నుంచి" మాట్లాడుతున్నామా? అనునది గ్రహించవలెను. వినమ్రత ప్రార్థనకు పునాది తన్నుతాను వినమ్రుని చేసికునే వానిని (దేవుడు) ఉన్నతునిగా చేస్తాడు. "మనకు ప్రార్థించ వలసిన రీతిలో ప్రార్థించడం రాదని" "వినమ్రతతో గుర్తించినపుడు,

ఉదారంగావచ్చే ప్రార్థనా వరాన్ని అందుకోడానికి సిద్ధంగా ఉన్నపుడు ఇది సాధ్యమవుతుంది. దేవుని సమక్షంలో మనిషి ఓ బిక్షగాడు.

"దేవుని వరమేమిటో నీకు తెలిస్తే" "నీళ్ళ కోసం వెతుక్కుంటూ వెళ్తే బావి ప్రక్కన ఆశ్చర్యం గొలిపే ప్రార్థనను యేసు–ఆవిష్కరించాడు. మనుష్యులందరిని కలిసికోటానికి యేసు అక్కడికి వస్తాడు ఆయనే ముందుగా మనల్ని చూస్తాడు నీళ్ళవ్వమని అడుగుతాడు. యేసు దాహంగొన్నాడు, మన పట్ల దేవుని హృదయాంతరాళంలో ఉన్న కోరిక నుండి ఆయన విన్నపము ఉదయిస్తుంది. మనం గుర్తించినా గుర్తించకపోయినా, మన దాహంతో దేవుని దాహం కలవడమే ప్రార్థన, మనం దేవుని పట్ల దాహం గొనడానికే దేవుడు దాహం గొంటాడు."

"నీవు ఆయనను అడిగి ఉంటే, ఆయన జీవ జలాన్నిచ్చేవాడు. "విపరీతార్థంలాగా తోచినా, జీవించే దేవుని అభ్యర్ధనకు సమాధానమే మన వేడికోలు ప్రార్థన: జీవజల బుగ్గనైన నన్ను వాళ్ళు తృణీకరించారు, వాళ్ళ కోసం రాతి తొట్లను తొలిపించుకున్నారు. అవి నీరు నిలువని పగిలిపోయిన తొట్లు, ఉచితమైన రక్షణ వాగ్దానానికి విశ్వాసంతో కూడిన సమాధానమే ప్రార్థన. దేవుని ఏకైక కుమారుని ప్రేమ దాహానికి, ప్రేమ పూర్వక సమాధానం ప్రార్థన". (కతోలిక శ్రీసభ సత్యోపదేశం 2559–2561).

## దేవుని వాగ్దానం – విశ్వాస ప్రార్థన

దేవుడు అబ్రహామును పిలిచినపుడు, "ప్రభువు నుడివినట్లుగా" అబ్రహాము బయలుదేరి వెళ్ళాడు. అబ్రహాము హృదయం సంపూర్ణంగా వాక్కు వశమైంది, అందుకే విధేయించాడు. అలాంటి శ్రద్ధగల హృదయం దేవుని సంకల్పానుసారంగా నిర్ణయాలు తీసుకుంటుంది. అలాంటి హృదయమే ప్రార్థనకు ముఖ్యం. ఈ సంబంధానుసారంగానే అందులో ఉపయోగించే మాటలను పరిగణలోనికి తీసికోవాలి. అబ్రహాము ప్రార్థన మొదట క్రియా రూపంలో అభివ్యక్తమైంది. ఆయన మౌనంపాటించే మనిషి ఆయన ప్రయాణంలో, ప్రతి విడిదిలో ప్రభువు కోసం పీఠం నిర్మించాడు. ఆ తరువాతనే మాటలతో కూడిన అబ్రహాము ప్రార్థన కనిపిస్తుంది: దేవుని వాగ్దానాలు సిద్ధింపలేదన్న భావనతో దేవునికే గుర్తుచేస్తూ, విచారంతో ఫిర్యాదుచేస్తున్నట్లుగా ఆ ప్రార్థన కనిపిస్తుంది." అలా ప్రార్థనా రూపకంలో (సంభాషణలో) మొదటి నుండి కనిపించే ఒక అంశాన్ని చూడొచ్చు: దేవుని విశ్వసనీయత పట్ల విశ్వాస

పరీక్ష. ఎందుకంటే అబ్రహాము దేవుని నమ్మాడు. ఆయన సమక్షంలో నడిచాడు. ఆయనతో ఒప్పందం చేసుకున్నాడు. "ఆయన గుడారంలోనికి అతిథిని ఆహ్వానించటానికి సిద్ధంగా ఉన్నాడు. అబ్రహాము మమ్రేవద్ద విశేషమైన ఆతిథ్యాన్నిచ్చాడు. ఇది వాగ్దానం చేసిన నిజమైన దైవ పుత్రుని ప్రకటనను ముందుగానే సూచిస్తుంది. దాని తరువాత దేవుడు తన ప్రణాళికను తెలిపాడు. అప్పటి నుండి నరుల పట్ల ప్రభువుకున్న జాలితో అబ్రహాము హృదయం ఒకటైంది. పూర్తినమ్మకంతో వారికోసం వేడుకోడానికి సాహసించాడు. అబ్రహాము వాగ్దానాలను అందుకున్నాడు."

దేవుడు తనే ఇచ్చిన కుమారుని బలిగా ఇవ్వమన్నాడు. అది అతని విశ్వాస శుద్ధికి తుది దశ. అబ్రహాము విశ్వాసం బలహీనపడలేదు: "దహన బలికి గొఱ్ఱెను దేవుడే స్వయంగా అందిస్తాడు". "తన సొంత కుమారుడని వదలిపెట్టక మనకోసం ఇవ్వనున్న (పరలోక) తండ్రి వలే నమ్ముకున్న వాళ్ళకు తండ్రి ఉన్నాడని ధృవపడింది. " ప్రార్థన దేవుని పోలికను పునరుద్ధరిస్తుంది. మానవ జాతిని రక్షించే దేవుని ప్రేమశక్తిలో పాలుపంచుకునే సామార్థ్యాన్నిస్తుంది."

"యిస్రాయేలు పండ్రెండు గోత్రాలకు పూర్వుడైన యాకోబుతో దేవుడు తన వాగ్దానాన్ని నూత్నీకరించాడు." తన అగ్రజుడైన యిషాయిని ఎదుర్కొనక ముందు, ఒక మార్మిక రూపంతో యాకోబు రాత్రంతా మల్లయుద్ధం చేశాడు. అతడు పేరు చెప్పటానికి తృణీకరించినాగానీ, ఉదయాన వెళ్ళబోయే ముందు అతణ్ణి దీవించాడు. ఈ సంఘటన నుంచి శ్రీసభ ఆధ్యాత్మిక సంప్రదాయం ప్రార్థనా సంజ్ఞను నిలిపింది: ప్రార్థన విశ్వాస పోరాటం (సంఘర్షణం), దీక్షకు (పట్టుదలకు) జయం.

## యేసు ప్రార్థన

కన్య మరియ కుమారుడై జన్మించిన దేవుని కుమారుడు తన మానవ హృదయంలో ప్రార్థించడం నేర్చుకున్నాడు. సర్వశక్తిమంతుడు చేసిన గొప్పకార్యాలన్నిటినీ తన హృదయంలో భద్రపరచుకున్న తన తల్లి నుండి ప్రార్థించటం నేర్చుకున్నాడు. ఆయన ప్రార్థన మరో రహస్య మూలం నుండి పెల్లుబుకింది. ఆయన పండ్రెండేళ్ళ ప్రాయమపుడు ఆయనే ఆ రహస్యాన్ని

వెలిబుచ్చాడు: "నేను నా తండ్రి ఇంట్లో ఉండాలి". "కాలం పూర్తయినపుడు, ప్రార్థనలోని కొత్తదనం, బయల్పాటు ప్రారంభమవుతుంది. ఆయన పుత్రోచిత వాత్సల్యంతో చేసిన ప్రార్థన, నరులతో, నరుల కోసం తుదిగా ఏకైక కుమారుడు తన మానవస్వభావంలో ఈ ప్రార్థనను జీవించటం ప్రారంభించాడు. తన బిడ్డల నుండి ఈ ప్రార్థన కోసమే తండ్రి ఎదురు చూస్తారు.

పవిత్రాత్మ కార్యము, క్రీస్తు పరిచర్యలో ప్రార్థనకున్న భావాన్ని లూకా సువార్త ఉద్ఘాటిస్తుంది. తన ప్రేషిత కార్యంలో, నిర్ణయాత్మక సమయాలకు ముందు యేసు ప్రార్థించేవాడు: తన జ్ఞానస్నాన తరుణంలో, తాను దివ్యరూపందాల్చినప్పుడు తన తండ్రి సాక్షం పలకడానికి ముందు, తన శ్రమలద్వారా తండ్రి ప్రేమ పూర్వక ప్రణాళికను తను సిద్ధింపజేయడానికి ముందు యేసు ప్రార్థించాడు. "అపోస్తులులను ప్రేషిత కార్యంలో నిమగ్నం చేసే నిర్ణయాత్మక తరుణానికి ముందు కూడా ఆయన ప్రార్థించాడు. పన్నెండు మంది శిష్యుల ఎంపికకు, పిలుపుకు ముందు, "దేవుని క్రీస్తు" అని పేతురు ప్రకటించడానికి ముందు. శోధనకు గురైనపుడు అపోస్తలుల ప్రముఖుని విశ్వాసం సడలకుండా ఉండడానికి ప్రార్థించాడు." రక్షణ సంఘటనలను నెరవేర్చమని తండ్రి, యేసును అడిగాడు. ఆ రక్షణ సంఘటనలకు ముందు యేసు చేసిన ప్రార్థన వినమ్రతతో, నమ్మకంతో తండ్రి ప్రేమ చిత్తానికి అంకితం చేయడమే యేసు ప్రార్థన.

"ఒక స్థలంలో ఆయన ప్రార్థిస్తున్నాడు. ప్రార్థన ముగియగానే ఆయన శిష్యులలో ఒకడు అడిగాడు, "ప్రభూ! ప్రార్థించుట నేర్పించు" అని, "తమ గురువు ప్రార్థనలో గడపడం చూచి, క్రీస్తు శిష్యులు కూడా ప్రార్థించాలనుకున్నారు. ప్రార్థనా నిపుణుడైన కుమారుని ధ్యానించి, ఆయన బోధను ఆలకించిన తరువాత బిడ్డలు తండ్రిని ప్రార్థించడం నేర్చుకుంటారు.

యేసు ఏకాంతంగా ప్రార్థించడానికి తరచుగా రాత్రి వేళ కొండపైకి వెళ్ళేవాడు." తన ప్రార్థనలో మనుష్యులందరిని చేర్చేవాడు. ఎందుకంటే తన మానవత్వంలో మానవ స్వభావాన్ని తీసికున్నాడు. తనను తాను తండ్రికి అర్పించుకున్నప్పుడు వాళ్ళను కూడా అర్పించేవాడు. మానవుడైన వాక్కు, యేసు

తన ప్రార్థన వలన “ఆయన సోదరుల” అనుభూతిలో పాలుపంచుకుంటాడు. వారిని విముక్తులను చేయడానికి వారి బలహీనతల పట్ల సానుభూతిని తెలిపేవాడు.” అందుకొరకే ఆయనను తండ్రి పంపింది. ఆయన మాటలు, పనులు ఆయన రహస్యంగా చేసిన ప్రార్థనకు బహిరంగ గురుతులు.

ప్రజలకు పరిచర్య చేసే తరుణంలో, క్రీస్తు అందించిన ప్రత్యేక ప్రార్థనలను రెండింటిని సువార్తాకారులు భద్రపరిచారు. రెండు కూడా కృతజ్ఞత అర్పించడంతో ప్రారంభమవుతాయి. మొదటి ప్రార్థనలో, యేసు తండ్రిని అంగీకరించి గుర్తించాడు, స్తుతించాడు. ఎందుకంటే, తండ్రి రాజ్యానికి సంబంధించిన నిఘూడ సత్యాలను విద్యావంతుల నుండి దాచాడు. పసిపిల్లలకు మోక్షభాగ్యాల పేదలకు వాటిని తెలియజేశాడు.” “అవును తండ్రి!” అన్న ఆశ్చర్యార్థకం ఆయన లోతైన హృదయాంతరంగాన్నీ, దేవుని సంతోషానికి అంటిపెట్టుకోవడాన్నీ అభివ్యక్తం చేస్తుంది. ఆయన గర్భానపడిన తరుణంలో వాళ్ళమ్మ విశ్వాసంతో ప్రతిధ్వనించింది. తను బాధలు అనుభవించినప్పుడు తాను చెప్పబోయే దాన్ని ముందుగానే సూచించింది. యేసు ప్రార్థనంతా తండ్రి సంకల్ప రహస్యాన్ని తన మానవ హృదయ ప్రేమతో అంటిపెట్టుకొని ఉంది.

లాజరును జీవంతో లేపటానికి ముందు చేసిన ప్రార్థన రెండవది. దీనిని పునీత యోహాను భద్రపరిచాడు. సంఘటనకు ముందు యేసు కృతజ్ఞతలర్పించాడు: “తండ్రి, నా మాట అలకించినందుకు నేను కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను”. తండ్రి ఎల్లప్పుడు, ఆయన విన్నపాలను ఆలకిస్తాడన్న భావన అందులో ఉంది. “నీవెప్పుడూ వింటావని నాకు తెలుసు” అని వెంటనే యేసు జతచేశాడు. యేసు తన వైపు నుంచి ఎప్పుడూ అలాంటి విన్నపాలు చేస్తున్నాడన్న భావన అందు ఇమిడి ఉంది. యేసు ప్రార్థనలో కృతజ్ఞతా భావం ఉంది. ఎలా అడగాలో మనకు బయలుపరుస్తుంది. కానుక ఇవ్వక ముందే, తననే కానుకగా ఇచ్చేవానికి యేసు అంకితమవుతాడు. కానుక కంటే కానుక ఇచ్చే వాని విలువే అమూల్యం, ఆయన ఒక “నిధి,” ఆయనయందు తన కుమారుని హృదయం తండ్రి ప్రేమ ప్రణాళికను నెరవేర్చే గడియ వచ్చింది. అపుడు, కుమారుని ప్రార్థనలోని అంతులేని లోతును యేసు క్షణం పాటు దర్శింపజేశాడు.

తనను తాను స్వేచ్ఛగా అర్పించుకున్నపుడే కాదు తండ్రీ... నా చిత్తం కాదు, నీచిత్తమ్మే... శిలువపై ఆయన తుది మాటలు కూడా దాన్ని వ్యక్తం చేస్తాయి. అందులో ప్రార్థన, తన ఆత్మ కానుక వేరు కాదు ఒకటే: "తండ్రీ, వారిని క్షమించండి, వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియదు." "నిజంగానే నేను నీతో చెబుతున్నాను, ఈ రోజు నీవు నాతో పరలోకంలో ఉంటావు. "స్త్రీ, ఇదిగో చూడు నీ కుమారుడు" "ఇదిగో చూడు నీ తల్లి." "నాకు దాహం మగుచున్నది." "నా దేవా, నా దేవా, నన్నెందుకు తృణీకరించావు!" "సమాప్తమైంది" "తండ్రీ, నీ చేతుల్లో నాయాత్మను పెడుతున్నాను". ఆయన మరణించేటప్పుడు "పెద్ద కేక" వేసే వరకు కూడా ఆయన తన ఆత్మను అర్పిస్తూనే ఉన్నాడు.

## ప్రార్థన ద్వారా పరిచర్య

పాత నిబంధనలో యాజకులు ప్రవక్తలు చేసిన విధంగానే కథోలికులకు సువార్త, ప్రార్థన చాలా ముఖ్యమైనవి. ప్రార్థనలో విశ్వాసి దగ్గరగా లేదా లోతుగా దేవునితో సత్సంబంధాన్ని కలిగి ఉంటాడు. ఆయనతో సంభాషిస్తూ, ఆయనతో ముఖాముఖి దర్శనాన్ని ప్రార్థనలో ఎలా జీవించాలి? దేవుని ఎలా నమ్మాలి అని పవిత్రాత్మ ద్వారా దేవుని ప్రణాళిక ప్రకారం నేర్చుకుంటాడు. అందుకే ప్రార్థన మతానికి ఒక హృదయము లాంటిది. అలాగే ఈ ప్రార్థన కతోలిక స్తుతి ఆరాధనలకు ప్రాధాన్యమైనది. ఎందుకంటే, ఈ క్రమంలో ఆచరించే ఆరాధన, వాక్య పరిచర్య, విన్నపాలు, దివ్య సంస్కారాలు ప్రతిష్టాపన, పాటలు, భక్తికృత్యాలు, వాక్య బోధన వాక్యపఠనం మొదలైనవి మనలను దేవునిలో మమేకమవడానికి ప్రేరేపిస్తాయి. ప్రతి ఒక్క పరిచర్యలో పనిని కూడా ప్రార్థన క్రమంతో పోల్చవచ్చు. పరిచర్యను నిర్వర్తించేటువంటి వారు ప్రత్యేకించి గురువులు వ్యక్తిగతంగా గొప్ప ప్రార్థనా పరులై ఉండాలి. గురువు విశ్వాసులను ప్రార్థనలో నడిపించాలి. ప్రార్థన ఎలా చేయాలో నేర్పిస్తూ ఉత్సాహంగా ఇతరుల అవసరాల కొరకు ప్రార్థిస్తూ, ప్రార్థనను అనుదిన జీవితంలో అనుసరించాలి. ఈ క్రమంలోనే గురువు ప్రతి ఒక్క విశ్వాసిని, సంఘ సభ్యుని దేవునితో సత్సంబంధం కలిగి ఆధ్యాత్మిక జీవితంలో ఎదగడానికి దేవుని సాన్నిధ్యాన్ని అనుభవించడానికి, ప్రేరేపిస్తాడు. ప్రార్థన అనేది క్రీస్తు సుమాతృకపై ఆధారపడి ఉండాలి. ప్రార్థన ద్వారా పరిచర్యను

అనేక విధాలుగా అర్థం చేసుకోవచ్చు. ఆశీర్వాదంగా స్వీకరించవచ్చు. (రోమీ 12:14). క్రీస్తు తన పరిచర్య కాలంలో ఇతరుల కొరకు ప్రార్థించాడు. అంతేకాకుండా నిజానికి ఆయన మన తరపున ప్రార్థిస్తున్నాడు. ప్రతి ఒక్క విశ్వాసి ఇతరుల కోసం ప్రార్థించాలి.

## పునీత మదర్ తెరిసా గారి యొక్క ప్రార్థన, పరిచర్య

ప్రస్తుత కాలంలో పరిచర్య అనేది అంతా సులభమైనది కాదు. పునీత మదర్ తెరిసా గారు వారి జీవనశైలితో అనేక మందికి సేవ చేస్తూ క్రీస్తు పరిచర్యలో పాలి భాగస్తులయ్యారు. ఆమె చేసే ప్రతి పని యందు దేవునిలో తనను తాను ఐక్యం చేసుకొని ప్రార్థనా జీవితాన్ని జీవించి ఒక గొప్ప సుమాతృకగా నిలిచారు. తాను చేసే ప్రతి పని ద్వారా ప్రార్థనను, క్రీస్తు పరిచర్యను కొనసాగించారు.

మదర్ తెరిసా గారికి ప్రార్థన అనేది వారి జీవితంలో అతి ప్రాముఖ్యమైన విషయం. చాలాసార్లు మదర్ తెరిసా గారు ప్రార్థనా జీవితాన్ని గురించి వారి సంభాషణలలో చెప్పారు. ప్రార్థన లేకుండా ఎటువంటి సేవలను కూడా తలపెట్టలేం. క్రీస్తు తానెప్పుడు ప్రార్థిస్తూ తండ్రితో ఏకత్వం పొందేవాడు. అలాగే మనము కూడా క్రీస్తుతో ఏకత్వం పొందాలి. క్రీస్తు మహా శక్తిమంతుడు. ఆయన ప్రేమను మనకు ప్రసాదించాలని ఆయన అభిలషిస్తున్నాడు. ఎప్పుడైతే క్రీస్తును మనలోను, మన ద్వారా పని చేయనిస్తామో అప్పుడే మన సేవ సార్థకమవుతుంది. మనం పవిత్రంగా ఉండాలి. అప్పుడే క్రీస్తు మనలో నివశించడానికి వీలు కలుగుతుంది. మన జీవితం ప్రేమ భరితం కావాలి. విశ్వాస పూరితం కావాలి. పవిత్రమయం నిరుపేదల సేవలో నిండిపోవాలి. దేవుని చిత్తాన్ని గ్రహిస్తే, నిరుపేదలే మన పవిత్రతకు కారణమవుతారు.

ప్రార్థన అనే అంశముపై చాలా పుస్తకాలు రచించారు మదర్ తెరిసాగారు. ఆమె వ్యక్తిగతంగా, తమ అనుచరులతో ప్రార్థన చేస్తూ ఉండేవారు. ఆమె చేస్తున్న పని రహస్యం ప్రార్ధన, త్యాగం అని రెండు విషయాల గురించి ప్రస్తావించేవారు. ప్రార్థన అను ఆయుధం ద్వారా దేవుని ప్రేమలో, దేవునితో ఐక్యమై, ఆయన నుండి ఆధ్యాత్మిక బలమును పొందుకొని దేవుని చిత్తాన్ని

నెరవేర్చారు. మదర్ తెరిసా గారు ప్రార్థన అనే అంశాన్ని రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగము ప్రార్థన మార్మిక వ్యక్తీకరణ గురించి తెలియజేస్తుంది. అనగా ప్రార్థనలను సాధారణంగా చెప్పడం కాకుండా మనస్ఫూర్తిగా దేవునితో ఐక్యమై ఆయనే మనలో, మన కొరకై, మన ద్వారా ప్రార్థించాలి. ఈ రకమైన ఆధ్యాత్మికంగా దేవుని మానవుడు అంటిపెట్టుకోవడమే ప్రార్థన. ఆమెకు ప్రార్థన అనేది దేవునితో ఒక్కటి అవ్వడం అనే భావన. అలాగే ప్రార్థన దేవుని గురించి తలుస్తూ ఆయనతో ఒకటి అవ్వడం. ప్రార్థన క్రీస్తుతో వ్యక్తిగతమైన బంధాన్ని కలిగి జీవించడం. ఒకవేళ మనం ప్రార్థనను తగిన శ్రద్ధ లేకుండ చేయడం లేదా ప్రార్థన ప్రక్రియను నిర్లక్ష్యం చేయడం మానవ ఆధ్యాత్మిక జీవితానికి శుభప్రదం కాదు. ద్రాక్షావల్లి కొమ్మకు అంటిపెట్టుకోకపోతే ఏ విదంగా ఫలించదో, అదేవిధంగా మానవ జీవితానికి ప్రార్థన ఆయుధం లేకపోతే మనము కూడా ఫలించలేము. ప్రార్థన అనేది మదర్ తెరిసా గారికి రోజులో 24 గంటలు దేవునితో, ఆయన కొరకు, ఆయన ద్వారా, ఆయనతో గడపడం.

రెండువ రకపు ప్రార్థన ఏమనగా, సాధారణంగా దేవునితో మాట్లాడటం, దేవుడు మనకు ఇచ్చే సందేశాన్ని శ్రద్ధగా అలకించడం. ఈ రకమైన ప్రార్థనలు మదర్ తెరిసాగారు స్థాపించిన నాలుగో ప్రతిజ్ఞకు చెందినది. ఆమె ప్రకారం పేద వారితో మాట్లాడటం, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, వారు పడుతున్న కష్టాలలో పాలుపంచుకుని, తగిన సహాయం అందించడమే నిజమైన ప్రార్థన, మదర్ తెరిసాగారు ప్రార్థన గురించి మాట్లాడుతూ దేవుడు నాతో మాట్లాడుతున్నారు, నేను దేవునితో మాట్లాడుతున్నాను అని అభిప్రాయాన్ని తెలియపరిచి, ఇది నా ప్రకారం ప్రార్థన అని తెలియజేస్తున్నారు.

కష్ట సమయాలలో మన హృదయాన్ని, మనసును దేవుని వైపు మళ్లీస్తూ ఆయన మీద ఆధారపడి జీవించడమే ప్రార్థన. దేవునివైపు చూస్తూ, ఆయన మన కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ, ధ్యానించడమే ప్రార్థన. పరిపూర్ణమైన ప్రార్థన అనేది మనం మాట్లాడే మాటల్లో ఉండదు, కానీ దేవుని పట్ల మనకున్న ఆశక్తిలో ఉంటుంది. ఈ రకమైన ప్రార్థన అనేది పుస్తకాలలో

చూసి చదివేది కాదు, కానీ ఎవరికి వారు వ్యక్తిగతంగా దేవునితో ఆధ్యాత్మికమైన సంబంధాన్ని ఏర్పరుచుకోవడంతో అలవడుతుంది. మదర్ తెరిసా గారు చెప్పిన ప్రార్థన నిర్వచనాలను అర్థం చేసుకోవాలంటే మనము పునీత అవిలాపురి తెరేజమ్మ గారు చెప్పిన ప్రార్థనా అంతస్తుల గురించి ముందుగా తెలుసుకోవాలి." ఆమె ప్రకారం తొమ్మిది అంతస్తులుగా ప్రార్థనను అర్థముచేసుకోవచ్చు. అవి ఏవనగా, 1. స్వర తంత్రుల ప్రార్థన, 2. ధ్యానము, 3. ఉద్వేగపూరిత ప్రార్థన, 4. సాదుత్వము లేక నిరాడంబరత కలిగిన ప్రార్థన, 5. దైవానుగ్రహ ధ్యానం, 6. ధ్యానములో లీనమైన ప్రార్థన, 7. దైవ సమ్మేళన ప్రార్థన, 8. దైవ అనురూప ప్రార్థన 9. దైవ రూపాంతర ప్రార్థన. ఇందులో మూడు, నాలుగవ రకపు ప్రార్థనలు మదర్ తెరిసాగారు చెప్పిన ప్రార్థనకు దగ్గర సంబంధం ఉంటుంది.

## ముగింపు

యేసు, మనము చేసే ప్రార్థన ద్వారా మనకు ప్రార్థించడం నేర్పిస్తారు. తండ్రికి ఆయన చేసిన ప్రార్థన, దేవునికి మనం చేసే ప్రార్థనకు మార్గం అయింది. శిష్యులకు యేసు ప్రార్థనను నిర్దిష్టంగా నేర్పాడని సువార్త తెలియజేస్తుంది. నేర్పుగల ఉపాధ్యాయుడుగా, మనమున్న ప్రస్తుత స్థితిలోనే మనలను క్రమేపి తండ్రి దగ్గరకు నడిపిస్తారు. ఆయనను వెంబడించే వారికి ప్రసంగించినపుడు, పాత ఒప్పందంలో ఇదివరకే ప్రార్థన గురించి వాళ్ళకు తెలిసిన అంశాలను ఆధారంగా చేసుకొని, దైవరాజ్యపు కొత్తదనాన్ని వాళ్ళకు చూపించాడు. సామెతల్లో ఉపమానాలలో ఈ కొత్తదనాన్ని వాళ్ళకు బయలుపరచాడు. చివరిగా, తండ్రిని గురించి, పవిత్రాత్మను గురించి బాహటంగా ఆయన శిష్యులతో మాట్లాడాడు. శ్రీసభలో ఈ శిష్యులే ప్రార్థన అధ్యాపకులు.

పర్వతముపై ప్రసంగం నుండి, హృదయ పరివర్తన, పీఠంపై కానుకలు చెల్లించే ముందు తన సోదరునితో సఖ్యత, శత్రువుల పట్ల ప్రేమ, హింసించే వారి కొరకు ప్రార్థన, తండ్రికి రహస్య ప్రార్థన, వ్యర్థ పదజాలాన్ని విడనాడడం, హృదయాంతరాళం నుండి ప్రార్థన, క్షమాపణం కొరకు ప్రార్థన, నిర్మల హృదయం, అన్నింటి కంటే ముందు దైవ రాజ్యాన్ని వెదకుట గురించి నొక్కి చెప్పాడు. పరివర్తనకు అంకితమైతే, విశ్వాసంతో ప్రార్థించటం హృదయం నేర్చుకుంటుంది.

మన భావనకు, అవగాహనకు అతీతంగా, పుత్రునిగా దేవుని అంటిపెట్టుకోవటమే విశ్వాసం. ఇది సాధ్యమే. ఎందుకంటే ప్రియమైన కుమారుడు తండ్రి దగ్గరకు వెళ్ళడానికి, ప్రవేశ సౌలభ్యాన్ని కల్పిస్తాడు. ఆయనే మార్గం, ద్వారం కనుక "వెదకమనీ" "తట్టమనీ" ఆయన మనతో చెప్పాడు.

ప్రభుని వాక్కు ఆలకించటం ద్వారా, దివ్య సంస్కారాలలో ముఖ్యముగా పాస్కా పరమరహస్యంలో పాల్గొనడం ద్వారా, మనం ప్రార్థించటం నేర్చుకుంటాం. కాని ప్రతి దిన సంఘటనల్లో మన నుండి ప్రార్థన పెల్లుబుకడానికి, అన్ని వేళలా మనకు ఆయన ఆత్మను ఇచ్చాడు. "చిన్న పిల్లలకు", క్రీస్తు సేవకులకు, మోక్ష భాగ్యాలను బయలుపరచటం, రోజూ జరిగే ప్రతి సంఘటనలో, ప్రతి తరుణంలో ప్రార్థిచడం, దైవ రాజ్యపు రహస్యాలలో ఒకటి. శాంతి నెలకొల్పే రాజ్యం రావాలని ప్రార్థించడం సరైంది, న్యాయమైంది. "హృదయ పూర్వకముగా తనను సేవించువానిని ప్రభువు అంగీకరించును. అతని ప్రార్ధనలు ఆకాశమునకు ఎక్కి పోవును" (సిరా: 35:16). "అనాధుని ప్రార్థన అనాధరం చేయడు, వితంతువుల వేడుకోలు పెడచెవిన పెట్టడు" (సిరా 35:14). ఈ విధముగా దైవ సేవలో, సోదరుల సేవలో నిమగ్నమై, మన పరిచర్యనే ప్రార్థనగా మలుచుకొందాం. మన అనుదిన జీవితాన్నే ఒక ప్రార్థనగా దేవునికి అర్పిద్దాం.

# మాకు ప్రార్థించుట నేర్పుము

## అనువాదికులు



**1.** బ్రదర్
చాట్ల అలెగ్జాండర్



**2.** బ్రదర్
కాలెంతు సాగర్ బాబు



**3.** బ్రదర్
గొన్నాబత్తుల హేమంత్



**4.** బ్రదర్
బట్టు అజయ్ కుమార్



**5.** బ్రదర్
బలసాని ప్రభుదాస్



**6.** బ్రదర్
పచ్చిగొర్ల ఒబేజ్



**7.** బ్రదర్
కాసు అఖిల్



**8.** బ్రదర్
కొమ్మెర పవన్



**9.** బ్రదర్
ఆరుగుల్ల రాజేంద్ర



**10.** బ్రదర్
జుత్తుక వెళాంగని రాజ్



**SPES NON CONFUNDIT**

"Hope does not disappoint" (Rom 5:5)

Releasing the bull of indiction of the Ordinary Jubilee of the year 2025

by **POPE FRANCIS**





పునీత పేతురు గారి మహాదేవాలయ జూబిలీ ద్వారము, వాటికన్ నగరము

(Jubilee Door, St. Peter's Basilica, Vatican City)

భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing